# ప్రభాత్

*ఈ సంచికలో....*

- సియాటిల్ సమావేశ వైఫల్యం
- రామాయణాల ప్రచురణకు వ్యతిరేకంగా
- తప్పుడువి మంచివిగా మారతాయి
- బైలడిల్లా పర్యావరణ కాలుష్యంపై
- హీరానార్ స్టీల్‌ప్లాంట్ - బస్తర్ అభివృద్ధి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)(పీపుల్స్‌వార్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార పత్రిక

సంచిక : | మే-జులై 2000 | వెల : పదిరూపాయలు

# కొయ్యూరు మృతవీరుల అమరత్వాన్ని కీర్తిస్తూ, జులై 28 నుండి ఆగస్టు 3 వరకు గ్రామగ్రామాన అమరవీరుల సంస్మ రణ వారం జరుపుకుందాం!

*కామ్రేడ్స్, ప్రజలారా!*

నక్సల్బరీ నిర్మాత, భారత విప్లవ మార్గదర్శకుడు, భా.క.పా.(మా-లె) సంస్థాపకుడు కామ్రేడ్ చారుమజుందార్ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఆయన అమరత్వం పొందిన జులై 28నాటిని మనం అమరుల సంస్మరణ దినంగా జరుపుకుంటూ వస్తున్నాం. ఈ సందర్భంగా అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించడం, స్థూపాలను నిర్మించి శ్రద్ధాంజలి ఘటించడం చేస్తూ వస్తున్నాం. గత సంవత్సరకాలంగా ఉత్తర తెలంగాణా, దండకారణ్యం, బీహార్, ఆంధ్రలతోపాటుగా కర్ణాటక, తమిళనాడులలో 200 మందికిపైగా మన ప్రియతమ కామ్రేడ్స్ నేలకొరిగారు.

ఈ అమరయోధుల త్యాగాలతో మన ఎర్రజండా మరింత ఎరుపెక్కింది. మనపార్టీ ప్రతిష్ట, త్యాగపూరిత సాంప్రదాయం మరింతగా ఇనుమడించాయి. మన పార్టీపైనా, పార్టీ ఎత్తుగడల పంథాపైనా పీడిత ప్రజల నమ్మకం, ఆశలు పెరిగాయి. మన పార్టీ నెలకొల్పిన త్యాగాల సాంప్రదాయం భారత విప్లవ చరిత్రలోనే అపూర్వమైనది. - వర్గశత్రువులను నిలువునా వణికించేది. కామ్రేడ్ చారుమజుందార్ చెప్పినట్టుగా....

*"కామ్రేడ్ల రక్తంతో ఎరుపెక్కిన ఈ బాట విప్లవ బాట. మానవజాతి విముక్తికై మనమెలాంటి మూల్యం కూడా చెల్లించక పోవడం ఎట్లా సాధ్యం? మనపైన జరిగే ప్రతిదాడి బాధాకరమైనదే. ఈ బాధలోంచే మరిన్ని మహత్తర త్యాగాలు చేయడానికవసరమైన దృఢసంకల్పం, శత్రువుపట్ల ఎనలేని ద్వేషం, కసి పుట్టుకొస్తాయి..... వాళ్ల ప్రతి ఒక్కరి మృత్యువు హిమాలయాలంత బరువైనదే. ఎందుకంటే వాళ్లు మనకంటే ఎంతో వున్నతులయిన మానవులుగా ఎదిగారు. అందుకే వాళ్ల రక్తపుధారల్లోంచి లెక్కలేనన్ని కొత్త ప్రాణులు పుట్టుకొస్తాయి. అందుకే ఈ బాటలోని ధూళిని మన కన్నీళ్లతో తడపాలి. మన రక్తంతో ఈ బాటను పటిష్టంచేయాలి."*

డిసెంబర్ 1, 1999న శత్రువు కోవర్ట్‌వార్‌లో మన పార్టీ కేంద్ర కమిటీ నాయకులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళి అమరులవడంతో మనపార్టీకి ఎనలేని నష్టం జరిగింది. పార్టీ అత్యున్నత నాయకుల అమరత్వాన్ని సంస్మరించుకొంటూ, జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారం జరపాలని మన పార్టీ నిర్ణయించింది.

కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలు విప్లవ చరిత్ర గమనంలో, ప్రత్యేకించి నక్సల్బరీ తర్వాతి మూడు దశాబ్దాల పోరాట చరిత్రలో భాగమై, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ సూత్రాలను భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు తగినట్టుగా అన్వయిస్తూ, దాదాపు రెండు దశాబ్దాలకుపైగా సమయాన్ని ప్రత్యక్షంగా సాయుధ పోరాటాన్ని విస్తరింప జేయడానికై వెచ్చించి, నిరంతరం ప్రజలను అంటిపెట్టుకొనివుంటూ, ఉద్యమాన్ని ఉన్నతస్థాయికి పురోగమింపజేశారు. తాము స్వయంగా నిర్మించి, నాయకత్వం వహించిన ఉద్యమంతోపాటుగా తామూ ఎదుగుతూ, రెండు పదుల వయస్సు నుండి నాలుగు పదుల వయస్సు వరకు ఎప్పుడూ వెనుదిరుగక తాము నమ్మిన ఆశయానికి ఎల్లప్పుడూ దృఢంగా కట్టుబడివుంటూ, నిత్యపోరాటాల మధ్య సాగే విప్లవ జీవితంలో ఎల్లప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ, తామెక్కడున్నా నలువైపులా విప్లవోత్తేజాన్ని వెదజల్లుతూ ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన ఈ విప్లవ వీరుల అమరత్వానికి సగౌరవంగా తలవంచి నివాళులర్పిద్దాం!

**కామ్రేడ్ చారుమజుందారుకు అరుణారుణ జోహార్లు!**

# మృత్యువు కుహరంలో మృత్యువుతో పోరాడుతూ ఆ మృత్యువునే జయించిన మృత్యుంజయుడు కామ్రేడ్ భూమన్న

దండకారణ్యంలోని గడ్‌చిరోలి (మహారాష్ట్ర) విప్లవోద్యమంలో 1984 కమలాపూర్ మహాసభలకు ఎంతటి ప్రాముఖ్యత ఉందో, ఆ మహాసభలతో ముడిపడిన అనేకానేక వ్యక్తులలో ఒకడైన కామ్రేడ్ భూమన్న జీవితానికి అంతటి గుర్తింపు వుంది. 16 సంవత్సరాల తర్వాత కూడా కమలాపూర్ గూర్చి మాట్లాడుకునే విప్లవకారులకు మొదట గుర్తొచ్చేది భూమన్నే అనడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఆనాటికి మన కామ్రేడ్ భూమన్న వయస్సు 16 ఏళ్లకు పైబడక పోవచ్చు.

కమలాపూర్‌లో 'ఆదివాసీ కిసాన్ షేత్ మజ్దూర్' సంగటన్ (ఎకెఎస్ఎస్) జిల్లా తొలిమహాసభలను భగ్నం చేయగలమని పోలీసులు విర్రవీగారు. కమలాపూర్ సభలకు ఏ దారిన కూడా విప్లవాభిమానులు రాకూడదని పోలీసుల తుపాకులు దారులన్నీ పహారా కాశాయి. 'కమలాపూర్ బాటలు మూసి క్రాంతిని ఆపలేరు' అన్న చందంగా కమలాపూర్ నడిగడ్డన నక్సలైట్ రాజకీయాలతో చైతన్య వంతుడవుతూ కామ్రేడ్ భూమన్న విప్లవకారుడిగా ఎదిగివచ్చాడు. వేలాది రైతాంగం అత్యంత ఉత్సాహంతో ఎర్రజండాలు చేతబూని మహాసభలకు రావడాన్ని సహించలేని పోలీసుల ఘాతుకం భూమన్నలో గల ప్రశ్నల తుట్టెను కదిపింది. రైతులు చేసిన నేరం ఏమిటి? రైతులు సంఘం పెట్టుకుంటే పోలీసులకు వచ్చే నష్టం ఏమిటి ? ప్రభుత్వ అనుమతితో సభలు జరుపుకుంటామంటే ఖాకీల క్రౌర్యం ఏమిటి? ఆదివాసులకు సంఘం పెట్టుకునే హక్కులేదా? మొదలైన ప్రశ్నలతో భూమన్న వీధుల్లోకి వచ్చాడు. తన తోటివాళ్లను కదిలించాడు. ప్రభుత్వ దుశ్చర్యలను ఖండించాడు. అది మొదలు భూమన్న సంగం భూమన్నగా ప్రజల గుండెల్లో నిలిచాడు.

భూమన్న నిరుపేద వ్యవసాయ కూలి కుటుంబంలో పుట్టాడు. ఊళ్లో బడికివెళ్లి ప్రాథమిక చదువు నేర్చి అక్షర జ్ఞానం సంపాదించాడు. ఆపై చదువులకు పేదరికం అనుమతించలేదు. తల్లిని తమ్ముణ్ని యితర కుటుంబ సభ్యులను పోషించాల్సిన భారం చిన్నతనంలోనే భూమన్నపై బడడంతో లేత రెక్కలు పలకా బలపానికి స్వస్తి చెప్పి కూలిపనుల్లో మునిగిపోయాయి. తునికి ఆకు కోత కూలి, వెదురు నరికే పేపర్ మిల్లు పనులతోపాటు ఊళ్లో లభ్యమయ్యే కూలిపనుల్లో చేరి తన శ్రమశక్తితో కుటుంబాన్ని పోషించాడు. అర్ధాకలితో రోజులు గడపడం, అంబలితో పొట్టనింపుకోవడం, అడవిలోని ఆకు, అలములు, కాయ, కంద, పుట్ట తేనెలు పుట్టకొక్కులు, యిలాంటివాటితో పోషణసాగిస్తూ పేద రికాన్ని అనుభవించడం భూమన్నకు జీవితమే నేర్పింది. తమ మధ్యనే తమ శ్రమను దోపిడీ చేసే సావుకార్లు సుఖంగా జీవిస్తుంటే, రెక్కలు ముక్కలు చేసుకున్నా పేదవాడి బతుకు తెల్లారడమే గగనమవుతుందేమిటని భూమన్నలో జీవితం ఎన్నో ప్రశ్నలను రేపింది.

అలాంటి ప్రశ్నలు తలెత్తే యువతరం పల్లె గడపలో, అడవితల్లి ఒడిలో పెరిగే వేళకు ఆ ప్రాంతంలో విప్లవకారులు ప్రజాపోరాటాలు చేపట్టడం నిజంగా యువకుల భవిష్యత్‌కు, యువకులలో తలెత్తే సవాలక్ష ప్రశ్నలకు సరైన జవాబును యివ్వగలిగింది. వారికి పోరాడే సంగాలు అండగా నిలిచాయి. ఎక్కడైతే విప్లవోద్యమం కాలూనుకొని ప్రజలను సంఘటితం చేస్తుందో, దేశంలోని మిగతా ప్రాంతాలకన్నా అక్కడి ప్రజలకు ముఖ్యంగా యువతకు చక్కని భవిష్యత్‌కు దారులు ఏర్పడుతున్నాయి. ఆ దారిలో నడవడానికి, ప్రారంభ కష్టాలను పట్టుదలతో అధిగమించడానికి నిశ్చయించుకొని కామ్రేడ్ భూమన్న 1988 నాటికి పూర్తికాలం విప్లవకారుడిగా పనిచేయడానికి నిశ్చయించుకున్నాడు. యింటివద్ద వుండగానే పార్ట్‌టైం పార్టీసభ్యుడిగా ఎదిగిన కామ్రేడ్ భూమన్న పిఆర్‌గా వచ్చాడు.

గడ్‌చిరోలి డివిజన్‌లో ప్రజా పోరాటాలు పైచేయిగా సాగుతున్న రోజుల్లో ఉద్యమ విస్తరణకు గల అనేక అవకాశాలను పార్టీ సద్వినియోగం చేసుకోవడంలో భాగంగా కామ్రేడ్ భూమన్నకు కొద్దికాలం అల్లపెల్లి పట్టణ ఆర్గనైజర్‌గా పార్టీ బాధ్యతలు యిచ్చింది. అల్లపెల్లిలో యేళ్ల తరబడి ప్రజానాయకులుగా ఫోజులు కొడుతూ పబ్బం గడుపుకుంటున్న దత్తాపాండ్రీలాంటి లంపెన్ శక్తుల, అలాగే కడుపులో చల్లకదలకుండా అవినీతిపై పోరాటం పేరుతో కాలం వృధాచేస్తున్న శేఖర్ మరియు ఏరోటి కాడ పాట ఆ రోటికాడన్నట్టు అవకాశవాదాన్ని ఆరాధించే మడావిజోగ, పోశెట్టి గంజివార్‌ల రంగు బైరంగంచేస్తూ, అక్కడి యువతతో, ప్రజలతో సంబంధాలు మెరుగుపరుచుకున్నాడు. కానీ, టిప్రాగడ్ ప్రాంతానికి దళం విస్తరణ యొక్క ఆవశ్యకత హెచ్చుగా వుందని డివిసి గుర్తించి భూమన్న ముందు ఆ ప్రతిపాదన పెట్టింది. కామ్రేడ్ భూమన్న ఎలాంటి ఊగిసలాట లేకుండా టిప్రాగడ్ దళసభ్యుడైనాడు. 1989 నుండి 1991 వరకు ఆప్రాంతంలో డిప్యూటీ కమాండర్ బాధ్యతలు నిర్వహిస్తూ కొత్త ప్రాంతంలో ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నాడు. శ్యాంరావుగా ఆ ప్రాంత ప్రజలకు తలలో నాలుకయ్యాడు. కొత్తగా ఆ ప్రాంతానికి విస్తరించిన విప్లవోద్యమంపై గొప్ప విశ్వాసంతో ప్రజలు పార్టీ యిచ్చిన ప్రతి పిలుపును తీవ్ర నిర్బంధకాండను ఎదుర్కొంటూనే జయప్రదం చేస్తూ దళాన్ని కంటికి రెప్పలా కాపాడుకున్నారు. సంగాలు వృద్ధి చెందడమే కాకుండా అనతికాలంలోనే దళాల్లోకి స్థానిక యువతీ యువకులు రాసాగారు. దళాలు సంఘటితం కావడంతో ఉద్యమం బాలాఘాట్‌కు విస్తరించాలనీ, నూతన డివిజన్‌ను ఏర్పర్చాలనీ ఫారెస్టు కమిటీ తీసుకున్న నిర్ణయం అమలులోకి రాసాగింది. ఆ నూతన ప్రాంతాన్ని సర్వే చేయడంలో కామ్రేడ్ భూమన్న పాల్గొన్నాడు. అంతేకాదు. బాలాఘాట్ గడ్‌చిరోలి డివిజన్‌ల మధ్య వారధిగా నిలిచిన దేవురి దళంలోకి కామ్రేడ్ శ్యామ్‌రావ్‌ను బదిలీ చేస్తూ డివిసి చేసిన నిర్ణయాన్ని అతడు నిండు మనసుతో స్వీకరించి దేవురిలో డిప్యూటీ కమాండర్ బాధ్యతలు చేపట్టాడు.

దేవురిలో ప్రజాపోరాటాలను నిర్మించడానికి పార్టీకి అత్యంత స్వల్ప సమయమే దొరికింది. ఆ సమయంలోనే ప్రజలను పెద్ద ఎత్తున కదిలించడంలో కామ్రేడ్ శ్యామ్‌రావ్ ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాడు. నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబం నుండి వచ్చిన కామ్రేడ్ శ్యాంరావుకు పేదలనుభవించే కష్టాలు, వారి శ్రమశక్తిని దోపిడీచేసే శక్తుల కుట్రలు కొట్టిన పిండి కావడంతో ప్రజలకు

విప్లవ మార్క్సిస్టు రాజకీయాలు చక్కగా బోధించాడు. ప్రజలపై నిర్బంధం విరుచుకపడి ముఖ్యంగా యువతులపై అత్యాచారాలకు పాల్పడడం, యువకులను బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపడం లాంటి పైశాచికకృత్యాలకు పోలీసులు పాల్పడుతుంటే, కామ్రేడ్ శ్యామ్‌రావ్ ప్రజల కన్నీళ్లను పంచుకోవడమే కాకుండా, పగవాడిపై గట్టిదెబ్బలు దియ్యడానికి, ప్రజల మనోధైర్యాన్ని నిలపడానికి మంగేర్ఘరిలో పోలీసుల వాహనంపై పిడుగుపాటులా మందుపాతరలను పేల్చి పెద్ద సంఖ్యలో వాళ్లను హతమార్చి వారి ఆయుధాలను స్వాధీనం చేసుకొని గెరిల్లాల శక్తి-సంకల్పాలను నిరూపించిన వారిలో కామ్రేడ్ శ్యాంరావు చురుగ్గా పాల్గొన్నాడు. మహారాష్ట్ర పోలీసులు 1991 నుండే గడ్‌చిరోలి ఉద్యమాన్ని నిర్మూలించడానికి అత్యంత దుర్మార్గమైన అణచివేత - నిర్బంధ చర్యలను ప్రారంభించారు. కానీ, ప్రజాపోరాటాలు న్యాయమైనవనీ ప్రజాయుద్ధం అజేయమైనదని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ ఈనాటి ఆత్మరక్షణా యుద్ధంలో మనం గెరిల్లా చర్యల ద్వారా శత్రువును దెబ్బతీయాల్సిన అవసరం రోజురోజుకు పెరుగుతుందనీ, అలా సిద్ధపడకుంటే మన ఉద్యమాన్ని శత్రువు నామరూపాలు లేకుండా చేస్తాడనీ కూడా ప్రజలకు ధైర్యాన్నిస్తూ, వారి పూర్తి అండదండలతో పార్టీ చేపట్టిన సైనిక చర్య - గజమెండి, భీమన్‌కొజ్జి - లలో కూడా కామ్రేడ్ భూమన్న క్రియాశీలంగా పాల్గొన్నాడు. పోలీసులను హతమార్చడమే కాకుండా వారి నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకొని గెరిల్లా బలగాలను శక్తివంతం చేసుకున్న జ్ఞాపకాలలో - చరిత్రలో కామ్రేడ్ భూమన్న పేరు చిరస్థాయిగా వుంటుంది. యిలా ఉద్యమంలో ఆర్గనైజేషనల్ మరియు సైనిక కర్తవ్యాలను పరిపూర్తి చేయడమే కాకుండా, పార్టీ అప్పగించే టెక్నికల్ కొరియర్ పనులు కూడా చేసేవాడు. నిత్యం శత్రువు కన్నుకప్పుతూ ఉద్యమ అవసరాలు తీర్చే కొరియర్ పనులు చేయడంలోకూడా భీమన్న నైపుణ్యం సంపాదించాడు. కానీ, 1994 ఫిబ్రవరిలో నమ్మకద్రోహానికి గురై పోలీసుల వలలో చిక్కాడు.

కామ్రేడ్ భూమన్నపై శత్రువు అనేక తప్పుడు ఆరోపణలు కూడా చేస్తూ జైలులో 'టాడా' చట్టం క్రింద నిర్బంధించాడు. బెయిల్ కూడా దొరకకుండా అడ్డగిస్తూ కటకటాలవెనుక విప్లవవీరుల ధైర్యాన్ని పరీక్షించసాగాడు. అత్యంత అమానవీయ చర్యలకు నిలయమైన జైళ్లలో శత్రువుతో పోరాడుతూ విప్లవదీక్ష ప్రదర్శించడం సాధారణ విషయం కాదు. జైలులో నున్న నిర్బంధితుల పక్షం నిలిచి అధికారుల అన్యాయాలను నిలదీయడంలో అగ్రభాగాన నిలిచే విప్లవకారులంటేనే జైలు పోలీసులకు మంట. దీనితో పోలీసులను చీటికి మాటికి గేటులోకి పిలవడం, విపరీతంగా లాఠీలతో బాదడం, ఒక జైలు నుండి మరో జైలుకు బదిలీ చేయడం, కిరాతకానికి పేరొందిన అమరావతిలోని భూగృహానికి తరలించడం, కనీసం మాన్యువల్స్ ప్రకారం అయినా వస్తువులు అందకుండా చేయడం, జబ్బు చేసినా వైద్య సౌకర్యాలనుండి దూరం చేయడం లాంటి అత్యంత అప్రజాస్వామిక పద్ధతుల్లో పశుప్రాయంగా పోలీసులు వ్యవహరించేవారు. వీటన్నిటిని మన ప్రియతమ కామ్రేడ్ శ్యామ్‌రావ్ విప్లవోద్యమం కోసం నిబ్బరంగా భరించాడు. వీలున్న మేరకు ఖైదీలకు నాయకత్వం వహించి పోరాటాలు చేపట్టాడు. జైళ్లలో శారీరకంగా, మానసికంగా దుర్భరమైన పరిస్థితుల మధ్య వుంటూ విప్లవోద్యమంపై, ప్రజలపై, పార్టీపై దృఢమైన విశ్వాసంతోనున్నవారిని దిగజార్చడానికి శత్రువు పరమ నీచమైన ఎత్తుగడలను అవలంభిస్తూ కృత్రిమంగా రకరకాల జబ్బులకు గురిచేసేవాడు. కామ్రేడ్ శ్యామ్‌రావ్‌కు అత్యంత భయంకరమైన ఎయిడ్స్ వ్యాధిని రక్తం ద్వారా ఎక్కించి, పొట్టన పెట్టుకొన్నాడు. గతంలో దేవన్న, రైను, బాలాజీ, శ్యాంసింగ్ తదితర కామ్రేడ్స్‌కు వైద్య సౌకర్యం కల్పించక హతమారిస్తే, ప్రస్తుతం కామ్రేడ్ శ్యామ్‌రావ్‌ను ఎయిడ్స్‌తో హతమార్చారు. ఇంతటి నీచమైన పద్ధతుల్లో విప్లవకారులను హతమారుస్తున్న పోలీసు హంతకులకు వాటికి తగిన మూల్యం చెల్లించక తప్పదు. ప్రజలు ఎన్నటికైనా ఈ నీచులను శిక్షించి తీరుతారు. ఎయిడ్స్, కాన్సర్ తదితర భయంకర జబ్బులకు అవకాశంలేని స్వార్థరహితమైన, దోపిడి రహితమైన నూతన సమాజాన్ని నిర్మించి మీ స్వప్నాలను నిజం చేస్తాం ! మీ ఆశయాలు నెరవేరుస్తాం! అమరవీరులకు జోహార్లు! కామ్రేడ్ శ్యామ్‌రావ్ (భూమన్న) అమర్ రహే! పార్టీపై ప్రజలపై ప్రగాఢమైన విశ్వాసంతో జైలుజీవితాన్ని నిబ్బరంగా భరించిన మన శ్యాంరావు పార్టీ పుట్టిన రోజు 22-4-2000 నాడు తన ప్రియమైన ఎర్రజండాలో ఎరుపైనాడు.

## కామ్రేడ్ అఖిల

తోహెగాం అడవిలో 2000, జూన్ 10వ తారీఖునాడు శత్రువుతో జరిగిన ముఖాముఖి పోరులో గుళ్లవర్షం కురుస్తున్నా చలించకుండా వీరోచితంగా ప్రతిఘటిస్తూ ఓ గడ్డిపువ్వు నేలరాలింది. ఆ పువ్వు పేరు అఖిల. 17 సంవత్సరాల ఆ గెరిల్లా యువతి ఉరకలెత్తే ఉత్సాహానికి ప్రతీకగా వుండేది. ఆమె ఒక చైతన్య దీపిక.

రాజగోండు కుటుంబంలో పుట్టి పెరిగిన ఆ బిడ్డకు తమ తల్లిదండ్రులు సురేఖ అని పేరు పెట్టుకున్నారు. తండ్రి దస్రు నైతాం. మాజీ రేంజి కమిటీ నాయకుడు. దళం తమ గ్రామం మాంద్రకు వచ్చినప్పుడల్లా తన బిడ్డను వెంటబెట్టుకొని వచ్చేవాడు.

తన తండ్రి చిటికెన వేలు పట్టుకొని దళం వద్దకు వచ్చే ఆ చిన్నారి పాటలంటే చెవి కోసుకునేది. దళం తమ ఊరిని వదిలి వెళ్లే వరకు దళాన్ని అంటిపెట్టుకొని వుండేది. ఆ క్రమంలో ఆదివాసీ బాలల సంఘంలో సభ్యురాలయింది. 3వ తరగతి వరకూ చదువు నేర్చిన సురేఖ తొందరగా పాటలు నేర్చుకుంది. బాలలకు నాయకత్వం వహిస్తూ అన్ని పనులలో చురుకుగా వుండే ఆ బాల తదుపరి బాలల సంఘం అధ్యక్షురాలైంది. ఆమెలో పెరుగుతున్న వయస్సుతోపాటు తాను గెరిల్లా కావాలనే కోరికా బలపడింది. తన కోరికను దళం ముందు పెట్టింది. వయస్సు నిండలేదనే కారణంగా కొంతకాలం యింటివద్దనే వుంటూ క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం (కెఎఎంఎస్) కార్యకర్తగా పనిచేయసాగింది.

తన పట్టుదలతో అనుకున్నది సాధించుకుంటూ 1999 సంవత్సరం ఫిబ్రవరి చివరిలో దళంలో అహిరి గెరిల్లా దళ సభ్యురాలైంది. దళంలో స్త్రీ- పురుషులనే బేధం లేకుండా కామ్రేడ్స్ అందరితో కలుపుగోలుగా వుండేది.

పార్టీ ఆదేశం మేరకు, పార్టీ అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, చాముర్షి దళానికి పయనమయ్యింది. చాముర్షి దళాన్ని చుట్టుముట్టి మట్టుబెట్టాలని శత్రువు కేంద్రీకరిస్తున్న సమయంలో ఎలాంటి తటపటాయింపులు లేకుండా కామ్రేడ్ అఖిల చాముర్షి ఏరియాలో అడుగు పెట్టింది. ఎంత నిర్బంధం వచ్చినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, చచ్చినా- బ్రతికినా దళాన్ని, ప్రజలను వదలనని ప్రతిజ్ఞ చేసింది. చేసిన బాసను నిలబెట్టుకున్న అఖిల అందరి ముందూ ఒక ఆదర్శాన్ని నిలబెట్టింది. అమరుల వారసత్వంలో ఎర్రజండాలో ఎరుపైంది.

**కామ్రేడ్ అఖిల అమర్ హై!**

# కరంచ దివిటీ కామ్రేడ్ లక్ష్మి కుడిమేత్ (సుజాత)

గడ్‌చిరోలి డివిజన్‌లోని అహిరి తాలూకా, జిమ్మలగట్ట రేంజ్‌లో గల చిన్న గ్రామం కరంచ. ఈ వూరంటే గడ్‌చిరోలి పోలీసు కమెండోలకు కన్నెర్ర. ఈ పల్లె ఇప్పటికే విప్లవోద్యమం కోసం ఐదుగురు ముద్దు బిడ్డలను అర్పించింది. ఈ ఐదుగురిలో కామ్రేడ్ లక్ష్మి కుడిమేత్ ఒకర్తి. తండ్రి గంగన్న, తల్లి బుచ్చక్కల ఏకైక ఆడ సంతానం అయిన లక్ష్మి నలుగురు అన్నదమ్ముల ముద్దుల చెల్లెలు. పీపుల్స్‌వార్ పార్టీ దండకారణ్యంలో ప్రవేశించిన తర్వాతే, 1983లో కామ్రేడ్ లక్ష్మి పుట్టింది. కామ్రేడ్ లక్ష్మి పుట్టిన ఏటనే కరెంచలో సంగం వెలిసింది. అంటే కామ్రేడ్ లక్ష్మి వయస్సు కరెంచ వూరి సంఘం వయస్సు ఒక్కటేనన్నమాట. ఉద్యమం ఒడిలో పెరిగిన లక్ష్మికి పోరుపాటలే జోలపాటలయ్యాయి. అందుకే పదేళ్ల వయస్సులోనే దళంలో చేరతానంటూ పట్టుబట్టింది. కానీ, *'నువ్వింకా ఎదగాలమ్మా'* అంటూ పార్టీయే ఆమె కోర్కెను వాయిదా వేస్తూ వచ్చింది.

కామ్రేడ్ లక్ష్మిది నిరుపేద కుటుంబం. పార్టీ అక్కడికి అడుగిడిన తర్వాతే వాళ్ల కుటుంబానికి దున్నుకోవడానికి పొలం దొరికింది. ఐదుగురు సంతానంలో రెండవదయిన లక్ష్మి పొలం పనుల్లో అమ్మా నాన్నలకు ఆసరా అయ్యేది. పేపరు మిల్లు, ఫారెస్టు కూలీ పనులకు పోతూ, తునికాకు తెంపుతూ కుటుంబాన్ని పోషించడంలో పాల్గొనేది. యిలా ఇంటి పనులు చేస్తూనే ఆమె *'క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంగటన్'*లో సభ్యురాలయింది. పేపర్ మిల్లు, తునికాకు రేటు పెంపుదల కోసం జరిగిన పోరాటాల్లో కామ్రేడ్ లక్ష్మి ఉత్సాహంగా పాల్గొంది. 2000 సంవత్సరం ఏప్రిల్ నెలలో ఆమె దళంలో చేరి సాయుధ గెరిల్లా అయ్యింది. పార్టీ తనను చాముర్షి ఏరియా వెళ్లి పనిచేయాల్సిందిగా కోరినప్పుడు, ఎలాంటి తటపటాయింపులు లేకుండా సిద్ధపడింది. పసి వయస్సునుండే విప్లవకారుల సన్నిహిత సంబంధాల్లో మెలిగి, తన వూరి విప్లవ వారసత్వాన్ని సమున్నతంగా నిలబెడ్తూ కామ్రేడ్ లక్ష్మి (సుజాత) జూన్ 10, 2000 నాడు తోహెగాం అడవుల్లో కమెండో కిరాతకులు జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ అఖిలతోపాటుగా నేలకొరిగింది. భారత ప్రజాతంత్ర విప్లవ విజయంకోసం పిన్నవయస్సులో ప్రాణాలనర్పించి అత్యున్నత త్యాగాలు చేసిన ఈ యిద్దరు నవ యువ విప్లవకారిణిలకు ***'దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ'*** వినమ్రంగా తలవంచి జోహార్లు పలుకుతోంది.

# పాము కాటుకు గురయ్యి అసువులు బాసిన పరాల్‌కోట్ గెరిల్లా దళ సభ్యురాలు కామ్రేడ్ రాజె (మెస్సి కోర్స)కు లాల్ సలాం!

19 జులై అర్ధరాత్రి 12 గంటలకు, పరాల్‌కోట గెరిల్లా దళం తమ దైనందిన విప్లవ కార్యక్రమం ముగించుకొని అడవి తల్లి ఒడిలో నిద్రకుపక్రమించిన సమయాన, దళసభ్యురాలు కామ్రేడ్ రాజె అకస్మాత్తుగా విషపు పాము కాటుకు గురైంది. తోటి దళసభ్యులు కామ్రేడ్ రాజెను రక్షించుకోవడానికి తమ దగ్గరున్న మందులతో తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఆ యువ విప్లవకారిణిని దక్కించుకోలేక పోయారు. కామ్రేడ్ రాజె 20/7/2000 నాడు తెల్లవారుజాము 3 గంటలకు తుది శ్వాస విడిచింది. ఉబికి వస్తున్న కన్నీళ్లను అదిమి పట్టుకొని, కామ్రేడ్ రాజె మృతదేహంపై ఎర్రజండా కప్పి, ప్రజలతో కలిసి విప్లవ సాంప్రదాయాలతో సగౌరవంగా అంత్యక్రియలు జరిపించారు. కామ్రేడ్ రాజె కన్న కలల్ని నిజం చేస్తామనీ, ఆమె ద్వేషించిన పిత్రు స్వామ్యాన్ని, దానికి మూలమయిన భూస్వామ్య సామ్రాజ్యవాదాలను పూడ్చి పెడతామని విప్లవ ప్రజలతో, గెరిల్లా యోధులు ప్రతినబూనారు.

నిండా పదిహేడేళ్లయినా నిండని కామ్రేడ్ రాజే బయటి ప్రపంచం అబూజ్‌మాడ్ అని పిలిచే మాడ్ కొండల్లో గల కాకూర్ అనే విప్లవ గ్రామంలో బొడుంగ కోర్సె- తోందే దంపతులకు కలిగిన రెండవ సంతానం. పేద ఆదివాసీ కుటుంబంలో జన్మించిన కామ్రేడ్ రాజేకు తల్లిదండ్రులు మెస్సి అని పేరు పెట్టారు. దళంలో చేరి పట్టుమని పది నెలలయినా పూర్తి కాకుండానే విప్లవ లక్ష్యంకోసం తన అమూల్యమైన ప్రాణాలర్పించిన కామ్రేడ్ రాజే జీవితం ఊహ తెలిసినప్పటి నుండే విప్లవకారులతో, పీపుల్స్‌వార్ పార్టీతో పెనవేసుకపోయింది. కాకూర్, మాడ్‌లోని అన్ని గ్రామాల్లోలాగానే అతి చిన్న గ్రామమే. కానీ, దశాబ్ద కాలానికన్నా ముందునుండే విప్లవ రాజకీయాలతో చైతన్యమవుతూ దోపిడీ పాలనపై తిరుగుబాటు బావుటా నెగురవేసిన గ్రామమది. బ్రిటీష్ సామ్రాజ్యవాదంపై తొలిసారిగా 1825లో తిరుగుబాటును ప్రకటించి ఆంగ్ల-మరాతా సేనలకు వ్యతిరేకంగా పోరాడిన గేండ్‌సింగ్ ఉరికంబమెక్కిన గ్రామమయిన పరాల్‌కోట్‌కు అతి సమీపంలోనున్న కాకూర్‌కు గొప్ప తిరుగుబాటు సాంప్రదాయముంది. యిక్కడి వృద్ధులు యిప్పటికీ వలస పాలకులతో కుమ్మక్కయిన రాజులు, జమీందార్లు ఎలా తమతో వెట్టిచాకిరి చేయించేవారో, ఏ విధంగా దోపిడీ దౌర్జన్యాలు అమలు చేసేవారో కళ్లకు కట్టినట్లు వివరిస్తారు. ప్రస్తుత అర్ధవలస-అర్ధభూస్వామ్య సమాజాన్ని కూలదోసి నూతన ప్రజాతంత్ర భారతాన్ని నిర్మించుకోవాలన్న పీపుల్స్‌వార్ రాజకీయాలతో సహజంగానే కాకూర్‌లోని ఆబాల గోపాలమూ ఆకర్షితులయ్యారు. పార్టీని, పార్టీ రాజకీయాలను ప్రేమించారు- విశ్వసించారు. రెండు దశాబ్దాలుగా అప్రతిహతంగా పురోగమిస్తున్న దండకారణ్య విప్లవోద్యమంలో భాగస్వాములవుతున్న శక్తులలో ఈనాడు రెండవ తరం వారు ముందుకు రావడమనేది సర్వసాధారణమైంది. కాకూర్‌లోనూ అదే జరిగింది. - జరుగుతోంది. అనేక మంది నవ యువతీ, యువకులు విప్లవ పార్టీలో, విప్లవ గెరిల్లా బలగాల్లో చేరుతూ ఉద్యమానికి వన్నె తెస్తున్నారు. అలాంటి తరానికి, ప్రత్యేకించి కాకూర్ గ్రామ యువతరానికి ప్రతినిధి కామ్రేడ్ రాజె.

కామ్రేడ్ రాజే పసి వయస్సు నుండే దళాలను చూసింది.

దళంలోని అక్కలు, అన్నలతో స్నేహం చేసింది. దళానికి అన్నం, నీళ్లు తేవడంతో మొదలు పెట్టి ముందుగా బాలల సంఘం లోనూ, ఆ తర్వాత క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘంలోనూ సభ్యురాలై తన రాజకీయ చైతన్యాన్ని పెంచుకుంది. ప్రత్యేకించి మాడ్ ప్రాంతంలోని ఆదివాసీ సమాజంలో మహిళలపై రీతి-రివాజుల పేరిట అమలయ్యే పితృస్వామ్య పీడనలను విప్లవ రాజకీయాల వెలుగులో అర్థం చేసుకుంది. వీటన్నింటినీ అంతమొందించడానికి తను సాయుధమయ్యి పోరాడాలని నిశ్చయించుకుంది. స్థానిక పార్టీ శాఖ ముందు తన ప్రతిపాదననుంచింది. అయితే గెరిల్లాల రిక్రూటింగ్ నియమం ప్రకారం వయస్సు 16 ఏళ్లు నిండనందున, తను మరింతగా విప్లవ రాజకీయాలను , విప్లవ జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలనూ అర్థం చేసుకునేందుకు గానూ ఒక సంవత్సరంపాటు ఆమె ప్రతిపాదనను ఆమోదించకుండా వాయిదా వేస్తూ పోవడం, అందుకు ఆమెను ఒప్పించడం, నిజంగా స్థానిక పార్టీ యూనిట్‌కు కష్టమే అయింది. చివరకు గత సంవత్సరం నవంబర్ నెలలో ఆమె ఎదురుచూపులకు తెరపడింది. ఆమె కామ్రేడ్ రాజెగా పరాల్‌కోట్ గెరిల్లా దళంలో సభ్యురాలైంది.

కామ్రేడ్ రాజె గెరిల్లాగా జీవించింది స్వల్పకాలమే అయినా, ఎప్పుడూ సజీవ చైత్యనంతో జీవించింది. గెరిల్లా దళ సభ్యురాలిగా క్రమశిక్షణతో నడుచుకుంటూ యింటి దగ్గర నోచుకోని చదువును నేర్చుకోవడానికి చాలా కృషి చేసింది. ప్రజలతో కలిసిపోతూ, వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ తన కర్థమయిన మేరకు విప్లవ రాజకీయాలు చెప్పింది. ఆదివాసీ సంస్కృతిని మింగివేస్తూ ఈ ప్రాంతంలో వేగంగా చొచ్చుకొస్తున్న హిందూ సంస్కృతిని, సామ్రాజ్యవాద సంస్కృతిని వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని వికసింపజేయడం కోసం జరుగుతున్న కృషిలో కామ్రేడ్ రాజే పాల్గొంది. చివరి వరకు ఒక దృఢమైన గెరిల్లాగా నిలిచిపోరాడి, విషపు పాముకాటుకు గురయ్యి శ్వాస పీల్చుకోవడం దుష్కరమయిన పరిస్థితిలోనూ చెక్కు చెదరని ధైర్యంతో నిలిచి, తనకు మృత్యువు తప్పదని తెలిసినప్పుడూ ఎక్కడలేని ప్రశాంతతను ప్రదర్శించి కనుమూసింది. తను దళంలో చేరిన కొన్నాళ్లకే పోలీసులు మాడ్ డివిజన్‌లో పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టి బాలెవాడ గ్రామంలో కాల్పులు జరిపి, కోహ్కామెట్ట గ్రామంలోని అమాయక రైతు రాజు నరోటిని నిష్కారణంగా కాల్చి చంపినప్పటికీ కామ్రేడ్ రాజె పట్టు సడలలేదు. అమాయక రైతుల్ని సైతం వదలకుండా, ప్రజల మానప్రాణాలను హరిస్తున్న పోలీసు హంతకులను ప్రతిఘటించాలని అందుకు ప్రజలను సాయుధం చేయాలని పార్టీ చేసిన నిర్ణయాలను అమలు పరచడంలోనూ కామ్రేడ్ రాజె పాల్గొంది. రాజకీయంగా, ఆర్గనైజేషనల్‌గా అనుభవం గడించే దశలో యిలా అకస్మాత్తుగా కామ్రేడ్ రాజె నిష్క్రమించడం మాడ్ డివిజన్ విప్లవోద్యమానికి, ప్రత్యేకించి పురోగమిస్తున్న విప్లవ మహిళా ఉద్యమానికి నష్టమే అయినా, కామ్రేడ్ రాజె ఆశయాన్ని కొనసాగించేందుకు మరెంతో మంది యువతీ యువకులు విప్లవోద్యమంలో చేరిపోయి విప్లవాన్ని కడకంటా సాగిస్తారు. చరిత్రలో యిప్పటిదాకా యిదే రుజువయింది.

దండకారణ్యంలో గత యిరవై సంవత్సరాల్లో పిడికెడు మందితో మొదలయిన ఉద్యమం వందలాది గెరిల్లా బలగాలతో, వేలాది ప్రజాసంఘాల సభ్యులు మరెంతో మంది సానుభూతిపరులతో కూడిన ఒక గొప్ప ప్రజాఉద్యమంగా, ప్రాథమిక స్థాయి గెరిల్లా జోన్‌గా ఎదిగి ఈనాడు దేశవాసులందరి దృష్టినీ తనవైపు తిప్పుకుంటోంది. ఈ యిరవై ఏళ్లలోనూ పాముకాటుకు గురైన గెరిల్లాలు ఎంతోమంది వున్నప్పటికీ దానితో ప్రాణాలు కోల్పోయిన తొలి గెరిల్లా కామ్రేడ్ రాజేనే. సాయుధ ప్రతిఘటనోద్యమం ఈ చేదు అనుభవంతో యిలాంటి ప్రమాదాల్లో బలగాల్ని కోల్పోకుండా అవసరమయిన చర్యలు తీసుకోవడంలో మరింత మెలకువగా వుంటుంది. అయితే ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ నేత కామ్రేడ్ జోస్ మారియో సిసోన్ చెప్పినట్లు *"....మరణించిన పద్ధతికాదు, యుద్ధాల నుండి తీసిన సారం ఒక మనిషిని యోధుణ్ణి చేస్తుంది. అనారోగ్యంతో మరణించే యోధుడున్నాడు, అనుకోని ప్రమాదంలో మరణించేయోధుడున్నాడు, శత్రువు చేతిలో చిత్రహింసలకు గురయ్యి అసువులు బాసే యోధుడూ వున్నాడు. ఎలా మరణించాడన్నది కాదు, ఎవరి కోసం మరణించాడన్నదే అమరత్వాన్ని నిర్ణయిస్తుంది."*

**కామ్రేడ్ రాజె అమర్ హై !**

## తమిళనాడులో మళ్లీ మొదలైన ఎన్‌కౌంటర్ **'హత్యాకాండలు'**:

# తమిళనాడు విప్లవోద్యమ బాటను ఉజ్వలంగా ప్రకాశింపజేసిన ప్రజా నాయకుడు కామ్రేడ్ రవీంద్రన్‌కు అరుణారుణ జోహార్లు!

2000 జనవరి 10 నాడు, తమిళనాడు స్పెషల్ టాస్క్ ఫోర్స్ బలగాలు, క్యూ బ్రాంచ్ (సిఐడి విభాగం) ధర్మపురి జిల్లాలోని, పెన్నగరం తాలూకాలోని పెరుంగాడు గ్రామంలో మన పార్టీ తమిళనాడు శాఖలో నాయకుడైన కామ్రేడ్ రవీంద్రన్‌ను, మరో కామ్రేడ్ శివను అరెస్టు చేసి క్రూరంగా చిత్రహింసలు పెట్టి, అటు తర్వాత కామ్రేడ్ శివ కళ్ల ముందే కామ్రేడ్ రవీంద్రన్‌ను కళ్లకు గంతలు కట్టి మరీ కాల్చి చంపారు.

ఈ ఘటన ద్వారా తమిళనాడు పోలీసులు దాదాపు దశాబ్దన్నర కాలం విరామం తర్వాత ఆ రాష్ట్రంలో బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలను మళ్లీ ప్రారంభించారు.

బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలకు పాల్పడ్డంలో తమిళనాడు పోలీసులకు చాలా చరిత్రే వుంది. 1940 దశకం చివర్లో వారు ఆనాటి అవిభక్త భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కామ్రేడ్ ఇరనియన్ను తంజావూరులో బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. 1970ల్లో అంటే నక్సల్బరీ శకం ఆరంభమైన, తర్వాత వారు మన పార్టీ తమిళనాడు శాఖ కార్యదర్శి, కేంద్రకమిటీ సభ్యుడు

అయిన కామ్రేడ్ అప్పును 'మాయం' చేశారు. ఎమర్జన్సీ చీకటి రాత్రుల్లో వారు కామ్రేడ్ బాలన్‌ను అమానుషంగా హింసించి హత్య చేశారు.

ఇక మళ్లీ 1980ల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె)(పీపుల్స్‌వార్) నాయకత్వం క్రింద ప్రజా ఉద్యమం మళ్లీ ఊపిరి పోసుకుంటున్న కాలంలో ఈ కిరాతకులు 26 మంది మన ప్రియతమ కామ్రేడ్లను పొట్టన పెట్టుకున్నారు. నరరూపరాక్షసుడు వాల్టర్‌దేవరం (పోలీసు డిఐజిగా ఇటీవలే రిటైర్ అయ్యాడు) కామ్రేడ్ బాలన్‌నూ కామ్రేడ్ కన్నమణినీ స్వయంగా చిత్రహింసలు పెట్టి కాల్చి చంపాడు.

అయితే ఎన్ని దెబ్బలు తిన్నప్పటికీ తమిళనాడులోని విప్లవోద్యమ జ్యోతి ఎన్నడూ కొడిగట్టలేదు. ప్రతి రౌండు నిర్బంధకాండ పిదప అది తిరిగి ఊపిరి పోసుకుని విజృంభిస్తోంది. 1980ల్లో మన పార్టీ నాయకత్వంలో సాగిన విప్లవోద్యమం ధర్మపురి జిల్లాలోని పలు ప్రాంతాలకేకాక, తమిళనాడులోని అనేక యితర తావులకు కూడా విస్తరించింది. అయితే లిక్విడేషనిస్టు కోదండరామన్ ముఠా ఈ కాలంలో, పోలీసులు కల్గించిన నష్టాలను మించిన హానిని విప్లవోద్యమానికి కలుగజేసింది.

విప్లవోద్యమం తిరిగి పట్టాలపైకి తేవడానికి 1992 నుండి ప్రయత్నాలు సాగుతున్నాయి. గత కొద్ది సంవత్సరాల కాలంలో ప్రజాసంఘాలను పునర్నిర్మించడం జరిగింది. పోరాటాలు తిరిగి ఊపునందుకోసాగాయి. ఒక్క ధర్మపురి, పెన్నగరం తాలూకాల్లోనే ప్రజాసంఘాలకు చెందిన ఇంచుమించుగా 100 శాఖలు పనిచేయసాగాయి. వడ్డీ వ్యాపారులు, అటవీ అధికారులు, భూస్వాములు దుష్టపెత్తందారులకు వ్యతిరేక పోరాటాలు విస్తృతంగా చేపట్టబడ్డాయి. మహిళపట్ల వివక్షత అణచివేత కులఅణచివేత, వివక్షలకు వ్యతిరేక ఉద్యమాలు నిర్వహించబడ్డాయి. 1993-94ల్లో పోలీసులు పెద్దెత్తున విరుచుకుపడి 150 మందికి పైగా ప్రజలను అరెస్టు చేశారు. ఈ నిర్బంధకాండ ఈనాటికీ కొనసాగుతోంది. పెన్నగరం అటవీ ప్రాంతంలోని విప్లవోద్యమ విస్తరణకు భీతిల్లిన పాలకులు ఇన్నేళ్లుగా వీరప్పన్ వేటలో వున్న ఎస్‌టిఎఫ్ దళాలను విప్లవకారులపైకి మోహరించారు. స్థానిక గూండాలకు ఆయుధాలనిచ్చి విప్లవకారులపైకి ఎగదోశారు. ఈ గూండాలు చేసిన హత్యాకాండ నుండి కామ్రేడ్ రవీంద్రన్ ఒకసారి వెంట్రుకవాసిలో తప్పించు కోగలిగాడు.

## నిర్బంధంలో కొత్త రౌండు

మన ప్రియతమ నాయకులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలను రాజ్యం పాశవికంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ ధర్మపురిలో ప్రజలు డిసెంబర్ 26 నాడు రెండు బస్సులను తగలబెట్టారు. యిక నిర్బంధకాండను తీవ్రతరం చేయడానికి పోలీసులు దీన్నోసాకుగా వాడుకొన్నారు. మనపార్టీకి వ్యతిరేకంగా భయంగొల్పే కట్టుకథలతో పత్రికలను నింపారు. ఎస్‌టిఎఫ్ బలగాలకు తోడుగా మరో 3000 మంది సాయుధ పోలీసుల్ని రంగంలోకి దింపారు. గ్రామీణ ప్రాంతాల్లో గాలింపు చర్యలను సాగించడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. పోలీసు స్టేషన్లను కోటల్లా కట్టుదిట్టం చేశారు. బస్టాండులు ప్రధాన కూడళ్లలో పోలీసు బృందాలను మోహరించారు. అంతిమంగా వారు కామ్రేడ్ రవీంద్రన్‌ను అరెస్టు చేసి, హతమార్చగలిగారు.

## మడమ తిప్పకుండా దృఢదీక్షతో పోరాడిన విప్లవ యోధుడు కామ్రేడ్ రవీంద్రన్

కామ్రేడ్ రవీంద్రన్, ఉన్నత మధ్యతరగతి కుటుంబంనుంచి వచ్చాడు. సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లమో పొందిన తర్వాత భారత ప్రభుత్వ టెలికామ్ శాఖలో ఉద్యోగి అయ్యాడు. భారత టెలికామ్ శాఖ ఉద్యోగులు, కార్మికులకు దశాబ్దాల విప్లవ పోరాటాల చరిత్ర వుంది. బలమైన కార్మిక సంఘాలున్నాయి. ఆ శాఖలో చేరిన పిదప కామ్రేడ్ రవీంద్రన్ కార్మికసంఘ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. తోటి ఉద్యోగుల, కార్మికుల ప్రేమాభిమానాలను త్వరితంగానే చూరగొన్నాడు. కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలను నిర్వహిస్తూ ఎస్‌సి/ఎస్‌టి ఉద్యోగుల నిర్దిష్ట సమస్యలను చేపట్టడం ద్వారా వారిని ప్రధాన సంఘాల బావుటా క్రిందకు తెచ్చే కృషి చేశారు.

ఆయన 1989లో పూర్తికాలం కార్యకర్తగా ఉద్యమం నిర్వహణ బాధ్యతలను చేపట్టాడు. అప్పటిదాకా ఆయన తన ఉద్యోగం ద్వారా తనకు లభించే ఆదాయంలో అధిక భాగాన్ని 'మున్నోడి' అనే విప్లవ విద్యార్థి యువజన పత్రిక ప్రచురణకోసం వెచ్చించేవారు. మండల్ సిఫారసుల అనుకూల ఉద్యమం. ఇరాకుపై అమెరికా సామ్రాజ్యవాదదాడి వ్యతిరేక నిరసన ప్రదర్శనలు, కొండకులమ్‌లో అణువిద్యుత్ కేంద్ర ఏర్పాటుకు వ్యతిరేక పోరాటం, యిలా ప్రజాపోరాటాలు, నిరసనోద్యమాలు అన్నింటిలో ఆయన పాలుపంచుకున్నాడు.

1993లో ఆయన అరెస్టు అయి జైల్లో వుండగా, జైలులోని యితర ఖైదీల పట్ల అధికారుల అమానుష ప్రవర్తనకు నిరసనగా పోరాటాలను నడిపాడు. పోలీసుల కస్టడీలో చిత్రహింసలపాలై మరణించిన ఒక బాలుడి ఉదంతంపై పట్టువదలకుండా పోరాటం జరిపాడు. దాని ఫలితంగా ప్రభుత్వానికి ఈ హత్యకు కారకుడైన ఒక ఇన్‌స్పెక్టర్‌ను అరెస్టు చేయక తప్పలేదు. అలా కామ్రేడ్ రవీంద్రన్ జైలులో వున్నా బైటవున్నా అక్రమాలకు పాల్పడేవారికి సింహ స్వప్నంగా నిలిచాడు.

ఉన్నత మధ్యతరగతి కుటుంబంనుండి వచ్చి, ఒక గ్రామికవర్గ యోధుడిగా ఆయన తన్నుతాను మలుచుకున్న తీరు ప్రతి ఒక్క విప్లవకారుడూ తప్పనిసరిగా అనుసరించాల్సివున్న మహాఆదర్శం. సాదా సీదా జీవనం, కష్టపడి పనిచేయడం ఈ రెండు విషయాలకు ఆయన పెట్టింది పేరు. బాధ్యత తీసుకోవడానికి సదా సిద్ధంగా వుండడం, పనిలో చొరవ చూపడం, నిర్మాణ క్రమశిక్షణను తుచ తప్పకుండా పాటించడం అనే ఒక మంచి కమ్యూనిస్టు గుణగణాలను ఆయన పుణికి పుచ్చుకున్నాడు. ప్రజలలో కలగలిసి పోవడం అన్నది ఆయనలోని మరో సుగుణం. శత్రు బుల్లెట్లకు ఎదురు నిల్చినప్పుడు కూడా ఏ మాత్రం వెన్ను చూపకుండా, చివరి శ్వాసదాకా భారత కమ్యూనిస్టుపార్టీ(మా-లె)(పీపుల్స్‌వార్) పతాక ప్రతిష్టను నిల్పిన అమరుడు కామ్రేడ్ రవీంద్రన్ అరుణారుణ స్మృతికి '*ప్రభాత్*' సవినయంగా జోహార్లు అర్పిస్తోంది.

**కామ్రేడ్ రవీంద్రన్ అమర్ హై !**

# పోలీసు నిర్బంధం మా ప్రజాపోరును ఆపదు

**- దండకారణ్య స్పెషల్ గెరిల్లా జోన్**

*[1999 జూన్ నుండి 2000 మే మధ్యన దండకారణ్యంలోని వివిధ డివిజన్‌ల విప్లవ ప్రజానీకం శత్రు నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూ చేపట్టిన అనేక పోరాటాలను ఎస్‌జడ్‌సిఎం ద్వారా విని పాఠకుల అవగాహన కోసం సంక్షిప్తంగా వాటిని వార్షిక నివేదికగా అందిస్తున్నాం. - సం.మం.]*

## కొయ్యూరుఅమరుల సాక్షిగా గన్నులెత్తిన గెరిల్లాలు- వీరుల సంస్మ రణ సభల్లో పిడికిలెత్తిన వీర ప్రజానీకం

1999, డిసెంబర్ 2, భారత ప్రజాతంత్ర విప్లవోద్యమ చరిత్రలో అత్యంత దుర్దినం. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు - లెనినిస్టు) (పీపుల్స్‌వార్) చరిత్రలో ఒకేసారి ముగ్గురు కేంద్రకమిటీ నాయకులను కోల్పోయిన దినమది. పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో దినదినం విస్తరిస్తూ పెంపొందుతున్న విప్లవోద్యమం తన ఉత్తమ కార్మిక వర్గ పుత్రులను కోల్పోయిన రోజది. శత్రువును సవాలుచేస్తూ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే లక్ష్యంతో ప్రత్యేక గెరిల్లా జోన్‌లుగా ఉనికిలోకి వచ్చిన ఉత్తర తెలంగాణ, దండకారణ్యం, గెరిల్లాజోన్ సన్నాహక దశలోవున్న ఆంధ్ర- బీహార్‌లు మాత్రమే కాకుండా యావద్భారతావనిపై పరచుకున్న పోరాట కేతనాన్ని తమ మృత్యువుతో మరింత ఎరుపెక్కిస్తూ ఆ ముగ్గురు వీరులు అందించిన సందేశాలు ఆవహించిన రోజు అది. ఆ వీరులు శత్రువు చేపట్టిన అత్యంత నీచమైన కోవర్ట్‌వార్ ఎత్తుగడలకు బలై బెంగుళూరులో అరెస్టయ్యారు. రోజంతా వాడి చిత్రహింసలను నిబ్బరంగా ఎదుర్కొన్నారు. తమ విప్లవాశయాలు సమున్నతమైనవని, తమ స్వప్నాలను, తమ వారసులు, సహచరులు సఫలంచేసి తీరుతారన్న దృఢసంకల్పంతో శత్రువును సవాలుచేస్తూ ఎర్రజండాపై నిండు విశ్వాసంతో వాడి తూటాలకు తమ గుండెలను నిలిపారు. ఉత్తర తెలంగాణాలోని కరీంనగర్ కొయ్యూరు అటవీ ప్రాంతంలో శత్రువు జరిపిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో చిమ్మిన మన ప్రియతమ కామ్రేడ్స్ నెత్తుర్లు భూతల్లి విముక్తికోసం అంకితమైనవి.

ఈ వార్త దావానలంలా నలుదిశలకు వ్యాపించింది. తమ ప్రియమైన గౌరవనీయులైన నాయకులను కోల్పోయిన వీరగెరిల్లాలు, విప్లవ ప్రజానీకం శత్రువుపై మరింత కసిని నింపుకున్నారు. పోరుప్రతినబూనారు. ఈ వీరుల సంస్మరణ సభలు దండకారణ్య వ్యాప్తంగా జరిగాయి. గెరిల్లాలు - ప్రజలు సంస్మరణ సభల్లో వారి జ్ఞాపకాలను పంచుకున్నారు. వీరుల మరణాలు కన్నీరు తెప్పించవనీ, భీరత్వాన్ని తలకెక్కించవనీ, శత్రువుపై కసిని నింపుతాయనీ కర్తవ్యాన్ని ప్రభోదిస్తాయనీ, కార్యోన్ముఖులను చేస్తాయనీ వక్తలు తమ పోరాట అనుభవం నుండి మాట్లాడారు.

## గెరిల్లాల వర్గకసిలో మట్టి గరచిన లిఖిరాం కావ్రే

దండకారణ్యంలోని బాలాఘాట్-బండారా సంయుక్త డివిజన్ గెరిల్లాలు తమ ప్రియమైన నాయకుల అమరత్వ వార్త రేడియో ద్వారా విని ముందు నమ్మలేకపోయారు. కానీ, దినదినం పెచ్చరిల్లుతున్న అణచివేత చర్యల్లో యిలాంటి ప్రమాదాలు వాటిల్లడానికి అవకాశాలు లేకపోలేదని గుండెనిబ్బరంచేసుకున్నారు. ఆంధ్ర-మధ్యప్రదేశ్-మహారాష్ట్ర-ఒరిస్సా-బీహార్ రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రంతో కుమ్మక్కై విప్లవపార్టీని, ప్రజాపోరాటాలను అణచడానికి ముఖ్యంగా గత దశాబ్దకాలంగా చేస్తున్న కుట్రల ఫలితమే ఈ హత్యలనీ, వీటికి ప్రతీకారంగా ఆ కుట్రదారులను దెబ్బతీయాల్సిన అవసరం రోజు రోజుకు పెరుగుతుందనీ నిర్ణయించుకున్నారు. దండకారణ్యంలో పెంపొందుతున్న పీడిత రైతాంగ పోరాటాలను తుదకంటా అణచడానికి దండకారణ్య ప్రాంతానికి చెందిన 3 రాష్ట్రాల ప్రభుత్వాలు పొరుగునున్న రాష్ట్రాల పోలీసు పౌర ఉన్నతాధికారులతో తరచుగా సమావేశాలవుతూ కేంద్రం గైడెన్స్‌లో వినూత్న పద్ధతుల్లో దాడులకు పాల్పడుతూ, ఎక్కడికక్కడే ఈ రాష్ట్రాల మంత్రి వర్గాలు పకడ్బందీ పథకాలు రూపొందిస్తున్నాయి. వీటిని ప్రజాయుద్ధం ద్వారానే ఓడించాలని గెరిల్లాలు ప్రతినబూనారు. కిర్నాపూర్‌లో మధ్యప్రదేశ్ రవాణాశాఖమంత్రి విడిది చేసిన విషయం ప్రజల సహకారంతో తెలుసుకున్న గెరిల్లాలు వాడి యింటిపై దాడి చేసి వాడికి బుద్ధి చెప్పాలని, ఆ శిక్షతో, దోపిడీ పాలక వర్గాల్లో విప్లవ ప్రతీకార జ్వాలల ద్వారా జడుపు పుట్టించాలనీ, గుణపాఠంగా నిలపాలనీ దాడి చేశారు. మంత్రి లిఖిరాంకావురేను అరెస్టు చేసి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్యమానికి వ్యతిరేకంగా చేస్తున్న కుట్రలకు నీ చావుతో మూల్యం చెల్లించకతప్పదని మరణశిక్ష విధించి విప్లవ నినాదాలతో కిర్నాపూర్‌ను మేల్కొల్పారు. ఊరు అడవి విప్లవ నినాదాలను విని వినమ్రంగా తలవంచి వీరుల సంస్మరణలో మౌనంగా నిలిచాయి. ప్రజావీరులను హతమార్చే నీచులను చరిత్ర క్షమించదనీ, ఆంధ్రప్రదేశ్ నియంతలు చంద్రబాబు, హెచ్.జె. దొరలకు కూడా యిదే గతి పడుతుందని గెరిల్లాలు హెచ్చరించారు.

మంత్రి చావుతో ఖంగుతిన్న పాలకవర్గాలు తమకు ప్రజాయుద్ధంతో మూడనున్న చావు నుండి తప్పించుకోవడానికి విధానసభ-లోక్‌సభల్లో సిగపట్లతో రాక్షసచట్టాల రచనకు నడుంలు బిగించారు. కానీ, ఏ చట్టాలు - ఏ శాసనాలు విజృంభించే ప్రజాపోరాటాలను అణచలేవనీ, గెరిల్లాల సైనిక దాడులను అరికట్టలేవని అంటూ గెరిల్లాలు వాకుల్‌వాహి ఆంబుష్ మచ్చుతునకను ముందుంచారు.

## ఫిబ్రవరి 20న వాకుల్‌వాహిలో మట్టిగరచిన హంతక అధికారులు-ప్రజాద్రోహులు

దండకారణ్యంలోని మాడ్ డివిజన్, ఎత్తైన గుట్టలతో, దట్టమైన అడవులతో గెరిల్లా యుద్ధానికి అత్యంత అనుకూలంగా వుంటుంది. యిక్కడ నివశించే నిరుపేద ఆదివాసీ ప్రజానీకం యిప్పటికీ ప్రధానంగా పోడు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. అయినప్పటికీ మాడ్ ప్రజానీకం బ్రిటీష్ వలస వ్యతిరేక పోరాటాలలో వీరోచితంగా పోరాడిన చరిత్రను కలిగి వున్నారు. అణచివేతంటేనే ద్వేషిస్తారు. అలాంటి వీర ప్రజలను హతమారుస్తూ, ఆ ప్రజలకు పోరాట నాయకత్వాన్ని అందిస్తున్న పార్టీని పశుబలగాలతో తుదముట్టించాలని దూకుడుగా వస్తున్న హంతక పోలీసులను వారికి అండగా నిలిచిన రహస్య పోలీసులను (వీరందరూ పోలీస్ ఇన్ఫార్మర్లే, వీరిలో కొందరు మాజీ నక్సలైట్లు వున్నారు) కొయ్యూరు

వీరుల ఆశయాల సాక్షిగా 20-2-2000 నాడుజరిగిన మాటుదాడిలో గెరిల్లాలు తునాతునకలు చేశారు. ఒక్కదాడిలో 24 మంది పోలీసులను మట్టి కరిపించి, వారి ఆయుధాలను స్వాధీనపరచుకున్న ఏకైక ప్రముఖ ఘటనగా అప్పటివరకు జరిగిన చరిత్రను తవ్వితీస్తూ దోపిడీ పాలకవర్గాలు, వారి తాబేదార్లు, వారి రాజ్యాంగ యంత్రం, వారి అడుగులకు మడుగులొత్తే మీడియా గుండెలు బాదుకున్నాయి. ఈ దాడిలో భాస్కర్ దివాన్ అనే జిల్లా పోలీసు అధికారి, సమర్ అనే రహస్య పోలీసు మట్టిగరవడంతో ప్రజలు పండుగచేసుకున్నారు. మాడ్ డివిజన్‌లో ప్రజల ప్రేమాభిమానాలను చూరగొన్న వీర గెరిల్లాలు కామ్రేడ్స్ సోమన్న, సబిత, కవిత, రమేష్ మరియు వీరికి ఆశ్రయమిచ్చిన రైతును 1999 జులై 26 నాడు అమానుషంగా హతమార్చిన ఘటనలో వీరిద్దరూ ప్రధాన నిందితులు. వీరి మరణవార్త విన్న జనాలు పండుగ చేసుకోకుంటే మరేం చేసుకుంటారు!

అయితే, వీరి మరణవార్తను పత్రికలు ఆకాశానికి ఎత్తాయి. పోరాట ప్రాంతానికి బయటనున్న ప్రజల్లో వీరి త్యాగాలకు హారతి పట్టాయి. నక్సలైట్లను దేశవిద్రోహక శక్తులుగా చిత్రిస్తూ నీచమైన ప్రచారానికి తమ పత్రికలను వేదికగా నిలిపాయి. భారత పాకిస్థాన్ పాలకవర్గాల కుట్రలకు కార్గిల్ సమరంలో అత్యంత విలువైన తమ జీవితాలను దేశభక్తిపేరుతో ఫణంగా పెడుతున్న వీర జవానుల తరహాలో వార్తా పత్రికల్లో కథనాలు రాస్తూ, విప్లవకారులను విదేశీ కిరాయి సైనికులతో పోలుస్తూ ప్రజల మనోభావాలను పరమనీచ పద్ధతిలో రెచ్చగొట్టే వార్తలకు ప్రాధాన్యతనిచ్చాయి. వాకుల్‌వాహిలో నేలకూలిన ఖాకీమూకల హంతక చరిత్రను మరుగుపరచి, వారి స్మృతులకు నీరాజనాలు పట్టిన పత్రికలు, ఆ ఖాకీల దుర్మార్గాల నుండి గ్రామ రైతాంగాన్ని పక్కదార్లు పట్టించడానికి పెట్టుబడిదార్ల విషపుత్రికలైన పత్రికలన్నీ ఏకతాటిపై నిలిచాయి. ఇవి ఇలాంటి వార్తలను ఎంతగా దట్టించినా రోజు రోజుకు తీవ్రమవుతున్న దేశ- ఆర్థిక - రాజకీయ సంక్షోభం ఏ మూలనున్న జనాన్నైనా వీధుల్లోకి తేకనూమానదు. వారు పాలకవర్గాల కిరాయి బలగాలతో సాయుధపోరుకు నిలబడకనూ పోరు.

## మరో హంతకునికి బుద్ధి చెప్పిన ఎడ్సగడ్ మందుపాతర

గత కొద్దికాలంగా ఆంధ్ర-దండకారణ్య (3రాష్ట్రాల) పోలీసులకు మాడ్ డివిజన్ లక్ష్యం(టార్గెట్)గా మారింది. మాడ్ డివిజన్ విప్లవ కార్యక్రమాలకు కేంద్రంగా నిల్చిందని తెగ దుష్ప్రచారం సాగిస్తున్నారు. కొండల కొలతలు, ప్రాంత విస్తీర్ణంతో సహా చిలువలు పలువలల్లుతూ పత్రికలు చాటుతున్నాయి. ముఖ్యంగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాంతంలో డబ్బు రాశులను గుమ్మరిస్తూ విపరీతమైన సంస్కరణ కార్యక్రమాలను చేపట్టింది. ఈ సంస్కరణల కేంద్ర లక్ష్యం గెరిల్లాల సమాచారాన్ని విప్లవ కార్యకలాపాల సమాచారాన్ని రాబట్టడానికి లోతట్టు అడవి నుండి కూడా తగిన ఇన్‌ఫార్మర్‌ల యంత్రాంగాన్ని సృష్టించుకోవడమే తప్ప యివి నిజంగా ప్రజల ప్రయోజనాలనాశించి చేపట్టినవి ఎంత మాత్రమూగాదని తేలిపోయింది. కింది నుండి పై వరకు ప్రభుత్వోద్యోగులు ఎవరి వాటా మేరకు వారు, ఎవరి పలుకుబడి, తాహత్తు మేరకు వారు పోటీపడుతూ ఆ డబ్బుల్లో ముప్పాతికపాలు స్వాహాచేస్తున్నారు. ఒకవైపు తీవ్ర నిర్బంధం-మరోవైపు డబ్బురాశుల మహిమతో ఇన్ఫార్మర్ల సృష్టి. వీటన్నింటిని తట్టుకుంటూ, ప్రతిఘటిస్తూ స్థానిక ప్రజలు విప్లవ పార్టీ నాయకత్వంలో తమ విజయాలను ఎత్తిపడుతున్నారు. విజయాలను వమ్ముచేసే దుర్మార్గులను చీల్చి చెండాడుతున్నారు. యిందులో భాగమే ఎడ్సగడ్ మందుపాతర విస్ఫోటనం.

పార్టీ కేంద్రకమిటీ నాయకులను ముగ్గురిని హతమార్చిన సంబరంతో విప్లవోద్యమం నడ్డి విరిగిందని, అంతమైందని వెర్రికుక్కల్లా మొరుగుతున్న పోలీసుల బలగాలకు ఎక్కడికక్కడే బుద్ధి చెప్పాలని కేంద్ర కమిటీ యిచ్చిన పిలుపును వీర గెరిల్లాలు అమలుఛేసిన ఫలితమే 2000, మే7న కుర్సనార్ మందుపాతర విస్ఫోటనం. ఈ ఆంబుష్‌లో సుబురు అనే ఒక రహస్య పోలీసు మట్టికరిచాడు. వీడు ఏప్రిల్ 99లో మా ప్రియమైన సహచరుడు కోహకమెట్ట దళసభ్యుడు కామ్రేడ్ రాకేశ్‌ను నమ్మకద్రోహంతో వెన్నుపోటుపొడిచి హతమార్చిన విశ్వాసఘాతకుడు. రహస్యపోలీసుగా ఊళ్లో వుంటూ జనాన్ని నమ్మిస్తూ గెరిల్లాలతో స్నేహంచేసి, అవకాశం దొరికిన క్షణంలో రాకేశ్ అనే గెరిల్లాను వెన్నుపోటుతో హతమార్చాడు. వీడు మందుపాతర విస్ఫోటనంలో తునాతునకలుకాగా, పెట్రోలింగుకు వచ్చిన మిగతావారిలో కమాండర్, ఉపకమాండర్ మరో ముగ్గురు పోలీసులు గెరిల్లాలు కాల్చిన తూటాలతో గాయపడ్డారు. గంటకుపైగా జరిగిన ఈ కాల్పుల్లో గెరిల్లాలు తమకు ఎలాంటి నష్టం లేకుండా, పోలీసులను నష్టపరచి పోరు నినాదాలతో రిట్రీట్ అయ్యారు. శత్రువును *"దెబ్బతీయు - దౌడు తీయు"* (मारो-भागो) ఎత్తుగడలతో గెరిల్లాలు పోలీసులను మట్టిగరిపించిన వార్త క్షణాల్లో మాడ్ అడవుల్లో ప్రతిధ్వనించింది. అడవులు, కొండల మధ్య ప్రజానీకం వారిని తమ గుండెల్లో నిలుపుకున్నారు. 2000 మార్చి భజరంగబలిలో (ఉత్తర బస్తర్) గెరిల్లాలు జరిపిన ఆంబుష్‌లో బస్తర్ జిల్లా ఎస్పి మరియు యితర ఉన్నతాధికారులు తృటిలో తప్పుకున్నారు. బాలాఘాట్‌లో గెరిల్లాలు జరిపిన మరో ఆంబుష్‌లో ఎస్ఐ మరియు హెడ్‌కానిస్టేబుల్‌కు నూకలు చెల్లాయి. వారి ఆయుధాలు గెరిల్లాల స్వాధీనమయ్యాయి.

## అమరుల సంస్మరణ - దండకారణ్య గెరిల్లా జోన్ జోహార్!

కామ్రేడ్స్ శ్యాం, మహేశ్, మురళిల సంస్మరణలో డిసెంబర్ 3 నుండి దండకారణ్యంలోని గెరిల్లాలు- ప్రజలు పిడికిలెత్తి సైనిక వందనాలు అందజేయడం ప్రారంభమైంది. 2-12-99నాడు రాత్రి బిబిసి రేడియో వార్తల్లో బూటకపు ఎన్‌కౌంటర్ వార్త పిడుగుపాటులా విన్న గెరిల్లాలు క్షణకాలం నిశ్చేష్టులై విస్తుపోయారు. ఆ వెంటనే తేరుకొని శత్రువుపై కసి నిండిన హృదయాలతో పిడికిలెత్తి పేరుపేరున జోహార్ అంటూ అమరులను స్మరించుకున్నారు. మరుసటి రోజు నుండి దండకారణ్యంలోని 2 ప్లటూన్‌లతో సహా 40 గెరిల్లా దళాలు, చేతనా నాట్యమంచ్ సాంస్కృతిక యోధులు ఈ వార్తతో ప్రజల్లోకి వెళ్లారు. ప్రభుత్వ పాశవిక చర్యను ప్రజల్లో ఎండగట్టారు.

దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘ్-క్రాంతికారి ఆదివాసీ మహిళా సంగ్ మరియు ఆదివాసీ బాల సంగ్‌లతోపాటు గ్రామరక్షకదళాలు, ఏరియా రక్షక దళాలు, గ్రామాల్లోని వందలాది పార్టీ కార్యకర్తలు, గ్రామరాజ్యకమిటీలు, వ్యవసాయాభివృద్ధి కమిటీలు, ప్రాంతీయ వ్యవసాయాభివృద్ధి కమిటీలు తదితర అన్ని రకాల ప్రజాసంఘాల -పార్టీ-రాజకీయాధికార అంగాల నిర్మాణాలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరియు ఆంధ్ర

అత్యున్నత పోలీస్ అధికారి (డిజిపి) దొర ల ఫాసిస్టు జంట విప్లవ వీరుల మరణానికి మూల్యం చెల్లించక తప్పదని పిడికిలెత్తి హెచ్చరికచేశాయి.

1999, జులై 28 నుండి ఆగష్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారం అత్యంత శ్రద్ధాసక్తులతో పాటించిన వారంలోనే, చురియా రెయిడ్‌లో పోలీసులను మట్టిగరిపించి దండకారణ్య స్పెషల్ గెరిల్లా జోన్‌కు ఆయుధాలు సంపాదించాలని వెళ్లి వీరోచితంగా పోరాడి తన ప్రాణాలను గడ్డిపోచలా భావించి ఆశయ సాధనకై అంకితమొనర్చిన నవయవ్వన విప్లవ వీరకిశోరము కామ్రేడ్ విక్రమ్ (శ్రీనివాస్) స్మృతిలో కారిన కన్నీరు తడి ఆరకముందే, గాయమైన గుండెలు కుదుటపడకముందే పార్టీ అత్యున్నత నాయకుల అమరవార్త విన్న గెరిల్లా జోన్ ప్రజానీకం మరింత బరువెక్కిన గుండెలతో అమరవీరుల స్థూపాల ప్రాంగణాలలో తలలు దించి తలపాగలు తీసి వినమ్రంగా సైనిక క్రమశిక్షణలో జోహార్లర్పించారు.

అమరులైన కేంద్ర కమిటీ సభ్యుల స్మృతిలో 1999 డిసెంబర్ నుండి జులై 28, 2000 వరకు అమరవీరుల సంస్మరణ సభలు-శత్రువుపై ప్రతీకార చర్యలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని విప్లవోద్యమంలోని విశాల ప్రజానీకానికి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)(పీపుల్స్‌వార్) యిచ్చిన పిలుపును పురస్కరించుకొని విశాల దండకారణ్య స్పెషల్‌జోన్‌లోని అన్ని డివిజన్‌లలో వేలాది మంది ప్రజానీకం వందలాది సభలు-సమావేశాలు జరుపుకున్నారు. వీరుల త్యాగాలు స్మరించుకున్నారు. వివిధ డివిజన్‌ల పార్టీ శాఖలు తమ వీలును బట్టి బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా బంద్ పిలుపులిచ్చాయి.

ఉత్తర్‌బస్తర్‌లోని కేస్కల్, కొండగాం, డౌలా, కోయిలబేడ దళాల ఏరియాలోని అనేక గ్రామాల ప్రజలు ఆ డివిసి యిచ్చిన బంద్ పిలుపు మేరకు 2000, జనవరి 15 నాడు అందులో పాల్గొన్నారు. అలాగే 1999 డిసెంబర్ 10 నుండి 10-2-2000ల మధ్య డివిజన్ వ్యాప్తంగా సభలు జరిగాయి. 100 గ్రామాలలో దాదాపు 5 వేల జనం స్త్రీలు-పురుషులు-పిల్లలు పాల్గొన్నారు. దాదాపు 30 క్యాంపెయిన్ బ్యాచ్‌లలో 300 మంది డివికెఎంఎస్-కెఎఎంఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. 110గ్రామాలు వెళ్లారు. డజన్లకొద్ది బ్యానర్లు, వందలాది పోస్టర్లు, వేలాది కరపత్రాల్లో అమరవీరుల త్యాగాలను శ్లాఘించారు. ప్రజాసేవకు అంకితమైన భారత కార్మికవర్గ ఉత్తమపుత్రుల ఆదర్శాలను కీర్తించారు. వారి ఆదర్శమయజీవితాల గూర్చి ఎత్తిపట్టారు.

ప్రజామిలీషియా కార్యకర్తలు 6గురు మహిళలతో సహా 25 మంది సాయుధంగా వెళ్లి డౌల పోలీస్‌స్టేషన్‌పై కాల్పులు జరిపి అదురుగుండె పోలీసుల్లో గుబులు పుట్టించారు. అంతాగఢ్ పోలీస్ స్టేషన్‌పై ప్రజామిలీషియా కార్యకర్తలు మరియు గెరిల్లాలు కలిసి 20 మంది దాడిచేసి, కాల్పులు జరిపి పోలీసుల గుండెల్లో బెదురు పుట్టించారు. సరండిలో ప్రజామిలీషియా కార్యకర్తలు పట్వారికి చెందిన ప్రభుత్వ క్వార్టర్‌ను ధ్వంసం చేశారు. డివిజన్‌లో దళాలు గెరిల్లాలు మరియు మిలిటెంట్లు 100 మంది కలిసి ఇన్‌ఫార్మర్లపై దాడులు జరిపారు. కొంతమంది ఆస్తులను జప్తు చేసుకున్నారు. 14-1-2000నాడు 'దుర్గ్' అనే ఇన్ఫార్మర్‌ను ఖతం చేశారు. ఎంపిఎస్ఆర్‌టిసికి చెందిన ఒక బస్సును దగ్ధం చేశారు.

మాడ్ డివిజన్ కూడా 15 జనవరి నాడు బంద్ పిలుపు యిచ్చింది. ఆశయ సాధనలో విద్రోహంతో పోలీసుల చేతచిక్కి కొయ్యూరులో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన కేంద్రకమిటీ సభ్యులకు నివాళులర్పిస్తూ మరియు మాడ్ కొండల్లో అమాయక నిరుపేద ఆదివాసీ రైతు కామ్రేడ్ రాజు నరోటిపై మధ్యప్రదేశ్ పోలీసులు జరిపిన హంతకదాడిని ఖండిస్తూ బంద్ పిలుపుఇచ్చింది. పోస్టర్ల ద్వారా విస్తృత ప్రచారం జరిగింది. కోహకమెట్ట, ఇంద్రావతి, పరాల్‌కోట దళాలు విస్తృతంగా ప్రచారం చేశాయి.

జులై 25న కోటెనార్‌లో నలుగురు గెరిల్లాలను, రైతును హతమార్చి రైతు కూతురును గాయపర్చిన పోలీసుల ఘాతుకాన్ని జనాలు యింకా యింకా గుర్తుచేసుకుంటుండగానే, మరిన్ని హత్యలు వెలుగులోకి రావడంతో ప్రజాస్వామ్యం ముసుగులో కొనసాగుతున్న హంతక వ్యవస్థ అసలు స్వరూపం అత్యంత లోతట్టు ప్రాంతంలో జీవిస్తున్న ఆదివాసులకు కూడా బోధపడింది. తమ మధ్య తమ కోసం యేళ్ల తరబడిగా కృషిచేసిన కామ్రేడ్స్ సోమన్న (గౌరన్న), సబిత (మిడ్కో), కవిత (జయమతి),లతోపాటుగా మాడ్ కడుపున పుట్టిన మాడ్ భూమి పుత్రుడు రమేష్ (గుడ్సా)లకు వారితోపాటు అమరుడైన కోటెనార్ రైతుకు పేరు పేరున జోహార్లర్పించిన రైతాంగం మాడ్ కొండలసాక్షిగా ప్రతి వీరుని మరణానికి ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

దక్షిణ బస్తర్ డివిజన్, కొయ్యూరు అమరుల స్మృతిలో 2000, మార్చి 7 నాడు బంద్‌కు పిలుపునిచ్చింది. డివిజన్‌లో దినదినం పెచ్చరిల్లుతున్న పోలీసు నిర్బంధాన్ని ఖండిస్తూ, 15 నవంబర్ 1999నాడు బూటకపు ఎన్‌కౌంటర్‌లో మాజీ విప్లవకారుడు కామ్రేడ్ భీమన్నను బస్తర్ పోలీసులు కాల్చి చంపడాన్ని ఖండిస్తూ బంద్‌ను విశాల ప్రజానీకం జయప్రదం చేయాలని డివిసి కోరింది. డివిజన్‌లో కుంట, కిష్టారం, గొల్లపెల్లి, కలిమెల, జేగురుగొండ, పామేడ్ తదితర ఎల్‌జిఎస్‌లు మరియు మద్దేడ్, నేషనల్ పార్క్ మరియు బైరంగఢ్ గెరిల్లా దళాల ప్రాంతంలోని వందలాది గ్రామాల్లో ప్రజలు ముందుగా తమ గ్రామాల్లోని అమరవీరుల జ్ఞాపకచిహ్నాల ముందు నిలిచి అమరులకు పేరుపేరున జోహార్లు అర్పించి వారి జ్ఞాపకాలను పంచుకున్నారు. తదనంతరం స్త్రీ-పురుషులు, పిల్లలు-పెద్దలు పార్టీ యిచ్చిన బంద్‌లో పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. కరపత్రాలు- పోస్టర్ల ద్వారా ప్రజాసంఘాలు, సాంస్కృతిక బృందాలు అమరుల త్యాగాలను విశాల ప్రజారాశుల్లో వివరించారు.

బీజాపూర్‌లో సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ కార్యాలయాన్ని బాంబులతో పేల్చివేసి దోపిడీ వ్యవస్థలో పేదవాడికి, పోరాడేవాడికి న్యాయం ఎండమావి లాంటిదేనని నినదించారు. బైరంఘఢ్-బీజాపూర్ రోడ్డుపై 4 చోట్లా; బీజాపూర్-గంగలూరు, గంగలూరు నుండి మార్తుల్ రోడ్డుపై అనేక చోట్లా తాత్కాలిక ఆటంకాలు ఏర్పరచారు. బీజాపూర్‌లో పోస్టర్లంటిస్తున్న మిలిటెంట్లపై రోడ్డుపై మాటుగాస్తున్న పోలీసులు కాల్పులు జరపగా వారు వెంట్రుకవాసిలో తప్పుకొని అడవి తల్లి ఒడిలో తలదాచుకున్నారు. జేగురుగొండ గ్రామం సమీపంలో గల నదిపై వంతెనను ప్రజలు పేల్చి పోలీసుల రాకపోకలను ప్రధానంగా అడ్డుకున్నారు. చింతల్‌నార్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ప్రజామిలీషియా కార్యకర్తలు బాంబులు పేల్చి పోలీసుల గుండెల్లో వణుకు పుట్టించారు. ఇత్తగుప్పలో కూడా ప్రజామిలీషియా

కార్యకర్తలు పోలీస్ స్టేషన్ సమీపంలో బాంబు పేల్చారు. ఆ సమీపంలోనున్న పట్వారీ క్వార్టర్ తగులబెట్టి తప్పుడు చిట్టాలలో ఇరుక్కుపోయిన భూముల వివరాలను దగ్ధంచేశారు. జేగురుగొండ ప్రాంతంలోని 25 గ్రామాల ప్రజలు దాదాపు 600 మంది 22 ప్రాంతాల్లో రోడ్లపై ఆటంకాలు ఏర్పరచారు. నేషనల్ పార్క్ ఏరియాలో 44 గ్రామాల్లో కనీసం 5 వేల మంది ప్రజలు సంస్మరణ సభల్లో పాల్గొన్నారు.

మద్దేడ్‌లో గెరిల్లాలు మరియు కొంతమంది ప్రజామిలీషియా కార్యకర్తలు కలిసి మద్దేడ్‌లో నున్న అటవీశాఖవారి రేంజర్ కార్యాలయాన్ని, ఆ ప్రక్కనే వున్న మండల కార్యాలయాన్ని (బ్లాక్ ఆఫీస్) ధ్వంసం చేశారు. అయితే ఈ కార్యాలయాలలో వున్న వైర్‌లెస్‌సెట్‌ను, టైప్‌మిషన్‌ను, సైక్లోస్టైల్ యంత్రాన్ని ముందుగా స్వాధీనం చేసుకొని జాగ్రత్తగా బయటకు తెచ్చి సురక్షిత ప్రాంతానికి తరలించారు. విప్లవావసరాలకు వాటిని వినియోగించుకోవడం ప్రారంభించారు. ఆ పిమ్మట అభివృద్ధి పేరుతో, ప్రజల అవసరాలను తుంగలో తొక్కుతూ సైన్య విభాగానికి చెందిన సరిహద్దు రోడ్ల సంస్థ బలగాలతో రోడ్డు పనులు కొనసాగిస్తున్న ఆవపల్లిలో 4 ట్రక్కులను దగ్ధం చేశారు. కుంట-డోర్నపాల్ మధ్య 600 మంది; బాసగూడెం-చిందనార్ మధ్య 150 మంది; స్త్రీ-పురుషులు బంద్‌లో పాల్గొన్నారు. కుంట ప్రాంతంలో రెండు ఆర్‌టిసి (ఏపిఆర్‌టిసి-1, ఎంపిఆర్‌టిసి-1) బస్సులను దగ్ధం చేశారు.

డివిజన్‌లోని వ్యాపారస్థులు, చిల్లర వర్తకులు, విద్యార్థులు, మేధావులతోసహా విశాల ప్రజానీకం బంద్‌కు తమ పూర్తిమద్దత్తును ప్రకటించారు. రానున్న అమరుల స్మృతివారం జయప్రదం చేయాలని ఎస్‌జడ్‌సి ప్రజలకు ఇచ్చిన పిలుపు జయప్రదం చేయడానికి దళాలు తమ కృషిలో జూన్ 2000 నుండి నిమగ్నమైనాయి.

## 15 ఆగస్టుతో స్వతంత్ర్యం వచ్చిందెవరికి? 26 జనవరి నాడు రిపబ్లిక్‌డే పాటించేదెవరు?

విశాల దండకారణ్య స్పెషల్ జోన్‌లో, భారత పాలకవర్గాల 'జాతీయ' వేడుకలను నిర్ద్వంద్వంగా బహిష్కరించడం విప్లవ సాంప్రదాయానికి చిహ్నంగానే మారుతోంది. అత్యంత లోతట్టు ప్రాంతంలో నివశిస్తున్న అమాయక ఆదివాసీ రైతాంగానికి నిజంగా ఈ వేడుకల గూర్చి పట్టింపేలేదు. వారేనాడూ వీటిని గుర్తించనూ లేదు. కాకపోతే, దోపిడీ వ్యవస్థకు ప్రతీకలుగా పాఠశాలలు-పంచాయతీ కేంద్రాలుగా వున్న రోడ్డు సైడ్ గ్రామాలు, ఓ మోస్తర్ గ్రామాల్లోని ఒక సెక్షన్ ప్రజలు మాత్రం 15 ఆగస్టు - 26 జనవరిల గూర్చి సర్కార్‌వారు ముందుగానే కబురు చేస్తే వాటిని 'జండా పండుం'లుగా చెప్పుకుంటూ పాటిస్తున్నారు. పసుపు - కుంకుమ-కొబ్బరికాయల తంతుతో జండా పండుం ముగిసిందనిపిస్తారు. కానీ, రోజు రోజుకు విప్లవోద్యమంలో ప్రజలు సంఘటితం కావడం, విప్లవోద్యమ ప్రభావం విస్తరించడంతో 'జండాపండుం'ల బూటకత్వం జనాలు కూడా గుర్తిస్తున్నారు. ఎప్పటికప్పుడు పెద్ద సంఖ్యలో ఖాకీ బలగాలు అడవుల్లో నిండిపోవడం, అడవిలోని పీడిత జనాలను వేధించడం నుండి హతమార్చడం, అత్యాచారాలకు గురిచేయడం వరకు అవి జరిపే అరాచక అమానుష చర్యలు ప్రభుత్వం యొక్క ప్రజావ్యతిరేక స్వభావాన్ని బట్టబయలు చేస్తుండడం కూడా 'జండా పండుం' దండుగ అనేది జనాలకు తెలియజేస్తోంది.

బ్రిటీష్ సామ్రాజ్యవాదులు దండకారణ్యా ఆదివాసీ ప్రజలను అన్ని రకాలుగా హతమార్చారు. ప్రజల పోరాట చేవను సహించలేదు. ప్రజల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోలేదు. 'అడవిమాది, దీనిని మేమే ఏలుకుంటాం. దీని యజమానులం మేమే' అని బస్తర్ ఆదివాసీ నినదించి సాయుధ తిరుగుబాటు జండా ఎత్తిన ప్రతి తడవ రాజులు, సామంతులు-బ్రిటీష్ సామ్రాజ్యవాదులు కుమ్మక్కై పచ్చని అడవుల్లో నెత్తుటి మడుగులను సృష్టించారు. ఆ బ్రిటీష్ వలసవాదుల ప్రత్యక్ష పాలన అంతమై భారత పాలకవర్గాలు అధికార కళ్లాలను అందుకున్న సంతోష సంబరానికి చిహ్నంగా జరుపుకునే 15 ఆగస్టునూ ఆ పాలక వర్గాలు తమ పాలన రాజ్యాంగ బద్దంగా కొనసాగించడానికి పూనుకున్న రోజుకు గుర్తింపుగా 26 జనవరినీ వేడుకలుగా జరుపుతున్నారనీ, ఈ రెండు వేడుకలూ పేద ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పుకు తోడ్పడలేదనీ, పైగా వారిపై దోపిడీ మరింత తీవ్రతరమై ఆదివాసులు పరాయీకరణ చెందారనీ, దారిద్ర్యం తాండవిస్తోందనీ, జీవితాలు యింకా యింకా అస్తవ్యస్థం అవుతున్నాయనీ పేర్కొంటూ విప్లవ ప్రజాసంఘాలు పార్టీ యిచ్చే పిలుపుల ద్వారా 'జండాపండుం'ల బహిష్కరణ విస్తృతమవుతోంది.

15ఆగస్టు 1999ని బహిష్కరించాలని ఎస్‌జడ్‌సి కరపత్రం ద్వారా ప్రజలకు యిచ్చిన పిలుపును పాలకవర్గాల నేతలు-పోలీస్ ఉన్నతాధికారులు కార్గిల్ యుద్ధంతో ముడిపెట్టి విప్లవకారులను దేశద్రోహులుగా చిత్రిస్తూ దుష్ప్రచారానికి పూనుకున్నారు. పోలీసు డిజిపి ఎస్‌సి త్రిపాఠి, విధాన సభ సభ్యుడు (ప్రస్తుత జైళ్ల మంత్రి) మహేంద్ర కర్మలు ఆ కరపత్రాలను పట్టుకొని నక్సలైట్లను దేశద్రోహులనడానికి కావలసినంత సాక్ష్యం వుందని పత్రికలకెక్కారు. కానీ, భూస్వామ్య-సామ్రాజ్యవాదుల సేవలో నిండా మునిగిన ఈ దుర్మార్గుల ద్వయంకు విప్లవకారుల విధానాల గూర్చి, ఆశయాల గూర్చి, లక్ష్యాల గూర్చి అవగింజంతకూడా తెలవదని మరోసారి నిరూపించుకున్నారు. *"మేం స్పష్టాతిస్పష్టంగానే కాశ్మీర్ ప్రజల న్యాయమైన డిమాండ్‌ను బలపరుచుతున్నాం. ప్రతి జాతికి విడిపోయే హక్కుతోసహా స్వయం నిర్ణయాధికార హక్కును గుర్తిస్తున్నాం. (భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో కాంగ్రెస్ కూడా ప్రజలకు ఈ హామీయే యిచ్చిందన్న విషయం ఈ మూర్ఖులకు తెలవదు పాపం) భారత -పాక్ పాలకవర్గాల సృష్టే కార్గిల్ యుద్ధమనీ, కార్గిల్ ఈ రెండింటిలో ఏ దేశానికి చెందినది కాదనీ, అది కాశ్మీరీయులదే"*నని మేం ఖచ్చితంగా చెప్పుతుంటే, బూటకపు స్వాతంత్ర్యదినాన్ని బహిష్కరించాలనే మా 99 ఏప్రిల్ కరపత్రం ద్వారా మా దేశ ద్రోహ చర్యను పసిగట్టగలిగామని పోలీసు ఉన్నతాధికారులు-మహేంద్ర కర్మ చంకలు గుద్దుకోవడం, పత్రికలకు ఎక్కడం గుడ్డివాడి చేతిలో రాయి ఎటు విసిరినా సూటిగానే తగిలినట్టయిందని ప్రజాసంఘాలు, పార్టీ కమిటీలు జరిపిన బహిష్కరణ సభలో ప్రజలకు స్పష్టం చేశాయి.

దండకారణ్యా వ్యాప్తంగా 15 ఆగస్టు 99నాడు ప్రజలు నిరసన దినం పాటించారు. దక్షిణ బస్తర్‌లో 100 గ్రామాల్లో నల్ల జండాలెగురేశారు. అనేక పాఠశాలల్లో మువ్వన్నెల జండాను పక్కనబెట్టారు. నల్లజండాను కొన్ని పాఠశాలల్లో ఎగురవేశారు. సహకరించిన ఉపాధ్యాయులకు, విప్లవ ప్రజాసంఘాలు కృతజ్ఞతలు

తెలియజేసి ప్రజాపోరులో ఉపాధ్యాయులు-విద్యార్థుల భాగస్వాములు కావాలని కోరాయి. కొన్ని చోట్ల ప్రభుత్వానికి తెలిస్తే తమ ఉద్యోగాలకు ముప్పు వస్తుందని జడుసుకున్న ఉపాధ్యాయులు లాంఛనంగా 'త్రివర్ణ పతాకాన్ని' ఎగురవేసినా ఇంకే కార్యక్రమం లేకుండా పాఠశాలలు మూసివేశారు. కొన్నిచోట్ల మూడురంగుల జండాను ఉపాధ్యాయులు ఎగురవేసినా, అక్కడ ప్రజాసంఘాల కార్యకర్తలు వేదికలెక్కి ఆ జండా ద్రోహాన్ని ఎండగట్టారు. ఆ జండా నీడలో గత యాభై ఏళ్లుగా బతుకుతున్న భారత ప్రజల్లో ఈనాటికి కూటికి-గుడ్డకు- స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు నోచుకోక అలగాజనం అలమటిస్తున్నారనీ, గతంలో తిరగబడి బస్తర్ గడ్డన పోరాడితే బ్రిటీష్‌వాడు కాల్చి చంపాడనీ, గడ్‌చిరోలి సడ్మేక్ బాబూరావును, ఆదిలాబాద్ కొమురంభీంను, కోరాపుట్ లక్ష్మణ్‌నాయక్‌ను, తూర్పుగోదావరిన అల్లూరి రామరాజును పొట్టనబెట్టుకుంటే, ఈ రోజు పోరాడుతున్న మన జనాలను భారత పాలకవర్గాలు హతమారుస్తున్నాయని చెప్పారు. బ్రిటీష్‌వాడైన-భారత పాలకవర్గాలైనా తోడుదొంగలేనని, వారి ముద్దుల పతాకం మువ్వన్నెల జండా అని దాని వైభవాన్ని ఎండగట్టి, నెత్తుటి త్యాగాలతో తరతరాలుగా ఎరుపెక్కుతున్న ఎర్రజండాయే పోరాడేవానిదని, చెప్పి ఈనాటి బాలల వర్తమానం రక్తసిక్తమవుతున్నదని రేపటి వారి భవిష్యత్ జ్వాజ్వలమానంగా కాగలదని వక్తలు చెప్పారు. వేడుకల వద్దకు చేరిన జనాల సాక్షిగా అన్ని చోట్లా సర్పంచ్‌లు మౌనప్రదర్శకులయ్యారు.

26 జనవరి 2000 కూడా దండకారణ్యా పల్లెల్లో పై విధంగానే జరిగింది. 90 శాతం భారత ప్రజల దృష్టిలో జీవంలేని భారత రాజ్యాంగానికి శవాలంకరణ లాంటి సమీక్షలు తోడ్పడవనీ, దానికి ప్రజాపోరాటాల ద్వారానే అంతిమ సంస్కరణలు జరపాలనీ, 50 యేళ్ల పండుగ జరుపుకుంటున్న పాలక వర్గాలకు సంబరం మిగలకుండా దేశవ్యాప్తంగా ప్రజాపోరాటాలను యింకా ఉధృతం చేయాలనీ, స్పెషల్ గెరిల్లా జోన్‌లను విముక్తి ప్రాంతాలుగా మలచుకోవాలని దండకారణ్యంలోని విప్లవ ప్రజాసంఘాలు-వివిధ స్థాయిల్లోని పార్టీ కమిటీలు ప్రజలను కోరాయి. మాకు సమాచారం అందినమేరకు పూసుపాక, సిలింగేర్ గ్రామాలలో (దక్షిణ బస్తర్) 105 మంది విద్యార్థులు 400 మంది ప్రజలు నల్లజండాను ఎగురవేసి నిరసన దినం పాటించారు. గడ్‌చిరోలి జిల్లాలోని బుర్గి గ్రామంలో 250 మంది విద్యార్థులు 100 మంది గ్రామస్థులు మువ్వన్నెల జండా చేసిందేమని తీవ్ర ఆగ్రహంతో దాన్ని మంటగలిపారు.

## 13వ లోక్ సభ ఎన్నికల బహిష్కరణ: ప్రజలను మసిబూసి మభ్యపరచిన గ్రామపంచాయితి ఎన్నికలు

13వ లోక్‌సభలు ఎన్నికల వార్త వినగానే గెరిల్లాలు ఎన్నికల బహిష్కరణ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 1999 జూన్-జులై నుండే నడుం బిగించారు. దండకారణ్యంలోని మహారాష్ట్రకు చెందిన గడ్‌చిరోలిలో ఎన్నికలు సెప్టెంబర్‌లో జరిగిన మొదటి విడుత పోలింగ్‌తో పూర్తవగా, మధ్యప్రదేశ్ జిల్లాల్లో మూడవ విడతతో పూర్తయ్యాయి. ఈ ఎన్నికల సందర్భంగా విప్లవ కార్యక్రమాలను సాగకుండా చేయాలని మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి నుంచి పెద్ద ఎత్తున బలగాల తరలింపుకు, ప్రజలు ఎన్నికల్లో పాల్గొనాలనే ప్రచారానికి పూనుకున్నాయి. నెల రోజుల ముందునుండే ప్రభుత్వాధికార్లు-పోలీసులు ప్రచారహోరు లంఘించుకున్నారు. ప్రజలు ఎన్నికల్లో పాల్గొనాలని రాష్ట్ర పోలీసులు, కేంద్ర పారామిలిటరీ బలగాలు మరియు ఎన్‌సిసి క్యాడర్లు ఓటర్లకు పూర్తి రక్షణ కల్పిస్తారనీ, హెలికాప్టర్లు గగనతలం నుండి నక్సలైట్ల విద్రోహక చర్యలను పసిగట్టి నిర్మూలించడంలో పోలీసులకు సహకరిస్తాయని రేడియో-టివిలతోపాటు పత్రికల్లోనూ రాయిస్తూ ఓటర్లు నిశ్చింతగా ఓట్లు వేయాలన్నారు. యిన్ని చేసినా ఓట్లు వేయకుంటే నక్సలైట్లుగానే పరిగణించి కఠినంగా వ్యవహరిస్తామనే అసలు బెదిరింపును పోరాట ప్రాంతాల్లో పెద్దెత్తున చేశారు.

తీరా ఎన్నికల సమయం వచ్చేసరికి పోలీసులు పలు డివిజన్‌లలో పలు రకాలుగా వ్యవహరించారు. ప్రతిస్పందించారు. గతంలో అనేకసార్లు జరిగిన ఎన్నికలను, ఎన్నికల సందర్భంగా విచ్చలవిడిగా తిరిగే పోలీసు మూకల అలవాటును అవకాశంగా తీసుకొనే గెరిల్లా మాటుదాడుల్లో ఎక్కడ చావుదెబ్బలు తినాల్సి వస్తుందోనన్న చావు భయం, ఎక్కడ ఆయుధాలను గెరిల్లాలపాలు చేయాల్సి వస్తుందోనన్న ఉద్యోగ భయం దండకారణ్యంకు వచ్చిన పోలీసులందరినీ పీడించిందనడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. మరోవైపు వాహనాలు వాడకూడదనీ, ప్రజలు లేకుండా పోలింగ్ పెట్టెలను తరలించకూడదనీ, రోడ్లపై గుంపుగా నడవకూడదనీ, యింకా యింకా అనేక ఆదేశాలు విరామం లేకుండా వైర్‌లెస్‌ల ద్వారా పై అధికారులు అందిస్తుంటే కూడా కింది పోలీసులకు అడవిలో గుండెలు డప్పులు కొట్టినాయనడం కూడా ప్రజల మాటలను మరోసారి చెప్పుకోవడమే అవుతుంది. పోలీసుల సాధారణ మానసిక స్థితి ఇలా వుంటే ఎక్కడైతే ఉన్నతాధికారులు వెంటవుండి తమ పటాటోపంతో కిందివారిని నడిపించారో అక్కడ మాత్రం పోలీసుల అరాచకాలు, అత్యాచారాలు చోటుచేసుకున్నాయి. బాలాఘాట్ డివిజన్‌లో ఆగస్టునుండే ప్రజాసంఘాల కార్యకర్తల అరెస్టులు చోటుచేసుకున్నాయి. ఉత్తర్ బస్తర్ చేరిన పోలీసుల్లో ఈసారి ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన గ్రేహౌండ్స్ బలగాలు వుండడం విశేషం. ఆంధ్రవాడి అనుభవాన్ని ఉత్తర్‌బస్తర్ రోడ్లపై చూపాడు. అసలే గతుకుల రోడ్లంటే వాటిని మందుపాతరల భయంతో ట్రాక్టర్లతో దున్నించారు. దక్షిణ బస్తర్‌లోని లోతట్టు బూతులవద్దకు ఏ పోలీసువారు కూడా రాలేదు. గఢ్‌చిరోలిలోని కొన్ని బూతుల వద్దకు లాఠీకర్రలతో హోంగార్డులు వచ్చారు. పోలీసుల ఆర్భాటమంతా రోడ్లపైనే ప్రదర్శించబడింది.

పోలీసులే, మందుపాతర్లు - గెరిల్లాల పలవరింపులతో లోతట్టు అడవిలోకి అడుగుపెట్ట సాహసించనప్పుడు యిక ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులు పల్లె ఓటర్ల ముఖం చూడడానికి ఎలా సాహసిస్తారు? కాకపోతే, మంద బలం చూసి మొరిగిన కుక్క చందంగా రోడ్లపై గ్రామాలలో, ఓ మోస్తర పట్టణ కేంద్రాలలో ఎన్నికల సభలు జరుపుకొని నేతలు తమ తలరాతలు తలచుకుంటూ చేతులు దులుపుకొని బతుకు జీవుడా! అంటూ వాహనాల్లో పరుగులు పెట్టేవాళ్లు. ఎప్పటిమాదిరిగానే ఈసారికూడా విప్లవ పోరాటాల ప్రాంతాలలోకి, అడవి గ్రామాల్లోకి ఏ పార్టీకి చెందిన నేతలు కూడా అడుగుపెట్టలేదు.

ఇక ఎన్నికల సరళి విషయానికి వస్తే, చాలా చోట్ల ఎన్నికల అధికారులు మొక్కుబడిగా వ్యవహరించారు. సాయంత్రం 5 గంటల

వరకు వుండి సంతృప్తిగా విధి నిర్వహణ పూర్తి చేసుకున్న పోలింగ్ కేంద్రాలు చాలా తక్కువ వుంటాయి. పొద్దస్తమానం కూర్చున్నా ఒక్క ఓటరు కూడా రాకపోవడంతో నీరసంచెంది పెట్టాబేడా సదురుకొని వెళ్లిన అధికార్లు ఎందరో వుంటారు. బాలాఘాట్ - బండారా డివిజన్‌లోని పర్సవాడ, మలాజ్‌ఖండ్ దళాల ఏరియాల్లో 30 గ్రామాలు ఎన్నికలను పూర్తిగా బహిష్కరించాయి. చాలా గ్రామాల్లో 5 నుండి 10 ఓట్లు గ్రామసర్పంచ్, పంచ్, పోలీస్ పటేల్‌లాంటి పెద్దలు వేసిన ఉదాహరణలే కానవస్తాయి. దక్షిణ బస్తర్ డివిజన్‌లో కనీసం 250 గ్రామాల్లో ఒక్క ఓటు కూడా వేయలేదు. మిగతా గ్రామాల్లో 'గ్రామపెద్దల' (సర్పంచ్, పంచ్, పోలీస్ పటేల్ మొదలగువారు) ఓట్లే పెట్టెలనలంకరించాయి. ఉత్తర బస్తర్ డివిజన్‌లో 25 గ్రామాలు పూర్తిగా ఎన్నికలను బహిష్కరించగా, 120 గ్రామాలలో 50 లోపు ఓట్లు పోలయినాయి. గడ్‌చిరోలిడివిజన్‌లో పోలీసుల ప్రమేయంతో గ్రామాల్లో 25% పోలింగ్ జరిగింది. ఇకపోతే మాడ్ డివిజన్ గూర్చి ప్రత్యేకంగా చెప్పాలి. కొన్ని పోలింగ్ బూతులకు 50 కిమీ కూడా నడిచి రావలసి వుంటుంది. దారిలో అనేక వాగులు-వంకలు దాటడమే కాకుండా, నదులు కూడా దాటాల్సి వుంటుంది. 1050 అడుగుల నుండి 3000 అడుగుల వరకు ఎత్తుగల కొండల్లో దమ్ము ఎగబోస్తూ రావలసి వుంటుంది. యిన్ని యిబ్బందులతో 'ప్రజాస్వామ్యాన్ని' రక్షించాలంటే వెంట ఖాకీ బలగాలు వుంటే ప్రజాస్వామ్యం మాట ఎలా వున్నా ప్రాణాలు రక్షించుకోవడం ముఖ్య సమస్య అవుతుందని వాస్తవాన్ని గుర్తించిన అధికారులు ఎవరూ ఖాకీలను వెంట తేకుండానే ఎన్నికలవిధి నిర్వహణకు వచ్చారు. ఎన్నికల ద్వారా తామే ఓట్లు గుద్ది భద్రపరచడం ఆనవాలుగా మారింది. అలాగే కొంతమంది అధికారులు పై ఉన్నతాధికారుల ఆదేశాలపై పోలీసులుతో సంప్రదించి తామే బ్యాలట్ పత్రాలపై తమకు నచ్చిన గుర్తులపై ముద్రలు వేసి ప్రజాస్వామ్యాన్ని పత్రికల వారికి శాతాల్లో విడుదల చేయడం కూడా చూస్తున్నాం. కానీ, ఈసారి జరిగిన గమ్మత్తేమంటే, ప్రజల అప్రమత్తతను తక్కువ అంచనా వేసిన పువ్వర్తి, పూసుబాక (దక్షిణబస్తర్) బూతులు అధికారులు మధ్యాహ్నం వరకు కూడా ఒక్క ఓటు పడకపోవడంతో విసుగుచెంది ప్రజల ప్రజాస్వామ్య పరిరక్షణకు అత్యంత చొరవతో తామే నడుం బిగించాలనుకున్నారు. అయితే, బహిరంగంగా అంతటి చర్యకు సాహసించలేకపోయారు. ఊరిలోని పోలింగ్ కేంద్రం నుండి బయలుదేరి అడవిలోకి వచ్చి చెట్టుక్రింద కూచోని బ్యాలట్ పత్రాలపై సంతోషంగా ముద్రలు వేయసాగారు. పోలింగ్ శాతం పెరిగిందని చూపి ప్రసంశలు పొందాలనుకున్నారు. కానీ, పాపం వారి కలలు భగ్నమయ్యాయి. ఊరి చుట్టూ పెట్రోలింగ్ చేస్తున్న గ్రామరక్షక దళం సభ్యుల కంట్లో పడ్డారు. ఇంకేం! ఆ యువకులు వీరి తప్పుడు పనిని చూసి గుతపలెత్తేసరికి అధికారులు కాళ్లకు బుద్ధిచెప్పారు. ప్రసంశలకు ఆశపడ్డ అధికార్లకు పరుగుతప్పనందుకు యువకులు సంతోషించి గెరిల్లాలకు విషయాన్ని తెలిపారు.

ఇలా అధికారులు 13వ లోక్‌సభ ఎన్నికలు దండకారణ్యంలో పూర్తిఅయ్యాయనిపించారు. తమకు తోచిన రీతిలో దొంగోట్లు వేసుకొని నక్సలైట్ల ప్రభావం ఏమీ లేదని, ప్రజలు ఓట్లు వేశారనీ తప్పుడు రిపోర్టులు పత్రికలకు విడుదల చేశారు. గింగురుమంటూ రింగులు కొడుతున్న సమాచార సాంకేతిక వ్యవస్థ సిగ్గులేకుండా ప్రజలకు చేరవేసింది.

**బూటకపు ఎన్నికల బహిష్కరణ సభలు**

| డివిజన్ | సభలు | హాజరైన జనాలు | డికెఎంఎస్ దళాలు | క్యాంపెయిన్ వివరాలు: కెఎంఎస్ దళాలు | క్యాంపెయిన్ వివరాలు: తిరిగిన గ్రామాలు | బ్యానర్స్ | పోస్టర్లు |
|---|---|---|---|---|---|---|---|
| దక్షిణ బస్తర్ | 40 | 28000 | 47 | 17 | 350 | 110 | 900 |
| ఉత్తర బస్తర్ | 12 | 2000 | 5 | 2 | 70 | 50 | 200 |
| మాడ్ | 3 | 600 | 2 | - | 12 | - | - |

నోట్ : 1. ఎన్నికల కంటే నెలరోజుల ముందు నుండే గెరిల్లాలు ప్రతిరోజు కనీసం రెండు గ్రామాలు వెళుతూ వందలాది జనాలతో జరిపిన సాధారణ ప్రజాసభలు పై పట్టికలో పేర్కొనలేదు.

2. స్పెషల్ జోనల్ కమిటీ విడుదల చేసిన 5000 కరపత్రాలు, డివిసిలు విడుదల చేసిన వేలాది కరపత్రాలు వివరాలు పై పట్టికలో లేవు.

3. ఎన్నికల ప్రచారంలో తిరుగుతున్న కాంగ్రెస్(ఐ)పార్టీ జీబును ఉత్తర బస్తర్‌లో రోడ్డుపై గెరిల్లాలు తగులబెట్టారు.

ప్రజాస్వామ్యం గత 50 ఏళ్లుగా నేతలు ఎంత వెలగబెడుతున్నారో గ్రహించిన అధికారులు ఎక్కడా ఓటర్ల జోలికి వెళ్లకుండా ఖాళీ పెట్టెలతో కాలుకు బుద్ధిచెప్పారు.

సాధారణంగా, బలమైన పోరాట గ్రామాల్లో ఎన్నికల పెట్టెలను ధ్వంసం చేయడం పోలింగ్ కాగితాలను తగులబెట్టడం లాంటి నిరసన చర్యలు అనేకచోట్ల జరుగుతుంటాయి. యిలాంటి గ్రామాల్లో తిరిగి (రీ) పోలింగ్ జరపడం లేదు. పోలీసులు-ఎన్నికల అధికార్లు ప్రజల ప్రజాస్వామ్యాన్ని పట్టణాల్లో కూర్చొని

> **తాము చెప్పుకునే ప్రజాస్వామ్యంపై తమకే మాత్రం గౌరవం వున్నా ఖాకీల ప్రమేయం లేకుండా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించి నిజమైన ఓట్లశాతాన్ని బహిరంగ పర్చాలని ప్రభుత్వాన్ని మేం సవాలు చేస్తున్నాం**
>
> **- డికెఎస్‌జడ్‌సి**

## ఎన్నికల బహిష్కరణ ప్లటూన్ల ఫ్లాగ్ మార్చ్

పోలీసులు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు చేసి జనాల్లో భయాందోళనలు సృష్టించడం యిప్పటి వరకు చూసిన జనాలు ఈసారి ఎన్నికల సందర్భంగా మరో నూతన విషయాన్ని గమనించారు. తమ మధ్య వుంటూ, తమకోసం అహర్నిశలు కృషిచేస్తూ, విప్లవోద్యమంలో తమని సంఘటితం చేస్తున్న గెరిల్లాలు ఈసారి వినూత్నపద్ధతిలో గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ చేశారు. గెరిల్లాజోన్‌లో నూతనంగా ముందుకు వచ్చిన ఉన్నత సైనిక నిర్మాణాలైన ప్లటూన్‌లు తమ తుపాకులను భుజాలపైకెత్తుకొని, ఆలీవ్‌గ్రీన్ డ్రెస్సుల్లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తూ ఎన్నికల బహిష్కరణ నినాదాలు చేస్తూ పురవీథుల్లో సంచరించడంతో జనాలు ఆత్మవిశ్వాసం నిండిన గుండెలతో బిగించిన పిడికిళ్ళెత్తి కోరస్ ఇస్తూ తమ బహిష్కరణ సందేశాన్నిచ్చారు.

## గ్రామపంచాయితీ ఎన్నికలు

2000 సంవత్సరం జనవరి/ఫిబ్రవరి మాసాల్లో మధ్య ప్రదేశ్‌లోని బాలాఘాట్, రాజనంద్‌గాం, దంతెవాడ, కాంకేర్, బస్తర్ జిల్లాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగాయి. దంతెవాడ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలులోకి వచ్చింది. ప్రతి గ్రామపంచాయతీకి ఎన్నికలు జరిపి తీరాలని సర్కార్ ఆదేశాలు వెలువడినాయి. తమ అధికారం గ్రామాల్లో ఏ మేరకు వుందో తెలుసుకోవడానికి కూడా ఈ ఎన్నికలను కొలమానంగా భావించిన అధికార్లు, పైన పేర్కొన్న జిల్లాల్లో ఈ ఎన్నికలను సవాలుగా తీసుకున్నారు. నక్సలైట్ల ప్రభావం ఏమీ లేదని ప్రపంచానికి చాటాలని ఉబలాటపడినారు. ప్రతి గ్రామపంచాయతిలోని ప్రజలను నమ్మించడానికి, వారిచే ఓట్లు వేయించుకోవడానికి వీరు అనేకపాట్లు పడినారు. మరీ తెలివైన గ్రామ పంచాయతీ బాబులు (సచివ్) వున్న చోటా పీటముడి (రహస్య) ఒప్పందాలు చేసుకొని ధరఖాస్తులు నింపి ఏకగ్రీవ ఎన్నికగా పేపర్లకు ఎక్కించారు. గ్రామరాజ్యకమిటీలు బలంగా వున్నచోట, వ్యవహార దక్షతకలిగి యిలాంటి రాజకీయాల లోతులు తెలిసినవారున్నచోటా మాత్రం గ్రామపంచాయతీ ఎన్నికలు ఖరాకండిగా జరగనివ్వలేదు. యిలా గ్రామపంచాయతి ఎన్నికల సందర్భంగా పలు రకాల ప్రయత్నాలు వెలుగులోకి వచ్చాయి. అధికారుల కుట్రలను తెలుసుకోలేని ప్రజలు-సంఘనాయకత్వం ఈసారి గ్రామపంచాయతి ఎన్నికల సందర్భంగా కొన్నిచోట్ల ఓట్లు వేశారు.

గ్రామపంచాయతీ సర్పంచ్ వుండడం ద్వారా గ్రామానికి గుర్తింపు వుంటుదని, లేకపోతే ప్రభుత్వం మంజూరు చేసే చౌకధర దుకాణాల్లోని సరుకులు రావనీ, అరెస్టు అయినవారిని జైలునుండి విడిపించుకోవడానికి వాల్యుయేషన్ కాగితాలు దొరకక సంగాలవాళ్లు జైళ్లోనే వుంటారనీ, సర్కార్ మంజూరు చేసే చెరువులకు డబ్బులు దొరకవనీ, పాఠశాల భవనాలు, రోడ్లు లేకుండా పోతాయనీ, యిలా రకరకాలుగా చెప్పుతూ గ్రామాభివృద్ధి కుంటుపడుతుందనీ అమాయక ప్రజలను హడలగొట్టారు.ఇంతేకాదు ఎంఎల్‌ఏ ఎంపిలంటే వాళ్లంతా డబ్బున్న పట్నం దొరలనీ, వాళ్లకు ఓట్లు వేయకున్నా నష్టంలేదుకానీ, ఊరివాడికి, బీరపీచు చుట్టరికం వున్న వాడికి(స్త్రీలతో సహా) ఓటు వేయకుంటే మన అధికారాన్ని మనమే నష్టపోతామనీ కూడా తీపిగుళికలు మింగించారు. ఈ ప్రచారం ఉద్యమ ప్రాంతంలోని ఒక సెక్షన్ ప్రజలపై బాగా పనిచేసింది. ఫలితంగా వారు ఎన్నికల్లో పాల్గొన్నారు.

గెరిల్లాలు క్రమం తప్పకుండా వెళ్లే గ్రామ ప్రజానీకం గ్రామ పంచాయితీలు ఎన్నికల తేదీలను వరుసగా గమనిస్తూ వాటికి వ్యతిరేకంగా అప్రమత్తం చేసినచోటా ఈ ఎన్నికలను కూడా నిర్ద్వంద్వంగా బహిష్కరించారు. గ్రామరాజ్యకమిటీ ఉన్నచోట సర్పంచ్‌గా ఎవరూ నిలవాల్సిన అవసరం లేదని కూడా గ్రామసభద్వారా ప్రకటించారు. ప్రజావ్యతిరేకులను ముందుగానే హెచ్చరించి పదవులకు పాకులాడకూడదని గట్టిగా చెప్పారు. ప్రజలమాట పెడచెవిన పెడితే రాబోయే పరిణామాలకు వారే బాధ్యత వహించాలని కూడా చెప్పారు. దీనితో దక్షిణబస్తర్‌లోని కుంట, బాసగూడెం, బైరంగడ్ ప్రాంతాలలోని మెజారిటీ గ్రామపంచాయితీల ఎన్నికలను ప్రజలు బహిష్కరించారు. విప్లవాభిమానులు గెరిల్లాల మాట విని పోటీ నుండి విరమించుకుంటే, యిదే అవకాశంగా తీసుకొని ప్రజావ్యతిరేకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాసగూడెం బ్లాక్ అధ్యక్షునిగా అజయ్‌శర్మ ఎన్నిక యిలాగే జరిగింది. అయితే, యిలాంటి వారు ఆ పదవుల్లో ఎంతో కాలం మురిసిపోలేరనీ, ప్రజలు తప్పనిసరిగా బుద్ధిచెబుతారన్న వార్తలు అప్పుడే అన్ని ఊర్లలో బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కాగా, ఏకగ్రీవ ఎన్నికైన మరో తరహా నాయకుల అవస్థ యిందుకు భిన్నంగా వుంది. ఉదాహరణకు దంతెవాడజిల్లాలో 5227 పంచ్‌లలో 3621 మంది ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. కుంట ప్రాంతంలో 17 జనపథ్ సదస్యలలో 6గురు, 49 పంచాయితీలలో 23 సర్పంచ్‌లు, 793 పంచ్‌లలో 628 పంచ్‌లు ఏకగ్రీవంగా పోలీస్‌ల - సచివ్‌ల పుణ్యాన ఎన్నికైనారు. దంతెవాడ జిల్లాలో 31.5 శాతం ఓట్లు పోలై ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోంది. యిందులో అధికభాగం దొంగోట్లే సుమా!

ఈ ప్రకటన వెలువడిన అనంతరం ఈ ఏకగ్రీవ మెంబర్లు పోరాట ప్రాంతాలలో (పంచ్‌లు) కుడితిలో పడ్డ ఎలుకలా కొట్టుకోసాగారు. పంచ్‌లు ఊళ్లోకి పోతే ఊరివాళ్లు అడిగే సవాలక్ష సవాళ్లకు ఎలాంటి జవాబు లేక వాళ్లు సచివ్ ఘనకార్యాన్ని మనసులో తిట్టుకుంటూ రాజీనామాలకు సిద్ధపడి జనాల్లోకి దిగారు. రాజీనామాలు సమర్పించడం కూడా మాడ్ డివిజన్‌లో ప్రారంభం అయింది. ఉత్తర బస్తర్‌లో జనం ప్రమేయం లేకుండానే 12 చోట్ల సచివ్‌లు విప్లవాభిమానులను పంచ్‌లుగా నిలబెట్టగలిగారు. కానీ, తర్వాత జరిగిన విషయం అర్థంచేసుకొని వారు రాజీనామాలకు సిద్ధపడినారు.

గ్రామపంచాయతీ ఎన్నికలు కూడా పార్లమెంటరీ వ్యవస్థలో భాగమేననీ, గ్రామాల్లో గ్రామరాజ్యకమిటీల నిర్మాణానికి వాటి అధికార నిర్వహణకు ప్రధాన అడ్డంకిగా నిలిచే గ్రామస్థాయి సర్కార్ యంత్రాంగం యిదేనని, వీటిని బహిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు-లెనినిస్టు)(పీపుల్స్‌వార్)డివిజనల్ కమిటీలు ఎక్కడికక్కడే ప్రజలకు పిలుపునిచ్చాయి. గ్రామరాజ్యకమిటీలకే సర్వాధికారాలు అనే నినాదం చుట్టూ ప్రజలు సంఘటితం కావాలనీ, గ్రామసభల ద్వారా ఆ కమిటీలను ఎన్నుకోవాలనీ ప్రజలను కోరాయి.

ఈ ప్రచారంతో ఉత్సాహం చెందిన ప్రజామిలీషియా సభ్యులు జనవరి 3వ వారంలో మాడ్ కొండలపై ఎన్నికల అధికార్ల జీబును తగులబెట్టారు. ఉత్తర బస్తర్‌లో మత్లా బూత్‌ను దగ్ధం చేసారు.

ప్రజలు హెచ్చరించినప్పటికీ వినని వాళ్లకు అక్కడక్కడ దేహశుద్ధులు జరిగాయి. అందులో మద్దేడ్ పంతులు ఒకరు.

గ్రామ పంచాయితీ ఎన్నికలు అనేక చోట్ల బహిష్కరించినప్పటికీ, అక్కడక్కడ అధికార్ల, చోటామోటా రాజకీయనాయకుల మోసపు ఎత్తుగడలకు బలై ఎన్నికల్లో ఒక సెక్షన్ పాల్గొంది. కాబట్టి, ఈ గుణపాఠాలనుండి రానున్న ఎన్నికల్లో మరింత అప్రమత్తంగా వుండాలని ప్రజాసంగాలు ప్రజలకు తెలుపుతున్నాయి.

## ప్రజలకు పీడనగా మారిన వన్‌ధన్ సమితులు

దండకారణ్యంలోగల ఆదివాసీలను ఉద్ధరించే పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలు, కొన్నిచోట్ల సొసైటీల పేరుతో మరికొన్ని చోట్ల వన్-ధన్ సమితుల పేరుతో సంస్థలను కొనసాగిస్తున్నవి. చాలా ఏళ్లుగా మహారాష్ట్రలోని గడ్‌చిరోలి జిల్లాలో కొనసాగుతున్న ఆదివాసీ సహకార సంగాలు ప్రజల నుండి అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో ఘోరంగా విఫలమైనాయి. పరమ అవినీతిపరులైన అధికారులు, నల్ల వ్యాపారస్థులతో మిలాఖతై కొనుగోళ్లలో అనేక అవకతవకలకు పాల్పడుతున్నందున రైతాంగం వీటిపై విశ్వాసాన్ని కోల్పోయారు. అత్యంత విలువైన అటవీ ఉత్పత్తులను అనేక ప్రమాదాల మధ్యన పొద్దస్తమానం శ్రమించి పోగుచేసి గిట్టు బాటు ధరలకు నచ్చినచోట అమ్ముకోవడానికి అటవీ ఉత్పత్తుల సంగ్రహకులు తమ పూర్తి యాజమాన్య హక్కులతో ప్రయత్నిస్తే ఈ సంగాల వాళ్లు అడ్డుతగిలేవారు. ప్రభుత్వాధికార్లపేరుతో రైతాంగాన్ని కేసుల పాలు చేస్తూ బెదిరించేవారు. లంచాలు గుంజి ఉడాయించేవారు. మొబైల్ కోర్టు పేరుతో వచ్చే అధికారులు సావుకార్ల దుకాణాలపై దాడిచేసి వారూ అదే తంతు కొనసాగించేవారు. యిలాంటి పరిస్థితుల్లో రైతాంగం తమ సంగబలంతో అక్కడక్కడ అవినీతి అధికారులకు బుద్ధిచెప్పి తమ సొమ్ము తమ ఇష్టం వచ్చిన చోట అమ్ముకోసాగారు. సంఘటిత రైతుల బలానికి జడుసుకున్న అధికారులు అడ్డుతగలడం మానుకున్నారు. చట్టం కాగితాల్లోకి తలదూర్చి మౌనంగా వుండిపోయింది. గెరిల్లాల పూర్తి అండదండలతో రైతాంగం అటవీ ఉత్పత్తులు వ్యవసాయోత్పత్తులను నిర్భయంగా అమ్ముకోసాగారు.

ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని విశాల బస్తర్‌లో రైతాంగం అచ్చం పై విధమైన సమస్యను ఎదుర్కొంటున్నారు. యిక్కడ వన్-ధన్ సమితిపేరుతో సర్కారీ మార్కెటింగ్ సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. అటవీ ఉత్పత్తులు - వ్యవసాయోత్పత్తులను రైతాంగం తమకే అమ్మాలని యివి ఒత్తిడి చేస్తున్నాయి. చట్టం పేరుతో బెదిరిస్తున్నాయి. వ్యాపార రంగం నుండి ప్రైవేట్ వ్యాపారులను తొలగించారు. విశాల బస్తర్‌లో యేటా కనీసం 1000 కోట్ల రూపాయల అటవీ ఉత్పత్తుల వ్యాపారంసాగుతుంది. యింతటి వ్యాపారంపై జీవించే ప్రైవేట్ వ్యాపారుల (ఇందులో నాలుగువేల మంది చిల్లర వర్తకులుంటారు) జీవితాలను నూతన విధానం అస్తవ్యస్థం చేసింది.

ప్రభుత్వం చేపట్టిన నూతన విధానంపై సర్వత్రా నిరసన వ్యక్తమౌతుంది. చివరకు 13వ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కూడా మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చేపట్టిన ఈ దుష్ట విధానమే కారణమైందని ఆ పార్టీ స్థానికనేతలే రోధిస్తూ పత్రికలకు ఎక్కారు. యిక ప్రతిపక్షాలు ఈ సమస్యనే ప్రధాన సమస్యగా తీసుకున్నాయి. నేటికీ బస్తర్‌లో ఈ సమస్య ప్రతిపక్ష పార్టీల చేతిలో గొప్ప అస్త్రంగా నిలిస్తే అధికార పార్టీ స్థానిక నేతలకు కొరుకుడు పడకుండా తయారైంది. వీరి గొడవ ఎలా వున్నా ఈ నూతన పద్ధతిలో రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

1. ఖజానా (ట్రెజరీ) దివాళ తీసిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం వన్ - ధన్ సమితులకు తగిన నిధులు సమకూర్చలేక పోతున్నందున అవి రైతాంగం నుండి సరుకులను కొనలేకపోతున్నవి.
2. విశాల బస్తర్‌లో వారం వారం జరిగే 100 సంతలకే ఈ సమితులు పరిమితం కావడంతో సంతలకు చేరుకోలేని విశాల అడవుల్లోని ఆదివాసీ రైతాంగం తమ సరుకులను అమ్ముకోలేకపోతున్నారు.
3. నిధుల కొరతతో సంతల్లో రైతాంగం సరుకులను సమితులు కొనకుండా పోవడంతో వారు మరెవరికీ అమ్ముకోలేక పోతున్నారు. పర్యవసానంగా దినసరి అవసరాల కోసం మార్కెట్ సరుకులను కొనుక్కోలేకపోతున్నారు.
4. సమితులు కొనుగోళ్లు చేస్తాయని గంపెడంత ఆశతో చేంతాడంత వరుసల్లో పొద్దస్తమానం నిలబడిన రైతాంగం చివరకు డబ్బుల్లేవని సమితి ఉద్యోగులు చేతులెత్తేస్తే దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కనీస అవసరాలు తీర్చుకోలేకపోతున్నారు.
5. వందలాది చిల్లర వ్యాపారుల జీవితాలు అస్తవ్యస్థమైనాయి.

పై దుష్పరిణామాల మూలంగా రైతాంగం వన్-ధన్ సమితులను వ్యతిరేకిస్తున్నాయి. యిలాంటి పరిస్థితుల్లో డిఎకెఎంఎస్, కెఎఎంఎస్‌లు రైతాంగానికి అండగా నిలిచాయి. వన్-ధన్ సమితుల విధానాలను ఖండిస్తూ కింది డిమాండ్లతో ఉత్తర-దక్షిణ బస్తర్‌లో ప్రచారానికి పూనుకున్నాయి.

1. అటవీ ఉత్పత్తుల సంగ్రహకులు (యజమానులు) ప్రకటించిన న్యాయమైన రేటుకే సర్కారీ సమితులు వారి సరుకులను కొనుగోలు చేయాలి.
2. సమితులకే ఏకైక కొనుగోలు అధికారాన్ని దఖలు పరుస్తూ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.
3. రైతాంగం సంతలలో సర్కార్ సమితులకు మాత్రమే వారి సరుకులను అమ్ముకోవాలని నిర్బంధించకూడదు. సంతలలో ఎప్పటిలాగే ప్రైవేట్ వ్యాపారాన్ని కూడా అనుమతించాలి.

పై డిమాండ్లతో ప్రజాసంగాలు విస్తృతంగా ప్రచారం చేశాయి. వాల్‌పోస్టర్లు వేశాయి. సంతలలో ర్యాలీలు నిర్వహించాయి. చిల్లర వర్తకులను కలుపుకొని సమితి వ్యతిరేక ఆందోళనను తీవ్రతరం చేశాయి. వీటిలో భాగంగా ఉత్తర బస్తర్ డివిజన్‌లోని వయనార్ సంతలో 15-12-99నాడు 30 ఊర్ల రైతాంగం, చిల్లర వర్తకులు దాదాపు 6 వేల మంది ర్యాలీ తీశారు. డౌలలో 14 గ్రామాల నుండి 100 మంది రైతాంగం ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లు సమితులవారికి తెలిపి 10 రోజుల గడువు యిచ్చి తిరిగి 25-12-99 నాడు 1800 మందితో బహిరంగ సభ జరిపారు.

బహిరంగ సభలో మాట్లాడిన వక్తలు పై డిమాండ్లతో పాటు ప్రభుత్వం యొక్క అసలు కుట్రలను కూడా వెల్లడి చేశారు. అటవీ ఉత్పత్తులకు సావుకార్లు చెల్లించే రేటుకన్నా అధికరేటును

సమితి ద్వారా ప్రకటిస్తూ ఆదివాసీ పక్షపాతిగా ప్రభుత్వం పోజు కొడుతోంది. కానీ, ఒకవైపు దాని కొనుగోళ్ల వ్యవహారం సరిగాలేదు. యివి ఇలా వుంటే ఆ రేటు యివ్వడానికి ప్రైవేట్ వర్తకులు సిద్ధపడినా వారిని ఇవాళ అనుమతించని సర్కార్, గ్లోబలైజేషన్. ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్ విధానాలను భుజాలకెత్తుకున్న ఈ సర్కార్ రేపు తప్పనిసరిగా యేటా కొనసాగుతున్న 1000 కోట్ల రూపాయల భారీ వ్యాపారాన్ని బహుళజాతి కార్పోరేషన్‌లకే అంటగడుతుందనీ, అందుకే ఈ మొత్తం వ్యాపారాన్ని తన నియంత్రణలోనికి తీసుకుందనీ, దానిని క్రమబద్ధీకరించి భారీ వ్యాపార సంస్థలకు ముట్టబెడుతుందనీ మాట్లాడారు. యిలాంటి వ్యాపార విధానాలను వ్యతిరేకించాలనీ, బస్తర్ గడ్డన బహుళజాతి కార్పోరేషన్‌లకు స్థానం లేదని నినదించాలనీ, పోరాడాలని నిశ్చయించుకున్నారు.

## ఊళ్లో పాఠశాలలులేవు-ఖాకీలు తప్పపంతుల్లూలేరు మా సమస్యను పరిష్కరించాలని బజార్లో బడిపిల్లల నినాదాలు

దండకారణ్యంలోని పోరాట ప్రాంతం మెజార్టీ ఆదివాసులతో వుంటుంది. కలిమెల (ఒరిస్సా) నుండి పర్సవాడ (ఎంపి) వరకు ఈనాడు పోరాటావసరాల రీత్యా దండకారణ్యంగా పిలవబడుతున్న ప్రాంతంలోని ఆదివాసుల జీవితాల్లో సారూప్యత-సామీప్యతా అధికంగా వుంటుంది. కాలక్రమంలో గోండీలో ఎన్ని మార్పులు వస్తున్నా ఈ విశాల ప్రాంతంలోని గోండులందరి మాతృభాష 'గోండి'గానే చెప్పబడుతుంది. మానవ చరిత్రలో గోండ్వానాగా పేర్కొనబడిన అతి విశాల ప్రాంతంలో భాగమైన ఈ ప్రాంతంలో నివశిస్తున్న లక్షలాది గోండులకు చదువుకునే అవకాశాలు లేవనే చెప్పుకోవాలి. గత వందేళ్లలో ఆదివాసీ ప్రాంతాలోని విద్యారంగంలో వికాసానికి తగిన రీతిలో ప్రగతి సాధించబడలేదనే చెప్పాలి. 1891 నాటి బస్తర్ రాష్ట్రంలో 19 పాఠశాలలు 584 మంది విద్యార్థులుంటే, 1908 నాటికి పాఠశాలల సంఖ్య 58కి పెరిగి విద్యార్థుల హాజరు 3855కు పెరిగిందని బ్రిటీష్ రికార్డులు చూపిస్తున్నాయి. అయితే ఆ కాలంలోనే బ్రిటీష్ పోలీసులు మాత్రం 27 మంది ప్రత్యేక రిజర్వు బలగాలు 297 మంది పోలీసులు వున్నారు. యివాళ వందేళ్లానంతరం కూడా పరిస్థితిలో గణనీయమైన మార్పు తేవడానికి పాలకవర్గాలు కృషిచేయలేదు. యిప్పటికీ విశాల బస్తర్‌లో అక్షరాస్యత 20 శాతం దాటలేదు. యిందులోనూ లోతట్టు గ్రామాలకన్నా పట్టణ ప్రాంతాలవారే చదువుకుంటున్నవారిలో అధికం అని మర్చిపోవద్దు. ఒక్క బైరంఘడ్ దళప్రాంతం యొక్క ఉదాహరణతో బస్తర్ విద్యావ్యవస్థలో సర్కార్‌వారి లొసుగులు అర్థం అర్థమవుతాయి. బైరంఘడ్ దళం 150 గ్రామాల పరిధిలో తన విప్లవ కార్యక్రమాలను నిర్వహిస్తుంటే అందులో 100కు పైగా గ్రామాల్లో పాఠశాలలు లేవని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. కవాడి, ఎడ్యుం, ఇర్మగొండ, ఇరిల్, అవునార్, నేంద్ర, కోర్సెల్ గ్రామాల్లోకి యేణ్ణరం దాటినా పంతుల్లు వచ్చిన పాపానపోలేదు. ఇక ఈ ఊర్లలోని పాఠశాలలు పశువులకు-పందులకు కొట్టాలుగా మారాయి. అనేక గ్రామాల్లోని పూరిగుడిసెల పాఠశాలలు దుస్థితి యిది. బైరంగడ్ వికాస్ ఖండ్‌లోని 281 గ్రామాల్లో గల 60449 మంది జనాల కోసం 107 పాఠశాలలు ప్రభుత్వం ప్రారంభించినా, యిందులో 67 పాఠశాలలకే భవనాలున్నాయంటే, విద్యారంగం ఎంత వెనుకబడి వుందో ఆలోచించండి. అయితే నిజానికి పాఠశాలలపై ప్రభుత్వం ధ్యాస ఈ మాత్రం పెరగడానికైనా గత 20 యేళ్ల విప్లవోద్యమ కృషి ఫలితమేనన్న విషయాన్ని మరచిపోవద్దు.

గోచిగుడ్డ ఆదివాసులం కామనీ, ఆదివాసీ జీవితాల్లోనూ ఎంతో మార్పు చోటు చేసుకుంటుందనీ జబ్బలెగురవేసే ఎంఎల్ఏలు గానీ, ఎంపిలుగానీ పంచు-సర్పంచ్‌లుగానీ ఏ ఒక్కనాడు కూడా విద్యా సమస్యపై ప్రజలను కదిలించలేదు. పోరాటాలు నిర్మించలేదు. నిజానికి ఈ ప్రాంతాల నుండి చట్టసభలకు పాకుతున్న నేతలకు ఆ సోయి కూడా వుండదు. కానీ, రోజు రోజుకు విప్లవ ప్రజాసంఘాలలో సంఘటితమవుతున్న ప్రజలు ఆ చైతన్యంతో అనేక సమస్యలపై పోరాటాలు చేపడుతున్నట్టే తమ బిడ్డల చదువు సమస్యపై కూడా ఆగస్టు 99లో ఉత్తర-దక్షిణ బస్తర్‌లలో, రోడ్లపైకి వచ్చారు. క్రాంతికారి బాలల సంగాలలో సంఘటితమవుతున్న చిన్నారి బాలలు తమ పెద్దలవెంట వీధుల్లోకి వచ్చి తమ డిమాండ్లను నినదించారు.

దక్షిణబస్తర్ డివిజన్ కమిటీలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని జులై 1999 సమావేశం సమీక్షించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తరహాలో ప్రచారానికి అత్యంత ప్రాముఖ్యత ఇస్తూ అమాయక ప్రజలను వంచిస్తున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ విధానాలను తీవ్రంగా ఖండిస్తూ, విద్యాగ్యారంటీ పథకాలు అటకెక్కినవనీ, కేవలం ప్రచారసాధనాలే వాటిని గోరంతలు కొండతలుగా చేస్తూ సర్కార్‌వారి అంకెల గారడీతో విన్యాసాలు చేస్తున్నాయనీ, ఈ విషయం `విద్యార్థుల-తల్లిదండ్రుల'ర్యాలీల ద్వారా వెలుగులోకి తేవాలని నిర్ణయించింది. యిందుకు డివికెఎంఎస్ పూర్తి అండదండలివ్వాలని కూడా కోరింది. దీనితో రేంజి కమిటీలు ఎక్కడికక్కడే పిల్లలను వారి తల్లిదండ్రులను కూడగట్టి పాఠశాలలున్న రోడ్‌సైడ్ గ్రామాలపైకి తీసుకెళ్లి ర్యాలీలు నిర్వహించారు. కుంట, జాసగూడెం, బైరంఘడ్, నేషనల్‌పార్క్, మద్దేడ్, కొండగాం, కేశ్కల్ దళాల ఏరియా కమిటీలు నెల రోజులు ఈ కార్యక్రమంపై కేంద్రీకరించి విద్యావ్యవస్థ అవకతవకలను ప్రజల్లో ఎండగట్టాయి. ఈ సందర్భంగా కొన్ని ముఖ్య సమస్యలను వెలుగులోకి తెచ్చాయి. వాటి మీద నిరంతరం పోరాడాలనీ, ఒక్క రోజుతో ఈ సమస్య పరిష్కారం కాదని ప్రజలను కోరాయి.

1. విద్యాగ్యారంటీ ప్రకారం ఎక్కడా 1కిలోమీటర్ పరిధిలో 25 మంది విద్యార్థుల కోసం పక్కా పాఠశాలలను నిర్మించని ప్రభుత్వ బూటకపు ప్రచారాన్ని ఎండగడుతూ విద్యాసంస్థల ఏర్పాటు కోసం పోరాడాలి.
2. పాఠశాలలున్న చోట అవి ఖాకీలకు విడిది కేంద్రాలు కాకుండా చూడాలి.
3. పాఠశాలలున్న చోట ఉపాధ్యాయులకు ప్రభుత్వం తగిన వసతి సౌకర్యాలు కల్పించాలి. ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలి.
4. పాఠశాలలు పశువుల కొట్టాలు-పందుల విశ్రాంతి మందిరాలు కాకుండా ప్రభుత్వం వాటికి చుట్టూ ఆవరణ (కంచె) వేయాలి.
5. ఉపాధ్యాయులను పోలీసులు వేధించకూడదు. ప్రభుత్వం బోధనా పరికరాలు సమకూర్చాలి.

6. బడిపిల్లలకు యూనిఫారంలు, నోటు పుస్తకాలు, ఆటస్థలాలనూ, మలమూత్ర విసర్జనా సౌకర్యాలకు మరుగుదొడ్లనూ నిర్మించాలి.

7. అత్యాచారాలకు, అవినీతికి నిలయాలుగా మారిన హాస్టల్స్‌ను విద్యార్థులకు తగిన విధంగా మలచి అన్ని సౌకర్యాలు అందించాలి.

పై డిమాండ్లను రూపొందించి డివిసి విడుదల చేసిన కరపత్రంలో ఉపాధ్యాయులు తమ ఉద్యోగ కేంద్రంలో తప్పనిసరిగా వుండాలనీ, ప్రజల పూర్తి అండదండలు వారికి లభిస్తూ గెరిల్లాలు తోడ్పడతారనీ విజ్ఞప్తి చేసింది. ఈ డిమాండ్లతో చిన్నారి బాలలు విపరీతమైన వర్షాల మధ్య ప్రమాదాలను లెక్కచేయక వాగులు ఒర్రెలు దాటుతూ సద్దిమూటలతో మైళ్లతరబడి నడిచి అధికారుల కేంద్రాలకు వచ్చి తమ డిమాండ్ల పత్రాలు సమర్పించారు. అయితే, యిక్కడా ఖాకీలు వారిని వదలలేదు. దండకారణ్యంలో ఏసమస్యపై ఎవరు బజార్లోకి వచ్చినా, గొంతువిప్పి ఎవరు నినదించినా వారు పోలీసుల దృష్టిలో నక్సలైట్లే కాకపోతే వారి సానుభూతిపరులే అని పోలీసులు తేల్చిపారేస్తున్నారు. బాసగూడెంలోని ఇలాంగేర్‌లో పోలీసులు వచ్చి విద్యార్థులను ఇళ్లకు పంపారు. బైరంగఢ్‌లో 4-8-99నాడు జరిగిన ర్యాలీకి 40 గ్రామాల నుండి 3000 మంది వెళ్లారు. విద్యార్థుల సమస్యపై తల్లిదండ్రులతో కూడిన ఇంత పెద్ద ర్యాలీ జరగడం బైరంగఢ్ చరిత్రలోనే అపూర్వమైనది. బీజాపూర్ వెళ్లడానికి 7 గ్రామాల నుండి 650 మంది జమకూడినా ప్రకృతి సహకరించకవారు బీజాపూర్ చేరలేకపోయారు. కానీ వారందరూ సర్కార్ చేసే, `పఢో-బఢో' లొసుగులను, విద్యాగ్యారంటీ పథకాల బూటకత్వాన్ని ఖండిస్తూ నాగళ్లు దున్నుకోవడానికి వెళ్లిపోయారు. నారాయణపూర్ అంతాగఢ్‌లకు చిన్నపిల్లలు తమ తల్లిదండ్రులను తీసుకొని (230 మంది) వెళ్లి అధికారుల ముందు తమ గోడువెళ్లబోశారు.

బీజాపూర్ కన్యాశ్రమంలో ఆగస్టు 99లో ఒక మైనర్ బాలికను హాస్టల్ వార్డెన్‌లు రాజేరాం త్రిపాఠీ మరియు లాలారాం లహరీలు కలిసి బలవంతంగా చెరచడాన్ని ఖండిస్తూ పై ప్రదర్శనలన్నింటిలోనూ ప్రజలు నినదించారు. అలాంటి ఘటనలు జరిగితే విద్యార్థులే వెంటనే నీచులకు బుద్ధి చెప్పాలని పెద్దలు ఉద్భోదించారు.

ప్రభుత్వ విద్యావిధానాన్ని ఎండగడుతూనే, సౌకర్యాల కల్పనకై పోరాడుతూనే ప్రజలు గ్రామరాజ్య కమిటీలను సంఘటితం చేసుకుంటూ, వాటి నేతృత్వంలో గ్రామంలో పిల్లలందరికీ విద్యా అవకాశాలు మెరుగుపడేలా, కృషిచేయాలనీ, ఈ దోపిడీ వర్గాలు పీడిత ప్రజలందరికి విద్యా అవకాశాలు కల్పించలేవనీ, శాస్త్రీయ విద్యను అందించలేవనీ విప్లవోద్యమ విజయాలతోపాటు విద్యారంగం మౌలికమైన మార్పుకు గురవుతుందనీ కూడా గెరిల్లాలు ఈ సందర్భంగా గ్రామగ్రామాన ప్రజలను కోరారు. గత మూడేళ్లుగా విప్లవ కృషితో ప్రారంభమై కొనసాగుతున్న ప్రజాపాఠశాల అనుభవాలను గెరిల్లాలు ప్రజలకు వివరించడంతో వారు ఎంతో ఉత్సాహంగా స్పందించారు.

## చిన్నారి బడి పిల్లల చేతిలో బడిపంతులు అరెస్టు

మాడ్ ప్రాంతంలో సాధారణంగా ఉపాధ్యాయులు ఏ ఊళ్లో నివాసం వుండరు. వారు సర్వసాధారణంగా వికాస్ ఖండ్ కేంద్రాలలో లేదా తాలూకా కేంద్రాలలో హాయిగా కాలం వెళ్లబుచ్చుతూ నెలవారీ జీతాలు పొందుతారు. పైగా లోతట్టు ప్రాంతంలో పని చేయాలంటే గెరిల్లాల `జడుపు' అని పై అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేస్తుంటారు. వాస్తవానికి విధులు నిర్వహించలేని సోమరి ఉపాధ్యాయులు, యితరత్రా వ్యాపకాలున్నవారు గెరిల్లాల సాకుతో పై అధికారులకు ముడుపులు చెల్లిస్తూ ప్రజాసొమ్మును దుర్వినియోగపరుస్తున్నారు. నిజం చెప్పాలంటే, గెరిల్లాలున్నచోట సక్రమంగా విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగికి తగిన భద్రత వుంటుంది. ప్రజల నుండి పూర్తి సహకారం వుంటుంది. ఇంతేకాదు, లోతట్టు గ్రామాలలో సైతం ప్రజావైద్యశాల నుండి వారికి మందూ-మాకు లభిస్తుంది.

మాడ్ కొండల్లో ఇలా ఉద్యోగాలు వెలగబెడుతూన్నవారికి ఉచితంగా జీతాలు పంపిణీచేసే ప్రభుత్వానికి కూడా ఈ ఉద్యోగుల వ్యవహారాలన్నీ తెలుసు. అందుకే, ప్రభుత్వం మాడ్ కొండలను రామక్రిష్ణ మిషన్ వారికి గుత్తకిచ్చింది. వారే యిక్కడ రోడ్ల నిర్మాణం చేస్తారు. వారే వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు. వారే నిరుద్యోగ యువకులకు ప్రభుత్వ సంస్కరణల ద్వారా వృత్తులు కల్పిస్తున్నారు. అవన్నీ 'ఏకలవ్య' పేరుతో సాగుతున్నవి. ఈ వృత్తికారులే రహస్యంగా ఇన్ఫార్మర్ల వృత్తిని కూడా చేపడుతున్నారు. మాడ్‌పై రామకృష్ణ సంస్థ 5 పాఠశాలలను కూడా నడుపుతోంది. అనేక అంగన్‌వాడీ కేంద్రాలు వీరే నడుపుతున్నారు. వన్-ధన్ సంస్థల ద్వారా అటవీ ఉత్పత్తుల సేకరణ కూడా చేస్తున్నారు. యిలా అన్ని రంగాలలోకి వీరు ఎగబాకుతున్నారు. వీరికి విదేశీ నిధులతోపాటుగా ప్రభుత్వం కూడా ఆర్థిక సౌకర్యాలు కల్పిస్తోంది. అయితే వీరి పాఠశాలల్లో కూడా చంద్రవంశి లాంటి అవినీతిపరులు, అమ్మాయిలను బలాత్కరించే యాదవ్‌లాంటి ఉపాధ్యాయులు గెరిల్లాలచే విచారించబడి ఉద్యోగాలకు తిలోదకాలిచ్చారు. ఈ కోవకు చెందినవాడే మస్పూర్ గ్రామంలోని ప్రభుత్వోపాధ్యాయుడు. పేరు నైతాం.

నారాయణపూర్ నుండి గార్పు వెళ్లే రోడ్డుపై నారాయణపూర్‌కు 42 కిలోమీటర్ల దూరంలో మస్పూర్ వుంది. ఈ ఊళ్లో మూడు ఉపాధ్యాయుల పోస్టులున్నాయి. కానీ, యిద్దరే వుంటారు మరొకరు నారాయణపూర్‌లో వుండి జీతం పొందుతాడు. ఇక్కడ వుండే ఇద్దరిలో కూడా నైతాం గురూజీ తాగుబోతు. నైతాం తాగుబోతుతనంతో విద్యార్థులు విసిగిపోతున్నారు. ఈ మహాశయుడు తాగిన మైకంలో బట్టలూడిపోయినా పట్టించుకోకుండా ఆశ్రమపాఠశాల హాస్టల్‌లో తూలుతూ, వదురుతూ తిరుగుతుంటాడు. ఇలాంటి స్థితిని సహించలేకపోయిన విద్యార్థులు ఒకరోజు బట్టలూడిన గురూజీని బంధించి అరలో వేసి మత్తు ఒదిలేవరకు నిర్బంధించారు. మరుసటిరోజు ఊరిపెద్దలు సమావేశమై నైతాం తప్పు సవరించుకొని తన విధులు సక్రమంగా నిర్వహించాలనీ కోరుతూ శిక్షగా 15 రూపాయలు ఆర్థిక దండుగ విధించి వసూలు చేశారు.

ఉపాధ్యాయులకు ఇలా బుద్ధి చెప్పడం నిజంగా కొనియాడదగిందే. యిలాంటి చర్యలు మిగతా ఉపాధ్యాయులకు గుణపాఠం కావాలి. తమంత తాముగా పిల్లలు చేపట్టిన సాహసోపేతమైన చర్య, పెద్దల మద్దత్తు మిగతా గ్రామాల విద్యార్థులకు, పెద్దలకు ఆదర్శం కావాలి.

## వెదురు, తునికాకు సమస్యలపై ప్రజాపోరు

దండకారణ్యంలోని ఒరిస్సా ప్రాంతానికి చెందిన మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల ప్రాంతంలోని ఆదివాసులు తదితర ప్రజానీకం అడవుల నుండి తెచ్చే తునికాకును సేకరించే పనిని ప్రభుత్వం నేరుగా తన అటవీశాఖ వారికే అప్పగించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఉత్తర దక్షిణ బస్తర్ డివిజన్‌లు మరియు మాడ్ డివిజన్, బాలాఘాట్-బండారా డివిజన్‌లోని బాలాఘాట్, రాజానందగాం ప్రాంతాలలో ప్రభుత్వం ప్రజల నుండి తునికాకును సేకరించే పనిని సహకార సంస్థలకు యిచ్చింది. కాగా మహారాష్ట్ర ప్రాంతంలోని గడ్‌చిరోలి డివిజన్, బండారా ప్రాంతాల్లో ప్రజల నుండి తునికాకు సేకరణను ప్రైవేట్ కంట్రాక్టర్లే కొనసాగిస్తున్నారు. ఇలా మూడు రకాల సేకరణ నడుస్తుంది. మూడు ప్రాంతాలలోనూ మూడు రకాల రేట్లు అమలవుతున్నాయి. దాదాపు మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ అటవీశాఖవారి ద్వారా ప్రకటించిన రేట్లు ఒకేలా వున్నా, ప్రైవేట్ కంట్రాక్టర్లు మాత్రం తమ లాభాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కన్నా మూడు రెట్లు అదనంగా ధర చెల్లిస్తూ తునికాకు కొనుగోలు చేస్తున్నారు. ఒరిస్సా-మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు మాత్రం మొండిగా వ్యవహరిస్తూ, ప్రజావ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ లాభాలన్నీ దిగమింగుతున్నవి. కాకపోతే, మధ్యప్రదేశ్ ప్రభుత్వం లాభాలను బోనస్ రూపంలో చెల్లిస్తామంటూ ప్రజలను మభ్యపెడుతూ గత పదేళ్లుగా సహకార సంస్థల పెద్దలు-ప్రభుత్వోద్యోగుల జేబులు నింపుతోంది.

ఒరిస్సా, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల తునికాకు సేకరణ విధానాలను ఎండగడుతూ ఏప్రిల్ 7న బంద్ పాటించాలని డివికెఎంఎస్, కెఎఎంఎస్‌లు, పార్టీ కలిసి సంయుక్తంగా ప్రజలకు పిలుపునిచ్చాయి ప్రతియేడు ఇలా బంద్ పాటిస్తూ ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేస్తూ ప్రభుత్వ మొండివైఖరితో విసుగెత్తి దాని ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. యింత ప్రజానిరసన వ్యక్తం అవుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టే వ్యవహరిస్తుంది. గత రెండేళ్లుగా ఇస్తున్న రేటే ఈయేడు కూడా ప్రభుత్వం నిర్ణయించింది. రూ.45లకు షేకడాగా ప్రభుత్వం ప్రకటించిన రేటు దారుణమని ప్రజలు నినదిస్తూ కనీసం 70 రూపాయలివ్వాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం ఖాతరు చేయలేదు.

తునికాకు సేకరణ రేటు పెంచాలని కొన్ని స్థానిక బూర్జువా - రివిజనిస్టు పార్టీలు కూడా డిమాండ్ చేశాయి. విశాల బస్తర్ జిల్లాలోని 15 లక్షల మంది ప్రజానీకం తునికాకు పనుల్లో పాల్గొని తమ శ్రమశక్తిని వెచ్చిస్తూవుంటే, సహకార సంఘాలు-ప్రభుత్వాధికారులు కుమ్మక్కై నిలువుదోపిడీ చేస్తున్నారు. ఈ ఆగడాలన్నింటినీ ఎండగడుతూ డివికెఎంఎస్ కెఎఎంఎస్‌లు కరపత్రాలు-వాల్‌పోస్టర్ల ద్వారా ముమ్మరమైన ప్రచారాన్ని పెద్ద ఎత్తున కొనసాగించాయి.

50 ఆకుల కట్ట ఒక్కంటికి 70 పైసలు యివ్వాలనీ, గ్రామగ్రామాన కళ్లం ఏర్పరచాలనీ, తునికాకు సేకరణ పనులు నెల రోజులు కొనసాగించాలనీ, బకాయి బోనస్ తక్షణం చెల్లించాలనీ, ప్రజలు తమ కనీస డిమాండ్లుగా పేర్కొన్నారు.

ఉత్తర బస్తర్‌లోని గడ్‌బెంగల్‌లో 17 గ్రామ పంచాయితీల నుండి 34 గ్రామాల ప్రజలు 7000 మంది అలాగే బొందనార్‌లో 30 గ్రామాల నుండి 7000 మంది జనం ఉదయం 10 గంటల నుండి పగలు 2 రెండు గంటల వరకు రాష్ట్ర హైవే రోడ్డుపైన రోడ్డు బ్లాక్ చేశారు. (చెక్కాజామ్). గడ్‌బెంగల్‌లో పోలీసులు వచ్చి ప్రజలను బెదిరించినా వారి పప్పులుడకలేదు. ప్రజలు తాము తలపెట్టిన ర్యాలీని జయప్రదంగా ముగించారు. తదనంతరం ఉన్నతాధికారులకు డిమాండ్స్ పత్రం యిచ్చి యిళ్లకు వెళుతుండగా 22 మందిని పోలీసులు అరెస్టు చేసినా జనాలు వెంటనే విడిపించు కున్నారు. మర్దపాల్‌లో 40 గ్రామాల ప్రజా ప్రతినిధులు, రేంజర్‌కు డిమాండ్స్ పత్రం యిచ్చారు. 6-4-2000 నాడు కోయిలబేడ ప్రాంతంలోని 'సంగం' గ్రామంలో 106 మంది రేంజర్ ఆఫీస్‌ను దగ్ధం చేశారు.

ఇలా మధ్యప్రదేశ్‌లోని 3 డివిజన్‌లలో ప్రజలు తమకు తోచిన రీతిలో ప్రభుత్వానికి తమ నిరసనను తెలిపారు. కాగా మధ్యప్రదేశ్-మహారాష్ట్ర సరిహద్దుల్లో అటవీ శాఖాధికారులు ప్రైవేట్ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ట్రక్కులకొలది తునికాకును రహస్యంగా అధిక ధరలకు అమ్ముకొని నక్సలైట్లు తునికాకు ట్రక్కులను కాల్చారని ప్రచారం చేశారు. ప్రజలు అవినీతి అధికారుల దుశ్చర్యలను ఖండిస్తూ వాటిని బహిర్గత పర్చారు. కాగా, ఒరిస్సాలోని కలిమెల దళం వికాస్‌ఖండ్ అధికారి భవనాన్ని పేల్చివేసింది. దక్షిణబస్తర్‌లోని బాసగూడెం దళం ప్రాంతంలో 6 క్యాంపెయిన్ బ్యాచ్‌లతో 60 మంది స్త్రీ పురుషులు 50 గ్రామాల్లో ప్రచారం చేసి ప్రభుత్వ తునికాకు విధానాన్ని ఖండించారు.

మరోవైపు మహారాష్ట్రలో ప్రభుత్వ ప్రకటిత రేటుతో సంబంధం లేకుండా ప్రైవేట్ ఠేకేదార్లు ప్రజల డిమాండ్ మేరకు 70 ఆకుల కట్టకు 1 రూపాయి 50 పైసలు చెల్లించారు. అయితే ప్రజల డిమాండ్ అమలు చేస్తే తమ ఖదర్ దెబ్బతింటుందని కుమిలిపోయిన పోలీసులు 1-60 పైసలే చెల్లించాలని కాంట్రాక్టర్లపై లాఠీలు పెట్టారు. భామ్రాగఢ్, గట్ట రేంజిల్లోని కొన్ని గ్రామాల్లో దీన్ని బలవంతంగా కొద్దిరోజులు అమలు చేయించారు. గడ్‌చిరోలి-బండారా ప్రజలు తమ తునికాకు రేట్ల పోరాటంలో వరుసగా ప్రతి యేటా విజయం సాధిస్తున్నారు. తునికాకు పోరాటంలో అత్యంత పట్టుదలగా నిలిచిన దండకారణ్య విప్లవ ప్రజానీకానికి, పార్టీ, ప్రజాసంఘాలు తమ విప్లవాభినందనలు తెలిపాయి.

బాలాఘాట్ డివిజన్‌లో 1999 అక్టోబర్ నెలలో వెదురు పనులు ప్రారంభమైనాయి. దండకారణ్య వ్యాప్తంగా సాధారణంగా వెదురు పనులన్నీ ఈ కాలంలోనే మొదలవుతాయి. మహారాష్ట్రలోని గడ్‌చిరోలి-బండారా ప్రాంతాల్లో పారిశ్రామిక వెదురును భారత బడాబూర్జువా థాపర్ నరికిస్తుండగా, మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వమే తన అటవీశాఖవారితో వెదురు పనులు నిర్వహిస్తోంది. కాగా, ఒరిస్సాలోని మల్కన్‌గిరి జిల్లాలో గల కలిమెల ప్రాంతంలో థాపరే వెదురు నరికిస్తున్నాడు. వెదురు పనులు ప్రభుత్వం చేపట్టిన దగ్గర అతి తక్కువ కూలిరేటు శ్రామికులకు చెల్లిస్తూ విచ్చలవిడిగా ప్రభుత్వం దోచుకుంటోంది. అవినీతి పరులైన అధికారులు చెల్లింపుల సందర్భంగా మరీ దోచుకుంటారు. వీరి దోపిడీని వ్యతిరేకిస్తూ మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ డివిజన్‌లో శ్రామికులు అధికకూలీరేట్లను డిమాండ్ చేస్తూ వీధుల్లోకి వచ్చారు. 1999 అక్టోబర్ నుండి 10 నవంబర్ వరకు 40 రోజులు సమ్మె జరిగి వెదురు కూపుల్లో పనులు నిలిచిపోయాయి. దానితో ప్రభుత్వానికి స్వల్పంగానైనా

| మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ డివిజన్‌లో 2000 సంవత్సరంలో అమలైన కూలిరేట్లు | | |
|---|---|---|
| 100 వెదురు ముక్కలు పొడవు (మీ) | రేటు | యితర డిమాండ్లు |
| 9 మీటర్లు | 120-30 | 7మీటర్లపైగానీ తక్కువగాగానీ |
| 7 " | 108.30 | వెదురు నరికించగూడదు. |
| 6.50 | 95.40 | సార్టింగ్ పనులు |
| 3.75 | 66.23 | నిలిపివేయాలి |
| 2.00 (20ముక్కలకు) | 4.78 | రోజు కూలీ రూ.60.77పై.లు సాధించుకున్నారు. |
| 1.00 (20ముక్కలకు) | 2.75 | |

| థాపర్ మెడలు వంచి గడ్‌చిరోలి - బండారా శ్రామికులు సాధించుకున్న కూలీ రేట్లు | | | |
|---|---|---|---|
| పని | డిమాండ్ రూ.పై. | సాధించిన రేటు రూ.పై | ఇతర డిమాండ్లు |
| 1. వెదురునరకడం కుప్పవేయడం(డులాయి) | 6.70 | 6.60 | |
| 2. ఊడిపోయిన కట్టలు తిరిగి కట్టడం (రీబండలింగ్) | 38.00 | 38.00 | 1. కిలోకు5.40 సబ్సిడీ రేటుకు కూలీలకు బియ్యం అందించాలి.<br>2. పని స్థలంలో ప్రాణాలు కోల్పోయిన శ్రామికులకు 70 వేలు నష్టపరిహారం చెల్లించాలి. |
| 3. రోజు కూలీ | 50.00 | 40.00 | |
| 4. లారీల్లోకి లోడింగ్ అన్‌లోడింగ్ | 50.00 | 50.00 | |
| 5. జూనియర్ మేట్ (రోజుకూలీ) | 48.00 | 48.00 | |
| 6. సీనియర్ మేట్" | 50.00 | 50.00 | |

రేట్లు పెంచక తప్పలేదు.

పై రేట్లు దండకారణ్యంలో అమలై పనులు సాఫీగా నడుస్తుండగా మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ డివిజన్‌లోని అవినీతిపరులైన అధికారులు వెదురు పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. వెదురు కూపులు కాల్చమని నక్సలైట్లు హామీ యివ్వాలనే అర్థం పర్థంలేని కుతర్కంతో పనులు నిలిపివేశారు. మలాజ్‌ఖండ్ ప్రాంతంలోని 12 కూపుల్లో, పర్సవాడలోని 3 కూపుల్లో పనులు నిలిపివేయడంతో విప్లవ ప్రజాసంఘాలు, పార్టీ పిలుపుపై ప్రజలు సమ్మెకు దిగారు. నవంబర్ 10 నుండి డిసెంబర్ 10 వరకు అధికారులు పనులు నిలిపి వేశారు. ప్రజల డిమాండ్స్‌ను ఆమోదిస్తూ పనులు నిలిపివేసిన అధికారుల శ్రామిక వ్యతిరేక విధానాన్ని ఖండిస్తూ దానికి నిరసనగా 10/12/99నాడు ప్రజలు డివిజన్ బంద్ పాటించాలని పార్టీ పిలుపునిచ్చింది. ప్రజలు బంద్ జయప్రదం చేయడంతో దడుసుకున్న అధికారులు క్రమంగా పనులు ప్రారంభించారు.

అధికారుల తప్పుడు వైఖరిని ఖండిస్తూ పర్సవాడ ప్రాంతంలోని 3 గ్రామాల ప్రజలు 150 మంది బైహార్‌లో 7-1-2000నాడు సబ్ డిఎఫ్‌ఒకు నిరసన పత్రం యిచ్చారు. ప్రభుత్వం తన మొండి వైఖరిని వదులుకోవడంతో 21-1-2000నాడు సమ్మె విరమణ జరిగింది. విప్లవోద్యమ ప్రాంతంలో పెంపొందుతున్న ప్రజల చైతన్యాన్ని వమ్ము చేయడానికి ప్రభుత్వం రకరకాల కుట్రలతో ముందుకు వస్తుందని బాలాఘాట్ అధికారుల మొండి వైఖరి తెలియజేస్తుంటే, అందుకు భిన్నంగా పోరాడే ప్రజలను ఏ శక్తీ అడ్డలేదని ప్రజాపోరాటాలూ నిరూపిస్తున్నాయి.

## సంక్షిప్తం

### బిల్ క్లింటన్ దిష్టిబొమ్మల దగ్ధం : “అమెరికా గైతల్ హాయిర్, హాయిర్.....”

మార్చ్ 2000 మాసంలో అమెరికా రాష్ట్రపతి, సామ్రాజ్యవాదుల ఏజంటు అయిన బిల్ క్లింటన్ భారత పర్యటనకు రావడాన్ని ఖండిస్తూ ప్రజలు ఎక్కడికక్కడే తమ నిరసనను వ్యక్తం చేయాలని స్పెషల్ జోనల్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు మరియు మాడ్ డివిజన్ కార్యదర్శి అయిన కామ్రేడ్ కోస పత్రికల వారికి ఇంటర్వ్యూ యిచ్చి వర్థమాన దేశాల పట్ల అమెరికా అవలంభిస్తున్న విధానాలను ఎండగట్టాడు. ప్రపంచ మొనగాడిననుకుంటున్న అమెరికా సామ్రాజ్యవాదానికి కాలం మూడిందనీ, సామ్రాజ్యవాదం గతంలో ఎన్నడెరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని చెబుతూ పెల్లుబుకుతున్న ప్రపంచ ప్రజల పోరాట జ్వాలల్లో సామ్రాజ్యవాదం నామరూపాలు లేకుండా పోనున్నదని అన్నాడు. భూస్వామ్య-సామ్రాజ్యవాదం వ్యతిరేక పోరాటాలను మన దేశంలోనూ యింకా తీవ్రతరం చేయాలన్నాడు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక విధానాలు ప్రజల పాలిట గండంగా మారాయనీ, వాటికి వ్యతిరేకంగా వేలాది ప్రజానీకం వీధుల్లోకి వస్తున్నారనీ, ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్‌ల షరతులకు తలొగ్గి భారత ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల పరిసమాప్తికై వారు నడుం బిగించారనీ వారందరితో ‘దండకారణ్య పోరుప్రజలు’ భుజం భుజం కలిపి నడుస్తారన్నాడు.

పార్టీ పిలుపుపై దండకారణ్యం వ్యాప్తంగా గెరిల్లాలు వందలాది గ్రామాల్లో ప్రజాసభలు నిర్వహించి సామ్రాజ్యవాద బంటు బిల్‌క్లింటన్ యాత్రను ఖండిస్తూ దిగ్విజయ్‌సింగ్ సర్కార్ దివాళాకోరు విధానాల ఫలితాలను ఎండగట్టారు. ఉత్తర బస్తర్‌లోని తాడోకి, రావుఘాట్, పల్లకస్సలలో వాల్‌పోస్టర్లు వేసి రావ్‌ఘాట్ మెయిన్ రోడ్డుపై క్లింటన్ దిష్టిబొమ్మను కాల్చారు. తుడ్కాలో 3 గ్రామాల ప్రజలు 50 మంది ఊరేగింపుగా వెళ్లి ఒక చోట సమావేశమై గడ్డిబొమ్మలను తగులబెట్టారు. "అమెరికా గైతల్ హాయిర్ హాయిర్" (అమెరికా నేత ముర్దాబాద్) అని గోండీలో నినదిస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పల్లహోడ్ వద్ద 2 గ్రామాల యువతీయువకులు పిల్లలు క్లింటన్ దిష్టిబొమ్మను మట్టికరిపించి, సంప్రదాయబద్ధంగా చావు డాకా (నృత్యం) చేశారు. ఆదివాసీ ప్రజలు ప్రపంచ 'మోసగాడి' యాత్రను నిరశిస్తూ వీధుల్లోకి రావడాన్ని బట్టి వారిలో పెంపొందుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

## గెరిల్లాజోన్‌లో సైనికచర్యలు - వీరగెరిల్లాలకు లాల్‌సలాం

*(డికె గెరిల్లాజోన్‌లో సైనిక కార్యకలాపాల పట్టికను 20వ పేజీలో చూడగలరు)*

గత యేడాది కాలంలో దండకారణ్య వ్యాప్తంగా గెరిల్లాలు పోలీసుల కాల్పులు ఎదుర్కొన్నారు. అడవులను పెద్దెత్తున గాలిస్తున్న పోలీసుల సమాచారాన్ని ముందుగా సేకరించుకొన్న గెరిల్లాలు వీలైనచోట వారిపై మాటుదాడులు చేశారు. శత్రు పరిస్థితి గూర్చి ముందే పూర్తి సమాచారం సేకరించి తగిన రెక్కీ జరిపి ప్లాన్ ప్రకారం గెరిల్లాలు ధైర్య సాహసాలతో రెయిడ్స్ నిర్వహించారు. చొరవతో మాటుదాడుల్లో శత్రువును మట్టుబెట్టారు. పెంపొందుతున్న ప్రజల పోరాట చైతన్యాన్ని దెబ్బతీయడానికి పోలీసులు రైతాంగ యువకులను ఎత్తుకెల్లి కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కట్టుకథలు అల్లిన ఘటనలున్నాయి. గెరిల్లాల సమాచారం సేకరించడంలో విఫలమైన పోలీసులు కసితో రైతులను చంపిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. పోలీసుల ఎంగిలి మెతుకులకు ఆశపడి గెరిల్లాల ఆచూకి పసిగట్టి పోలీసులకు ఇన్ఫార్మర్లుగా వ్యవరిస్తూ ప్రజల చేతిలో గెరిల్లాల చేతిలో కుక్కచావు చచ్చినవారూ వున్నారు.

## పోరు వారం - "పోరాడుదాం రండి"

ప్రతియేటా దండకారణ్యవ్యాప్తంగా 8 మార్చ్ తమ విశేష పోరాట దినంగా మహిళలు జరుపుకోవడం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. యేటా 8 మార్చ్‌ను పోరాట దినంగా జరుపుకుంటున్న మాడ్ మరియు ఉత్తర బస్తర్ డివిజన్ మహిళలు ఈ సంవత్సరం కెఎఎంఎస్ పిలుపుపై పోరాట వారంగా మలచుకున్నాయి. దినదినం మహిళలపై పెచ్చరిల్లుతున్న పోలీసు అత్యాచారాలకు నిరసనగా మహిళలపై రాజ్యహింసను ఖండిస్తూ పెద్ద ఎత్తున ఈ సభలు జరిగాయి. వందలాది గ్రామాల మహిళలు వేలాది మంది సభలకు హాజరై రాజ్యహింసను ఖండిస్తూ తమ యేడాది పోరాట అనుభవాలను సమీక్షించుకున్నారు. కొన్ని చోట్ల తమ సంగం నూతనంగా చేపట్టనున్న కార్యక్రమాలను కూడా రూపొందించుకున్నారు. మాడ్ డివిజన్‌లోని పరాల్‌కోట దళ ప్రాంతంలో గార్పలో 5 గ్రామాల మహిళలు 100 మంది, మూసేర్‌లో 6 గ్రామాల మహిళలు 150 మంది, కొంగల్‌లో 10గ్రామాల నుండి 100 మంది స్త్రీ పురుషులు, మక్కోడిలో 7 గ్రామాల నుండి 50 మంది మహిళలు, గమిడిలో 3 గ్రామాలవారు 120 మంది, మెట్టనార్‌లో 50 మంది మహిళలు అత్యంత పట్టుదలతో సభల్లో పాల్గొన్నారు. ఇంద్రావతి దళ ప్రాంతంలోని పోదాడలో జరిగిన సభకు 500మంది జనాలు హాజర్‌కాగా 65 మంది పురుషులున్నారు. ఎర్రగుడ్డపై తెల్లని నక్షత్రం జండా గాలిలో రెపరెపలాడుతుండగా వారి నినాదాలు ఆకాశాన్ని ముద్దాడినాయి. పోరు వారంలో మాడ్ కొండల్లో "పోరాడుదాం రండి" అన్న ఏకైక నినాదం మహిళలను ఆకర్షించింది.

దక్షిణ బస్తర్‌లోని అన్నారం, సంద్రలలో మహిళా సభలు జరిగాయి. 200 మంది మహిళలు సభలలో పాల్గొన్నారు. మద్దేడ్‌లోని ఆవులపల్లిలో 350 మంది, భట్టుగూడెంలో 100 మంది పాల్గొన్నారు. జేగురుగొండ ప్రాంతంలో 4 ప్రచార దళాలు అంతర్జాతీయ మహిళా దిన ప్రాముఖ్యతను వివరించి 1200 మందిని సమావేశపర్చాయి. కుంటలోని కిష్టారం ప్రాంతంలో 800 మందితో 8 మార్చ్ జరిగింది. (మిగతా ప్రాంతాల రిపోర్టులు అందలేదు)

## రైతుల వీపులపై బండలెత్తుతూ మధ్యయుగాలను మరిపిస్తున్న దిగ్విజయ్‌సింగ్ ప్రభుత్వం

1999 సంవత్సరంలో 1999-2000 సంవత్సరానికి గాను ప్రభుత్వం బడ్జెట్ ప్రకటించిన అనంతరం దాని ఆర్థిక దుస్థితిని తెలుపుతూ శ్వేతపత్రం వెల్లడించడంతో రుణాల వసూళ్ల కార్యక్రమం జోరందుకుంది.నూతనఆర్థిక విధానాలను నెత్తికెత్తుకొని దివాళాతీస్తున్న ప్రభుత్వం తన పబ్బం గడుపుకోవడానికి రైతుల పాలిట శాపంగా మారింది. గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బుద్ధిపూర్వకంగానే అధికారులు ఓట్ల భయంతో రుణాల వసూళ్లు కొద్దికాలం నిలిపివేశారు. బ్యాంకు అధికారులు బాలాఘాట్ డివిజన్‌లో అధికారులు నిరుపేద రైతుల యిళ్లల్లోకి చొరబడి కుర్కి జప్తుకి పూనుకున్నారు. దీనితో రైతులు చైతన్యవంతమై అధికారుల దుశ్చర్యలను ఖండిస్తూ పెద్ద ఎత్తున కరపత్రాలు పంచారు. దక్షిణ బస్తర్ జిల్లాలోని అనేక పోలీస్ స్టేషన్‌లు రుణవసూళ్ల కేంద్రాలైనాయి. ఒకవైపు అటవీ ఉత్పత్తుల ప్రభుత్వ కొనుగోళ్లు మందగించగా, మరోవైపు తునికాకు పనులను ప్రభుత్వం నిలిపివేసి రైతుల గోళ్లూడగొట్టే రుణవసూళ్లకై పోలీసులను రంగంలోకి దింపింది. జిల్లాలోని అన్ని దోపిడీ పార్టీల రాజకీయనాయకులు గుడ్లప్పగించి రైతుల దీనావస్థను చూస్తూ పోలీసుల పక్షమే నిలిచారు తప్ప నోరు మెదపలేదు. రైతులను ఏదో నెపంపై ఠాణాకు పిలుచుకొని రుణవసూళ్ల చర్చ లేవనెత్తి వారి లోతు కడుపులను మరింత వంగదీసి, వీపులపై బండలెత్తి క్రూరమైన ఆనందాన్ని అనుభవించారు. మధ్యయుగాల ఈ చర్యను ఖండిస్తూ విప్లవ ప్రజాసంఘాలు ప్రజల పక్షం నిలిచి రుణవసూళ్లను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. లేనిచో ఎదురయ్యే తీవ్రపరిణామాలకు అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించాయి.

## మహాసభలు :

దండకారణ్యంలోనిప్రజాసంగాలు ప్రతిరెండేళ్లకొకసారి తమ సంస్థ మహాసభలను జరుపుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఈ సంవత్సరం బండారా-బాలాఘాట్ డివిజన్‌లోని డాబ్రి రేంజి

## దండకారణ్య గెరిల్లాజోన్‌లో సైనిక కార్యకలాపాలు (జూన్1999 నుండి జూన్ 2000 వరకు)

### గెరిల్లాలు జరిపిన దాడులు

| డివిజన్ | దాడి | పో.వైపు నష్టం | గె.వైపు నష్టం | గుంజుకున్న తుపాకుల సంఖ్య |
|---|---|---|---|---|
| ఉత్తర బస్తర్ | బజరంగబలి ఆంబుష్ | – | – | – |
| దక్షిణ బస్తర్ | కొంగపెల్లి ఆంబుష్ | – | – | – |
| గడ్‌చిరోలి | అడింగే ఆంబుష్ | ఒకడిచావు | – | – |
| ” | ఆసరెల్లి రెయిడ్ (ఉత్తర తెలంగాణ గెరిల్లాల ద్వారా) | యిద్దరికి గాయాలు | యిద్దరు అమరులు | 32 |
| మాడ్ | వాకుల్‌వాహి ఆంబుష్ | 24 చచ్చారు | – | 13 |
| ” | ఎడ్సగడ్ ఆంబుష్ | 4చావు,5గాయాలు | – | – |
| బండారా-బాలాఘాట్ | సేర్వి ఆంబుష్ | 2చావు, ఒకడికి గాయాలు | – | 2 |
| ” | ఛురియా రెయిడ్ | ముగ్గురికి గాయాలు | ఒకరి అమరత్వం | – |
| మొత్తం | 9 | 28మంది చావు 11మందికి గాయాలు | ముగ్గురి అమరత్వం | 47 |

### పోలీసులు జరిపిన కాల్పులు, బూటకపు ఎన్‌కౌంటర్లు, గెరిల్లాలచేతిలో ఖతమైన ప్రజా శత్రువులు

| డివిజన్ | ఎన్‌కౌంటర్ | గెరిల్లాలవైపు నష్టాలు | బూటకపు ఎన్‌కౌంటర్లో అమరులైనవారు | గెరిల్లాలు, ప్రజామిలీషియా చేతుల్లో హతులైన ప్రజాశత్రువులు |
|---|---|---|---|---|
| ఉత్తర బస్తర్ | 2 | – | – | 10మంది ఇన్‌ఫార్మర్లు పొరపాటున ఒక నిర్దోషి మృతి |
| దక్షిణ బస్తర్ | 2 | – | మాజీ నక్సలైట్ కా.భీమన్న | 2హోంగార్డులు 1పోలీసు 2ఇన్‌ఫార్మర్లు |
| గడ్‌చిరోలి | 2 | 5అమరులు (ఇద్దరు ఉ.తెలంగాణావాళ్లు) | – | 8ఇన్ఫార్మర్లు |
| మాడ్ | 4 | 4అమరులు 1గెరిల్లాగాయం | అమాయకరైతు కా.రాజు 1రైతు 11రహస్య సైనికులు | 4ఇన్‌ఫార్మర్లు 1హోంగార్డు |
| బండారా-బాలాఘాట్ | 5 | – | – | 14ఇన్‌ఫార్మర్లు 1మంత్రి (లిఖిరాం కావ్రే) |
| మొత్తం | 15 | 10అమరులు1గాయం | 2 | 55 |

(యిందులో హోంగార్డులు-రహస్య పోలీసులున్నారు)

*[1999 అక్టోబర్-జనవరి-ఏప్రిల్ 2000 సంచికలను తెలుగులో తేలేకపోయినందుకు చింతిస్తున్నాం. – సం.మం.]*

డివికెఎంఎస్ మహాసభ 22-1-2000 నాడు జరిగింది. అలాగే ఉత్తర బస్తర్ డివిజన్‌లోని ప్రతాప్‌పూర్ రేంజి, ప్రభుత్వ లెక్కల ప్రకారం విశాలంగా వుండడంతో, ప్రజాసంగాల సమన్వయంలో ఎదురవుతున్న సమస్యను దృష్టిలోపెట్టుకొని ఈ సంవత్సరం ఆ రేంజిని రెండుగా విభజించారు. ప్రతాప్‌పూర్ రేంజి మహాసభను 18-5-2000 నాడు జరిపి ప్రతాప్‌పూర్ రేంజి కమిటీని ఐదుగురితో ఎన్నుకున్నారు. కొయ్యూరు అమరవీరుల కమ్యూన్‌లో జరిగిన ఈ మహాసభకు 22 మంది డెలిగేట్స్ హాజరైనారు. ఆ తర్వాత కడిమె రేంజి మహాసభ 8-6-2000నాడు జరిగింది. 15 మంది ప్రతినిధులు హాజరైనారు. ఐదుగురితో కమిటీని ఎన్నుకున్నారు.

నేల్‌నార్ రేంజి డివికెఎంఎస్ మహాసభలు జయప్రదంగా ముగిశాయి. కోటెనార్‌లో నేల్‌నార్ దళం కామ్రేడ్స్ అమరులై సంవత్సరం గడిచిపోయింది. పార్టీ నేల్‌నార్ దళాన్ని పునర్నిర్మించి ఏరియాకు పంపిన ఆరు నెలల్లో యిది మొదటి మహాసభగా చెప్పుకోవచ్చు. 10 గ్రామాల సంగం ప్రతినిధులు 21 మంది, సౌహార్ధ్ర ప్రతినిధులుగా కెఎఎంఎస్ వారు 5 మంది మొత్తం 26 మందితో రేంజి మహాసభ (కాన్ఫరెన్స్) జులై 1-3ల మధ్య 3 రోజులపాటు జరిగింది.

ప్రతినిధులతో కలిసి గ్రామస్థులందరూ పాల్గొనగా డివికెఎంఎస్ జండాను కామ్రేడ్ ఎక్స్ ఆవిష్కరించగా ఊరేగింపుగా కోటెనార్ అమరుల (మీటింగ్)హాలువద్దకు చేరుకున్నారు. తర్వాత ప్రతినిధులు 26 మందితో మహాసభ జరిగి మొదటి రోజున ప్రణాళిక, రెండవరోజున నిర్బంధం-ప్రతిఘటన, మూడవ రోజున సంగం గత సమీక్ష (గతంలో రేంజి కమిటీ ఏర్పడి రద్దయి తిరిగి నిర్మాణమైన మధ్య కాలంలోని చరిత్ర సమీక్ష) అలాగే రాజకీయ తీర్మానం మరియు 28 జులై ప్రత్యేకత గురించి చర్చించి, చర్చలు పూర్తి చేసుకొని ఐదుగురితో కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

మహాసభలలో ప్రణాళిక-నిబంధనావళి ప్రవేశపెట్టి చర్చించారు. జరిగిన అన్ని సభలలో కార్యదర్శులు తమ రెండేళ్ల కార్యకలాపాల సమీక్షను వివరించారు. మారుతున్న రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని తాము రాసుకున్న రాజకీయ తీర్మానాన్ని కూడా చర్చించారు. రెండు రోజులు జరిగిన ఈ మహాసభల్లో చివరి రోజు మధ్యాహ్న సెషన్‌లో కమిటీ సభ్యులు తమ ఆత్మ విమర్శలను ప్రవేశపెట్టి ప్రతినిధుల నుండి విమర్శను ఆహ్వానించారు. ఆ పిదప నూతన కమిటీలను ఎన్నుకొన్నారు. రెండు రోజులు సాయంకాల సమయంలో స్థానిక ప్రజానృత్యాలతో, విప్లవ గీతాలతో సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు మహాసభల వాతావరణానికి నిండుదనాన్నిచ్చాయి. దక్షిణ బస్తర్‌లో గ్రామస్థాయి కెఎఎంఎస్ మహాసభలు ప్రారంభమైనాయి. నేషనల్‌పార్క్ ఏరియాలో 6, బైరంఘడ్‌లో 5 జరిగాయి.

## ప్రజాస్వామిక ఎన్నికలు- గ్రామరాజ్య కమిటీ ఎన్నిక

గ్రామ రాజ్యకమిటీలకై ప్రతి రెండేళ్లకొకసారి గ్రామ సభలు జరగాలని గ్రామ రాజ్యకమిటీ నిబంధనావళిలో పేర్కొన్న విధంగా కాలపరిమితి నిండిన గ్రామ రాజ్యకమిటీలకు ఎన్నికలు జరగడం ప్రారంభమైంది. గ్రామ రాజ్యకమిటీల నిర్ణయంపై అధ్యక్షులు గ్రామ సభలను నిర్వహించి తమ రెండేళ్ల కాల వ్యవధిలో జరిగిన కార్యక్రమాలన్నింటినీ వివరించారు. తమ కాలవ్యవధిలో జరిగిన తప్పొప్పులను ప్రజల ముందుంచి వాటిలో తమ పాత్రను పేర్కొంటూ, గుర్తించిన మేరకు గ్రామ రాజ్య కమిటీ సభ్యులు ఆత్మ విమర్శలు ప్రవేశ పెట్టి గ్రామ సభ ప్రతినిధుల నుండి విమర్శలు ఆహ్వానించారు. ఆ తర్వాత గ్రామ సభ నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. దక్షిణ బస్తర్‌లో నూతన సంవత్సరం నూతన శతాబ్దంలోని మలి రోజు నుండి ఈ మహాసభలు జరగడం ప్రారంభమైంది. ఒకవైపు ప్రభుత్వం గ్రామపంచాయితీ ఎన్నికలు జరిపి పంచు-సర్పంచులు ఎన్నిక నడుం బిగిస్తే, ప్రజలు విప్లవ చైతన్యంతో అక్కడక్కడ ఏర్పర్చుకున్న గ్రామరాజ్యకమిటీలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను ఇలాంటి చోట పూర్తిగా బహిష్కరించారు. ప్రజల ముందు తలవంచి ప్రజలకు నేరుగా జవాబుదారి వహిస్తూ ప్రజానేతలు నిలబడడం గతంలో తామెన్నడెరుగని జనాలు ఈ నూతన ప్రక్రియతో అత్యంత ఉత్సాహం చెందారు. ప్రజానాయకుల తప్పుల గురించి జంకు-గొంకు లేకుండా గెరిల్లాల సమక్షంలో స్పష్టంగా మాట్లాడారు. నాయకుల ఆత్మవిమర్శలతో సంతృప్తి చెందని పక్షంలో, వారి స్థానంలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకొని నిజమైన ప్రజాస్వామ్య పాలనకు పునాదులు వేస్తున్నారు.

## ప్రజావైద్యులు - ప్రజలకు వైద్యం

దండకారణ్యంలోని అన్ని డివిజన్‌లలోనూ ప్రజా ఆరోగ్య కేంద్రాలు ఏర్పడి పనిచేస్తున్నాయి. సంఖ్యరీత్యా నేడు అవి అత్యంత స్వల్పంగానే వున్నా, వీటి ప్రభావంతో యింకా యింకా నూతన కేంద్రాలు ఉనికిలోకి వస్తున్నవి. మలేరియా, డయేరియా, నొప్పులు, గాయాలు వంటి అతి మామూలు వ్యాధులకు ఈ కేంద్రాల నుండి ప్రజలు డబ్బులు చెల్లించి మందులు తీసుకెళ్లుతున్నారు. రైతాంగ వైద్యులు ఆ డబ్బులతో తిరిగి మందులు కొనుగోలు చేసి కేంద్రాలలో పెడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రబలే అంటువ్యాధుల నుండి ప్రజలకు కనీస ఆరోగ్య వసతులు కల్పించి వారి జీవికకు మౌలికాధారమైన వ్యవసాయంపై అనారోగ్య ప్రభావం పడకుండా వుండడానికి ఈ కేంద్రాలు తమ శక్తిమేరకు కృషిచేస్తున్నవి.

అరోగ్య కేంద్రాల కృషితోపాటు దండకారణ్యంలోని కొంతమంది డాక్టర్లు ప్రజాసంక్షేమాన్ని కోరి విప్లవకారుల పూర్తి అండదండలతో స్వచ్ఛందంగా వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తున్నారు. మరోవైపు విప్లవోద్యమంలోని డాక్టర్లు స్థానిక రైతు డాక్టర్ల సహకారంతో కూడా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ డాక్టర్లు ముందుగా 'రైతు డాక్టర్లకు' శిక్షణ యిచ్చి, శిబిరాలలో వారికి ప్రాక్టికల్ జ్ఞానాన్నిఅందిస్తున్నారు. దక్షిణ బస్తర్‌లో ప్రజావైద్య శాల డాక్టర్లకు ఈ సంవత్సరం ఫిబ్రవరి - మార్చి మాసాలలో 3 రోజులు శిక్షణా శిబిరం జరిగింది. అదే కాలంలో కుంటలో 2, బైరంగడ్‌లో 2, బాసగూడెంలో 2 కలిమెలలో 1 వైద్య శిబిరాలు కూడా జరిగి 2060 మంది రోగులను పరీక్షించి వారికి మందులను అందజేశారు. అందుబాటులో మందులు లేని వారికి రాసి యిచ్చారు. ఈ రకంగా సాగుతున్న వైద్య కృషి మూలంగా ప్రజల్లో తమ ఆరోగ్యాన్ని ఈ దోపిడీ ప్రభుత్వం ఎన్నడూ పట్టించుకోలేదని, ఇకపై దాని కోసం కూడా తామే నడుం బిగిస్తే విప్లవోద్యమంలో అన్నీ సాధించి తీరుతామన్న విశ్వాసం పెరుగుతోంది.

## భూమి కొలతలు విప్లవోద్యమంలో గొప్పముందంజ

దండకారణ్యంలోని పీడిత రైతాంగం భూదాహంతో అలమటిస్తున్నారు. అడవులన్నీ మావేననీ, వీటిని నరికే అధికారం ఎవడికీ లేదనీ దోపిడీ పాలకవర్గాలు భూమిని చట్టాల్లో బంధించాయి. చట్టం నుండి తమను మినహాయించుకొని రైతాంగాన్ని రాచి రంపానపెడుతున్నాయి. పంటపొలాలు లేక అలాగే అర్ధాకలితో అలమటించలేక, అటవీ ఉత్పత్తులపైనే జీవితాలను కడతేర్చలేక రైతాంగం తెగించి అడవి నరికితే వారిపై సర్కార్‌వారు లేనిపోని కేసులు తయారుచేసి వారి ఇల్లు గుల్లచేసేలా లంచాలు గుంజి కాదంటే కటకటాల్లోకి తోయడమే ఇన్నాళ్లు సాగింది. అటవీశాఖవారు ఎంత దుర్మార్గంగా వ్యవహరించినా రైతు మాత్రం భూమిని వదిలే వాడు కాదు. పంటను విడిచేవాడు కాదు. నీటిలో చేపలా, నేలలో విత్తనంలా భూతల్లిని నమ్ముకుని దాన్నే అంటిపెట్టుకునేవాడు. దానిపై ప్రభుత్వం కటాక్షించి యాజమాన్య హక్కులు ఇస్తే అనుభవించేవాడు లేకుంటే అందుకై లీడర్ పేరుతో అడ్డమయ్యే దొంగవెధవల కాళ్లు పట్టి అంగలార్చేవాడు. కానీ, డికెలో గత 20 యేళ్లుగా ఈ పరిస్థితిలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

1. అడవి నరికి కొత్త భూములు సాగుచేసుకోవడం సర్వ సాధారణమైంది.
2. విప్లవోద్యమ ఫలితంగా భూమి పొందని రైతుకూలీలు కానరారంటే అతిశయోక్తి కాదేమో!
3. పెద్దెత్తున అడవి నరికి అమ్మకాలు చేసేవారి ఆటలు సాగడంలేదు.
4. ప్రభుత్వ అటవీశాఖవారి దుర్మార్గానికి అడ్డుకట్టలు వేశారు.
5. అడవి నరికిన భూములతో పెత్తందారులుగా, భూస్వాములుగా అవతారమెత్తిన వారి నుండి నిరుపేద రైతుకూలీలు భూములు స్వాధీనం చేసుకోవడం కొనసాగుతుంది.
6. ప్రభుత్వ పట్టాలతో నిమిత్తం లేకుండా పంటలు తీసుకోవడం రైతాంగం నేర్చుకున్నారు.
7. అడ్డమైన దొంగ లీడర్లవెంటపడి ప్రభుత్వ పట్టాల కోసం అఘోరించే కాలం చెల్లిపోయింది.
8. గ్రామాల్లోని బీడు భూములు గ్రామరాజ్యకమిటీల పరమవుతున్నాయి. గ్రామరాజ్యకమిటీలు లేనిచోట ప్రజాసంఘాల పరమవుతున్నాయి.
9. గ్రామాల్లో భూముల వివరాల సేకరణ ప్రారంభమై, భూపంపకాలు చేపట్టబడి నిరుపేద వ్యవసాయకూలీలు, పేదరైతులకు న్యాయం జరుగుతుంది.
10. గ్రామరాజ్యకమిటీల లేదా ప్రజాసంఘాల అనుమతి లేకుండా కొత్తగా అడవి నరకడం నిషేధించబడింది.

పై మార్పులు దండకారణ్యా వ్యాప్తంగా విప్లవోద్యమ బలానికి అనుగుణంగా ఆయా గ్రామాల్లో అమలవుతున్నాయి. ఈ క్రమంలో విప్లవోద్యమంలో "భూ యాజమాన్య పత్రాల పంపకం" కార్యక్రమం ప్రారంభమైంది. 1997లో 'పట్టా నమూనా'ను గ్రామరాజ్యకమిటీలు రూపొందించుకున్నా పంపిణీలో అనేక సమస్యలు ఎదురైనాయి. ముఖ్యంగా భూమి కొలతలు తెలవక పోవడంతో యింతకాలం పట్టాల పంపకం జరగలేదు. కానీ, నూతన శతాబ్దంలో అనేక వినూత్న ప్రక్రియలకు బీజాలు పడుతున్నట్టే పట్టాల పంపిణీ ప్రారంభమైంది. కుటుంబంలోని స్త్రీపురుషులిద్దరినీ భూయజమానులుగా గుర్తిస్తూ గ్రామరాజ్యకమిటీలు భూమి పట్టాలు పంపిణీ చేస్తున్నవి. ఈ సంవత్సరం జనవరి-మార్చ్ మధ్య దక్షిణబస్తర్‌లోని 10 గ్రామాలలో భూముల వివరాలు సేకరించి గట్లు పెట్టి విప్లవ భూపట్టాల పంపిణీ సాగింది. విప్లవోద్యమం ద్వారా లభించిన భూ పట్టాలు అందుకున్న స్త్రీ-పురుషులు గొప్ప విశ్వాసం కళ్లలో తొణికిసలాడుతుండగా దానిని భద్రంగా దాచుకుంటున్నారు. విప్లవ భూ పట్టాలు పోలీసుల కంటపడకూడదనీ, గ్రామరాజ్య కమిటీల ఆనుపానులు శత్రువుకు తెలవకూడదనీ రైతులు పిడికిళ్లు బిగిస్తున్నారు.

## దండకారణ్యా పోరుపథంలో.......

### మంత్రాల సమస్యలను పరిష్కరించుకొని మూఢనమ్మకాల ఊబి నుండి బయటపడిన నేల్‌నార్ ప్రజలు

మాడ్ డివిజన్ నేల్‌నార్ లోకల్ గెరిల్లా దళం ఏరియాలోనిది నేల్‌నార్ గ్రామం. గత 11 సంవత్సరాలుగా ఈ గ్రామం మంత్రాల మాయాజాలంలో మునిగితేలుతోంది. మంత్రాలు చేసి చంపుతున్నారని గ్రామంలోని 9 కుటుంబాలకు కుటుంబాలనే తెగ బహిష్కరణ చేశారు. గ్రామం నుండి వెళ్లగొట్టాలనే వాతావరణం నిండియుంది. వీటి పేరుతో ఒకరిని ఒకరు చంపుకోవడం, స్త్రీలపై అత్యాచారాలు చేయడం వంటి భయానక వాతావరణం కొనసాగుతోంది. ఈ సమస్యపై గెరిల్లాదళం మార్చ్ 25న గ్రామస్థులు 2,000 మందిని సమావేశపర్చి పంచాయితీ చేసింది. వారి తగవుల పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకొన్న దళం ప్రజానీకంతో చర్చించి వారి వారి లోపాల్ని గుర్తింపజేసి ఈ క్రింది విషయాలపై రాజీ కుదిర్చింది.

- గ్రామస్థులందరి ముందే వివాదానికి కారణమయిన పొలంలో పాతి వుంచిన గజ్జలు, ఉంగరాలు, వెంట్రుకలు వంటివి అన్నీ పాతినవారే తొలగించాలి.
- అలాగే అడవిలో మంత్రాలు చేస్తామని ఎక్కడెక్కడ గద్దెలు పెట్టారో (రాళ్లతో) వాటన్నింటిని కూడా పెట్టినవారే తొలగించాలి.

ప్రజల్లో అనారోగ్యానికి (రోగాలు రొప్పులకు) కారణం పోషకాహార లోపం, అపరిశుభ్ర పరిసరాలు, కలుషితమైన నీరు త్రాగడం వంటివి కాగా శాస్త్రీయ విజ్ఞానం తెలియక వారంతా కక్షలతో మూఢ నమ్మకాలతో ఒకరినొకరు చంపుకోవడం, స్త్రీలను బలిపశువులను చేయడం తప్పని వారికి దళం అర్థం చేయించింది. దీనికంతకూ ప్రభుత్వమే బాధ్యురాలని, దోపిడీ స్వభావం కల్గినదాని ప్రతినిధులు వెనుకబడిన ఆదివాసీ ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ఫలితమే యిది అని తెలియజెప్పింది. పార్టీ చేబట్టే అభివృద్ధి కార్యక్రమాలు ముఖ్యంగా ఆరోగ్యకేంద్రాలు నెలకొల్పి వైద్య సౌకర్యాలు అందించడం వంటివన్నీ వారి జీవన ప్రమాణాల్ని పెంచడానికేనని వివరింగా అర్థం చేయించింది. ఆ క్రమంలోనే మూఢనమ్మకాలు పోతాయని కూడా చెప్పింది.

దీనితో ఉత్సాహవంతమైన గ్రామస్థులు ఇళ్ల చుట్టూ, గల్లీల్లో వున్న చెత్తా చెదారం పేడ మొదలగు అపరిశుభ్రమైనవన్నీ తొలగించే పారిశుధ్యకార్యక్రమం చేబట్టాలని నడుం బిగించారు. అలాగే సమిష్టి

శ్రమతో రెండు సిమెంటు బావులు కట్టుకొని మంచినీటి సౌకర్యం ఏర్పర్చుకోవాలని కూడా నిర్ణయించుకొన్నారు. యిలా ప్రజలు నూతన చైతన్యం సంతరించుకొని సమిష్టితత్వంతో చేతులు కలుపుతున్నారు.

## కులాంతర వివాహం - జంట కలయిక

మాడ్ డివిజన్‌లో కోహకమెట్ట దళ ఏరియాలో కుస్తూరిమెట్ట గ్రామస్థురాలైన కమ్మరి అమ్మాయికి హోక్‌పాడ్ గ్రామస్థుడైన గొల్ల అబ్బాయితో లైంగిక సంబంధాలుండి ఆమె గర్భవతి కావడంతో వివాదం మొదలైంది. గొల్లవారి కట్టుబాట్లు కఠినమైనవి కావడంతో ఆమెను విడిచిపెట్టాలని కుటుంబస్థులు అతనిపై తీవ్రవత్తిడి తేసాగారు. మరోవైపు యువతి బంధువులు పెళ్లి చేసుకోవాలని వత్తిడిపెట్టసాగారు. యిది సంవత్సరంగా సాగుతున్న వివాదం.

గెరిల్లా దళం గ్రామానికి వెళ్లినప్పుడు సంగంవారితో కలిసి ప్రజలందరినీ మార్చి 20న పంచాయితీకి పిలిచింది. ఆ ప్రజాపంచాయితీలో క్రింది రెండు తప్పులను గుర్తింపజేసింది.

1. యువతిని విడిచిపెట్టడానికి ఒప్పుకుంటూ ఆమె తండ్రి డబ్బు తీసుకొన్నది.
2. విడాకులకు ఒప్పించి ప్రజల మధ్య రాజీతో ఎలాగైనా అమ్మాయిని వదిలించుకోవాలనే గొల్ల కుటుంబంవారి ప్రయత్నాలు.

పై తప్పులు ఒప్పించి, అంతిమ నిర్ణయాన్ని గర్భం ధరించిన ఆ అమ్మాయికే వదిలివేయడంతో ఆమె పెళ్లినే కోరుకుంది. దానితో అబ్బాయికి, అతని కుటుంబంవారికి అర్థం చేయించి వారిరువురి చేతులు కలిపి ప్రజా సమక్షంలో వివాహం జరిపించారు. కష్టనష్టాలు ఏమి వచ్చినా ఒకరినొకరు అర్థంచేసుకొని కుల పెద్దల వత్తిడిని తట్టుకొని జీవించాలని సంగం - దళం తమ మద్దత్తును తెలిపాయి.

## ప్రాణ భయంతో గుండె ఆగి చచ్చిన హంతకుడు సేఠ్ భౌరూ

నారాయణపూర్ నివాసి భౌరూ ఒక బడా వ్యాపారి. మాడ్ ఏరియాలోని ఆటుం (సంత)లలో ఆదివాసుల అమాయకత్వాన్ని ఆసరాచేసుకొని అవకతవకలతో మోసంచేసి తెగబలిసాడు. ఈ నేరాలకుగాను వీడిని ఒకసారి గెరిల్లా దళం శిక్షించడం జరిగింది. అప్పటి నుండీ కక్షగట్టి దళ సమాచారం తెలియగానే పోలీసులకు చేరవేస్తుండేవాడు.

వీడు ప్రజావ్యతిరేక, దోపిడీదారుడేగాక కామాంధుడు కూడా. అంగన్‌వాడిగా పనిచేస్తుండిన పుష్ప దేవాంగన్‌ను పెళ్లిచేసుకుంటానని తీసుకువెళ్లి కొన్నేళ్ల తర్వాత విడిచిపెట్టాడు. నన్ను మోసం చేశావు. పెళ్లిచేసుకోమని అడిగిన ఆమెతో 'గల్లీకి ఓ భార్య వుంది. ఎవరినని తెచ్చుకోవాల'ని పురుష మదాంధకారంతో జవాబిచ్చాడు. అంతేగాక ఆమె వుంటే తనకు ఎప్పటికైనా ప్రమాదమని భావించాడు. టీచర్ ఉద్యోగం చేసుకుంటూ బ్రతికే ఆమెను నారాయణపూర్ గూండాలు తోడురాగా రాత్రికి రాత్రి పట్టుకొనిపోయి రాళ్లతో కొట్టి చంపాడు. శరీర అవయవాలను ముక్కలుగా కోసి తన కసిని వెళ్లగక్కాడు. ఇదంతా బయటకు పొక్కేసరికి పోలీసులకు లక్షరూపాయలు లంచం ఇచ్చి బయటపడ్డాడు.

ఇలాంటి ప్రజావ్యతిరేకి, పోలీసు ఇన్ఫార్మరూ, కామలోలుడికి 'ప్రజాయుద్ధం' చేతిలో చావు తప్పదని 8 మార్చి మహిళా దివస్ సందర్భంగా డిఎకెఎంఎస్, కెఎఎంఎస్‌లు పోస్టర్లు వేసి ప్రచారం సాగించారు. ఈ వార్త విన్న భౌరు గుండె ఆగి చచ్చాడు.

## పోలీస్ ఇన్ఫార్మర్, ప్రజావ్యతిరేకి పటేల్ సైను సుక్కుకి దేహశుద్ధి

గడ్‌చిరోలి డివిజన్ నందలి బారసావాడ గ్రామం చాముర్షి దళ ఏరియా ముల్‌చేరా పోలీస్ స్టేషన్ పరిధిలోనిది. ఈ గ్రామ పటేల్ సైను సుక్కు ఎరమె పోలీస్ ఇన్ఫార్మర్‌గా పనిచేస్తున్నాడు. వీడు తునికాకు కూలీల నుండి పార్టీపేరుతో డబ్బులు వసూలు చేయడం ప్రారంభించినప్పటినుండీ ఇన్ఫార్మర్‌గా మారాడు.

1998లో గెరిల్లా దళం ఆ గ్రామం వెళ్లినప్పుడు దళసభ్యులు యిద్దరు తిండి ఏర్పాట్లు చెప్పడానికి ఊర్లోకి వెళ్లారు. అప్పుడు పటేలు సైను సుక్కు, మాజీ సంగసభ్యుడు ఒకడు కలిసి కమాండర్ వద్దకు వచ్చారు. కమాండర్ వారికి తిండి ఏర్పాట్లు చూడమనీ, అలాగే గ్రామస్థులందర్నీ పిలుచుకొని రమ్మనీ చెప్పి పంపాడు.

వారు వెళ్లి 3 గంటలు అయినా ఏమీ జాడలేదు. గతంలో కూడా ఒకసారి పోలీసులకు దళం సమాచారం ఆ గ్రామం నుండే పోయిన నేపథ్యంలో దళం డేరా మార్చాలని నిర్ణయించుకొంది. 300 గజాల దూరంలో మారి డేరా వేసింది. సరిగ్గా దళం మకాం వేసిన చోటుకి 100 గజాల దూరం వరకు పోలీసులు వచ్చారు. తీసుకువచ్చింది పటేల్ సుక్కునే. అయితే డేరా మారడంతో ప్రమాదం తప్పింది. సురక్షితంగా దళం తప్పుకోగలిగింది. దీని తర్వాత సైను సుక్కు ఎరమె చుట్టు పట్ల గ్రామాల్లో యిలా ప్రచారం చేయసాగాడు. 'మాగ్రామానికి దళం సమాచారం తెలిసి పోలీసులు వచ్చారు. అలా వచ్చిన పోలీసులకు మా ఊరికి దాదలు రాలేదని చెప్పాను'

తర్వాత దళం ఆ గ్రామానికి వెళ్లి వాడిని పట్టుకుంది. ఊర్లోని పెద్దలు, పిల్లలు అందరితో ప్రజాపంచాయితీ నిర్వహించింది. అప్పుడు కూడా సైను సుక్కు తాను ఇన్ఫార్మర్‌ను కాదని బుకాయించాడు. దేహశుద్ధి చేయడంతో తన తప్పులు ఒప్పుకున్నాడు. గ్రామస్థులు వాడికి ఒకసారి సరిదిద్దుకునే అవకాశం కల్పించాలని భావించడంతో కొన్ని షరతులపై హెచ్చరించి వదిలారు. షరతులు: 1. ఊరు విడిచి ఎప్పుడూ పోకూడదు. 2. పోలీస్ పటేల్ నౌకరిని విడిచిపెట్టాలి. 3. వ్యవసాయం పనులు చేసుకుంటూ గ్రామంలోనే వుండాలి, తిరిగి ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తే చంపుతాము.

## ఇన్‌ఫార్మర్ల ఖతం

కోహకమెట్ట గ్రామస్థుడు ఐతు, అరాచకత్వంతో వీడు గ్రామంలో అందరితో గొడవపడేవాడు. వ్యతిరేకుల్ని తుపాకితో చంపుతానని బెదిరించేవాడు. అలా ప్రజావ్యతిరేకియై గ్రామంలో నిలిచాడు. వీడిని గత కొద్ది నెలల క్రితం ఇన్‌ఫార్మర్‌గా మార్చుకున్న పోలీసులు వీడికి ఆయుధ శిక్షణనిచ్చి ఎవరినైనా ముఖ్యుడిని చంపి రావాలనే ఒప్పందంతో గ్రామంలో వుంచారు. గెరిల్లా దళంకు ఈ సమాచారం తెలియగానే మార్చి నెలలో నిఘా వేసి పట్టుకొని గ్రామస్థుల సమక్యంలో విచారించి మరణశిక్ష విధించింది.

బాలెవాడ గ్రామంలో పరాల్‌కోట దళంపై పోలీసుల దాడికి కారకుడైన ఇన్ఫార్మర్ కొమ్మి ఫిబ్రవరిలో గ్రామరక్షక దళం చేతికి

*(తరువాయి 24వ పేజీలో..)*

# సియాటిల్ మినిస్టీరియల్ సమావేశ వైఫల్యం:

## ప్రపంచ ప్రజల సామ్రాజ్యవ్యతిరేక పోరాటంలో మరో ముందడుగు!

అమెరికాలోని సియాటిల్ నగరంలో 1999నవంబర్ 30 నుండి డిసెంబర్ 3 దాకా జరిగిన డబ్ల్యుటివో(విశ్వవాణిజ్య సంఘటన) మూడవ మినిస్టీరియల్ సమావేశం (సభ్యదేశాల వాణిజ్యమంత్రుల సమావేశం) అపూర్వ ప్రజానిరసన పోరాటాల ధాటికి భగ్నమైంది. ఈ సమావేశం ద్వారా తన ఎజెండాను (తన బహుళజాతి సంస్థల ప్రయోజనాలను) సాధించు కోవాలని అమెరికా సామ్రాజ్యవాదం పడ్డ తంటాలన్నీ వమ్ము అయ్యాయి. ప్రపంచం నాలుగు చెరుగుల నుండి సియాటిల్ నగరానికి చేరుకున్న వివిధ ప్రజాబృందాలకు చెందిన 50,000 మందికి మించిన ప్రదర్శనకారులు ఆ నాలుగు రోజులపాటు సియాటిల్ నగరాన్ని దిగ్బంధనం చేసి. సమరశీల వీధిపోరాటాలు నడిపి అమెరికా సామ్రాజ్యవాద నేతృత్వంలోని సామ్రాజ్యవాద రాజ్యాల కుట్రలను అడుగడుగునా అడ్డుకుంటూ, అమెరికా సామ్రాజ్యవాద నడిగడ్డ మీదనే, సామ్రాజ్యవాదులకు పెద్ద చెంపపెట్టు పెట్టారు.

ప్రపంచ ప్రజల నిరసనల తాకిడికి కుప్పకూలి భగ్నమైన ఈ సమావేశం సామ్రాజ్యవాదుల నడుమ, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులకు, ఐరోపా యూనియన్‌కు చెందిన సామ్రాజ్యవాదులకు (జర్మని, ఫ్రాన్స్, బ్రిటన్ వగైరా)నడుమ వైరుధ్యాలు నానాటికీ మరింత తీవ్రతరమవుతున్నాయనే వాస్తవాన్ని మరోసారి వెల్లడి చేసింది. కుట్రలు, కుహకాల ద్వారా, దౌర్జన్యపూరిత పద్ధతుల ద్వారా తమ స్వార్థ ప్రయోజనాలను సాధించుకోజూసిన సామ్రాజ్యవాదుల (ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు) యత్నాలకు ఆ సమావేశంలోపలే ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరిబియన్ ప్రాంతాల దేశాల నుండి బహిరంగంగానే ప్రతిఘటన వ్యక్తమవడం ఈ సమావేశానికి సంబంధించి ప్రత్యేకించి చెప్పుకోదగ్గ మరో అంశం. అంతేకాదు, ఈ సమావేశం భారత పాలకవర్గాల సామ్రాజ్యవాద సేవక బానిస ప్రవృత్తిని ప్రపంచ ప్రజల ముందర మరోసారి నగ్నంగా వెల్లడి చేసింది. కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి మురసోలి మారన్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం (యిందులో భాజపా నాయకత్వంలోని జాతీయ ప్రజాస్వామిక కూటమి, కాంగి, చివరికి ప్రతిపక్షాలుగా చెలామణి అవుతున్న రివిజనిస్టు పార్టీల ప్రతినిధులు కూడా వున్నారు) అడుగడుగునా అమెరికా సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తుతూ మిగిలిన మూడవ ప్రపంచ దేశాల నుండి తన్ను తాను వేరు చేసుకుంటూ, సామ్రాజ్యవాదానికి నిఖార్సైన నమ్మిన బంటునని రుజువు చేసుకుంది.

---

*(23వ పేజీ తరువాయి)*

చిక్కాడు. వీడు తాగుబోతు, లంపెన్ కూడా. ఏ ఒక్క గ్రామంలో వుండకుండా తిరుగుతూ పోలీసు సంబంధాల్లోకి పోయి ఇన్ఫార్మర్‌గా మారాడు. పోలీసులను రహస్యంగా అడవిదారుల్లో తిప్పుతూ దళాల ఉనికికి ప్రమాదంగా మారాడు. వీడిని ప్రజాసమక్షంలో స్థానిక గెరిల్లా దళం శిక్షించి పీడ వదిలించుకుంది.

### మత్తుమందు గంజాయి నిరోధానికి పోరాటం

హిందూ మతసంస్థకు చెందిన బాబా బీహారీదాస్ అలాంటి వారు మరికొందరు మాడ్ డివిజన్ ఏరియాలో గంజాయిని మొదట ప్రవేశపెట్టారు. అది పెరిగి పెరిగి రైతులు వ్యాపారం కోసం దాన్ని పండించే దుస్థితి నెలకొంది. ఇది ప్రజలకు ముఖ్యంగా అమాయకులైన పేద ఆదివాసీలకు ఎలాంటి హానికరమో తెలిసియున్న మన పార్టీ దాన్ని ఈ ఏరియాలో లేకుండా బంద్ చేయించాలని నిర్ణయం తీసుకోవడమేగాక విస్తృత ప్రచారం చేయసాగింది. గత 2, 3 ఏళ్లుగా అది పండించుతున్న వారిని, వ్యాపారం చేస్తున్నవారిని ప్రజాపంచాయితీల్లో హెచ్చరించి శిక్షించడం జరుగుతోంది.

ఈ క్రమంలోనే కుస్తూరిమెట్ట గ్రామస్థుడు సీతారాంను, హాక్‌పాడ్ గ్రామస్థుడు రామ్‌లాల్‌లను గ్రామ డిఎకెఎంఎస్ నాయకత్వంలో ప్రజలందరి ముందే విచారించడం జరిగింది. తమ తప్పుని ఒప్పుకొని ఇక ఆ వ్యాపారం చేయనని అంగీకరించడంతో తీవ్రంగా హెచ్చరించి వదిలారు.

అలాగే కాన్నార్, ముహందీ గ్రామాల్లో డిఎకెఎంఎస్, కెఎఎంఎస్‌ల నాయకత్వంలో గంజాయి మొక్కల్ని పట్టుకొని పీకి వేయడం జరిగింది.

### మంత్రాల పేరుతో ప్రజల్ని భయపెడుతూ పెత్తందారీగా వున్న మన్హేరూ కుటుంబం గ్రామ బహిష్కరణ

కోహ్‌కమెట్ట ఏరియా సోన్‌పూర్ రేంజిలోనిది కుర్సునార్ గ్రామం. ఆ గ్రామ నివాసి మన్హేరు గ్రామంలో పెత్తందారుడిగా వ్యవహరిస్తూ, మంత్రాల పేరుతో జనాల్ని భయపెట్టేవాడు. వీడు దేవర్లకు నరబలి ఇచ్చే ప్రయత్నాలు చేయడంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. దీనితో ఒకసారి ప్రజాసమక్షంలోనే దళం హెచ్చరించినప్పటికీ వీడు మారలేదు.

అయితే ఆ క్రమంలో పోలీసు సంబంధాల్లోకి పోయి వారి అండదండలతో దళం ఆ గ్రామానికి వెళ్లినప్పుడల్లా రహస్యంగా సమాచారం అందిస్తూవచ్చాడు. వీడిపై నిఘా వుంచిన గ్రామస్థులు వీడు ఇన్ఫార్మర్‌గా మారిన సంగతి గెరిల్లా దళంకు సమాచారం చేరవేశారు.

ఫలితంగా దళం ఆ గ్రామంలో200 మందితో సమావేశం జరిపింది. దాని పారలలోని జనాలకు కూడా కబురుచేసి పిలిపించి మన్హేరు కుటుంబం గురించి చర్చించింది. వారందరి ఆమోదంతో వాడి కుటుంబాన్ని వెళ్లగొట్టాలనే నిర్ణయానికి గెరిల్లా దళంకూడా రావడంతో వెంటనే అమలు చేశారు. అలాంటి ప్రజాద్రోహుల ఆస్తులను స్వాధీన పరుచుకోవడం విప్లవోద్యమ కర్తవ్యం అని గ్రామస్థులకు అర్థం చేయించడంతో వారంతా సమైక్యంగా కదిలి వాడి యింటిని దగ్ధం చేశారు. యింట్లో వున్న ఆస్తి 20 క్వింటాళ్ల ధాన్యం, 9 బర్రెలు, 20 గొడ్లు, 8 మేకలు యితరత్రా సామాను అంతా స్వాధీన పంచుకొని ప్రజలంతా పంచుకున్నారు. ❖

ఈ సమావేశం వైఫల్యం అమెరికా సామ్రాజ్యవాదానికి పెద్ద చెప్పుదెబ్బ. అమెరికా ఈ సమావేశాన్ని తన అభీష్టాలకనుగుణంగా విజయవంతంగా నిర్వహించడానికై అంతకు ముందు సంవత్సర కాలంగా ముమ్మరంగా సన్నాహాలు చేస్తూ వచ్చింది. అమెరికా బహుళజాతి కంపెనీలకు అతి బలమైన పీఠాలలో ఒకటైన సియాటిల్ నగరాన్ని - ప్రపంచంలోని రెండు అతి పెద్ద అమెరికా బహుళజాతి సంస్థలు, బోయింగ్, మైక్రోసాఫ్ట్ కంపెనీల కేంద్ర కార్యాలయాలుఈ నగరంలో వున్నాయి - ఈ సమావేశ నిర్వహణకై ప్రత్యేకించి ఎంపిక చేసింది. అమెరికా అధ్యక్షుడు క్లింటన్ నాలుగు రోజులపాటు జరుగనున్న సమావేశంలో మూడు రోడుల పాటు స్వయంగా పాల్గొని తద్వారా దాని ప్రతిష్టను ఇనుమడింప జేయదల్చాడు. స్వయంగా విచ్చేసి పాల్గొనవలసిందిగా కోరుతూ అన్ని బడా దేశాల రాజ్యాధి నేతలకు ఆహ్వానాలు కూడా పంపడం జరిగింది. (అయితే ఈ ఆహ్వానాన్ని మన్నించి ఏ దేశాధినేత హాజరవ్వలేదన్నది వేరే విషయం) ఇలా అమెరికా ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి, దాన్ని విజయవంతంగా ముగించడానికి కుక్కపాట్లు పడినప్పటికీ, ప్రజా నిరసనకారుల పోరాటాల ధాటికి అది ఘోర పరాజయాన్ని చవిచూసింది.

అమెరికా సామ్రాజ్యవాదులు, వారి బహుళజాతి సంస్థలు ఈ సమావేశంలో ప్రదర్శించిన అహంకారం, బలోన్మత్త పటాటోపాలు సమావేశం వెలుపల జరిగిన సమరశీల ప్రజాప్రదర్శనల తాకిడికి గాలిబుడగల్లా పేలిపోయాయి. అగ్రరాజ్య దురహంకార మదంతో ప్రతినిధులందరి మెడలు వంచి తన ఎజండాను సాధించుకోవాలని అమెరికా చేసిన ప్రయత్నాలకు సమావేశంలోపలే పలు మూడవ ప్రపంచ దేశాల నుండి అడుగడుగునా ప్రతిఘటన ఎదురవు తుండడంతో, ఆ ప్రయత్నాలు వమ్ము అయాయి.

అమెరికా బహుళజాతి సంస్థలకు అనధికార పీఠంగా పరిగణించదగ్గ సియాటిల్ నగరం, ఆ నాలుగు రోజుల పాటు బహుళజాతి సంస్థల విచ్చలవిడి దోపిడికి వ్యతిరేక పోరాట కేంద్రంగా పరివర్తన చెందింది. డబ్ల్యూటిఒ బహుళజాతి సంస్థల చేతుల్లో కీలు బొమ్మే తప్ప, వాటి స్వార్ధపూరిత ప్రయోజనాలను పరిరక్షణకు అంతర్జాతీయ ముసుగులో ఏర్పరచపడిన మరో సంస్థే తప్ప మరేమీ కాదని ఈ సమావేశాన్ని సమరశీల పోరాటాలతో భగ్నం చేసిన పోరాటకారులు యావత్ప్రపంచానికి నిరూపించారు. 'రక్తపిపాశ బడా వ్యాపారులు, నేరస్త బహుళజాతి సంస్థలు', 'సామ్రాజ్యవాద దోపిడీదారుల', ప్రయోజనాల పరిరక్షకులైన డబ్ల్యుటిఒ నశించాలి. అనే నినాదాలు నాలుగు రోజుల పాటు సియాటిన్ నగరంలో వీధి వీధిన ఒక్క క్షణమైనా విరామం లేకుండా ప్రతిధ్వనించాయి. 'రాజు వెడలే రవితేజము లలరగా' అన్న చందంగా ప్రపంచ రారాజులా సమావేశానికి తరలి వెళ్లి తన అధికార దర్పాన్ని ప్రదర్శించాలని క్లింటన్ కన్న కలలు, ప్రజా నిరసనకారుల నిరసన పోరాటాల నడుమ కల్లలుకాగా, తన స్వదేశంలోనే తన రాజధాని సివారుల్లో వుండే సియాటిల్ నగరంలోకి చిల్లర దొంగలా చాటుమాటున ప్రవేశించాల్సిన దుర్గతి వాడికి పట్టింది. 'ప్రపంచంలో అత్యంత శక్తి శాలియైన వ్యక్తి'గా మన పాలకులు వారి బాకా పత్రికలు అభివర్ణించే అమెరికా అధ్యక్షుడికి, అతడి స్వదేశంలోనే పట్టిన గతి యిది.

మరో రౌండ్ (విడత) సంప్రదింపుల కోసం ఎజండాను నిర్ణయించడం అన్నదే ఈ సమావేశ లక్ష్యం. అయితే ఈ సమావేశం ఒక్కటంటే ఒక్క అంశం పైన అయినా ఏకాభిప్రాయాన్ని సాధించడంలో విఫలమైంది. సమావేశం ముగిసేనాటికి ఎజండాపై ఏ అంగీకారం కుదరలేదు. సరికదా వైషమ్యపూరిత వాగ్వివాదాలు, తీవ్ర నిరసనల మధ్య పూర్తి వైఫల్యంతో ముగిసింది.

## వివాదాలు

ఈ సమావేశంలో రెండు రకాల తీవ్ర వివాదాలు బయటకు వచ్చాయి. సామ్రాజ్యవాదుల నడుమ వివాదాలు మొదటి కోవలోవి కాగా, సామ్రాజ్యవాదులకు, వెనుకబడిన దేశాలకు నడుమ వివాదాలు రెండవ కోవకు చెందుతాయి.

సామ్రాజ్యవాదుల నడుమ వివాదాల్లో వ్యవసాయ రంగానికి యిచ్చే సబ్సిడీల (సామ్రాజ్యవాద దేశాలు తమ తమ వ్యవసాయ రంగాలకు ఇస్తున్న సబ్సిడీల) సమస్య పెను ఘర్షణలకు దారి తీస్తోంది. యితర దేశాలు వ్యవసాయ వస్తువులపై దిగుమతి సుంకాలను తగ్గించాలనీ, పూర్తిగా రద్దు చేయాలనీ, ఎగుమతులకు సబ్సీడీలనిచ్చే విధానాలకూ, వ్యవసాయ రంగానికి సాయపడే కార్యక్రమాలకూ చరమగీతం పాడడానికై సంప్రదింపులను మొదలు పెట్టాలని అమెరికా పట్టుబడుతోంది. కాగా, ఐరోపా యూనియన్‌కు చెందిన దేశాలు, జపాను ఈ ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అమెరికా అగ్రిబిజినెస్ (వ్యవసాయోత్పత్తుల వ్యాపారం) ఎగుమతులపైనే అధికాధికంగా ఆధారపడి వుంది. అందుకని ఈ వ్యాపారం నిర్వహిస్తోన్న అమెరికా బహుళజాతి సంస్థలకు పై అంశాలు తక్షణ ప్రాముఖ్యతగల అంశాలు. అవి ఈ అంశాలను సాధించడం ద్వారా ప్రపంచ ఆహార మార్కెట్ మొత్తంపై గుత్తాధిపత్యం చెలాయించాలని చూస్తున్నాయి. అయితే ఈ ప్రతిపాదనలకు ఐరోపా సముదాయ దేశాలు. జపాను సుతరామూ అంగీకరించడం లేదు. ఈ ప్రతిపాదనలను అంగీకరిస్తే వాటి స్వంత బహుళజాతి సంస్థలూ. వ్యవసాయరంగాలు పూర్తిగా దెబ్బతింటాయి. (ఐరోపా యూనియన్ దేశాలు వ్యవసాయ రంగానికి 42% సబ్సిడిని అందిస్తుండగా జపాను 69% అందిస్తోంది. కాగా అమెరికా 16% సబ్సిడిని అందిస్తోంది)

విదేశీ పెట్టుబడులు అనే అంశం అమెరికాకు ఐరోపా సముదాయ దేశాలకు నడుమ చిచ్చును రేపుతున్న మరో సమస్య. విదేశీ పెట్టుబడులపై కనీస నియమనిబంధనలను డబ్ల్యూటిఒ రూపొందించాలని ఐరోపా యూనియన్, జపాను పట్టుబడుతుండగా, అమెరికా అందుకు ససేమిరా ఒప్పుకోవడం లేదు.

ఇక మూడవ ప్రపంచ దేశాలు లేవనెత్తుతున్న అంశాల ద్వారా ఉత్పన్నమైన వివాదాలు 'గాట్' ఉరుగ్వే రౌండు నియమాలలో నిబిడీకృతమై వున్న సామ్రాజ్యవాద పక్షపాత అంశాలకు సంబంధించినవి. ఉదాహరణకు అమెరికా, ఐరోపా సముదాయ దేశాలూ ఒక వంక, మూడవ ప్రపంచ దేశాలు పారిశ్రామిక వస్తువులపై దిగుమతి సుంకాలను భారీగా తగ్గించాలని పట్టుబడుతున్నాయి. మరోవంక డంపింగ్ వ్యతిరేక సుంకాలు పర్యావరణ సంరక్షణా నిబంధనలు వగైరాల ద్వారా తాము అమలు చేస్తున్న తమ స్వంత మార్కెట్ల పరిరక్షణా విధానాలను తిరిగి పరిశీలించడానికి మొండిగా తిరస్కరిస్తున్నాయి. వాస్తవానికి, ఈ రూపాల్లో అవి అమలు చేస్తున్న చర్యల్లో అత్యధికమైనవి డబ్ల్యుటిఒ నిబంధనలకు

పూర్తిగా వ్యతిరేకమైనవే. ఇలా అవి ఒక వంక తమ స్వంత మార్కెట్ల పరిరక్షణకై తామే రూపొందించిన డబ్ల్యుటిఓ నిబంధనలను యదేచ్ఛగా ఉల్లంఘిస్తూనే, మరోవంక మూడవ ప్రపంచ దేశాలు ఆ నిబంధనలనన్నింటినీ తుచ తప్పకుండా పాటించాలని అతి త్వరితంగా అమలులోకి తేవాలని పట్టుబడుతున్నాయి. అలా చేయకపోతే ఆంక్షలు విధిస్తామని, వెలివేస్తామని బెదిరిస్తున్నాయి.

1995లో ఉరుగ్వే రౌండ్ సంప్రదింపులలో అంగీకారం కుదిరిన మేరకు వాటి వాణిజ్య రంగ ఉదారీకరణా విధానాలను అతి త్వరితంగా మూడవ ప్రపంచ దేశాలచే అమలు చేయించాలనే ఉద్దేశ్యంతో సామ్రాజ్యవాదులు చేపట్టిన దౌర్జన్యపూరిత యత్నాల కారణంగానే ఈ వివాదాల్లో అత్యధికమైనవి తలెత్తాయి.

## పూర్వరంగం

గాట్ (వాణిజ్యం, సుంకాలపై సార్వత్రిక ఒప్పందం) యొక్క సంస్థాగత రూపమే డబ్ల్యుటిఓ. గాట్ కూడా. ప్రపంచ సామ్రాజ్యవాద పనిముట్లైన ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్‌లతోపాటు 1944లో జరిగిన బ్రెట్టన్ ఉడ్స్ సమావేశంలో రూపుదిద్దుకొన్నది. 1944లో జరిగిన ఆ సమావేశంనాటి నుండి ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు శాశ్వత సంస్థలుగా ఆవిర్భవించగా 'గాట్' 1995లో డబ్ల్యుటిఓ పేరిట సంస్థాగత రూపం తీసుకునేదాకా, సభ్యదేశాలు అడపదడపా సమావేశమయి, ఒప్పందాలు కుదుర్చుకునే వేదికలా పనిచేసింది. ఈ సమావేశాలనే రౌండ్లు అంటారు. 1947లో తొలి సమావేశం జరిగింది. అటు తర్వాత మూడు రౌండ్ల సమావేశాలు (కెన్నడి రౌండ్, టోక్యో రౌండ్, ఉరుగ్వే రౌండ్) సమావేశాలు జరిగాయి. ఉరుగ్వే రౌండ్ ఒప్పందాన్నే మనం సాధారణంగా గాట్ ఒప్పందంగా ప్రస్తుతిస్తున్నాం. స్వేచ్ఛా వాణిజ్యం పేరిట, ఎగుమతి దిగుమతి సుంకాలు, తదితర వాణిజ్య అవరోధాలను బద్దలు కొట్టడం ద్వారా ప్రపంచ వాణిజ్యంపై సామ్రాజ్యవాద బడా దేశాల పెత్తనాన్ని ఖాయం చేయడమే ఈ గాట్ ధ్యేయం. ప్రముఖ సామ్రాజ్యవాద దేశాలు (అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మని, జపాన్ వగైరాలు) ప్రత్యేక సమావేశాలు జరుపుకుని తమలో తమకు కుదిరిన ఒప్పందాలను 'గాట్' నిర్ణయాల క్రింద (ఇప్పుడు డబ్ల్యుటిఓ నిర్ణయాల క్రింద) యితర దేశాలపై రుద్దుతున్నాయి.

డబ్ల్యుటిఓ నియమ నిబంధనలను, దాని సభ్యదేశాల ప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయ సాధన ద్వారా రూపొందించడం జరుగుతోందని ప్రచారం చేస్తున్నప్పటికీ, వాటి అసలు కర్తలు సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలే. 'గాట్ ఒప్పందంలోని ప్రతి ఒక్క నియమం, ప్రతి ఒక్క నిబంధన ఏదో ఒక బహుళజాతి కార్పోరేట్ సంస్థల కూటమిచే తయారు చేయబడింది. ఉదాహరణకు 1993లో కుదర్చబడిన ఉరుగ్వే రౌండ్ ఒప్పందం కోసం సంప్రదింపుల ప్రక్రియ 1986 లో మొదలైంది. అంతకు మునుపే 1200కి మించిన అమెరికా బహుళజాతి సంస్థలు బహుముఖ సంప్రదింపుల ఐక్యసంఘటన అనే సంస్థను నెలకొల్పి, దాని ఆధ్వర్యంలో ప్రభుత్వం ద్వారా తమ ప్రతిపాదనలను ప్రవేశ పెట్టించాయి. యూరోపుకు చెందిన బహుళజాతి సంస్థలు పై సంస్థకు అండదండలనందించాయి. మాన్‌సాన్‌టో, డూపాంట్ వగైరా 13 అమెరికా బడా కార్పొరేషన్ల ఐక్య వేదిక అయిన మేధోపర ఆస్థిహక్కుల కమిటీ డిమాండ్ మేరకే ఉరుగ్వే రౌండులో మేధోపర ఆస్థిహక్కులు అనే అంశం చేర్చబడింది. 1997లో డబ్ల్యుటిఓ ఆధ్వర్యంలో కుదర్చబడిన మూడు అంతర్జాతీయ ఒప్పందాల - సాంకేతిక పరిజ్ఞాన రంగ వస్తువులపై ఒప్పందం, టెలికమ్యూనికేషన్ రంగంపై ఒప్పందం, ద్రవ్యరంగ ఉదారీకరణా ఒప్పందం-ను సాధించడంలో బహుళ జాతి వాణిజ్య సంస్థలు కీలక పాత్ర వహించాయి.

ఇలా కుదర్చబడిన ఒప్పందాల ద్వారా, సామ్రాజ్యవాద రాజ్యాల అండదండలతో బహుళజాతి సంస్థల వస్తువులూ సేవా రంగం ప్రత్యేకించి ద్రవ్య పెట్టుబడి దేశాల ఎల్లలు చెరిపివేసి అపూర్వ స్థాయిలో విస్తరించగల్గాయి. సాంకేతిక పరిజ్ఞాన రంగంలో వచ్చిన పెనుమార్పులు [ఇంటర్నెట్, 'ఇ' కామర్స్ (ఎలక్ట్రానిక్ వాణిజ్యం) వగైరాలు] కారణంగానే ఈ విస్తరణ జరిగిందనీ, ఈ మార్పులే దేశాల ఎల్లలను చెరిపేశాయనీ తెగ ప్రచారం చేస్తున్నారు. కానీ, వాస్తవానికి ఈ విస్తరణ మూడవ ప్రపంచ దేశాలపై రుద్దబడిన, 'నియంత్రణల సడలింపు' 'ప్రైవేటీకరణ' 'ప్రభుత్వ ఖర్చుల తగ్గింపు' 'వడ్డీ రేట్ల తగ్గింపు' వంటి విధానాల ఫలితమే.

'గాట్' ఒప్పందం వల్ల ప్రపంచ వాణిజ్యం ఇతోధికంగా వృద్ధిచెందిందన్నది వాస్తవమే. అయితే, ఈ వృద్ధి అంతా బహుళజాతి గుత్త సంస్థల ప్రయోజనాలకు లబ్ధి కలిగించే దిశలోనే సాగిందనే వాస్తవాన్ని వేరే ఎవరోకాదు స్వయంగా ఐరాస ప్రకటించిన నివేదికలే వెల్లడి చేస్తున్నాయి. విశ్వవాణిజ్యం పెరిగితే, ప్రపంచ ప్రజల తలసరి ఆదాయం పెరగగలదని నమ్మబలికారు. అయితే వాస్తవమేమిటంటే ప్రజల తలసరి ఆదాయపు పెరుగుదలను మించి ఐదురెట్లు వేగంగా ప్రపంచ వాణిజ్యం (అంటే బహుళజాతి సంస్థల వాణిజ్యం) వృద్ధి చెందింది.

మరక్కాష్ ఒప్పందంపై సంతకాలు చేయడంలో పూర్తిగా సాగిలపడిన మూడవ ప్రపంచ పాలక వర్గాలకు, ఆ ఒప్పందం ద్వారా తమ దేశ ప్రజల ప్రయోజనాలకు పెద్దలబ్ధి చేకూర్చి పెట్టామని ప్రచారం చేసుకోవడానికై ఆ ఒప్పందంలో సామ్రాజ్యవాద రాజ్యాలు కొన్ని ముష్టి మెతుకుల్ని విదిలిస్తామని అంగీకరించాయేకానీ, ఈనాటి వరకు కనీసం వాటినైనా కూడా అమలు చేయలేదు. ఉదాహరణకు, వస్త్రాలమీది ఒప్పందం ప్రకారం సామ్రాజ్యవాద దేశాలు, మూడవ ప్రపంచ దేశాల నుండి వచ్చే వస్త్రాల దిగుమతులపై తాము అమలు చేస్తూ వుండిన ఆంక్షలలో మూడింట ఒక వంతు వాటిని యిప్పటికే రద్దు చేయవలసి వుండగా, ఈనాటికీ అవి కేవలం 5% ఆంక్షలనే సడలించాయి. సామ్రాజ్యవాద దేశాలు తమ వ్యవసాయరంగాలకు ఏటా 335 బిలియన్ల డాలర్ల అపారమొత్తాల్ని సబ్సిడీకింద అందిస్తున్నాయి. (అమెరికాలోని ప్రతి బడారైతు యేడాదికి 25,000 డాలర్ల సబ్సిడీ పొందుతున్నాడు) మరోవంక అవి మూడవ ప్రపంచ దేశాలు, ఆహార రంగానికిగాని, వైద్య రంగం వంటి ప్రజాసంక్షేమ రంగాలకుగాని నయాపైస సబ్సిడీని కూడా ఇవ్వకూడదని పట్టుబడుతున్నాయి. 'గాట్' ఒప్పందంలో తమకు నామమాత్రపు అసౌకర్యాన్ని కలిగించే నిబంధనలను సైతం అమలు చేయడానికి నిరాకరిస్తూ, తమ స్వంత మార్కెట్ల పరిరక్షణా విధానాలను కొనసాగిస్తున్నాయి. తద్వారా మూడవ ప్రపంచ దేశాలు ఏటా 700 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని నష్టపోతున్నాయి. వాణిజ్య షరతులు నానాటికి పేద దేశాలను మరింత కొల్ల గొట్టేవిగా తయారవుతున్నాయి. 30 యేళ్ల క్రితం ప్రపంచంలోని ఐదు అతి సంపన్న దేశాలకు ఐదు అతి పేద దేశాలకు మధ్య గల వ్యత్యాసం

నిష్పత్తి 30:1గా వుండగా ఈ మూడు దశాబ్దాలలో అది 65:1కి చేరింది. సంపన్న దేశాలకు చెందిన కేవలం 355అపర కుబేరులకు ప్రపంచ జనాభాలో సగం మంది మొత్తం ఆస్తికి మించిన సంపద లున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన జీవించేవారి సంఖ్య 1987 కంటే యిప్పటికి 20 కోట్లు అధికమైంది. ప్రపంచంలోని మొత్తం 190 దేశాలలో , కేవలం 33 దేశాలు మాత్రమే, 1990 నుండి . యేడాదికి 3 శాతపు నిలకడైన స్థూలజాతీయోత్పత్తిని సాధించ గల్గుతున్నాయి.

ఇలా, మరక్కేష్ ఒప్పందం ద్వారా సాధించిన విజయాన్ని ఆసరా చేసుకుంటూ బహుళజాతి కార్పోరేషన్లు తమతమ రంగాలలో, గుత్తాధిపత్యసాధనకై సంలీనమయ్యే ప్రక్రియను వేగిరం చేశాయి. గత దశాబ్దంలో జరిగిన అతి పెద్ద సంలీనాల ఫలితంగా వేళ్లమీద లెక్కించగల గుత్త బహుళజాతి సంస్థలు తమ తమ రంగాలలోని మార్కెట్లలో దాదాపు సగాన్ని మించిన భాగాన్ని తమ చెప్పుచేతలక్రిందకు తెచ్చుకున్నాయి. తమ గుత్తాధిపత్య హక్కులను యింకా అధికం చేసుకోవడానికై అవి యిప్పుడు మూడవ ప్రపంచ దేశాల పేటెంట్ల వ్యవస్థలో మార్పులను ప్రవేశపెట్టిస్తున్నాయి. పర్యావరణాన్ని రక్షణ పేరిట, కార్మిక ప్రమాణాల ఉద్ధరణ పేరిట తమ మార్కెట్ల పరిరక్షణా విధానాలను కొనసాగింపచూస్తున్నాయి.

డబ్ల్యుటిఓలోని 134 సభ్యదేశాల వాణిజ్య మంత్రులు (ప్రతినిధి బృందాలు) పాల్గొన్న ఈ మూడవ అంతర్జాతీయ సమావేశాన్ని (సియాటిల్ మినిస్టీరియల్ సమావేశం) మరో రౌండు వాణిజ్య రంగ సంప్రదింపులను ఆరంభించే లక్ష్యంతోనే నిర్వహించారు. డబ్ల్యుటిఓ ఏర్పాటుకు ముందు 'గాట్' ఆధ్వర్యంలో రుద్దబడిన ఉరుగ్వే రౌండ్ ఒప్పందం (దీన్నే మరక్కేష్ సమావేశ ఒప్పందం అనికూడా అంటారు) 1995 జనవరి 1 నుండి అమలులోకి వచ్చింది. ఈ ఒడంబడికలోని అన్ని నిబంధనలను అమలులోకి తేవడానికై దానిపై సంతకం చేసిన దేశాలకు 2004, డిసెంబర్ 1 దాకా గడువుంది. అయితే ఉరుగ్వే రౌండు ఒడంబడిక సంతకాలపై సిరా ఆరకముందే సామ్రాజ్యవాదులు ఒక వంక మూడవ ప్రపంచ దేశాలు ఆ ఒడంబడికకు లోబడుతూ తమ ప్రపంచీకరణ విధానాలను గడువుకు ఎంతో ముందుగానే అమలు చేసేలా చూడడానికై వాటిపై సామధాన బేధ దండోపాయాలన్నింటిని ప్రయోగిస్తూనే, మరోప్రక్క సరికొత్త అంశాలను ముందుకు తెచ్చి, మరో కొత్త రౌండు సంప్రదింపుల పేరిట, వాటిపై తమ దోపిడీ ఉచ్చులను మరింతగా బిగించడానికై కొత్త సన్నాహాలు, కుట్రలు ఆరంభించారు. ఈ క్రమంలోనే సియాటిల్ సమావేశంలో పైన పేర్కొన్న వివాదాలు ముందు కొచ్చాయి.

మరక్కేష్ సమావేశంలోనే, వాణిజ్యానికి పర్యావరణానికి మధ్య సంబంధంపై అధ్యయనానికై అటు తర్వాత ఏర్పడబోయే డబ్ల్యుటిఓలో ఒక కమిటీనీ నియమించాలని నిర్ణయం తీసుకోబడింది. యిది వాణిజ్యరంగంపై ఎజండాను విస్తృతపర్చడానికి సామ్రాజ్యవాదులకు ఒక చక్కని సాకును కల్పించింది. దీనికితోడుగా ఉరుగ్వే రౌండు, వ్యవసాయం, సేవా రంగాలలో 2000, జనవరి నుండి సరికొత్త సంప్రదింపులకు పిలుపునిచ్చింది. ఇక ఇదే సందుగా, తరువాతి రౌండు సంప్రదింపుల ఎజండాను ఈ అంశాలకే పరిమితం చేయకుండా, సర్వతోముఖమైన కొత్త ఎజండా దిశగా సంప్రదింపులను తీసుకెళ్లాలనే కుట్రపూరిత ప్రయత్నాలను సామ్రాజ్యవాదులు ఆరంభించారు. ఐరోపా యూనియన్ మాజీ ట్రేడ్ కమిషనరు లియాను బ్రిట్టను, ఎప్పుడో 1996లోనే, వ్యవసాయ సేవారంగాలపై, ఎజండాలో అందరి అంగీకారం పొంది వున్న అంశాలను ఎంతగానో దాటిపోయే మరో కొత్త రౌండు సంప్రదింపుల కోసం ముమ్మర ప్రయత్నాలు ఆరంభించాడు. దీనికి ఆయన మిలీనియమ్ రౌండ్ (సహస్రాబ్ది రౌండ్) అని నామకరణం కూడా చేశాడు.

ఇక ఆపైన, డబ్ల్యుటిఓ జరిపిన కీలక సమావేశాలు ఈ లక్ష్యానికి అనుగుణంగానే ఎజండాను విస్తరింపజేయసాగాయి. మినిస్టీరియల్ సమావేశం (మంత్రుల సమావేశం) అనేది డబ్ల్యుటిఓ అత్యున్నత నిర్ణయాధికార అంగం. ఇది రెండేళ్లకొకసారి సమావేశమవుతుంది. ఈ మినిస్టీరియల్ సమావేశాల ద్వారా, డబ్ల్యుటిఓ అధికార పరిధిని విస్తరింపజేసే ప్రయత్నాలను కూడా సామ్రాజ్యవాదం ముమ్మరం చేసింది. 1996 డిసెంబర్‌లో సింగపూరులో జరిగిన మొదటి మినిస్టీరియల్ సమావేశంలో నాలుగు కొత్త అంశాలను - పెట్టుబడులపై నియమాలు, పోటీ విధానం, ప్రభుత్వ సేకరణ విధానంలో పారదర్శకత, వాణిజ్యానికి బాటను సుగమం చేయడం - అధ్యయనం చేయడానికి వర్కింగు గ్రూపులను ఏర్పాటు చేయడం జరిగింది. 1996 మేలో, జెనీవాలో జరిగిన రెండవ మినిస్టీరియల్ సమావేశం, 'ఇ' కామర్స్‌ను (ఎలక్ట్రానిక్ వాణిజ్యం) ఎజండాలోకి తెచ్చింది. ఈ మధ్యలో, సాంకేతిక పరిజ్ఞాన రంగానికి చెందిన కొన్ని నిర్దిష్ట వస్తువులపై సుంకాలను రద్దు చేసే సాంకేతిక పరిజ్ఞాన ఒప్పందం (ఐ.టి.ఎ-I)పై సంతకాలు జరిగాయి. అంతేకాదు, సింగపూర్ మినిస్టీరియల్ సమావేశం అంతర్జాతీయంగా గుర్తించబడిన కీలక కార్మిక ప్రమాణాలను పాటించాలంటూ, ప్రత్యేకించి పిలుపునిచ్చింది.

ఇలా ఈ క్రమంలో, సర్వసమగ్రమైన మరో కొత్త రౌండు వాణిజ్య సంప్రదింపుల కోసం ప్రాతిపదిక సిద్ధం చేయబడింది. డబ్ల్యుటిఓ సియాటిల్‌లో నిర్వహించిన మూడవ మినిస్టీరియల్ సమావేశాన్ని, ఈ కొత్త రౌండ్‌కు ఎజండాను నిర్ణయించే ఉద్దేశ్యంతో నిర్వహించడం జరిగింది.

## సియాటిల్ సమావేశం

ఈ సమావేశం నేటి అంతర్జాతీయ సంబంధాలలోని నాలుగు ప్రధానాంశాలను ప్రస్ఫుటంగా బయటకు తెచ్చింది.

### అమెరికా దౌర్జన్యపూరిత ధోరణి

దీనికి అమెరికా అధ్యక్షుడైన క్లింటనే స్వయంగా సారధ్యం వహించాడు. ఈ సమావేశ స్థలానికి చేరుకునే ముందు జారిచేసిన ప్రకటనలో అతడు కీలక కార్మిక ప్రమాణాలను పాటించని దేశాలపై ఆంక్షలు విధించాలనే పిలుపునిచ్చాడు. పైగా పుండుమీద కారం చల్లినట్టుగా అతడు, సమావేశం నడుస్తుండగానే 'బాలల శ్రమ యొక్క అతి ఘోర రూపాల' పై నిషేధానికి పిలుపునిచ్చే ఒక అంతర్జాతీయ వొప్పందంపై సంతకం కూడా చేశాడు.

అమెరికా వాణిజ్య ప్రతినిధిగా ఈ సమావేశంలో పాల్గొన్న ఛార్లిన్ బార్షెఫెస్కి, సమావేశపు సహ - అధ్యక్షురాలిగా తన హోదాను, అమెరికా ఎజండాను ఆమోదించే విధంగా యితర దేశాల మెడలు వంచడానికి వినియోగించింది. ఆమె, డబ్ల్యుటిఓ అధినేత మైక్‌మూర్

(న్యూజిలాండ్‌కు చెందినవాడు)తో కలిసి కార్మిక ప్రమాణాలపై అమెరికా ప్రతిపాదనను ధృవీకరించడానికై ఒక కమిటీని ఏకపక్షంగా- యితర సభ్యదేశాల ప్రతినిధులెవ్వరితోనూ సంప్రదించకుండానే వారి ఆమోదం లేకుండానే - నియమించింది, తద్వారా ఈ సమావేశంలో అమెరికా దౌర్జన్యపూరిత ఎత్తుగడల ద్వారానే తన పంతాన్ని నెగ్గించుకోదలచిందన్న వాస్తవాన్ని బయటపెట్టింది. ఈ ప్రతిపాదనను అప్రజాస్వామికంగా ప్రవేశపెట్టబడిన ప్రతిపాదన అంటూ కొన్ని వెనుకబడిన దేశాలు వ్యతిరేకించగా, ప్రజాస్వామిక ప్రక్రియను బుట్టదాఖలు చేసి, తనకు తానుగా ఎంపికచేసే ప్రక్రియను చేపట్టే హక్కు అమెరికాకు వుందంటూ బార్షెఫెస్కి తలపొగరు సమాధానం యిచ్చింది.

అయితే, యిక్కడ స్వయంగా అమెరికా సామ్రాజ్యవాదులే, కార్మికుల జీవన ప్రమాణాలు, పని పరిస్థితులు మెరుగు పరిచే చట్టాలను, బాల కార్మిక వ్యవస్థను రూపుమాపే చట్టాలను ప్రవేశ పెట్టాలని పట్టుబడుతుంటే, ఇంతటి ప్రగతిశీలమైన ప్రతిపాదనను విమర్శించడం, వ్యతిరేకించడం, కార్మికవర్గ పక్షపాతులకు తగునా అని ఎవరికైనా సందేహం కల్గవచ్చు. అయితే, కార్మికులు వెట్టిచాకిరి పద్ధతుల్లో పనిచేయవలసి రావడానికిగానీ, బాల కార్మిక వ్యవస్థ కొనసాగడానికిగానీ మూల కారణం ఏది అన్న ప్రశ్నలోకి వెడితే, అమెరికా కారుస్తోన్న కన్నీరు, ఉత్తి మొసలి కన్నీరేనన్న వాస్తవం ఇట్టే అర్థమవుతుంది. లాభార్జననే పరమావధిగా ఎంచే పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద వ్యవస్థే వాటి ఉనికికి మూలకారణం. అధికలాభాల కోసం ఎక్కడైతే శ్రమశక్తి కారుచౌకగా లభించగలదో అక్కడనే ఉత్పత్తి కేంద్రాలను తెరవడం సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల విధానం. ఉదాహరణకు, ప్రపంచంలో అతి పెద్ద బహుళజాతి సంస్థల్లో ఒకటైన అమెరికాకు చెందిన జనరల్ మోటార్ సంస్థ, అమెరికాలోని తన ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులకు గంటకు 18.96 డాలర్ల వేతనాన్ని చెల్లిస్తుంది. అదే సంస్థ మెక్సికోలోని తన ఫ్యాక్టరీల్లోని కార్మికులకు గంటకు ఎక్కువలో ఎక్కువ 1.54 డాలర్ల వేతనాన్ని మాత్రమే చెల్లిస్తోంది. థాయ్‌లాండ్, తైవాన్, మలేషియా, భారత దేశం వగైరా వెనుకబడిన దేశాల్లో అమెరికా బహుళజాతి సంస్థలు చెల్లిస్తున్న వేతనాలు, అమలు చేస్తున్న కార్మిక ప్రమాణాలు ఏపాటివో అందరికి తెలిసిన విషయాలే. సామ్రాజ్యవాద దేశాల్లో కార్మికులు, ప్రజలు పోరాడి సాధించుకున్న మెరుగైన పని పరిస్థితులు, జీవన ప్రమాణాలు, పర్యావరణ కాలుష్య నివారణా నియంత్రణ చట్టాల మూలంగా లాభాలు తగ్గిపోతున్నాయనే ఆందోళనతో, బహుళజాతి సంస్థలు కారుచౌకగా శ్రమశక్తి దొరికే, పర్యావరణ కాలుష్యాన్ని గురించి పట్టించుకోని మూడవ ప్రపంచ దేశాలకు, వెట్టి చాకిరితో ముడిపడి వుండే తమ కర్మాగారాలను బదిలీ చేస్తున్నాయి. మన దేశంలో భోపాల్‌లో విషవాయు నరమేధానికి కారణమైన యూనియన్ కార్బైడ్ అనే అమెరికన్ బహుళజాతి సంస్థ సరిగ్గా ఈ కారణాల రీత్యానే, తన ఫ్యాక్టరీని యిక్కడికి తరలించింది. ఇక 'ప్రపంచీకరణ' పెనుగాలి ద్వారా, దక్షిణార్థగోళంలోకి వ్యాపిస్తోన్న బహుళజాతి సంస్థల కర్మాగారాల్లో అత్యధికమైనవి పర్యావరణానికి అమితహాని కలిగించే పరిశ్రమలే. మూడవ ప్రపంచ దేశాల్లో ఇటీవలి కాలంలో విదేశీ పెట్టుబడులు అత్యధికస్థాయిలో ప్రవహించిన మూడుదేశాలు - చైనా, ఇండొనేషియా, మెక్సికో - పర్యావరణ పరంగా భూతల నరకంగా తయారవుతున్నాయి. అంతేగాదు, సామ్రాజ్యవాదుల ఒత్తిడి కారణంగా, మూడవ ప్రపంచ దేశాలు తమ సహజ సంపదలను కారుచౌక ధరలకు తెగనమ్మేసుకుంటున్నాయి. అడవులు, గనులు, చివరికి మత్స్య సంపదకూడా ఎగుమతుల వేటలో అంతరించి పోతున్నాయి. విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరిగే కొద్దీ, 'ప్రైవేటీకరణ' 'ప్రభుత్వ ఖర్చు తగ్గింపు' 'ప్రపంచీకరణ' వగైరాలు అమలు జోరు పెరిగేకొద్దీ, ఈ దేశాల్లో లక్షలాది పరిశ్రమలు మూతపడి కోట్ల కార్మికులు వీధుల పాలవుతున్నారు. మిగిలినవారు తమ ఉపాధిని నిలుపుకోవడానికి ఏ వెట్టిచాకిరికైనా సిద్ధమవుతున్నారు. తల్లిదండ్రులకు ఏ ఉపాధి లభ్యమవకపోవడంతో, బాల కార్మిక వ్యవస్థ అంతరించడం మాట అటుంచి, నానాటికీ మరింత విస్తరిస్తోంది. ఈ వివరాలను స్వయంగా ఐరాస తను ఏటా ప్రకటించే ప్రపంచ మానావాభివృద్ధి రిపోర్టులో గణాంక వివరాలతో సహా పేర్కొంది. వాస్తవాలు ఇలా వుండగా, మరి అమెరికా ఎందుకు ఈ అంశాలపై పట్టుబడుతున్నట్టు అంటే, అందుకు ఏకైక కారణం, ఈ కార్మికోద్ధరణ, బాల కార్మికోద్ధరణ, పర్యావరణ పరిరక్షణ ముసుగులో మూడవ ప్రపంచ దేశాల నుండి తన దేశానికి చౌక ధరల్లో దిగుమతి అయ్యే వస్తువులను నిరోధించడం - అంటే తన స్వంత మార్కెట్ పరిరక్షణే తప్ప మరే ధ్యేయమూ దానికి లేనే లేదు. ఉదాహరణకు, అది ఇటీవలనే భారత దేశం నుండి దిగుమతి అవుతున్న బీడీలను నిషేధించింది.

ఇక మూడవ ప్రపంచ దేశాలు, ముఖ్యంగా భారత దేశం కార్మిక ప్రమాణాల అంశాన్ని చేర్చడాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి, యిక్కడ గమనించాల్సిందేమిటంటే, ఈ అంశం కంటే ఎన్నోరెట్లు ఎక్కువగా ప్రమాదకారి అయిన `పేటెంట్ వ్యవస్థ' పై నిబంధనలను భారత దేశం అంతగా వ్యతిరేకించడం లేదు. భారత ప్రతినిధి బృందం, సుంకాల తగ్గింపు, వ్యవసాయరంగం, సేవారంగం వగైరాల ఉదారీకరణ వంటి పలు అంశాలపై అమెరికా ఎజండాను తుచ తప్పకుండా ఆమోదించాలని అయితే బాల కార్మిక వ్యవస్థ రద్దు, కార్మికుల ప్రమాణాల మెరుగుదల విషయంలో గట్టిగా వ్యతిరేకించాలనే ఏకాభిప్రాయంతోనే వెళ్లింది. బాల కార్మిక వ్యవస్థను రద్దు చేయడం, కార్మికుల ప్రమాణాలను మెరుగుపర్చడం అంటే విషం తినడమేనని, అలా చేస్తే భారత ఎగుమతులకు, విదేశాలలో తయారయ్యే వస్తువులతో పోటీపడే సామర్థ్యం తగ్గిపోగలదనీ భారత బృందానికి ప్రాతినిధ్యం వహించిన కేంద్ర వాణిజ్య మంత్రి మురసోలి మారన్ ప్రకటించాడు. ఆయన మూడవ ప్రపంచ దేశాలలోని పాలకవర్గాల నిఖార్సైన వర్గ వైఖరిని ప్రతిబింబించాడు. సామ్రాజ్యవాదుల దోపిడీకి అన్ని విధాల సహకరిస్తాం. అయితే, మా కార్మికులను దోచుకునే హక్కు' విషయంలో మాత్రం రాజీపడం. ఇలా సియాటిల్ సమావేశం పనిలో పనిగా మూడవ ప్రపంచ దేశాల పాలక వర్గాల సామ్రాజ్యవాద సేవక స్వభావాన్ని, దోపిడీ స్వభావాన్ని కూడా బయటపెట్టింది.

## అమెరికా - ఐరోపా యూనియన్‌ల మధ్య ఘర్షణ

ఈ సమావేశంలో వీటి మధ్య ఘర్షణ ఎంత తీవ్రస్థాయికి చేరుకుందంటే, ఐరోపా యూనియన్, అమెరికా ప్రతిపాదించిన 'అధికారిక' మినిస్టీరియల్ సమావేశ ప్రకటనకు విరుద్ధమైన ప్రత్యామ్నాయ ప్రకటనను ప్రవేశపెట్టింది. ఈ ప్రత్యామ్నాయ ప్రకటనను జపాను, స్విట్జర్లాండు, ఆఖరికి దక్షిణకొరియా సైతం

(అమెరికా సామ్రాజ్యవాదానికి నమ్మిన బంటుల్లో ఒకటి) సమర్థించాయి. డబ్ల్యుటిఓ ఒప్పందాల అమలులో వెనుకబడిన దేశాలు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలోకి తరచి చూడడానికై అమెరికాను మించిన సుముఖతను ప్రదర్శించడం ద్వారా ఐరోపా యూనియన్ వెనుకబడిన దేశాల మద్దత్తును కూడగట్టుకోవడానికై ప్రయత్నించింది.

సమావేశం చివర్లో ఐరోపా యూనియన్ వాణిజ్య కమిషనరు పాస్కల్ లామే సమావేశ నిర్వహణలో పాటించబడుతోన్న 'మధ్యయుగాల నాటి పద్ధతులను' విమర్శించాడు. అంతేకాదు, "తన స్వంత ఎజండాను రుద్దడానికి అమెరికా ఎంత కృతనిశ్చయంతో వుందంటే, అది ఎక్కడికి దారి తీయగలదు అనే విషయాన్ని సైతం అది విస్మరిస్తోంది." అంటూ అమెరికాకు మొట్టికాయ వేశాడు.

## మూడవ ప్రపంచ దేశాల నిరసనలు

ఒక పక్క భారత ప్రతినిధి బృందం, అమెరికా తరపున దాని ఎజండాను అందరి నెత్తిన రుద్దే కృషిలో తన వంతు పాత్ర నిర్వహించడంలో తల మునకలై వుండగా, మరో వంక, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో అవలంభించబడుతున్న నిరంకుశ, స్వైర పద్ధతులకు వ్యతిరేకంగా పెద్దసంఖ్యలోని మూడవ ప్రపంచ దేశాలు తమ నిరసనను తెలియజేశాయి. ఈ దేశాల నిరసనకు అద్దంపడుతూ ఈజిప్టు వాణిజ్య సంప్రదింపుదారుడు మునీర్ జహరాన్ ఇలా అన్నారు. "మమ్మల్ని అంధకారంలో వుంచారు, మాకు ఏ విషయాలు చెప్పకుండా దాటవేశారు. జంతువులతో వ్యవహరించే తీరులో వ్యవహరించారు" అన్నాడు. ఇక్కడ పాటించబడిన పద్ధతుల్లో పారదర్శకత మచ్చుకైనా కానరాలేదనీ, ఆఫ్రికా దేశాలను "పక్కకు నెట్టేసి, వెలివేశారని" ఆఫ్రికా ఐక్యతా సంఘటన (ఓఏయు) ప్రతినిధి ఆరోపించారు.

## 'గ్రీన్ రూమ్' సంప్రదింపుల భాగోతం

డబ్ల్యుటిఓ నిర్వహించే సంప్రదింపులన్నీ దాదాపుగా 'గ్రీన్ రూమ్' (ఆకు పచ్చగది) సంప్రదింపులుగా పిలవబడే పద్ధతుల ద్వారానే జరుగుతూ వస్తున్నాయి. ముందే చెప్పినట్లు సామ్రాజ్యవాద బడారాజ్యాలు అంతకు ముందు తమ ప్రత్యేక సమావేశాలలో కుదుర్చుకున్న ఒప్పందాలను డబ్ల్యుటిఓ ఒప్పందాల పేరిట యితర దేశాలపై రుద్దడానికి వాడే పద్ధతే ఈ 'గ్రీన్ రూమ్' సంప్రదింపుల పద్ధతి. ఈ బడా రాజ్యాలు మూడవ ప్రపంచానికి చెందిన పూర్తిగా తమకు విధేయంగా వుండే దేశాల ప్రతినిధి బృందాలను మాత్రమే ఈ గ్రీన్‌రూములనబడే వాటిలో సమావేశపర్చి తాము ముందుగా తీసుకుని వున్న నిర్ణయాలను వాటిచే అంగీకరింపజేసి, దాన్ని ఏకాభిప్రాయంగా, చిత్రించి సమావేశంలోని మిగిలిన అన్ని దేశాల మీద రుద్దుతాయి. ఈ సంప్రదింపులలో ఎటువంటి చర్చా అంగీకరించబడదు. సియాటిల్ సమావేశంలో చిన్న దేశాలకు చెందిన పలువురు వాణిజ్య మంత్రులను ఈ గ్రీను రూముల దరిదాపుల్లోకి కూడా రానీయకుండా, అమెరికా రక్షణాధికారులు అడ్డుకున్నారు. ఎలాగోలా తంటాలుపడి ఈ రూముల్లోకి చేరుకోగల్గినవాళ్లకు వారు, వారి వారి దేశాల మంత్రులైనప్పటికి వారికి కూర్చోడానికి కుర్చీలు కూడా లేకుండా చేశారు. కేవలం 23 దేశాలకు మాత్రమే ఈ రూముల్లోకి ప్రవేశానుమతి పరిమితం చేయబడింది. (సామ్రాజ్యవాద పాదసేవలో పరమ విధేయ సేవకులైన భారత ప్రతినిధి బృందానికి మాత్రం అనుమతి లభించింది.)ఈ 23 దేశాలను, డబ్ల్యుటిఓ డైరక్టర్ జనరల్ అమెరికా ఆదేశాల ప్రకారం ఎంపికచేశాడు.

134 దేశాలు పాల్గొనే ఏ బహుముఖ సంప్రదింపులలోనైనా పాటించాల్సిన కనీస మర్యాదల్ని కూడా పాటించడం జరగడం లేదు. 'ప్రధాన' సంప్రదింపుదారులు (అంటే సామ్రాజ్యవాద బడా రాజ్యాలు) చిన్న వెనుకబడిన దేశాలను బాహటంగానే కించపరిచారు, విస్మరించారు. యిక్కడ అగ్రరాజ్యాలు బాహటంగా ప్రదర్శించిన వివక్షత, అధికార మదాలు భరించనలవికాని స్థాయికి చేరుకున్నాయి. ఇక ఇది సహజంగానే, సమావేశపు మూడవనాటికి అపూర్వమైన తిరుగుబాటుకు దారితీసింది. ఆ రోజున మూడవ ప్రపంచ దేశాల నుండి రెండు బహిరంగ ప్రకటనలు జారీ చేయబడ్డాయి. గాట్/డబ్ల్యుటిఓల ఏబై ఏళ్ల చరిత్రలో ఇంతకు ముందెన్నడూ, సమావేశంలోనే ఇలా బహిరంగ నిరసన వ్యక్తం కావడమంటూ జరగనేలేదు.

లాటిన్ అమెరికా, కరిబియన్ ప్రాంతాలకు చెందిన పెద్దసంఖ్యలోని దేశాలు విడుదల చేసిన నిరసన ప్రకటనలో ఇలా పేర్కొనబడింది. "సభ్య దేశాలు అన్నింటి యొక్క ప్రయోజనాలకు సంబంధించి తగినంత సమతుల్యత కూడివున్న ఫలితాలకు అవకాశాన్ని కల్పించే పారదర్శకతతోనూ, స్వేచ్ఛతోనూ సమావేశంలో పాల్గొనగల పరిస్థితులు కొరవడినంతకాలమూ, ఈ మినిస్టీరియల్ సమావేశ ధ్యేయాల సాధనకు అవసరమైన ఏకాభిప్రాయ సాధనా ప్రక్రియలో మేము పాలుపంచుకోవడంలేదు"

అన్ని ఆఫ్రికా దేశాలతో కూడుకుని వుండే, ఆఫ్రికా ఐక్యతా సంఘటన ప్రకటన ఇలా పేర్కొంది. "ఇక్కడ అనుసరించబడుతున్న వైఖరిని మేము తిరస్కరిస్తున్నాము. ప్రస్తుత పరిస్థితుల్లో మినిస్టీరియల్ సమావేశ ధ్యేయాల సాధనకు అవసరమైన ఏకాభిప్రాయ సాధనా ప్రక్రియలో మేము పాలుపంచుకోలేము."

## దేశ గౌరవ ప్రతిష్టలను మంటగలుపుతూ భారత ప్రతినిధి బృందం ప్రదర్శించిన బానిస విధేయత

భారత విదేశాంగ మంత్రి జస్వంత్ సింగ్ అమెరికా విదేశాంగ శాఖ కార్యదర్శి స్ట్రోబ్ టాల్‌బోట్‌తో కుదుర్చుకున్న రహస్య ఒప్పందాల కారణంగా, భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సియాటిల్ సమావేశంలో అమెరికా ఆటకు వంతపాడింది. క్లింటన్ వెనుకబడిన దేశాల్లో అమలవుతున్న ఏ 'వెట్టిచాకిరి'కి వ్యతిరేకంగా మాట్లాడాడో, భారత ప్రతినిధి బృందం తన స్వామిభక్తిని ప్రదర్శించడానికై, అమెరికా ప్రతిపాదన నెగ్గేందుకై అంతకంటే ఘోరమైన 'వెట్టిచాకిరి' చేసింది. అయితే విచిత్రమేమిటంటే, సియాటిల్ సమావేశంలో అమెరికా దాసులుగా యిప్పటికే పేరుగాంచిన జాతీయ ప్రజాస్వామిక కూటమికి చెందిన మురసోలి మారన్ (ద్రవిడ మున్నేట్ర కళగం), కాంగ్రెస్‌కు చెందిన కమలనాథ్‌ల గొంతుతో, సదా సామ్రాజ్యవాద వ్యతిరేక జపం చేస్తూ వుండే నయా రివిజనిస్టు సిపిఐ(ఎం)కు చెందిన బిప్లవ్‌దాస్ గుప్తా కూడా గొంతు కలపడం.

అమెరికా ముందు సాగిలపడి దండాలు పెట్టే ప్రక్రియకు పూర్వరంగం సియాటిల్ సమావేశానికి ఎంతో ముందుగానే సిద్ధం చేయబడింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలలో డబ్ల్యుటిఓ నిబంధనలకు అనుగుణంగా భారత చట్టాలను సవరించడానికి

మొత్తం ఏడు బిల్లులను ప్రవేశపెట్టడం జరిగింది. గత దశాబ్దకాలంలో ఒకదాని తర్వాత మరొకటిగా గద్దెనెక్కిన కాంగీ, ఐక్య సంఘటన, భాజపా కూటమి ప్రభుత్వాలు, ఇప్పటికే డబ్ల్యుటిఓ నిబంధించిన స్థాయిల కంటే కూడా తక్కువగా వుండే విధంగా దిగుమతులపై సుంకాల రేట్లను తగ్గించాయి. ఆహార పదార్థాలతో సహా వేలాది వస్తువుల దిగుమతిపై వున్న ఆంక్షలనన్నింటినీ ఎత్తి వేశాయి. ద్రవ్య రంగ ఉదారీకరణ, భీమా రంగం తదితర కీలక రంగాల్లో విదేశీ పెట్టుబడులకు చట్టపరంగా అవకాశకల్పన మొదలైనవి సామ్రాజ్యవాదులు ఆశించిన స్థాయికి మించిన స్థాయిలో, అనూహ్య వేగంలో సాగాయి. ప్రజలకు ఎంతో కొంత ఉపకారం చేసే ఏ బిల్లునైనా, ప్రజల డిమాండ్లకు తప్పని సరిగా తల వొగ్గి వచ్చి ప్రవేశపెట్టబడిన ఏ బిల్లునైనా (ఉదాహరణకు ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఉత్తరాంచల్ రాష్ట్రాల ఏర్పాటు బిల్లు) ఆమోదించడానికి దశాబ్దాలు తీసుకునే భారత పార్లమెంటు, సామ్రాజ్యవాద విధేయతను ప్రకటించే ఇటువంటి బిల్లులను మాత్రం ఆఘమేఘాల మీద, పెద్ద చర్చ ఏమీ లేకుండానే ఆమోదించింది.

అంతేకాదు, సియాటిల్ సమావేశానికి ఎంతో ముందునుండే సామ్రాజ్యవాదుల సమస్త నిర్ణయాలకు భారత దేశం తలవొగ్గాలని - అవి దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైనవే అని తెలిసినప్పటికి - డిమాండ్ చేస్తూ మీడియాలో ముమ్మర ప్రచార కార్యక్రమం నిర్వహించబడింది. భారత పరిశ్రమల సంఘం ఈ విషయంపై బాహటంగా ముందుకు వచ్చి వకాల్తా పుచ్చుకోగా, బూర్జువా రాజకీయ వేత్తలు అవే అభిప్రాయాలను తమ కలవాటైన నంగి మాటల్లో వ్యక్తపరిచారు.

భారత దళారి బూర్జువా వర్గ సంఘాలైన సిఐఐ (భారత పరిశ్రమలసమాఖ్య) అసోఛామ్, ఎఫ్ఐ, సిసిఐలు వాటి చెప్పుచేతల్లోని మీడియా, భారత దేశం వెనుకబడిన దేశాలతో కలిసికట్టుగా  నిలకూడదని సామ్రాజ్యవాద అగ్రరాజ్యాల చెలాంచలాలను ఎత్తిపట్టి నడవడమే (తమకు) దేశానికి లాభసాటిగా వుండగలదని బాహటంగానే ప్రచారాన్ని లంకించుకున్నాయి.

భారత కార్మికవర్గానికి ప్రజలకూ అంతో యింతో ప్రయోజనాన్ని చేకూర్చగల అంశాలైన, కార్మిక ప్రమాణాల మెరుగుదల, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనల విషయంలో అమెరికాతో ముఖాముఖి పోట్లాటకు కూడా సిద్ధమైన భారత పాలకవర్గాలు, దేశ ప్రయోజనాలను మొత్తంగానే హరించి వేసే, దేశ సార్వ భౌమత్వాన్ని నామ రూపాలు లేకుండా చేసే అమెరికా ప్రతిపాదనలన్నింటిని ఆమోదించడానికి సంసిద్ధమవడమేగాక, అమెరికా ప్రతిపాదలను వ్యతిరేకిస్తోన్న మూడవ ప్రపంచ దేశాలను ఒప్పించే కర్తవ్యాన్ని తమభుజాన వేసుకుని, అందుకు నానాపాట్లుపడ్డాయి. ప్రధాని వాజ్‌పాయి సియాటిల్ సమావేశానికి ముందు మాట్లాడుతూ భారత దేశం యింతకు ముందు అవలంభించిన "తలుపులు మూసుకునే వైఖరి" (అంటే మరేమీ కాదు, దేశీయ మార్కెట్‌ను సంపదల్ని సంరక్షించడానికి నామమాత్రంగానైనా అస్థిత్వంలో వుండిన చట్టాలు)ని కాకుండా పట్టువిడుపులతో కూడిన వైఖరిని చేపట్టగలదన్నాడు.

గతంలో భారత దేశం మరక్కేష్ సమావేశంలోగానీ, అటు తర్వాత ఏర్పడిన డబ్ల్యుటిఓ సమావేశాల్లోగానీ, స్వయంగా ప్రధాని మాటల్లోనే `తలుపులు మూసుకునే వైఖరి'ని అవలంభించినప్పుడే, సామ్రాజ్యవాదులు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ మారు మాట లేకుండా సంతకాలు పెట్టింది అనే చేదు వాస్తవాన్ని మరోసారి గుర్తు తెచ్చుకుంటే ఇపుడు చేపట్టనున్న `పట్టువిడుపుల వైఖరి' భారత ప్రజల నెత్తి మీదకు ఇంకెంతటి పెద్ద ఉపద్రవాన్ని కొని తేనున్నదో తేలికగానే గ్రహించవచ్చు. (సియాటిల్ సమావేశంలో యిది రుజువు అయింది, కార్మికులు జీవన ప్రమాణాలను పెంచడం బాలకార్మిక వ్యవస్థను రద్దు చేయడం, పర్యావరణ రక్షణకు చర్యలు చేపట్టడం విషయంలో అటువంటి చర్యలను ఆరునూరైనా చేపట్టేది లేదనే 'పట్టు'; సామ్రాజ్యవాదులకు దేశాన్ని తెగనమ్మివేసే ప్రక్రియ కొనసాగింపు విషయంలో 'విడుపు').

ఈ సమావేశంలో భారత దేశం 'ఇ'కామర్స్ సాంకేతిక పరిజ్ఞానం రంగం, వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాల తగ్గింపు రద్దు సబ్సిడీల తగ్గింపు రద్దు అనే అంశాలపై అమెరికా ప్రతిపాదనలను సమర్థించింది. (ఒక ప్రక్క యిప్పటికే కారుచౌక ధరల్లో దిగుమతి అవుతున్న వ్యవసాయోత్పత్తుల మూలంగా - గోధుమలు, వంటనూనెలు, రబ్బరు, పంచదార వగైరా - భారత రైతాంగం సర్వనాశన మవుతున్నప్పటికీ) కాగా, ఐరోపా యూనియను ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ ప్రకటనను వ్యతిరేకించింది. అమెరికా ప్రకటనకు అండగా నిలిచింది. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే, ఐరోపా యూనియన్ ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ ప్రకటనలో భారత ప్రభుత్వం 'అమలు చేయవలసి వున్న అంశాలు'గా డిమాండ్ చేస్తూ వచ్చిన అంశాలు వున్నప్పటికీ, భారత ప్రతినిధివర్గం ఆ ప్రకటనను నిర్ద్వందంగా తిరస్కరించింది. భారత పాలకవర్గాల ఈ బానిస సేవక ప్రవృత్తి ఎంతటి అథమ స్థాయికి చేరుకుందంటే తప్పని సరిగా అమలు పర్చాల్సి వున్న అంశాలుగా భారత దేశం డిమాండ్ చేస్తూ వచ్చిన అంశాలలో ఏ ఒక్క అంశాన్నైనా ఆమోదించడానికి అమెరికా అణుమాత్రంగానైనా సిద్ధపడక పోయినప్పటికీ, భారత దేశం అమెరికా/డబ్ల్యుటిఓల డిమాండ్లన్నింటికీ పరమ విధేయంగా గుడ్డి ఆమోదాన్ని తెలిపింది. అమెరికా భారత దేశం నుండి తన దేశానికి దిగుమతి అయ్యే బట్టలపై అధికరేటులో సుంకాన్ని కొనసాగిస్తూనే వుంది. (అమెరికా విధించే సగటు సుంకాల రేటు 5%గా వుండగా భారత దేశం నుండి దిగుమతి అయ్యే బట్టలపై 25% సుంకాన్ని విధిస్తోంది) భారత ఉత్పత్తులపై డంపింగ్ వ్యతిరేక సుంకాల సంఖ్యను పెంచింది. (ఒక దేశం, తన దేశంలో ఉత్పత్తి అయ్యే వస్తువుల కంటే తక్కువ ధరల్లో అవే వస్తువులు తమ దేశంలోకి దిగుమతి అవుతున్నప్పుడు, అవి పెద్ద ఎత్తున దిగుమతి అవకుండా నిరోధించి, స్వంత మార్కెట్లను రక్షించుకోవడానికై విధించే అదనపు సుంకాలను 'డంపింగ్' సుంకాలంటారు.) అంతేకాదు, సరిగ్గా సియాటిల్ సమావేశానికి కొద్ది ముందుగానే, బాలల శ్రమతో తయారవుతున్నాయనే సాకుతో, అప్పటికే అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించి, స్థానిక సిగరెట్ల మార్కెట్‌కు పెద్ద సవాలుగా తయారైన భారత బీడీల దిగుమతిని నిషేధించింది. అమెరికా, ఇలా ఒక పక్క డబ్ల్యుటిఓ నియమనిబంధలన్నింటినీ తుంగలో తొక్కుతూ, యధేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటూ, మరోప్రక్క ప్రపంచంలోని యితర దేశాలన్ని (ప్రత్యేకించి పేదదేశాలు) ఆ నియమ నిబంధనలను తుచ తప్పకుండా పాటించకపోతే ఆంక్షలు విధిస్తానని బెదిరిస్తూ, ఏ మాత్రం పట్టువిడుపులేని వైఖరిని ప్రదర్శిస్తుండగా, భారత పాలకులు తమ తలుపులు మూసుకునే వైఖరిని విసర్జించి, సణుగుడు

రూపంలోనైనా నిరసనను వ్యక్తం చేయజాలని 'పట్టువిడుపుల వైఖరి'ని అవలంభించారు. తమ అమెరికా యజమానుల ప్రతిఒక్క కోర్కెను తీర్చడానికి కుక్కపాట్లు పడ్డారు.

దేశంలో నిరంతరం ఘర్షణలు పడుతూ వస్తున్న, తాము ఉత్తర, దక్షిణ ధృవాలమని ప్రజలను నమ్మింపచూస్తున్న భాజపా కూటమి పార్టీలు, కాంగీ, మరియు వామ పక్షాలుగా చెలామణి అవుతున్న పార్టీలు సియాటిల్‌లో ఒకే గొంతుకతో మాట్లాడడం, సియాటిల్ సమావేశంలో భారత ప్రజలు ప్రత్యేకించి గమనించాల్సిన అంశం. సామ్రాజ్యవాద అనుకూల పార్టీలుగా పేరుగాంచిన భాజపా కూటమి పార్టీలు - కాంగీ సంగతటుంచి, సామ్రాజ్యవాదానికి, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదానికి బద్దవిరోధులుగా దేశంలో కపట నాటకాలాడే వామపక్ష పార్టీల తరఫున, భారత ప్రతినిధి బృందంలో సభ్యుడిగా సియాటిల్ సమావేశంలో పాల్గొన్న నయారివిజనిస్టు పార్టీ సిపిఐ(ఎం) పార్లమెంట్ సభ్యుడు బిప్లవ్‌దాస్ గుప్తా కూడా, అమెరికా పాటకు వంతపాడడంలో మురసోలి మారన్‌కు వెన్నంటే నిలిచాడు. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, కరబియన్ ప్రాంతంలోని చిన్న దేశాలు సైతం ముందుకొచ్చి ఏదో ఒక మేరలో నిరసన తెలియజేయగా ఈ "విప్లవ, సామ్రాజ్యవాద వ్యతిరేక కమ్యూనిస్టు" కూడా భాగస్వామియైన భారత ప్రతినిధి బృందం మాత్రం, ప్రపంచ ప్రజలందరి ముందరా భారత దేశగౌరవ ప్రతిష్టలను, సార్వభౌమత్వాన్ని మంటగలిపే తీరులోనే సామ్రాజ్యవాద 'చెంచా'నని రుజువు చేసుకుంది

## ఉవ్వెత్తున ఎగసిన ప్రజా నిరసనలు ఎడతెరిపి లేకుండా సాగిన సమరశీల పోరాటాలు

ఈ సమావేశ సందర్భంగా, డబ్ల్యుటిఓ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ, ప్రపంచమంతటి నుండి వచ్చిన వేయి ప్రజాబృందాలు ఒక పత్రాన్ని విడుదల చేశాయి.

కన్ను మిన్ను కానని 'లాభలాలస'తో, వాణిజ్యరంగ ఉదారీకరణ ప్రక్రియను ఉధృతంగా ముందుకు తీసుకువెడుతోన్న గుత్త కార్పోరేట్ సంస్థల దుష్టప్రయోజనాలను వ్యతిరేకించడం అన్నదే సియాటిల్ నగరాన్ని సమావేశం జరిగిన నాలుగు రోజులూ దిగ్బంధించిన 50,000 ప్రదర్శనకారుల్లో అత్యధికుల ధ్యేయం.

సమావేశ ఆరంభదినం నాటికే నిరసన ప్రదర్శనకారులు సియాటిల్ నగర వీధులన్నింటినీ ఆక్రమించుకున్నారు. సమావేశంలో పాల్గొనడానికి సియాటిల్ చేరిన వివిధ దేశాల ప్రతినిధులు, ప్రదర్శనకారుల వలయాలను ఛేదించుకొని, బయటపడలేక తమ తమ హోటలు గదుల్లోనే చిక్కుకు పోయారు. ఎలాగోలా తంటాలు పడి సమావేశానికి చేరుకుందామనే తాపత్రయంతో అడ్డదారులు వెతికిన కొందరు ప్రతినిధులను ప్రదర్శనకారులు చుట్టుముట్టి వారిపై రంగులు చల్లి, నిరసనను తెలియజేశారు. ఆరంభ వేడుకలో ప్రధాన వక్తలైన అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ మాడలిన్ ఆల్‌బ్రైట్, ఐరాస సెక్రటరీ జనరల్ కోఫీ అన్నాన్; డబ్ల్యుటిఓ డైరెక్టర్ జనరల్ మైక్ మూర్, అమెరికా వాణిజ్య ప్రతినిధి చార్లిన్ బార్షెఫెస్కె వంటి ఘనాపాటులందరూ తమ విడుదుల్లోంచి బయట పడి సమావేశ స్థలానికి చేరుకోలేక పోయారు. ఒక విధంగా ప్రపంచ పెట్టుబడి సంరక్షణకై ముందు పీటిన నిలబడి సేవచేస్తున్న వివిధ దేశాల ఘనత వహించిన మంత్రివర్యులు, వారి ప్రతినిధి బృందాలు, ప్రజారాశులకు బందీలుగా అయ్యారు. ప్రదర్శనకారులు ఎంతటి అంకిత భావంతో, దృఢదీక్షతో తమ నిరసన పోరాటాలను కొనసాగించారంటే, ఎంతో ఆర్భాటంతో, సకల లాంఛనాలతో అట్టహాసంగా జరగవలసి వున్న ప్రారంభ వేడుకే రద్దు చేయబడింది. ప్రజల దిగ్బంధనం మూలంగా ప్రతినిధులు సభాస్థలానికి చేరుకోలేక పోవడంతో సమావేశం కూడా ముందుగా అనుకున్న విధంగా మొదలవలేదు.

ఇక అప్పుడు, సమావేశ నిర్వహణకు వీలు కల్పించడానికై నగర వీధుల నుండి ప్రదర్శనకారులను తరిమి కొట్టడానికై నఖశిఖపర్యంతం సాయుధులై వున్న అమెరికా పోలీసు బలగాలను పెద్ద సంఖ్యలో రంగంలోకి దించడం జరిగింది. పోలీసు బలగాలకు దన్నుగా నేషనల్ గార్డు బలగాలను, స్టేట్ ట్రూపర్ బలగాలను (పారా మిలిటరీ బలగాలను) కూడా మోహరించారు. ఈ నగర మేయరు 'అత్యవసర పరిస్థితి' అమలులోకి వచ్చినట్టు ప్రకటించాడు. కర్ఫ్యూ విధించబడింది. సామ్రాజ్యవాద అట్టహాసాన్ని, దర్పాన్ని ప్రదర్శించడానికై సర్వాంగ సుందరంగా అలంకరించబడిన సియాటిల్ నగరం 'యుద్ధరంగం'గా పరివర్తన చెందింది. అమెరికా రక్కసి పోలీసు బలగాలు లాఠీలు, భాష్పవాయుగోళాలు, పెప్పర్‌స్ప్రేలు, ప్లాస్టిక్ బుల్లెట్లు, చివరికి కంకషన్ గ్రెనేడ్లను సైతం వినియోగిస్తూ ప్రదర్శనకారులపైన, సియాటిల్ నగర సాధారణ ప్రజానీకంపైనా రాక్షస నిర్బంధకాండతో విరుచుపడ్డారు. దీనికి నిరసనగా ప్రజలు, వాహనాలను దుకాణాలను పోలీసు బారికేడ్లను ధ్వంసం చేస్తూ, ఎదురుతిరిగి పోరాడారు. గెరిల్లా పద్ధతుల నవలంభిస్తూ, పోలీసులతో పోరాటాలకు దిగారు. ప్రజా నిరసనకారులకు, పోలీసులకు మధ్య పోరాటాలు హోరాహోరీగా కొనసాగాయి. సియాటిల్ నగర వీధులు రక్తంతో ఎరుపెక్కాయి. నగర వీధులను నిరసన కారులనుండి తిరిగి చేజిక్కించుకోవడానికై పోలీసులకు అడుగడుగునా పోరాటం చేయవలసి వచ్చింది. యిక ఆపైన ప్రదర్శనకారులు తమ ఎత్తుగడలను మార్చుకున్నారు. ముఖాముఖి పోరాటం నుండి వెనక్కి తగ్గి, పక్కల నుండి దాడులు చేసే పద్ధతిని చేపట్టారు. ముసుగులు ధరించిన యాక్టివిస్టులు మార్గావరోధాలను నెలకొల్పారు. ప్రధాన చౌరస్తాలను తిరిగి తమ అదుపులోకి తెచ్చుకున్నారు.

మొత్తానికి పోలీసులు ఆనాటికి ఎలాగోలా తంటాలుపడి ప్రదర్శనకారులను చెల్లా చెదరు చేయగల్గారు. సమావేశాన్ని మొదలు పెట్టించగలిగారు. అయితే పోరాటాలు అంతటితో సమసిపోకుండా, మరునాడు కూడా కొనసాగాయి. పోలీసులు పాశవిక దాడులకు పాల్పడి వందలాది మందిని తీవ్రంగా గాయపర్చడమే కాక, 600 మందిని అరెస్టు చేశారు కూడా. పోలీసుల పాశవికత ఎంతటి నీచస్థాయికి చేరిందంటే వారు భాష్పవాయు గోళాలను ప్రజాసమూహాల నడుమగాక నేరుగా ప్రదర్శనకారుల మొఖాలకే తగిలే విధంగా గురిపెట్టి కాల్చారు. ఫలితంగా ప్రదర్శనకారుల దవడలు చిట్లాయి, ఎముకలు నజ్జు నజ్జు అయ్యాయి. పెప్పర్ స్ప్రేలు నేరుగా కళ్లలోకే ప్రయోగించిన కారణంగా అనేకుల కళ్లు దెబ్బతిన్నాయి. ఇక అరెస్టు చేసిన వారిని చిత్రహింసలు పెట్టారు. పోలీసులు సాధారణ పాదచారులను కూడా చితకబాదారు. అయితే ఇంతటి అమానుష దమనకాండ ప్రదర్శనకారుల మనోస్థైర్యాన్ని ఆవగింజంతైనా కూడా తగ్గించలేక పోయింది. వారు వీధుల్లో నాటికలను ప్రదర్శించారు. పాటలు పాడారు. ఖాళీగా వున్న ఇళ్లను

ఆక్రమించుకున్నారు. విలాసవంతమైన కార్లలో ఊరేగింపుగా సభాస్థలికి తరిలి వెడుతున్న మూడవ ప్రపంచ దేశాల నియంతల్ని గేలిచేశారు. షెల్ (చమురు వ్యాపారం చేసే బహుళజాతి సంస్థ, నైజీరియాలో కెన్‌సారో వీవా హత్యకు సూత్రధారి) యూనియన్ కార్బైడ్ (భోపాల్ విషవాయువు సృష్టికర్త) మాన్‌సాన్‌టో (టెర్మినేటర్ విత్తనాల సృష్టికర్త) వంటి నేరస్థ బహుళజాతి గుత్త కార్పోరేషన్లను, మానవాళికి వ్యతిరేకంగా అవి సాగిస్తోన్న ఘోర నేరాలకుగాను సియాటిల్ వీధుల్లో ప్రజాకోర్టులు నిర్వహించి, ప్రపంచ ప్రజల తీర్పును ప్రకటించారు. మానవాహారాలను ఏర్పాటు చేశారు. మూడవ ప్రపంచంపై రుద్దబడిన రుణభారానికి వ్యతిరేకంగా, బహుళజాతి గుత్తసంస్థల లాభాలకోసం ప్రపంచం నలుమూలలా సాగుతోన్న నరమేధానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ఊరేగింపులు జరిపారు.

మూడవ రోజుకు ప్రదర్శనల స్వభావంలో మరోమార్పు వచ్చింది. ఆ రోజున ప్రదర్శనలు, పోలీసుల పాశవిక దమనకాండనూ నిరశిస్తూ, సియాటిల్ నగరంలో వాక్‌స్వాతంత్ర్యం కాలరాయబడి వేయడాన్ని నిరసిస్తూ. అక్రమంగా అరెస్టు చేసిన వారిని బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సాగాయి. వేలాది ప్రదర్శనకారులు సియాటిల్ జైలును చుట్టుముట్టారు. సియాటిల్‌లో విధించబడిన మార్షియల్ లా (సైనిక శాసనం) సైతం ప్రదర్శనకారులను ఏ మాత్రంగానైనా అడ్డుకోలేకపోయింది. సమావేశం జరిగిన నాలుగురోజులు నిరసన ప్రదర్శనలు ఎడతెరిపిలేకుండా కొనసాగుతూనే వచ్చాయి.

ప్రపంచంలోని బూర్జువా వార్తా ప్రసార సాధనాలన్ని క్లింటన్ డిమాండ్లతో ఏకీభవించే కొన్ని డిమాండ్లపైనే - కార్మిక ప్రమాణాలు, పర్యావరణం, బాలకార్మిక వ్యవస్థ - ప్రధానంగా కేంద్రీకరించి, వాటికే విశేష ప్రాముఖ్యతనిచ్చి, ప్రదర్శనకారులు అధికాధికంగా అమెరికా సామ్రాజ్యవాద అనుకూలురనే కట్టుకథలను ప్రచారం చేసినప్పటికీ (ముఖ్యంగా భారత దేశంలోని మీడియా మొత్తానికి మొత్తంగానే ఈ కట్టుకథను ప్రచారం చేసింది) అసలు వాస్తవమేమిటంటే, అమెరికా లేవనెత్తిన పై అంశాలు పరిష్కృతం కాకపోతే తమ ఉద్యోగాలు ఊడుతాయనే భయంతో, అమెరికా మీడియా విషప్రచారం ప్రభావానికి లోనైన అమెరికా కార్మిక సంఘాలు కొన్ని పై విషయాలపై నిరసనలు చేపట్టినప్పటికీ, ప్రదర్శనకారుల్లో అత్యధికులు డబ్ల్యుటిఓను, దానిని నియంత్రిస్తున్న బహుళజాతి సంస్థలనుతూర్పార బడుతూనే ప్రదర్శనలను నిర్వహించారు. ఇలాంటి నిరసన ప్రదర్శనలు ఒక్క సియాటిల్ నగరంలోనే కాక ప్రపంచంలోని పలు యితర నగరాలలో కూడా సాగాయి. వీటిలో లండన్, పారిస్, మనిలా మహానగరాల్లో సాగిన ప్రదర్శనలు ప్రత్యేకించి చెప్పుకోదగ్గవి.

లండన్ మహానగర నడిబొడ్డులో జరిగిన ప్రదర్శనలు, బ్రిటనులో రైల్వేల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగాయి. ప్రదర్శనకారులు హాస్టను రైల్వేస్టేషన్ను ఆక్రమించుకుని, లండన్ భూగర్భ రైల్వే వ్యవస్థను స్థంభింపజేశారు. ప్రదర్శనకారులు యిక్కడ కూడా పోలీసులతో హోరాహోరీగా పోరాడారు. పారిస్ నగరంలో వేలాది మంది ప్రదర్శనకారులు, డబ్ల్యుటివో కార్పోరేటు గుత్త సంస్థల లాభాలకు కాక, ప్రపంచ ప్రజల ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యత నివ్వాలని నినదిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు.

## సియాటిల్ సమావేశ వైఫల్యం - సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడికి వ్యతిరేకంగా ప్రపంచ ప్రజలు సాగిస్తోన్న పోరాటంలో మరో ముందడుగు

డబ్ల్యుటివో, సామ్రాజ్యవాద బహుళజాతి గుత్త సంస్థల ప్రయోజనాలను ఈడేర్చడానికి వాటి అక్రమ లాభార్జనలకు అంతర్జాతీయస్థాయిలో చట్టబద్ధ ప్రతిపత్తిని కల్పించడానికి స్థాపించబడిన మరో సంస్థ అనే విషయాన్ని సియాటిల్ సమావేశం మరోసారి రుజువు చేసింది. సియాటిల్ సమావేశ నిర్వహణకు నడుంకట్టిన, సియాటిల్ ఆతిథ్య సంఘానికి బోయింగ్, మైక్రోసాఫ్ట్ అనే బడా గుత్త సంస్థల అధిపతులే సహా- అధ్యక్షులు. ఈ సమావేశ నిర్వహణ వ్యయం మొత్తాన్ని కార్పోరేటు సంస్థలే భరించాయి. బోయింగ్, మైక్రోసాఫ్ట్, జనరల్ మోటార్స్, ఫోర్డు, హనివెల్, హెవలేట్ ప్రాకార్డ్, మొటరోలా, ఐబియం, కాటర్ పిల్లర్, లుఫ్తాన్సా మొదలైన బడా బహుళజాతి గుత్త సంస్థలు ఈ సమావేశ నిర్వహణలో పాలుపంచుకున్నాయి. అవి ఈ సమావేశం కోసం 40 కోట్ల రూపాయలను విరాళంగా అందజేశాయి. 'లాభం లేనిదే శెట్టి వరదనబోడు' అన్న చందంగా ఈ సంస్థల దాతృత్వం వెనక వున్నది వాటి లాభ లాలసతే. విరాళాలు అందజేసిన బహుళజాతి సంస్థలకు, వాటివాటి వ్యాపార ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్ళడానికి, వివిధ దేశాల ప్రతినిధులతో యదేచ్ఛగా కలవడానికి ప్రత్యేక సదుపాయాలు కల్పించబడ్డాయి. ఒక పక్క ఈ కంపెనీలకు ఇలాంటి సదుపాయాలు కల్పించబడగా, సమావేశంలో గౌరవప్రతినిధులుగా వచ్చిన పేదదేశాలలో అత్యధికమైన వాటి మంత్రులకు, ప్రతినిధి బృందాలకు ఎలాంటి ఆదరణ లభించిందో పైన చూశాం.

డబ్ల్యూటిఓ, బహుళజాతి సంస్థల వ్యాపార ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి ఏర్పాటు చేయబడ్డ సంస్థే తప్ప మరేమీకాదని పై విషయాలు స్పష్టం చేస్తున్నాయి. 'ఉదారీకరణ' 'స్వేచ్ఛా వాణిజ్యం' అనే పరదాల చాటున, ఒకరి గొంతులు మరొకరు కోయడానికై కత్తులు నూరుతూ, కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతూ, లాభాల వేటలో ప్రపంచ మానవాళిపై ఎంతటి ఘోర ఆకృత్యానికైనా తలపడడానికి సిద్ధంగా వున్న గుత్త కార్పోరేటు సంస్థలు పొంచివున్నాయి. "ఏకాభిప్రాయంతో కూడిన అంతర్జాతీయ ఒప్పందాలు, 'ప్రజాస్వామిక పద్ధతిలో వ్యవహార నిర్వహణ' వగైరా ఆకర్షణీయమైన నినాదాల వెనుక, ఏకపక్షంగాసాగే, ప్రజల మూల్గులను పీల్చిపిప్పిచేసే షరతులను విధించే ద్రవ్యపెట్టుబడికి చెందిన మహా హంతక ముఠాలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. మైక్‌మూర్‌లు (డబ్ల్యుటివో ప్రస్తుత అధినేత), చార్లిన్ బార్షెఫెస్కీ (అమెరికా వాణిజ్య ప్రతినిధి) పాస్కల్ లామే (ఐరోపా యూనియన్ వాణిజ్య కమిషనర్) వగైరాలు ఈ అంతర్జాతీయ తిమింగలాల విశ్వాస పాత్రులైన సేవకులే, తెరముందు కనబడే పాత్రధారులే.

సియాటిల్‌లో ప్రదర్శనకారులు సరిగా ఈ వాస్తవాలనే వెలుగులోకి తెచ్చారు. వారు డబ్ల్యుటివోనే కాక, దాన్ని తెరవెనుక నుండి ఆడిస్తోన్న బహుళజాతి సంస్థలపైన కూడా దాడి చేశారు. ఈ ప్రదర్శనకారుల్లో కొందరికి, డబ్ల్యుటివో, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సంస్థలకు జన్మనిచ్చి సామ్రాజ్యవాద వ్యవస్థే అసలు శత్రువని, దాన్ని ధ్వంసం చేయడమే ఈ సమస్య పరిష్కారానికి మూలమనే అవగాహన లేకపోవచ్చుగాక. అయితే, యిటువంటి

*(తరువాయి 33వ పేజీలో..)*

# సెక్యులరిజం ముసుగు ధరించిన ప్రభుత్వం(రాజ్యం) విశాల ఆదివాసీ బస్తర్ జిల్లాల్లోని పాఠశాలలకు అందిస్తున్న హిందూపురాణ గ్రంథాలను మంటగలపండి!

1991జనగణన వివరాల ప్రకారం భారతదేశంలో 67.76 మిలియన్‌ల ఆదివాసులున్నారు. మొత్తం భారత జనాభాలో 8.08 శాతం. వీరు భారతదేశ వ్యాప్తంగా విస్తరించివున్నప్పటికీ ముఖ్యంగా అడవులు కొండల ప్రాంతాల్లోనే నేటికీ అధికంగా జీవిస్తున్నారు. దేశంలోని 70 శాతానికి పైగా ఆదివాసులు మధ్యప్రదేశ్, మహరాష్ట్ర, ఒరిస్సా, బీహార్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్ మరియు గుజరాత్‌లలోనే కేంద్రీకరించబడి వున్నారు. 1991 జనాభా లెక్కల ప్రకారం మధ్యప్రదేశ్‌లో జనాభాలో (6, 61, 35, 862) 23.27% (1,32,27,172) ఆదివాసులున్నారు.

ఈ ఆదివాసుల హైందవీకరణా ప్రక్రియ మన దేశంలో అనాదిగా కొనసాగుతోంది. ఆదివాసులకు తమదంటూ ఒక విశాల ప్రాంతమున్నప్పటికీ వారు ఈ దేశంలో అధికారం నుండి వంచింపబడుతున్నారు. ఆదివాసులకు తమదంటూ ఒక ప్రత్యేక జీవన విధానం నేటికీ యింకా మిగిలి వున్నప్పటికీ రోజు రోజుకు దాని నుండి వారు బలవంతంగా దూరం చేయబడుతున్నారు. వారికి తమవైన భాషలు విశేష సంస్కృతులు వున్నప్పటికీ దినదినం అవి పరాయీకరణ చెందుతున్నాయి. దేశంలోని అధికారాన్నంతా తమ గుప్పెట్లో పెట్టుకొని పాలకవర్గంగా నిలిచిన పిడికెడు మంది భాష రాజభాషగా, వారి సంస్కృతి ఉచ్చ సంస్కృతిగా గణతికెక్కుతూ, అవి భిన్న తెగల, జాతుల, సంస్కృతుల ప్రజలపై ఆధిపత్యం చెలాయించడాన్ని చూస్తున్నాం. ఈ ఆధిపత్య విధానాలను ప్రజలు ఎక్కడికక్కడే తమ శక్తి మేరకు వ్యతిరేకిస్తున్నప్పటికీ దోపిడీ పాలకవర్గం చేతిలోనున్న 'రాజ్యం' వారిని పరమ క్రూరంగా అణచివేస్తోంది. అయినా నిరంతరం ప్రజా నిరసన-ప్రజాప్రతిఘటన భిన్న స్థాయిల్లో వ్యక్తమవుతూనే వుంది. ఈ క్రమంలో భాగంగానే బస్తర్ ఆదివాసులు తమపై భారత పాలకవర్గాలు రుద్దుతున్న హిందూ సంస్కృతిని అనాదిగా వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ మధ్యప్రదేశ్ ప్రభుత్వం, ప్రత్యేకించి బస్తర్ అటవీ ప్రాంతంలో నెలకొన్న గ్రామపంచాయితీలకు, ఆశ్రమ పాఠశాలలకు ప్రస్తుతం రామాయణాలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. దాదాపు 700 పేజీలు గల ఈ ఉద్గ్రంథం మార్కెట్టులో ఎంతలేదన్నా 1000 రూపాయల విలువ చేస్తుంది. మాడియా రాం కథ, మురియా రాంకథ, హల్బిరాంకథల పేరుతో ఆ గ్రంథాలను అందంగా అచ్చువేసి, ముఖ్యమంత్రి, గృహమంత్రి వాటికి ముందుమాటలు రాసి (రాయించి) అందులో వాటి ప్రాసస్త్యాన్ని వివరిస్తూ వాటికి కితాబులు ఇచ్చారు. యూనివర్శీటీలలో కూర్చొని తేరగా ప్రజల సొమ్ముతో సర్వసౌఖ్యాలు అనుభవిస్తూ, గత రోజుల నాటి ఆస్థాన పండితుల స్థానాన్ని ప్రస్తుత 'రాజుల' సేవలో పోషిస్తున్న 'మేధావి' వర్గం యిలాంటి ప్రభుత్వ దుశ్చర్యలకు నిస్సిగ్గుగా తోడ్పడుతోంది. ఈ బాపతుకు చెందిన వారిలో ఒకడైన హీరాలాల్ శుక్లా వీటికి రచయితగా నిల్చి తన ప్రజావ్యతిరేక స్వభావాన్ని చాటుకున్నాడు.

ఈ రామాయణాలకు తన ముందు మాటలో ముఖ్యమంత్రి గోండి భాషపై మొసలి కన్నీరు కారుస్తూ "గోండీలో సమృద్ధమైన సాహిత్య సారస్వతాలున్నాయన్నాడు. తులసీ రామాయణం గోండీలో రావడం ద్వారా లుప్తమవుతున్న గోండీ భాష పునరుజ్జీవనం జరగగలదని" దయ్యాలు వేదాలు వల్లించినట్లు భవిష్యవాణి పలికాడు. ఈనాటి సాహిత్యంపై అనేక 'వాదాలు' ముసురుకున్నాయనీ అనేక 'వాదులు' దళిత, పీడిత పేదప్రజల సంక్షేమం పేరిట రాజ్యమేలుతున్నారనీ (రాజ్యమేలుతున్నదెవరు దిగ్గిరాజే సెలవియ్యాలి సుమా!) అంటూ ఆదివాసీ ప్రజాపోరాటాలపై విసుర్లు విసిరాడు.

---

*(32వ పేజీ తరువాయి)*

కపట అంతర్జాతీయ సంస్థలకు వ్యతిరేకంగా ప్రపంచం నలుమూలలా ప్రజల క్రోధాగ్ని ఏ స్థాయికి చేరుకుందో, దాన్ని పెద్దమేరలోనే ప్రతిబింబించే స్థాయిలో వారు నిరసన పోరాటాలను నిర్వహించారు.

ఈ అంతర్జాతీయ రక్తపిశాచాలను యికపై మౌనంగా భరించడానికి ప్రపంచ ప్రజలు ఏ మాత్రం సిద్ధంగా లేరనే వాస్తవానికి తమ నిరసనల ద్వారా అద్దం పట్టారు.

సియాటిల్ సమావేశం ప్రపంచ వాణిజ్యంలో సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల పెత్తనాన్ని వివిధ ప్రజాసముదాయాలు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, పర్యావరణ రక్షణోద్యమవేత్తలు, ప్రజాస్వామిక వాదులు వగైరాలు - సవాలుచేసి, దాన్ని అరికట్టడానికి ముందుకొస్తున్నాయనే వాస్తవాన్ని ప్రదర్శించింది. నిరాయుధంగా, శాంతియుతంగా ప్రదర్శనలు జరుపుతున్నవారిపై సాగించబడిన జులుం, ప్రదర్శనకారుల నైతికబలానికి చిహ్నం.

సియాటిల్‌లోని ప్రదర్శనకారులు, సామ్రాజ్యవాద గుత్త సంస్థలు, వాటి చెప్పుచేతల్లో నడిచే వివిధ ప్రపంచదేశాల అధికారులు, మంత్రులు, రహస్య మంతనాల ద్వారా ఒప్పందాలకు వచ్చి వాటిని వివిధ దేశాల మధ్య కుదిరిన అంతర్జాతీయ ఒప్పందాలుగా చెలామణి చేసే కుతంత్రాలను ప్రపంచ ప్రజానీకం యికపై సాగనీయబోరని సమరశంఖం పూరించి మరీ సామ్రాజ్యవాదాన్ని హెచ్చరించారు. ప్రపంచ ప్రజానీకం 1995 మరకేష్ ఒప్పందం నాటికంటే యిప్పుడు మరింత జాగ్రుతమైందనీ, సామ్రాజ్యవాదుల పన్నాగాలు, పథకాలు, ఎలాంటి ప్రతిఘటనా లేకుండా నల్లేరు మీదబండి ప్రయాణంలా యికపై సాగబోదని తమ రక్తాన్ని చిందించి మరీ రుజావు చేశారు. ప్రపంచ ప్రజలు ఏకమై తమ నిరసనల ద్వారా 1998లో పెట్టుబడులపై బహుముఖ ఒప్పందం అనబడే దాన్ని ఓడించి నిలవరించారు. యిప్పుడు సియాటిల్ సభకు వ్యతిరేకంగా, హింసాపూరిత నిరసన పోరాటాలు చేపట్టి, సామ్రాజ్యవాదానికి దాని సంస్థలకు వ్యతిరేక పోరాటంలో మరో ముందడుగు వేశారు. ❖

నిజమే గోండీలో విశిష్టమైన ప్రజాసాహిత్యముంది. చారిత్రక పరిణామ క్రమంలో మానవుడు సాధించిన ప్రగతిలో భాషా వికాసం అత్యంత ముఖ్యమైనది. పురాతన బాషలన్నింటిలోనూ సమృద్ధ సాహిత్యముంది. అది శ్రమజీవుల సొంతం. శ్రమకు దూరమైన సోమరిపోతు (విశ్రాంతి) వర్గం' సృష్టించే కాల్పనిక సాహిత్యానికి దీనికీ పొత్తులేదు. కానీ, మెజారిటీ ప్రజల సాహిత్యం ఈనాటికీ లిపిబద్ధం కాలేదు. భాషా వికాసానికి అత్యంత తొలిదశలో తమ భావ వ్యక్తీకరణకు సంకేతంగా ప్రజలు తమనోటితోనే వెల్లడించిన ఒక రకమైన అతిపురాతనమైన చిత్రమైన ధ్వనులు వినదలుచుకుంటే ముఖ్యమంత్రికి ఈనాటికీ అబూజ్‌మాడ్ కొండల్లోని గోండు హృదయాలు వినిపిస్తాయి. వీటిని ఏ కంప్యూటర్లు సాఫ్ట్‌వేర్‌లు భద్రపరచలేకపోతున్నాయి. వేనవేల సంవత్సరాలుగా తరతరాలు అందిపుచ్చుకుంటున్న స్థానిక గోండు ప్రజల సాహిత్యాన్ని అక్షరబద్ధం చేయడానికి ఏ ప్రభుత్వమూ పూనుకోలేదు. పైగా ముఖ్యమంత్రి లుప్తమవుతున్న గోండీ భాష తులసీ రామాయణం గోండీలో రావడం ద్వారా పునరుజ్జీవింప చేయబడుతుందంటున్నాడు. యిదీ నిజమే. ఇన్నాళ్లుగా పాలకవర్గాల కుట్రలకు బలై దినదినం హిందూమతోన్మాద సంస్కృతి కమ్మేస్తున్న నీడల్లో లుప్తమవుతున్న గోండీ భాష పతనానికి తులసీ రామాయణం గోండీలో రావడం పరాకాష్టవుతుంది. భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు మరియు తులసీదాస్ యొక్క 5 శతాబ్దాల జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ముఖ్యమంత్రి శ్రీరాం చరితామానస్‌ను ఆదివాసీలకు అందిస్తున్నట్లు సంతోషం వ్యక్తం చేశాడు. 5 శతాబ్దాల క్రితం రచించిన క్రీస్తుపూర్వపు కట్టుకథలను 20వ శతాబ్దం చివరి సంవత్సరాల్లో ఆదివాసీ ప్రజలకు అందించడం ఆ ప్రజలను ఘోరంగా అవమానించడమే అవుతుంది.

అందుకే విశాల భూభాగంలో విస్తరించుకొని వున్న గోండు ప్రజలు ముఖ్యమంత్రి వితండ వాదనను అసహ్యించుకుంటూ తమపై రుద్దబడుతున్న రామాయణాలను మంటగలపడానికి నిశ్చయించుకుంటున్నారు.

ముఖ్యమంత్రి గోండులపై మొసలి కన్నీరు కారిస్తే, మాజీ గృహమంత్రి చరణ్‌దాస్ మహంత (నియంత) తన శాఖకు తగినట్టుగానే రామాయణంలో 'టెర్రరిజం'పై విరుచుకుపడుతూ ముందుమాటలో తన మూర్ఖత్వాన్ని చాటుకున్నాడు. సమాజంలో "కుటుంబ గౌరవాలు మంటగలిసిపోతున్నాయనీ, నైతిక విలువలు పతనమవుతున్నాయనీ, విజయం సాధించడానికి అడ్డదారులే మార్గంగా మారినాయనీ, పార్టీల స్వార్థానికి దురదృష్టవంతులు బలవుతున్నారని" వాపోయాడు. వీటన్నింటికి ఈ దోపిడీ వర్గాలు, వీరి రాజ్యంల బాధ్యత ఎంత ఉందో సెలవియ్యని 'శంత'కు టెర్రరిజం ఎందుకు వ్యాపిస్తుందో తెలుస్తుందనుకోవడం అవివేకమే అవుతుంది. యిలాంటి పరిస్థితుల్లో "భారతీయ జనజీవితానికి గొప్ప ప్రేరణనిచ్చే (ఈ ఘరానా పెద్దల అడ్డదారులన్నింటికి ప్రేరణ రామాయణ-భారతాలేనన్నది హంతకుడు ధారాసింగ్ నుండి రథయాత్రలు జరిపే అద్వానీల వరకు వారి చర్యలను గమనిస్తే తెలుస్తుందని పాఠకులు మరచిపోరాదు. మనల్ని మేల్కొల్పే తులసీదాస్ జ్ఞాపకాలే మన మనోఫలకంపై చోటుచేసుకుంటాయి" అన్నాడు.

మహంత తన ముందుమాటలో "ఆదివాసులు నేటికీ పరస్పర గౌరవ మర్యాదల పలకరింపుకు 'రాం రాం' అంటారని రాశాడు. ఇలా రాయడం ద్వారా మంత్రికి ప్రజల సంప్రదాయాలు-సంస్కృతి పట్ల ఎంతటి అజ్ఞానం వుందో తెలుస్తుంది. నిజానికి ఈనాటికి విశాల బస్తర్ జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆదివాసులుగా 'అబూజ్‌మాడ్' ప్రజలనే పేర్కొంటారు. ఈ ప్రజల రీతి రివాజులనే ప్రామాణికంగా తీసుకున్నా 'రాం రాం' ఎక్కడా వినపడదు. ప్రజలు పరస్పర గౌరవసూచకంగా 'జోహార్'తో పలకరించుకుంటారేగాని 'రాం రాం'తో కాదు. రామ పిచ్చి ముదిరి తలకెక్కిన మహంత కలవరింత నుండి పుట్టిన రాం రాంను వాడుకలోని వాదాలుగా చెప్పడం అతని అజ్ఞానాన్నే ప్రదర్శిస్తుంది.

ముఖ్యమంత్రి తన ముందు మాటలో చెప్పినట్లుగా సమృద్ధమైన గోండీ సారసత్వాన్ని భావి తరాలకు ఒక క్రమపద్ధతిలో అందించకుండా, తులసీదాస్ రామాయణాన్ని 'భగీరథ' ప్రయత్నాల ద్వారా గోండీకరించి అందించడం, అందులో అక్షరబద్ధంచేసి భిన్నమతాలు సహజీవనం చేస్తున్న దేశంలో సెక్యులరిజమే తమ విధానమని భారత రాజ్యాంగ సాక్షిగా నమ్మబలికే ఈ ఖద్దరు పెద్దలు హిందూ ధర్మపురాణేతిహాస గ్రంథాలను సమకూర్చడం వారి హిందూ మతోన్మాదానికే నిదర్శనమవుతుంది. దేశంలోని భిన్నమతాలను కించపర్చడమే అవతుంది. ముఖ్యంగా ఇన్నాళ్లయినా లిపిలేకున్నా ప్రజల నాలుకలపై చిరస్థాయిగా నిలిచిపోయిన గోండు ప్రజల మౌఖిక సాహిత్యాన్ని భూస్థాపితం చేసే చర్యే అవుతుంది.

ఈ దోపిడీ పాలకవర్గాలు చెప్పేదొకటి చేసేదొకటి అని ఆదివాసీ అభివృద్ధి కోసం రూపొందించిన ఈనాటి ఆచరణను 1952 నాటి నెహ్రూ 'పంచశీల' సూత్రాలతో పోల్చిచూస్తే తేలికగానే బోధపడుతుంది.

1. ప్రజలు తమదైన ప్రతిభాన్విత రీతిలో అభివృద్ధి చెందగలరు. అంతేగానీ మనం వారిపై ఎలాంటి విషయాలను కూడా రుద్దకూడదు. వారి స్వంత సంప్రదాయక కళలను సంస్కృతిని అన్ని విధాల ప్రోత్సహించడానికే కృషి చేయాలి.
2. భూములు మరియు అడవులపై ఆదివాసుల హక్కులను గౌరవించాలి.
3. పరిపాలన మరియు అభివృద్ధి పనుల నిర్వహణకుగానూ ఆదివాసీ ప్రజల నుండే కొంత మందికి శిక్షణ గరపి ఒక బృందాన్ని తయారు చేయడానికి మనం కృషిచేయాలి. నిస్సందేహంగానే టెక్నికల్ రంగాలకు చెందిన బయటి వ్యక్తులు, ప్రత్యేకించి ప్రారంభంలో అవసరమవుతారు. కానీ గిరిజన ప్రాంతాల్లోకి పెద్దెత్తున బయటి వాళ్లను అనుమతించకూడదు.
4. ఈ ప్రాంతాల్లో పాలనాపరంగా అధిక జోక్యం చేసుకోకూడదు లేదా అనేకానేక పథకాలతో వీటిని ముంచెత్తకూడదు. అంతకన్నా మిన్నగా వారి పాత సామాజిక మరియు సాంస్కృతిక సంస్థలతో పోటీపడే సంస్థలద్వారా పనిచేయకూడదు.
5. మానవ స్వభావంలో చోటుచేసుకున్న విలువలను బట్టి ఫలితాలను నిర్ణయించాలే కానీ, వెచ్చించిన డబ్బు మొత్తాల లెక్కల ద్వారా కాదు.

(గిరిజనుల సామాజిక విధానాల సమస్యలు రూపకల్పనలో - ఎల్విన్ సమర్పించిన పత్రం నుండి)

పంచశీల ద్వారా వెలుగులోకి తెచ్చిన ఈ కనీస విషయాలనుండి కూడా పాలకులు ప్రజలను వంచిస్తున్నారు.

## ప్రజలకు చారిత్రక వాస్తవాలు అవసరమా? పురాణాలా?

"ఒకజాతి ముందుకు పోవడానికి తోడ్పడేది చరిత్రా- పురాణమా? ఈ ప్రశ్నకు పురాణమే అని సమాధానం ఇచ్చే స్థితిలో వున్నవాడు బహుశా భారతీయుడే" అంటాడు ఒక ప్రముఖ కవి. వాస్తవ చరిత్రను లిఖిత రూపంలో నిక్షిప్తించడం యితర పాశ్చాత్యదేశాల వారికి తెలిసినట్టు భారతీయులకు తెలీదు. అందుచేత ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. మన తొలి సంస్కృతిని పాశ్చాత్యులు మన వైదిక సాహిత్యంలో చూస్తే, మన సంస్కృతిని మధ్య ఆసియావాసులు మన గణితంలోనూ, ఖగోళశాస్త్రంలోనూ, వైద్యశాస్త్రంలోనూ చూస్తే, మనం మట్టుకు దాన్ని రామాయణంలో చూస్తున్నాం. ప్రపంచానికి చూపించడానికి గర్వపడుతున్నాం. 21వ శతాబ్దంలో కూడా దాన్ని ఇంకా ఇంకా భావితరాలకు అందించడానికి 'దేశనాయకులు' ఉబలాట పడుతున్నారు.

మన జీవితానికి ఉపకరించే సత్యాలన్నీ రామాయణంలో ఉన్నట్టు ఆధునిక పౌరాణికులు హోరెత్తేటట్టు ప్రచారం చేస్తున్నారు. ఇంతకన్నా చిత్రం ఏమంటే, ఆ పురాణాలను కూడా వున్నవి వున్నట్టుగా వుండనీయటం లేదు. వాల్మీకి రామాయణంలోని భాగాలను పౌరాణికులూ, ఔత్సాహికులూ మార్చి వేస్తున్నారు. ఆయా పురాణాల కాలాలను, పరిస్థితులను వక్రీకరించి భావితరాలకు చరిత్రగూర్చి ఏం శాస్త్రీయ అవగాహన అందకుండా చేస్తూ ఏనాటికానాడు వాటిని భ్రష్టుపట్టిస్తున్నారు. ఈనాటి రామాయణంలో ఏడంతస్థుల మేడలు సృష్టించారు. కానీ, హరప్పా నాగరికత అంతరించిన తర్వాత వెయ్యేళ్లకుగానీ మన దేశంలో నగరం లాంటిది ఏర్పడ లేదు. ఈ ఏడంతస్థుల మేడలు, సీతమ్మవారి సిల్కు, నైలాను చీరలు రామాయణకాలంనాటి సంస్కృతికి చెందినవా? రామున్ని దేవున్ని చేసి, సీతమ్మను దేవతను చేసి వారికి రంగులు దట్టించి టివి తెరమీదకి కూడా ఎక్కించి పుష్కలంగా డబ్బు దండుకుంటూ ప్రజల్లో మత మౌఢ్యాన్ని పెంచి పోషించే 'నాగరిక' మనుషుల దాష్టీకానికి హద్దుల్లేని రోజుల్లో పురాణాల్లో చరిత్ర గూర్చి పరిశోధనలు, గిరిశోధనలు ఏవి చేసినా ఇసుక నుండి తైలాన్ని ఆశించడమే అవుతుంది.

## రామాయణం ఎవరికి ఏ వర్గాలకు సేవ చేస్తోంది? రామాయణం ఏం నీతిని బోధిస్తుంది?

దేవుడు మనిషిని చేశాడన్నదానికి రుజువు ఏమీలేదు కానీ, మనిషి దేవున్ని చేశాడనటానికి చాలా ఆధారాలున్నాయి. ఒకప్పుడు మానవ సమాజం దేవుడు లేకుండానే నడిచింది.

మనుషులు గణాలలో, గణనియమాలకు లోబడి జీవించినంత కాలమూ వారికి మతంతోకానీ యిప్పటి దేవుడితోగానీ అవసరం కలగలేదు. ఎందుకంటే వారి కష్టసుఖాలు సమంగా వుండేవి. ఒకడి శ్రమను మరొకడు దోచుకొని 'నీకన్నా నేను గొప్ప జన్మగల వాణ్ణి' అనే అవసరంగానీ, అవకాశంగానీ ఆ సమాజంలో లేకపోయింది. అది సమసమాజం. కానీ అది పరిణత సమాజం కాదు.

సామాజిక పరిణామ క్రమం గణ జీవితాన్ని నిర్మూలించవలసిన అవసరాన్ని ఏర్పరచింది. అలాంటి అవసరం ఏర్పడటానికి కారణం ఉత్పత్తి శక్తుల పెరుగుదల. ఎవడి శ్రమతో వాడి పొట్ట నిండని దశపోయి, ఒకడి శ్రమమీద నలుగురు బతకగల్గిన ఉత్పత్తి శక్తులు మానవుడి ఆధీనంలోకి వచ్చాయి. ఆహారం ఏరుకోవడం ద్వారా ఒక్క మనిషికి జీవనోపాధి లభించిన జాగాలో పశుపోషణతో ముగ్గురు బతికారనీ, అదే జాగాలో వ్యవసాయం నూరు మందిని పోషించిందని ఈనాటి శాస్త్రజ్ఞుల అంచనా వేయడం మనమెరిగిందే. ఉత్పత్తి శక్తుల పెరుగుదలతో వర్గ సమాజం ఏర్పడింది. దోచుకునేవాళ్లూ, దోచుకోబడేవాళ్లూ ఒకే సమాజంలోఅవతరించారు. అలాంటి వర్గ విభజన గణ జీవితానికి పూర్తి విరుద్ధం.

వర్గ సమాజంలో వివిధ తెగలకు స్థానం వుంది. దోచుకోబడేవాళ్లు తక్కువ. దోచుకునేవాళ్లు ఎక్కువా - యిది దురన్యాయంతో కూడినదే అయినా ఈ వర్గ సమాజం గణ జీవితానికన్నా పురోగమించినదే. గణజీవులు ఏనాడూ ఎరగనంత విస్తృత సమాజాలు వర్గవ్యవస్థలో ఏర్పడడానికి, రాజ్యాలు, సామ్రాజ్యాలూ పుట్టుకు రావడానికి అవకాశం ఏర్పడింది.

ఆటవిక గణాల నాయకులు వర్తకం ద్వారానూ, జీతాలకు యుద్ధాలు చేసి బోలెడంత సంపద గడించారు. అయితే, గణ నియమాల ప్రకారం సంపద అంతా గణానికి సమిష్టి సొత్తు అవుతుంది. దాన్ని ఆ నాయకులు సొంత ఆస్తి చేసుకోవాలనుకుంటే కుల ధర్మం అవలంబించాలి. యిది ఎలా సాధ్యం? ఎవరు చేస్తారు? బ్రాహ్మణులు వచ్చి "హిరణ్య గర్భ" విధి జరిపేవారు! ఆ నాయకున్ని ఒక బంగారు పాత్రలో కూచోబెట్టి మంత్రాలు చదివేవారు. ఆ పాత్రను బాహ్మలు తీసేసుకొని వాడి పూర్వీకులను ఏ పురాణంలోనో చూపేవారు లేదా వాడి పేరు ఏ పాత పురాణంలోనో దూర్చేవారు. కొందరు గణనాయకులు బ్రాహ్మలు కూడా అయ్యారు. ఏ ఆదిమజాతిలోనైనా తేలికగా ప్రవేశించగలగటం బ్రాహ్మణత్వానికి చాలా ఉపయోగపడుతూ వచ్చింది. కశ్యపులు ఆదిమవాసులను తమ శాఖలో కలుపుకొని, వంశనామాలు లేని వారందరికీ తమ గోత్రం యిచ్చారు. రాజపుత్రులలో ఎక్కువ మంది పూర్వులు ఆ కులానికి చెందిన వారు కాదు, ఆటవిక తెగకు చెందినవారు. అయితే, బ్రాహ్మణులు వారిని సూర్యవంశపు రాజులుగానో, చంద్రవంశపు రాజులుగానో చేసి క్షత్రియులుగా మార్చేశారు. (దిగ్గిరాజు కూడా తన చరిత్రను తడుముకుంటే మంచిది) యిలాంటి కూర్పుల వల్ల వ్యక్తులు సంకుచిత గణజీవితం నుంచి విశాల సమాజంలోకి అడుగుపెట్టారు.

ఈ ప్రక్రియకు దేవుడికి గాఢమైన సంబంధం వుంది. సాంఘిక దోపిడిని కొన్ని వర్గాల వాళ్లు శాశ్వతంగా ఎందుకు సహిస్తారు? పీడిత వర్గాలకు మత్తు మందుపెట్టి వాళ్ళ మనుషులను శాశ్వతంగా జోకొట్టాలి. అందుకుగాను వర్గ సమాజం మనసులను చేసినది కాదనీ దేవుడు చేసినదని సిద్ధాంతీకరించాలి. 'చతుర్వర్ణం మయా సృష్టం' అని 'దేవుడే' చేత చెప్పించారు. ఇవాళ మన పాలకులు మానవ వికాస చారిత్రిక వాస్తవాల్ని పక్కకునెట్టి రామాయణాన్ని బస్తర్ ఆదివాసులలోకి చొప్పించి, ఈ సమాజం దేవుడి సృష్టి అని, దీనిని మార్చపూనుకోకూడదని, టెర్రరిజం (నక్సలిజం!) భ్రమల్లో పడితే మహాఘాతకానికి బలైపోతారని బెదిరించ పూనుకుంటోంది.

మానవజాతి పరిణామ క్రమంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధితో ఇనుము కనుగొనబడిన పిదప వ్యవసాయం విస్తరించింది. అడవులను

విస్తారంగా నిర్మూలించి భూములను వ్యవసాయయోగ్యం చేశారు. అది రాజ్య విస్తరణకు కూడా ఎంతగానో వుపయోగపడిందని మౌర్యసామ్రాజ్య విస్తరణ చరిత్ర ఎరిగిన వారికి వేరే చెప్పనవసరం లేదు. అందుకు సాక్ష్యం 1600 సంవత్సరాల నాటి కౌటిల్యుని అర్థశాస్త్రమే. ఈ రాజ్యవిస్తరణలో వేల సంఖ్యలో గ్రామాలు కూడా వెలిశాయి.

ఈ క్రమంలో అడవుల్లో నివశిస్తున్న ఆటవికులను నయానో-భయానో లొంగదీసుకొని వ్యవసాయ సమాజంలో కలుపుకున్నారు. వారిని శూద్రులుగా, పంచములుగా చాతుర్వర్ణ వ్యవస్థ నామకరణం చేసింది. ఆ ప్రక్రియకు లొంగని వాళ్లు మరింత లోతట్టు అడవుల్లోకి పారిపోయి తలదాచుకొని తమ అస్థిత్వాన్ని నిలుపుకున్నారు. విస్తారంగా అడవులు నరికి వ్యవసాయయోగ్యం చేసిన భూములను సీతా (నాగటిచాలు) భూములుగా వ్యవహరించారు. మహాభారతం కథ ఎరిగినవారికి ఖాండవ వన దహనం గూర్చి విడిగా చెప్పనవసరంవుండదు. అరణ్యాలు తగులబెట్టి సాగుభూములు చెయ్యడం కూడా మానవ పరిణామ క్రమంలోని ఒక దశలో సర్వసాధారణ విషయమని తెలుస్తుంది. తగులబెట్టడం అంటే యింకా ఇనుము విస్తారంగా వాడుకలోకి రాకపోవడాన్నే సూచిస్తుంది. ఖాండవవన దహనంతో కొన్ని ఆటవిక జాతుల నిర్మూలనం అయిన తర్వాత జరిగిన ఆనాటి సభే - మయసభ. కవుల కలాలకు హద్దుల్లేకుండా సాగిన మయసభ మాయలన్నింటి వర్ణనలను భారతాన్ని రచించిన వారి పుర్రెలో నుండే పుట్టినవనే అనుకోవాలి. సాక్షాత్తు శ్రీరామ చంద్రుడు కూడా వ్యవసాయ సమాజాలు విస్తరిస్తున్న యిలాంటి సుదీర్ఘ క్రమంలో ఏదో ఒక తెగకు చెందిన సాధారణ మనిషిగా గుర్తిస్తే రామున్ని దేవుడిగా ఎందుకు మలిచారో, రామ కథ ద్వారా ఏం నీతిని బోధించదలుచుకున్నారో తర్వాత చూద్దాం. ఆటవిక దశ, అనాగరిక దశ అనేక దశ సహస్రాబ్దాలపాటు కొనసాగి అడుగడుగునా విప్లవ పరిణామాలు సాధించాయి. అడుగడుగునా మానవుడు ఆనాడు ఎదుర్కొన్న ఘర్షణలను గురించి ఈనాడు మనం ఊహించను కూడా ఊహించలేం. నాగరిక యుగం ప్రారంభమై అధికాధికంగా 3,4వేల ఏళ్లే అయింది. ఈ క్రమాన్ని శాస్త్రీయంగా విద్యార్థులకు బోధించపూనుకోలేని ప్రభుత్వం, ఈ క్రమంలోనే రాముడు కృష్ణుడు పుట్టుకొచ్చారని విశ్లేషించి వాస్తవాలను అందించ చేతకాని ప్రభుత్వం తన పబ్బం గడుపుకోవడానికి రామున్ని దేవునిగా మలచి, రామకథను కాగితాలపైకి ఎక్కించి ప్రజలను మతం మత్తులో నిద్రపుచ్చడానికి తంటాలు పడుతోంది.

మానవ వికాస క్రమంలో ఆర్యులు-అనార్యులు ఎంతగా కలగలిసిపోయారంటే ఈనాడు వీరిని నిర్దిష్టంగా, నిర్ధుష్టంగా విడదీసి చెప్పనలవికానంత సంక్లిష్టంగా. కాకపోతే ప్రాంతాల ప్రాతిపదికగా చరిత్రను చెప్పగలం. వేదకాలపు ఆర్యులకు ఒక మతమంటూ వున్నా లేకపోయినా, అనంతర కాలంలో మతంగా వ్యాప్తిలోకి వచ్చింది బ్రాహ్మణ మతం. తదనంతరం క్రీ.శ. 9-10 శతాబ్దాల నుండి అదే హిందూ మతంగా చలామణి అవుతోంది. దీనికి ఆధారం ఆధ్యాత్మికవాదం. క్రీ.పూ. 6వ శతాబ్దంనాటికి బ్రాహ్మణం మీద తీవ్రంగా పోటీ చేసింది బౌద్ధం. కొంతవరకు జైనం. బ్రాహ్మణ్యంలాగే. ఈ రెండూ కూడా కులవ్యవస్థను ఎరగని గణతంత్ర జీవితం నుండి పుట్టినవే. ఇలాగే శైవం, వైష్ణవం, సిక్కు మతం తదితర సవాలక్ష మతాలు వర్ణవ్యవస్థను తీవ్రంగా ప్రతిఘటించక, హిందూ సమాజంలో ఇమడగలిగాయి. కొన్ని మతాల వాళ్లు ఒక ప్రత్యేక సంగంగా నిలబడగలిగితే, మరికొన్ని 'చిల్లర' మతాల వాళ్లు హిందూ సమాజంలో ప్రత్యేక కులాలుగా చేరిపోయారు. ఇవే కాకుండా సింధూ ప్రాంతంపై అరబ్బుల దాడి క్రీ.శ. 712లో జరిగింది. వీరు మన దేశానికి వచ్చిన తొలి మహమ్మదీయులు. వీరు సింధు రాజైన దాహర్‌ను ఓడించి అనేక మందిని ఇస్లాం మతస్థులుగా మార్చారు. అరబ్బుల తర్వాత తురుష్కుల (టర్కీ నుండి వచ్చినవారు -తురకలు) దండయాత్రలు జరిగాయి. దానితో ఇస్లాం మతం యింకా చురుగ్గా వ్యాపించింది. బ్రిటీష్ వారి పాలన ప్రారంభమయ్యేవరకు మొగలుల పాలన సాగింది. బ్రిటీష్‌వారి కాలంలో క్రైస్తవం భారతదేశంలో వ్యాప్తి చెందసాగింది. వలసపాలన అనంతరం 1947 నుండి సెక్యులరిజం ముసుగులో తిరిగి హిందువుల పాలన సాగుతోంది. భారత దేశంలో పుట్టిన ప్రతివాడిని హిందువుగా మార్చాలన్న సంగ్‌పరివార్ హిందూ మతోన్మాదం మరీ ముఖ్యంగా గత రెండేళ్లుగా పరాకాష్టకు చేరింది. "ఈ సుదీర్ఘ మానవ ఇతిహాసంలో మేం ఏ మతానికి లొంగలేదనీ, మా దారిన మేం బతుకుతున్నామనీ, మేం ఆదివాసులమనీ" నేటికీ సగర్వంగా చెప్పుకునే ప్రజలను భారత హిందూ రాజ్యం సహించలేకపోతోంది. వారిని హిందువులుగా మార్చడానికి, యజ్ఞోపవితంతో బంధించడానికి పడుతున్న తంటాల్లో భాగమే ఆ ప్రజలపై రామాయణాన్ని రుద్దడం.

## "చరితం రఘునాధస్య శతకోటి ప్రవిస్తరం"

శతకోటి రామాయణాలన్నది అతిశయోక్తి కావచ్చుకానీ, రామాయణాలు చాలా వున్న మాట మాత్రం అబద్ధం కాదు. రామాయణం కావలసినవాళ్లే అల్పసంఖ్యాకులు. అందులో అధిక సంఖ్యాకులకు వాల్మీకి రామాయణం అవసరం లేదు. హిందీ వాళ్లకు తులసీదాసు రచన ప్రమాణం. ఆధ్యాత్మిక చింతనగల తెలుగు వాళ్లకు ఆధ్యాత్మిక రామాయణం, అరవవారికి కంబరామాయణం. కన్నడిగులకు కుమార వాల్మికి ఒకడు ప్రత్యేకంగా వున్నాడు. బౌద్ధులకు బౌద్ధరామాయణం, ఇన్ని రామాయణాలూ వాల్మికి రామాయణానికి కొంత భిన్నంగానే వుంటాయి. అధికశాతం ఆదివాసులు నివశిస్తున్న మధ్యప్రదేశ్‌లో, హిందీ వారికి మాతృభాష కాకపోయినా, హిందీని రాజభాషగా రుద్దుతున్న పాలకవర్గాలు తమకు ప్రామాణికమైన తులసీదాస్ రచనను ఆదివాసులపై రుద్దడం వెనుక కూడా వారికి వారి భాషా ఆధిక్యతా భావం లేదనలేం. ఇన్ని రామాయణాలున్నందునే అవి విన్న శ్రోతలకు చదివిన పాఠకులకు రాముడికి సీత ఏమవుతుందనే? సందేహం సహజంగా రావడంలో ఆశ్చర్యంలేదు. బౌద్ధరామాయణం ప్రకారం రాముడు-సీత-లక్ష్మణుడు దశరధుడి పట్టపురాణి బిడ్డలు. అంటే రామలక్ష్మణులకు సీత చెల్లెలవుతుంది. పట్టపురాణి మరణానంతరం దశరధుడు మరో భార్యను వివాహమాడగా ఆమెకు భరతుడు జన్మిస్తాడు. పుత్ర సంతానం సంబరంతో దశరధుడు తన భార్యను వరం కోరుకోమంటాడు. "రాజ్యాభిషేకం భరతుడికే చెయ్యాలి" అని ఆమె వరం కోరుతుంది. ఈ రాజ్యకాంక్ష గొడవల్లో తండ్రిమాటతో రామ-లక్ష్మణ-సీతలు 12 సంవత్సరాలు వనవాసానికై వెళ్లింది. వారణాసి (బౌద్ధ రామాయణం ప్రకారం దశరధుడు అయోధ్య రాజు కాడు వారణాసి రాజు) నుండి ఉత్తరాన గల హిమాలయాలకు, కానీ దక్షణాన దండకారణ్యానికి కాదంటుంది బౌద్ధరామాయణం. కానీ, వాల్మీకి రామాయణం ప్రకారం మృగనయని మిథిలేశ్వరి అపహరణ

ఒరిస్సా నుండి ఆంధ్రవరకు విస్తరించి వున్న దండక్ అడవుల్లోనే జరిగింది. ప్రాంతాలవారిగా చూస్తే లంకాధిపతి రావణుడు అనార్యుడనుకోవాలి. అంటే ద్రావిడుడన్నమాట. మరో మాటలో చెప్పాలంటే, ఈ దండకారణ్యంలో వనవాసం గడుపుతున్న ఆ ఆర్య సంతతికి చెందిన కౌమారదశలోని లక్ష్మణ కుమారున్ని స్థానిక ద్రావిడ లెయ్య (యువతి) మోహిస్తే పగబూనిన రామచంద్రుడు నిర్దాక్షిణ్యంగా ఆమె ముక్కుచెవులు కోయించి, లంకాధీశుని కోపానికి గురైన పాపఫలితంగా సీతవియోగానికి నెట్టబడతాడు. ఫలితం రామ రావణ యుద్ధానికి దారితీస్తుంది. శ్రీలంకలోని అశోకవనంలో (ఇప్పుడు అక్కడ అత్యంత సుందరంగా పర్యాటకులను ఆకర్షించే రీతిలో సీతమ్మ గుడిని, రావణున్ని పూజించే సింహళ ప్రభుత్వం నిర్మిస్తోంది) రావణాసురుని చెఱలోనున్న సీతమ్మ చివరకు వానరసైన్యం సహాయంతో యుద్ధం గెలిచిన రాముడి కైవసం అవుతుంది. అయితే సీతమ్మ ప్రాతివత్యాన్ని శంకించిన రాముడు సీతమ్మను అగ్ని పరీక్షకు గురిచేస్తాడు. సీత అగ్నిలో దూకి తన పాతివ్రత్యాన్ని నిరూపించుకొన్న తరువాత రాముడు అయోధ్యకు చేరి రాజ్యమేలుతాడు. ఇంతటితో రామాయణం ముగుస్తుందని సంక్షిప్తంగా చెప్పుకోవచ్చు. రాముడు 16 వేల సంవత్సరాలు చక్కగా పాలించాడన్న కథ కూడా వుంది. ఈ రామాయణాన్ని పుక్కిటి పురాణం కింద తప్ప పరిగణించనవసరం లేదు. యిది మనకు ఈనాడు ఎందుకూ పనికిరాదు. ఈ రామాయణం గూర్చి ప్రజల భాషలో ఒక్క మాటలో చెప్పాలంటే 'రామాయణం రంకు-భారతం బొంకు' అని చెప్పుకోవాలి. దాన్ని పవిత్ర గ్రంథంగా ఈనాటికి ఆరాధించడం ఆటవిక మనస్తత్వానికి ప్రత్యక్ష చిహ్నం. యిలాంటి రామాయణాన్ని ప్రభుత్వం ఆదివాసులపై రుద్దడం ద్వారా వారు ఏం నేర్చుకోవాలి? రామాయణంలో దాగిన విలువలు ఏనాటివి? అనేక చరిత్ర దశలు దాటిన మనిషికి వాటితో యింకా పని వుందా? ఈనాటి ఆదివాసీ ప్రజలకు సమకాలీన సమాజ విలువలు కాకుండా రామాయణ విలువలు బోధించడం దేనికి?

దశరథుడి బహుభార్యత్వం, రాముడు అనార్య స్త్రీలను చంపడం, చంపించడం, ముక్కు చెవులు కోయించడం అమానుషంగా సీతను అగ్ని పరీక్షకు నెట్టడం, కులకట్టుబాటు, పితృవాక్యపాలనా, పాదుకలతో రాజ్యపాలన, లంకా దహనంలో ద్రావిడులు సజీవదహనం మొదలైనవాటిల్లో కనీస ప్రజాస్వామిక విలువలు లేవు. ఆనాడు అవి వుండగలవని వూహించనూలేము. పరమ ఫ్యూడల్ విలువలతో, స్త్రీలపట్ల ఫ్యూడల్ ఫాసిస్టు ధోరణులతో తదనంతర కాలంలో రచించబడిన రామాయణం ఈనాడు కాలం చెల్లింది కాక మరేమవుతుంది? అందుకే యిలాంటి రామాయణాలను మంట కలపండని ప్రజలను కోరుతున్నాం. గ్రామ సభల ద్వారా ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందనే దిగ్గిరాజు, పాదుకలతో పాలించబడిన రామరాజ్యంలో ఎలాంటి ప్రజాస్వామ్యాన్ని చూస్తుండో! ఇప్పటికే రాముడు పుట్టినట్టు చెప్పబడుతున్న స్థలాన్ని అత్యంత వివాదాస్పద అంశంగా మార్చి, రాముని పేరుమీద రథయాత్రలు జరుపుతూ, పరమతాన్ని సహించని హిందూ మూర్ఖత్వంతో, పరమత ప్రార్థనా మందిరాలను కూల్చుతూ దేశంలో భిన్నమతాల ప్రజల శవాల గుట్టలపై ఓట్ల రాజకీయాలాడుతున్న హిందూ పాలకవర్గాలు ఎలాంటి జంకు-గొంకు లేకుండా ఆదివాసులను హైందవీకరించే ప్రక్రియలో భాగంగా రామాయణాన్ని వారిపై రుద్దుతున్నారు. యిది ఫాసిస్టు చర్యే. దీనిని ప్రజాస్వామ్య ప్రియులందరూ నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలి.

## ఆదివాసులను హిందువులుగా ఎందుకు మారుస్తున్నారు?

ఆదివాసుల అస్థిత్వం విడిగా ప్రత్యేకంగా కొనసాగడం దోపిడీ పాలకవర్గాలు ఎందుకు సహించలేకపోతున్నాయి? ఆదివాసీ ప్రాంతాలపై దాడులు చేసి అధికారాన్ని చలాయించే దోపిడీ వర్గం ఏ మతానికి చెందినదైనా, అది స్థానిక ఆదివాసులపై తన మతాన్ని రుద్దడానికే ఎందుకు పూనుకుంటుంది? యివి అత్యంత కీలకమైన ప్రశ్నలు. మానవ సమాజ వికాస క్రమంలో తొలుత గణాలు ఏర్పడి, కొన్ని గణాలు కలిసి తెగలుగా ఏర్పడి, ఆ పిదప అవి జాతులుగా వికసించిన సహజ పరిణామం చారిత్రకమైనది. అలాగే సమాజం వర్గసమాజాల రూపంలో చూసినప్పుడు ఆదిమ కమ్యూనిజం- తర్వాత ఉనికిలోకి వచ్చిన బానిస సమాజం తొలి వర్గ సమాజంకాగా ఆ పిదప భూస్వామ్య సమాజం -పెట్టుబడిదారీ సమాజం- కమ్యూనిజంలుగా జరిగిన జరగనున్న పరిణామాలను చారిత్రక భౌతికవాదం వివరిస్తుంది. నిర్దిష్టంగా మన భారత దేశానికి వస్తే, భూస్వామ్య సమాజం పెట్టుబడిదారీ సమాజంగా మారకుండా, యిక్కడి పెట్టుబడిదారీ శక్తులు పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా శక్తులు) విశాల రైతాంగాన్ని కలుపుకొని 'దున్నేవానికే భూమి' ప్రాతిపదికన ప్రజాస్వామ్య విప్లవాన్ని జయప్రదం చేయనీకుండా సామ్రాజ్యవాదం మధ్యంతరంగా అడ్డగించింది. యిక్కడి బడా పెట్టుబడిదారి శక్తులు కూడా యిటు భూసామ్యంతో అటు సామ్రాజ్యవాదులతోనూ కుమ్మక్కై ప్రజాస్వామిక విప్లవానికి విద్రోహం చేసి దళారి బూర్జువాలుగా అవతారమెత్తారు. దీనినే వికల పెట్టుబడిదారీ విధానం అని కూడా చెప్పుకోవచ్చు. యిప్పటికీ తెగలుగా చెప్పుకోబడుతున్న ఆదివాసీ ప్రజాసమూహాలు వాటి సహజ పరిణామ క్రమంలో జాతులుగా వికసించాలి కానీ, నేటి దోపిడీ పాలకవర్గాలు ఆ సహజ పరిణామాన్ని అడ్డగిస్తున్నాయి. ఆదివాసీ సమాజాలు జాతులుగా వికశిస్తే అవి విడిపోయే హక్కుతోసహా తమ స్వయం నిర్ణయాధికారం కోసం స్వాభిమానంతో పోరాడుతాయని, తమ ఆధీనంలో గల వనరులన్నింటిపైనా తమ సంపూర్ణ అధికారాన్ని నెలకొల్పుకోవడానికే అవి దృఢంగా కట్టుబడి వుంటాయనీ, ఇలా వుండడం ద్వారా పాలకవర్గాల దోపిడీకి సంకెళ్లు పడి లాభాలు దెబ్బతింటున్నాయన్నది వారి బెంగ. ప్రజల పోరాట చైతన్యం పెంపొందడం ద్వారా అవి అంతిమంగా దోపిడీ పాలకవర్గాల అస్థిత్వానికి కూడా సమ్మెటపోటులా తయారుకాగలవన్న దూరదృష్టితోనే ఆదివాసులను హిందువులుగా మార్చడానికి పూనుకుంటున్నారు. హిందువులుగా మారి, హిందూ వర్ణాశ్రమ ధర్మంలో, కుత్సితమైన కుల వ్యవస్థకు లొంగిపోయి వైకల్యతా స్థితికి లోనుకావడం ద్వారా ఈ దోపిడీ వ్యవస్థలో ఆర్థికంగా, రాజకీయంగానే కాకుండా సాంస్కృతికంగా కూడా ఆదివాసులు భాగమవుతారనీ, దీనితో తమ దోపిడీ యదేచ్ఛగా కొనసాగి తీరుతుందనే దోపిడీ వర్గాల దుస్వప్నాల కొనసాగింపే హైందవీకరణ అని గుర్తించాలి.

క్రీ.పూ.2000 సంవత్సరాల క్రితం ప్రపంచంలో అద్భుతమైన నాగరికతల్లో ఒకటిగా నిలిచిన మన దేశంలోని సింధూనాగరికత ఆర్యుల రాకతో పరిసమాప్తమైంది. ఆ తదనంతరం కాలంలో

ఇక్కడ అనేక మతాలు వెలిసినవి. హైందవం బౌద్ధం, జైనం, వీరశైవం, ఇస్లాం, క్రైస్తవం తదితరాల గూర్చి పైన చూశాం. అయితే, దండకారణ్యానికి సైతం ఏదో ఒక నెపంతో - అయితే వ్యాపారం మతవ్యాప్తి లేదా రాజ్యవిస్తరణ కాంక్షతో - పై మతాలన్ని పరిచయమైనవి. ఆంధ్రలోని వరంగల్‌లో కాకతీయుల కాలంలో వీరశైవం బాగా ప్రచారంలోకి వచ్చింది. కాకతీయుల ఆఖరిపాలకుడైన ప్రతాపరుద్రుడు తురుష్కుల దాడికి తట్టుకోలేక 1323లో మహ్మద్‌బిన్ తుగ్లక్‌కు బందీ కాగా, అతని సోదరుడు గోదావరి నది దాటి బస్తర్ అడవుల్లోకి పారివచ్చి యిక్కడి ఆదివాసి 'రాజు'ను హతమార్చి రాజ్యం చేపట్టాడు. వీరి వెంట వచ్చిన శివలింగాలు యిప్పటికీ అడవిలో అక్కడక్కడ దర్శిస్తుంటాయి. ఆదివాసుల దేవతగా చెప్పుకోబడుతున్న దంతేశ్వరి దేవి (దంతాల దేవి-కాళికాదేవి) వీరి కులదైవమే అంటారు. అయితే, మరో చారిత్రక ప్రచారాన్ని కూడా మనం చూడాలి. శివుడు పశుపతి రూపంలో సింధూ నాగరికతకు చెందినవాడే అంటారు. వేదకాలంలో శివుడు రుద్రుడి పేరుతో వ్యవహరించ బడ్డాడు. అతడు గణాలకు అధిపతి. జనజీవితం గణజీవితంగా వూరిస నాటికి శివుడు మహాదేవుడన్నమాట. శివుడు ఆసేతుహిమాచలం ఏలిన దేవుడు. అందరు దేవతలకన్నా దీర్ఘాయువు. అనార్యగణాలకు నాయకుడైన రుద్రుడు శివుడుగా పేరు మార్చుకొని హిందూ త్రిమూర్తులలో ఒకడుగా ఆమోదించబడ్డాడు. ఇదంతా ప్రజల మధ్య రాజీ విధానాన్ని సూచిస్తుంది. వర్గసమాజ క్రమంలో ఆర్యులు-అనార్యులు ఎలా కలగలిసిపోయారో, వారి దేవతలూ అలాగే సంబంధాలు - సంపర్కాలు పెట్టుకున్నారు. బ్రాహ్మణ మతం (హిందూమతం) తన మనుగడకోసం ఆటవిక ఆచారాలతో సహితం రాజీపడింది. బ్రాహ్మణ మతం పరమ అవకాశవాదితనం కలిగిందన్నది జగమెరిగిన సత్యం. ఈ పురాతన చరిత్రను పక్కనపెట్టినా గత 50యేళ్లుగా వివిధ హిందూ ధర్మ సంస్థలు విశాల బస్తర్‌లోని అడవులు కొండల్లోకి కూడా చొచ్చుక వచ్చి ఆదివాసుల అస్థిత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ ధర్మ సంస్థలకు 'రాజ్యం'పూర్తి సహకారాన్నందిస్తోంది. కొన్ని సంస్థలు విదేశీ నిధుల సహాయంతో హిందూ ధర్మాన్ని ఆదివాసుల్లో ప్రచారం చేస్తున్నవి. తమ మత విస్తరణ కాంక్షతో హిందూ ధర్మ సంస్థలు ఆదివాసులపై ఘోరమైన అమానుషత్వానికి కూడా ఒడిగడుతున్నాయి. వారి దేవతా విగ్రహాలను మలినబరుస్తున్నాయి. కొన్ని సంస్థలు వాటిని తెలివిగా అపహరించుకుపోయి పవిత్ర గంగాజలంతో (సుదూర ప్రాంతాలలోనున్న గంగను సంపాదించలేని వారికి ఏ జీవనదినైనా గంగగా వ్యవహరించడం ఆనవాయితీగానే వస్తుంది) శుద్ధిచేసి తమ హిందూ దేవతల సరసన ప్రతిష్టిస్తున్నారు. పేరు మారుస్తున్నారు. అవసరమైతే పెళ్లిళ్లు చేస్తున్నారు. ప్రజల సంప్రదాయ గోటుల్లను 'ఖాండవ వన దహనం''లంకాదహనం'లా తగులబెడుతూ సంబరపడిపోతూన్నారు. స్థానిక గోండు ప్రజల మధ్యపానాన్ని వ్యతిరేకిస్తూ ఆ పాత్రలను ధ్వంసం చేస్తున్నారు. నిజానికి గతంలో ఈ ఆర్యపుత్రులందరూ కూడా సురాపాన ప్రియులేనని, లేలేత ఆవుదూడల మాంసాన్ని అత్యంత ప్రియంగా భక్షించిన బౌజ్ఞావతారాలేనన్న గతాన్ని మర్చిపోయి, అహింసకు మూలం ఉన్నతమైన వ్యవసాయం అన్న విషయాన్ని ప్రక్కనబెట్టి ఆదివాసులు మాంస ప్రియులన్న కోపంతో వారిని 'కత్వా' (శూద్రులు)లుగా వ్యవహరిస్తూన్నారు.

ఇప్పటికే, ఆర్యులుగా విర్రవీగుతూ, హిందువులుగా గర్వపడుతూ `అనార్యులైన!(ఆదివాసులైన) స్థానిక ప్రజలపై విరుచుకుపడుతూన్న హిందువుల పరంపరకు తోడుగా గత రెండేళ్లుగా ప్రభుత్వం బస్తర్ కొండకోనల్లో రామాయణాలను అందిస్తూ హైందవోన్మాదుల పైశాచిక చర్యల కాష్టంలో నేతిని గుమ్మరిస్తోంది. హిందూ సంస్కృతి విస్తరణలో భాగంగా ఈ రోజు విశాల దండకారణ్యంలో తరతరాల సాంప్రదాయ పేర్లను తమ పిల్లలకు పెట్టుకునే ప్రజాసంస్కృతి అడగంటిపోతోంది. ప్రతి పేరుకు చివర 'రాం' తగిలించే వికృత సంస్కృతి రాజ్యమేలుతోంది. ముఖ్యంగా పాఠశాలల్లో చేరే ప్రతివిద్యార్థికి పేరు చివర'రాం'ను కావాలని దురుద్దేశ పూర్వకంగా, హిందూ భావజాలంతోనే తగిలిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే, `రాం' తగిలించడం వెనుక ఒక కుట్ర దాగివున్నదన్న వాస్తవం ప్రజల గమనంలోకి రాకుండా వుండేంత సహజంగా ఆ ప్రక్రియ జరిగిపోతోంది. గోండి మాట్లాడడం ఎబ్బెట్టుగా భావించడం ప్రారంభమైంది. హిందీ-మరాఠీ చత్తీస్‌గఢీలు మాట్లాడడం హుందాతనంగా భావిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వాల చలవతోనే జరుగుతుందన్న వాస్తవాన్ని గుర్తించకపోతే ఈ అక్రమాలపై, అన్యాయాలపై జరిపే పోరాటం గురిలేనిదవుతుంది. ఆదివాసీల ఇళ్లల్లో హిందూ దేవతల చిత్రపటాలు గోడలను మింగేస్తున్నాయి. దండకారణ్యంలో భాగంగా బస్తర్‌లో దినదినం పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి 'రాజ్యం'తో పాటుగా ఈ మత సంస్థలు కూడా ముందుకొస్తున్నాయి. ఆదివాసీ చిన్నారి బాలల మెదళ్లలోకి సైతం వేదాధ్యయనం ద్వారా చెత్తనంతా చొప్పిస్తూ కమ్యూనిజంపై కాషాయం విషాన్ని కక్కుతుంది. వారెన్నడూ కూడా వినని సంస్కృత శ్లోకాలను, పదాలను బలవంతంగా వారిచే అనిపిస్తుంది. కాబట్టి, యిలాంటి బలవంతపు, అశాస్త్రీయపు విద్యావిధానాన్ని వ్యతిరేకించాలి. విద్యార్థులపై, ప్రజలపై జరుగుతున్న సాంస్కృతిక దాడిని ఖండించాలి. ప్రతిఘటించాలి. రామాయణాలు మాకు అక్కర్లేదని మంటగలపాలి.

ఆదివాసులను హిందువులుగా చలామణిచేసే మరో ప్రక్రియ ప్రతి పదేళ్లకొకసారి జరిగే జనాభా లెక్కల సేకరణ. దేశంలోని జనాభా, జనాభాలో వివిధ మతాల ప్రజల సంఖ్య, వారి మాతృభాష తదితర వివరాలకు ఎవరైనా జనాభా లెక్కలపైనే ఆధారపడుతుంటారు. యివి అత్యంత ప్రామాణికం అని కూడా భావిస్తారు. కానీ, ఈ వర్గ సమాజంలో సర్వత్రా వర్గదృష్టి, వర్గన్యాయం, వర్గ ద్వేషము వ్యాపించి వుంటుందన్న ప్రాథమిక అవగాహన వున్నవారెవరైనా జనాభా లెక్కలకు వున్న పరిమితులను, వాటిలో జరిగే అవకతవకలను తప్పనిసరిగా దృష్టిలో పెట్టుకుంటారు. గత జనాభా లెక్కల వివరాలు, ప్రస్తుతం2001 కోసం జరుగుతున్న జనాభా లెక్కల వైనం చూస్తే అవకతవకలు, కుట్రలు సులభంగానే బోధపడుతాయి. 1961 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 1652 మాతృభాషలు నమోదైనాయి. యిందులో నాల్గింట ఒక వంతువి ఆదివాసీ భాషలే. యిందులో లక్షలాది గోండు ప్రజలు మాట్లాడే గోండీ కూడా వుంది. కానీ, 1981 నాటికి ఈ భాషల సంఖ్యను 106కు కుదించారు. పాలకులు ఎన్నెన్ని ప్రజల మాతృభాషలను కాలగర్భంలో కలిపేశారో అర్థమైతే, వారువారి ఘాతుకానికి ఎంతటి మూల్యం చెల్లించినా స్వల్పమే అవుతుంది. లక్షలాది ప్రజలు మాట్లాడే అనేక భాషలను మృత భాషలుగా నమోదు చేసి పిడికెడు మంది

కూడా మాట్లాడని సంస్కృతానికి పెద్దపీటవేశారు. స్థానిక ప్రజల భాషను కాగితాలపై రూపుమాపి పరాయి భాషపైన ఆంగ్రేజికి గౌరవం కల్పిస్తున్నారు. భాషల విషయంలో జనాభా లెక్కలు యింతటి దారుణానికి ఒడిగడితే ప్రజల తెగల అస్థిత్వాన్ని కూడా అవి నిలువునా పాతేస్తున్నాయి. జనాభా లెక్కల సేకరణలో ఆదివాసుల విషయంలో కులం వున్నచోట తెగను పేర్కొంటూ మతం అన్న చోట 'హిందూ' అని రాయడం క్షమించరాని ద్రోహమే అవుతుంది. ఒక్క బస్తర్ ఆదివాసుల విషయంలోనే యిలా జరగడంలేదు. దేశవ్యాప్తంగా విస్తరించివున్న ఆదివాసులందరి విషయంలో ఇలాగే జరుగుతోందని గుజరాత్ ఆదివాసుల పోరాటం ద్వారా తాజాగా వెలుగులోకి వస్తుంది.

2001 సంవత్సరానికి గాను జరుగుతున్న జనాభా లెక్కల సేకరణలో ఆదివాసులు అత్యంత అప్రమత్తంగా వుండాలనీ, వారు ఆదివాసులుగానే తమను నమోదు చేసుకోవాలనీ, 'వనవాసీ'లుగా చెప్పుకోవద్దనీ, మేము హిందువులం కాము ఆదివాసులమేననీ సగర్వంగా చెప్పుకోవాలనీ ఆదివాసులను కోరుతూ, 'ఆమె వనవాసి నతి' అన్న శీర్షికతో గుజరాత్‌లో ఒక కరపత్రాన్ని ఆదివాసులు పంచుతున్నారు. గుజరాత్‌లోని ఆదివాసులలో సంఘసేవా సంస్థలుగా పనిచేస్తున్న అనేక సంస్థలలో 'గుజరాత్ వనవాసి కళ్యాణ్ పరిషత్' ఒకటి. సంఘ్ పరివార్‌కు చెందిన ఈ సంస్థ హిందూ వారసత్వాన్ని కొనియాడుతూ, హిందూ దేవతలైన శ్రీరాం-హనుమాన్‌లను పొగడుతూ దక్షిణ, తూర్పు గుజరాత్‌లోని ఆదివాసీ ప్రాంతాల్లో విస్తృతంగా పత్రాలు పంచడాన్ని వ్యతిరేకిస్తూ పై కరపత్రం వెలుగులోకి వచ్చింది. ఆదివాసులు వెలుగులోకి తెచ్చిన కరపత్రంలో తమను 'ఆదివాసీ'లుగా పేర్కొనడంలో కుట్ర వుందనీ, అటవీ ఉత్పత్తుల పంపకాల సమయంలో ఈ సమస్య కీలకమవుతుందనీ, ఆదివాసులను అడవులనుండి, మిగతా వనరులనుండి వంచించడానికే సంఘ్ పరివార్ తమను వనవాసులుగా (వనంలో వున్న వారెవరైనా వనవాసులే-వారు ఆదివాసులు కానవసరం లేదనే తర్కానికి యిదే మూలం-వ్యాసకర్త) పేర్కొంటుందని కరపత్రం తన తీవ్ర నిరసనను వ్యక్తం చేసింది. ఇంతేకాదు, "మీరు మమ్మల్ని హిందువులుగా పిలిస్తే మమ్మల్ని ఏ కులస్థులుగా వర్గీకరిస్తారు.? శూద్రులుగానా, వైశ్య, క్షత్రియ లేక బ్రాహ్మణులుగానా? అలాగే మీ బిడ్డలను మా కొడుకులకు యిచ్చి వివాహం చేస్తారా?" అని కూడా ఆ కరపత్రం సవాలు విసిరింది "ఈ అడవుల్లో తొలినాళ్లనుండి నివశిస్తుంది మేమే. యిక్కడ నదీనదాలు; అడవులు-కొండలు; గడ్డి-గాద; నీళ్లు-నిప్పులు సర్వం మావే" అని కూడా ఆ కరపత్రం ప్రకటించింది. (6-5-2000 'హిందూస్థాన్ టైమ్స్' పత్రిక ఆధారంగా)

ఇంకా ఈ సందర్భంగా ఈ క్రింది విషయాన్ని కూడా దృష్టిలోకి తీసుకోవాలి.

ప్రపంచ ఆదివాసీ సంఘాలు తమల్ని తెగగా వ్యవహరించడాన్ని ఖండిస్తూ తమను ఆదివాసులుగా వ్యవహరించాలని 1996లోనే ఐక్యరాజ్య సమితిని కోరాయి.

సంఘ్ పరివార్ అయితే తన పకడ్బంధీ పథకంలో భాగంగానే సైద్ధాంతిక అవగాహనలో వనవాసి లేదా వనాల్లోని హిందువులు అంటుంది. అందుకే యిదంతా ఆదివాసులపై జరుగుతున్న కుట్రగానే పేర్కొంటున్నాం.

భారతదేశ షెడ్యూల్డు తెగలను ఆదివాసీ ప్రజల్లో భాగంగా పరిగణించాలని ఐక్యరాజ్యసమితి వర్క్ గ్రూప్ ప్రతిపాదించింది.

భారత ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. దాని వాదన - షెడ్యూల్డు తెగలు ఆదివాసీ ప్రజలు కారు, ఎందుకంటే

1. షెడ్యూల్డు తెగలు భారత దేశ మూలనివాసుల ఏకైక వంశీయులు కారు. భారత దేశం వివిధ సమూహాలు విలీనమయ్యే ప్రక్రియలో వుంది.
2. విభిన్న సామాజిక, సాంస్కృతిక విశిష్టతలు కలిగిన మెజారిటీ సమాజం తెగల పట్ల వివక్షతకా అమలుచేయడం లేదు. వారిపై పెత్తనమూ చేయడం లేదు. తెగలలో అనేకం మైనారిటీ సాంస్కృతిక, మత సముదాయాలకు చెందినది.
3. 'ఆదివాసీ'పదం భారత దేశ బ్యూరాక్రట్లకూ, పాలకవర్గానికీ నచ్చలేదు. వాళ్లు వారిని 'షెడ్యూల్డు తెగలు'గానూ, 'గిరిజనులు' గానూ వ్యవహరిస్తారు.

పై సమస్య ఒక్క గుజరాత్‌లోని ఆదివాసులదేకాదు. సమస్త భారత ఆదివాసీ ప్రజానీకసమస్య. ఆదివాసుల అస్థిత్వానికి అన్నివైపుల నుండి ప్రమాదం తీవ్రతరం అవుతోంది. సంఘ్‌పరివార్ అధికారం చేపట్టిననాటినుండి ఈ ప్రమాదం యింకా పెరిగింది. దేశంలోని మైనార్టీ మతాలు కూడా యిదే స్థితిలో వున్నవి. ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన పిదప 1-5-2000 నాడు రాయపూర్ వచ్చిన సుదర్శన్ ఇస్లాం భారతీకరణ కావాలన్నారు. యిలా ఆదివాసులు-మైనార్టీ మతస్థులు దేశంలో అత్యంత అభద్రతాభావాన్ని ఎదుర్కొంటున్నారు. 1991 జనాభా లెక్కల ప్రకారం దేశంలో హిందూ జనాభా 83 శాతం వున్నారు. దేశంలో 12 శాతానికిపైగా వున్న ముస్లింలు, 8.08 శాతం వున్న ఆదివాసులు మరియు సిక్కు - జైన - బౌద్ధ - క్రైస్తవ మతాల వారందరిని ఏ లెక్కల్లో వేశారో ఆ అధికారులే సెలవియ్యాలి. ఇలాంటి తప్పుడు లెక్కల ద్వారా తమ అస్థిత్వాన్ని కోల్పోయే ప్రమాదంలో వున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మతమౌఢ్య శక్తులతో, హిందూ మతోన్మాద దుర్మార్గులతో పోరాడడమే వీరి ముందున్న ఏకైక కర్తవ్యం. ఆ పోరాటానికి దేశంలోని అన్ని వర్గాల, అన్ని సెక్షన్ల ప్రజలు-ప్రజాస్వామిక వాదులు మద్దత్తు యివ్వాలి. అలా పోరాడడం ద్వారానే తమ సంస్కృతులను నిలబెట్టు కోవడమేగాదు నూతన సంస్కృతికి బీజాలు వేసినవారవుతారు. అదే ఈనాటి ప్రజల కర్తవ్యం.

| | |
|---|---|
| 1891లో బస్తర్‌లోకి వచ్చిన యితర ప్రాంతాలవారు | 16262 |
| 1991బస్తర్‌లోకి వచ్చిన యితర ప్రాంతాలవారు | 700000 |
| 1891లో బస్తర్ జనాభా (కాంకేర్ మినహా) | 247255 |
| 1991లో బస్తర్ జనాభా (కాంకేర్‌తో సహా) | 2200000 |

☆ ☆ ☆ ☆

*(41వ పేజీ తరువాయి)*

అయితే ప్రపంచం మునుముందుకే సాగుతుంది. కొత్తది ఖాయంగానే పాతదాని స్థానంలో ప్రవేశిస్తుంది. పురోగామిది, నశించిపోయేదాన్ని ఖాయంగానే ఓడిస్తుంది. సరైనది అనివార్యంగానే తప్పుడుదాన్ని అధిగమించితీరుతుంది. సోషలిస్టు వ్యవస్థ అంతిమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానంలోకి ప్రవేశిస్తుంది. కమ్యూనిజం ప్రపంచం నలుమూలలా నెలకొంటుంది. ఇదే అభివృద్ధి సాధారణ ధోరణి. యిది అప్రతిహతంగా సాగే చారిత్రక ధోరణి. ☆

# తప్పుడువి మంచివిగా మారాయి!

*[ఒక మార్క్సిస్టు - లెనినిస్టు పార్టీలో చెడ్డ విషయాలు, తప్పుడు పంథాలు తలెత్తడం వింత విషయమా? కలవరపడాల్సిన విషయమా? అంటే కానేకాదు, అది గతితార్కిక నియమం ప్రకారమే ఉత్పన్నమవుతుంది. చెడుకు ద్వంద్వ స్వభావం వుంటుంది. కొన్ని పరిస్థితుల్లో చెడు మంచిగా పరివర్తన చెందగలదు అనే మార్క్సిస్టు-లెనినిస్టు అవగాహనను, చైనా కమ్యూనిస్టుపార్టీ చారిత్రకానుభవం నుండి వివరించే ఈ సిద్ధాంతవ్యాసం 'పెకింగు రివ్యూ' పత్రికలో 1971లో ప్రచురితమైంది]*

సిద్ధాంతంపైనా, రాజకీయపంథాపైనా బోధన గరపడానికై మన క్యాడర్లు, యోధులు, మన పార్టీలోని రెండు పంథాల మధ్య పోరాటాల చరిత్రను శ్రద్ధగా అధ్యయనం చేశారు. ఈ అధ్యయన క్రమంలో మాకు ఈ ప్రశ్న ఎదురైంది. పార్టీలో వాంగ్‌మింగ్, లీషావ్‌చీ తదితర రాజకీయ దగాకోరులు ఆవిర్భవించడం, వారు ప్రాతినిధ్యం వహించిన తప్పుడు పంథాలు తల ఎత్తడం వంటి చెడు పరిణామాలను సరిగ్గా ఎలా అర్థం చేసుకోవాలి?

## చెడుకు (విషయానికి) వుండే ద్వంద్వ స్వభావం

మార్క్సిస్టు-లెనినిస్టు తాత్విక ఆలోచనను అధ్యయనం చేసిన పిదప, మేము మన పార్టీలోపల రెండు పంథాల మధ్య పోరాటాల చారిత్రక అనుభవాన్ని గతితార్కిక భౌతికవాద దృక్పథంతో విశ్లేషించాము. చైర్మన్ మావో ఇలా అన్నారు "*సరైన రాజకీయ, సైనిక పంథా, ప్రాప్తకాలజ్ఞంగా (స్పాంటేనియస్‌గా) ప్రశాంతంగానూ ఆవిర్భవించదు, అది పోరాట క్రమంలోనే ఆవిర్భవిస్తుంది*" సరైన పంథా ఆవిర్భవించి, అభివృద్ధి చెందడానికై, సరైన పంథాకు, తప్పుడు పంథాకు మధ్య పోరాటం, త్యజించ వీలులేని ఒక షరతు అని అర్థం చేసుకోవడంలో మాకు చైర్మన్ మావో చేసిన పై బోధన వుపయోగపడింది. మన పార్టీ చరిత్ర, పార్టీలోపల్నే వుండిన అతివాద, మితవాద పంథాలపై చైర్మన్ మావో విప్లవ పంథా పోరాటం జరిపి, సదా విజయాన్ని సాధించిన చరిత్ర. మన పార్టీ సరిగ్గా ఈ రెండు పంథాల మధ్య పోరాటం ద్వారానే నిలకడగా పటిష్టపడుతూ వచ్చింది; అభివృద్ధిచెందింది, విస్తరించింది. పార్టీలో తప్పుడు పంథాలు, దుష్టశక్తులు, చెడుపనులు తలెత్తడం అనేది వింత విషయమేమీ కాదు. భయపడవలసిన విషయమూ కాదు. దాన్ని ఎలా సరిగ్గా అర్థం చేసుకోవాలి, దానితో సరిగ్గా వ్యవహరించడం ఎలా? అన్నదే అసలు సమస్య.

చైర్మన్ మావో మనకు ఇలా బోధించారు "*విషయాల పూర్వాపరాలను గమనిస్తూ, సమస్యలను అన్ని వైపుల నుండి పరిశీలించడం అనే విషయాన్ని మనం తప్పనిసరిగా నేర్చుకోవాలి. కొన్ని పరిస్థితుల్లో, ఒక చెడు విషయం, సత్ఫలితాలకు దారితీయవచ్చు*" మంచి విషయం చెడు ఫలితాలకు దారి తీయవచ్చు, ప్రతీదీ రెండుగా విభజితమవుతుంది. చెడు విషయానికి ద్వంద్వ స్వభావుం వుంటుందని పార్టీ లోపలి రెండు పంథాల మధ్య పోరాటచారిత్రక అనుభవం రుజువు చేస్తోంది. అది ఒక వంక విప్లవాన్ని దెబ్బతీస్తుంది; అయితే, అది విమర్శ నెదుర్కొన్న తర్వాత ఒక నకారాత్మక (నెగటివ్) ఉదాహరణగా, పార్టీ సభ్యులకు ప్రజలకు గుణపాఠాలు నేర్పుతుంది. తద్వారా ఇతోధికంగా ఘనవిజయాలను సాధించడంలో విప్లవానికి సాయపడుతుంది.

మొదటి విప్లవ అంతర్యుద్ధ కాలంలో (1924-27) చెన్‌టుషి రెనగేడ్ (స్వపక్ష పరిత్యాగి) ముఠా, చైర్మన్ మావో సరైన పంథాను వెర్రిగా వ్యతిరేకించింది. మితవాద లొంగుబాటు పంథాను భుజాలపైకెక్కించుకుంది. రైతాంగం, పెటీ బూర్జువా వర్గం, మధ్యస్థ బూర్జువా వర్గాలపైనా ప్రత్యేకించి సాయుధ సేనలపైనా నాయకత్వాన్ని చేజారి పోనిచ్చింది. దాని ఫలితంగా, శక్తివంతంగా పురోగమిస్తుండిన మహా విప్లవం (1924-27 నాటి విప్లవం) వైఫల్యంతో ముగిసింది. మన పార్టీ స్థాపన పిదప కొద్దికాలంలోనే, చైనా విప్లవం వెల్లువలో వున్న కాలంలోనే యింతటి చెడు పరిణామం చోటుచేసుకుంది., అంతమాత్రానే, దీనితో చైనా విప్లవానికి భవిష్యత్‌పై ఏ ఆశా లేకుండా పోయిందని అనగలమా? అనలేము! చైర్మన్ మావో నాయకత్వాన మొత్తం పార్టీ చెన్‌టుషీ మితవాద అవకాశవాద పంథాకు వ్యతిరేకంగా కృత నిశ్చయంతో పోరాడింది. మహా విప్లవ వైఫల్యం నుండీ, తప్పుడు పంథా చైనా విప్లవానికి కలిగించిన తీవ్ర నష్టాన్నుండీ గుణపాఠం నేర్చుకుంది. ఈ మార్క్సిస్టు-లెనినిస్టు సత్యాన్ని అర్థం చేసుకోగలిగింది : "*చైనాలో సాయుధ పోరాటం లేకపోతే కార్మిక వర్గానికిగానీ, ప్రజలకుగానీ, కమ్యూనిస్టుపార్టీకిగానీ ఎటువంటి ప్రతిష్ఠ వుండబోదు. విప్లవ విజయం అసంభవ మవుతుంది*" అలా ఒక చెడు విషయం మంచి విషయంగా మార్చబడింది. చైర్మన్ మావో యొక్క శ్రామికవర్గ విప్లవ పంథా పోరాటాల ద్వారా అభివృద్ధి చెందింది. ఇక అప్పటి నుండీ మన పార్టీ గ్రామీణ స్థావర ప్రాంతాల నిర్మాణం, కార్మిక, కర్షక ఎర్రసైన్య స్థాపన, సాయుధ శక్తిద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం అనే బాటను పట్టింది. ఆ విధంగా విప్లవం మళ్లీ కొత్తగా అభివృద్ధి చెందింది.

వ్యవసాయ విప్లవ యుద్ధ కాలంలో (1927-37) "*నూటికి నూరుపాళ్లు బోల్షివిక్కు*"గా తన్ను తాను అభివర్ణించుకొన్న రెనగేడ్ వాంగ్ మింగ్ "*లిలీ-సాన్ పంథాను వ్యతిరేకించడం*" అనే పేరిట ప్రజలను ప్రక్కదారి పట్టించడానికి కుక్కపాట్లు పడ్డాడు. పార్టీ నాయకత్వాన్ని చేజిక్కించుకున్నాడు. లిలీ-సాన్ పంథాను మించిన అతివాద పంథాయైన అవకాశవాద పంథాను బలంగా ముందుకు తెచ్చాడు. దాని ఫలితంగా విముక్తి ప్రాంతాలలోని పార్టీ శక్తులలో 90% దాకా శక్తులనూ, శత్రు ఆక్రమిత ప్రాంతాల్లోని పార్టీ శక్తులను నూటికి నూరుమందిని కోల్పోవడం జరిగింది. ఎర్ర సైన్యానికి తప్పనిసరి పరిస్థితుల్లో లాంగ్‌మార్చ్ చేపట్టవలసి వచ్చింది. వాంగ్ మింగ్ అవకాశవాద పంథా, చైనా విప్లవానికి పెనువిఘాతాన్ని కల్గించింది అన్నది నిజంగానే చాలా చెడ్డ విషయమే. అయితే, రక్తాన్ని మూల్యంగా చెల్లించి నేర్చుకున్న గుణపాఠంతో, మనపార్టీ దాని సభ్యులూ, క్యాడర్లూ, వాంగ్ మింగ్ ముసుగును చించివేశారు. వాడినో బూటకపు విప్లవకారుడుగా బట్టబయలు చేశారు. ఈ "*నూటికి నూరుపాళ్ల బోల్షివిక్కు*" ఒక కుహనా మార్క్సిస్టు అని గ్రహించ గలిగారు. వాంగ్ మింగ్ తప్పుడు పంథాకు వ్యతిరేక పోరాటం ద్వారానే మొత్తం పార్టీ కామ్రేడ్లు, చైర్మన్ మావో విప్లవ పంథాయే ఏకైక సరైన పంథా అనే లోతైన అవగాహనకు రాగలిగారు. పార్టీ 1935 జనవరిలో ట్సున్‌యిలో నిర్వహించిన సమావేశంలో పార్టీ కేంద్ర నాయకత్వ అంగంలో వాంగ్‌మింగ్ అతివాద అవకాశవాద పంథా ఆధిపత్యానికి స్వస్తి చెప్పడం జరిగింది. మొత్తం పార్టీపైన చైర్మన్ మావో నాయకత్వాన్ని నెలకొల్పడం జరిగింది. ఆ విధంగా

పార్టీ పంథా సరైన మార్క్సిస్టు లెనినిస్టు బాటకు రావడం సాధ్యమైంది. వాంగ్‌మింగ్ అవకాశవాద పంథా చాలా చెడ్డ విషయమే, అయితే దానికి వ్యతిరేకంగా విమర్శ పోరాటాల ద్వారా ప్రజలు తప్పుడు పంథా ప్రమాదాన్ని, దాని పుట్టుకకు గల కారణాలను తెలుకోగలిగారు. తప్పుడు పంథాకు వ్యతిరేకమైనదైన ఛైర్మన్ మావో విప్లవ పంథా యొక్క సవ్యతను అవగాహన చేసుకున్నారు. ఈ విధంగా, చెడు విషయం, చైనా విప్లవ విజయానికి మౌలిక గ్యారంటీనీ సమకూర్చిన చాలా మంచి విషయంగా మార్చబడింది.

కార్మిక వర్గం రాజకీయాధికారాన్ని స్వాధీనం చేసుకున్న పిదప, సోషలిస్టు విప్లవం ప్రగాఢమయిన కొద్దీ మన పార్టీ లోపల రెండు పంథాల మధ్య పోరాటం మరింత పదునెక్కింది, మరింత జటిలమయింది. మార్క్సిజంపట్లా, ఐక్యత పట్లా, పైపై విధేయతను ప్రకటిస్తూనే లీషావ్-చీ, తదితర బూటకపు మార్క్సిస్టులు, వాస్తవానికి రివిజనిజాన్ని, చీలికవాదాన్ని (స్ప్లిట్టిజం) ఆచరించారు. నోరు తెరిచినప్పుడల్లా చక్కని పదాల్ని, పదబంధాల్ని వినియోగిస్తూ వారు కార్మికవర్గ నియంతృత్వాన్ని కూలదోసి, పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించడానికై తమ విఫలయత్నంలో భాగంగా కుట్రలు, కుహకాలకు పాల్పడ్డారు. అయితే, ఛైర్మన్ మావో, శ్రామికవర్గ మహత్తర సాంస్కృతిక విప్లవాన్ని నడపడానికై ప్రజారాశులను సంఘటితపరచారు. (లీషావ్‌చీ ముఠా) నేరపూరిత కుట్రలను సకాలంలో ఎండగట్టి భగ్నం చేశారు. లీషావ్‌చీ యొక్క విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టు పంథాపై విస్తృతస్థాయిలోనూ, చాలా లోలోతుల్లోకి వెళ్లే పద్ధతిలోనూ సాగిన విమర్శ, యావత్తు పార్టీకి అత్యంత ప్రగాఢమైన ఎడ్యుకేషన్ను అందించింది. ఈ సంకుల పోరాటంలో మొత్తం పార్టీ, మొత్తం సైన్యం, సమస్త దేశ ప్రజానీకమూ, సోషలిజపు చారిత్రక కాలానికి పార్టీ మౌలిక పంథాను లోతుగా అవగాహన చేసుకోగలిగారు. వర్గ పోరాటానికి వుండే దీర్ఘకాలిక, సునిశిత, సంక్లిష్ట స్వభావాన్ని ఇంకా బాగా అర్థం చేసుకోగలిగారు. నిజమైన మార్క్సిజాన్ని బూటకపు మార్క్సిజాన్ని వేరు చేసి చూడగలిగే తమ శక్తి సామర్థ్యాలను వృద్ధి చేసుకునే విధంగా మొత్తం పార్టీ, మొత్తం సైన్యం దేశ ప్రజానీకం సమస్తమూ యింకా చైతన్యయుతంగా, శ్రద్ధాసక్తులతో మార్క్సిజం-లెనినిజం- మావో ఆలోచనా విధానాన్ని అధ్యయనాన్ని చేసేందుకుగానూ ఈ పోరాటం ప్రేరణను కలిగించింది. ఇది కార్మికవర్గ నియంతృత్వాన్ని ఇతోధికంగా పటిష్టపర్చడానికై సాగే పోరాటానికి పరిస్థితులను సృష్టించింది. పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరింపజేయాలని తలచిన అందరు బూటకపు మార్క్సిస్టులకు వ్యతిరేకంగా మరింత శక్తి వంతంగా పోరాడడంలో మనకు వుపకరించింది.

ఇదంతా "*పాజిటివ్, నెగటివ్ ఉదాహరణల ద్వారా, పదే పదే నిర్వహించబడే ఎడ్యుకేషన్ ద్వారానే, పోల్చి చూడడం, వ్యత్యాసాలు చూడడం ద్వారానే, విప్లవ పార్టీలు, విప్లవ ప్రజలు తమల్ని తాము రాటుదేల్చుకోగల్గుతారు*" అనే సత్యాన్ని సంపూర్ణంగా రుజువు చేసింది. ఒక తప్పుడు పంథా నకారాత్మక (నెగటివ్) ఉదాహరణ ద్వారా మన గురువులలో ఒకరిగా అవుతుంది. నకారాత్మక ఉదాహరణ ద్వారా బోధించే గురువుల పాత్రను చిన్నచూపు చూసేవారు, అర్థం చేసుకోనివారు, సమగ్రమైన గతితార్కిక భౌతికవాదులు కారు.

పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటం, అనేది సమాజంలోని వర్గపోరాటం పార్టీలోపల అభివ్యక్తమవడమే. యిది మానవుని ఇష్టానిష్టాలతో నిమిత్తం లేని ఒక భౌతిక వాస్తవికత, వర్గాలు, వర్గపోరాటం, బూర్జువా వర్గం, సమాజంపై దాని ప్రభావం యివి ఉనికిలో వున్నంత కాలమూ మన పార్టీలో తప్పుడు పంథాలు, దుష్ట శక్తులు, చెడువిషయాలు అనివార్యంగానే ఆవిర్భవిస్తాయి. మనం వాటిని ఒప్పుకునే సాహసం చేయాలి. వాటిని ఎండగట్టాలి. వాటని సంపూర్ణంగా అధిగమించాలి. ఒక సోషలిస్టు సమాజంలో వోడింపబడిన దోపిడీ వర్గాలు, తమ వోటమికి ఎన్నడూ రాజీపడరు. సరికదా, వివిధ మార్గాల ద్వారా మనపై బరితెగించి పోరాటాలు చేస్తారు. అందుచేత పార్టీ సభ్యుల వేషం వేసిన పార్టీ వ్యతిరేక శక్తులు, మార్క్సిజం-లెనినిజం అంటూ కొంగజపం చేసే మార్క్సిజం-లెనినిజపు శత్రువులు మన పార్టీలో ఆవిర్భవించడం, వింతవిషయమేమీ కాదు; అది వర్గ పోరాటం భౌతిక వాస్తవిక నియమానికి అనుగుణ్యమైనది. అయితే కొందరు కామ్రేడ్లకు ఏకపక్ష దృష్టితో కూడిన అభిప్రాయాలుంటాయి. వారికి సర్వసమగ్రమైన విప్లవ చైతన్యం లోపించింది. వారు వర్గం పోరాటం దీర్ఘకాలంసాగేది. తీవ్రంగా వుండేది. అతి జటిలమైనది అని సిద్ధాంతపరంగా అంగీకరిస్తారు. అయితే మరో వంక, వర్గ పోరాటం స్వల్పకాలంలోనే ముగిసిపోవాలనీ, అంతా నల్లేరు మీద బండిసాగినట్లు సాఫీగా సాగిపోగలదనీ ఆశిస్తారు. చాలా తరచుగానే వారికి, చెడువిషయాలు ఎదురైనప్పుడు, అందుకు మానసికంగా సిద్ధమై వుండరు. ఒక చెడు వాస్తవంగా చోటుచేసుకున్నప్పుడు, దాన్ని అర్థం చేసుకోవడం వారికి బాగా కష్టమవుతుంది. కొన్ని సార్లు అనవసరమైన ఆందోళనలకు గురవుతుంటారు. ఇదంతా చరిత్ర అభివృద్ధికి సంబంధించిన గతితర్కానికి విరుద్ధమైనది.

## పరివర్తనకు కొన్ని పరిస్థితులు అవసరమవుతాయి

ఒక చెడు విషయం, ఒక మంచివిషయంగా పరివర్తన చెందే అవకాశం వుంది. అయితే ఈ పరివర్తన వాస్తవమవడానికి కొన్ని పరిస్థితులు అవసరమవుతాయి. ఛైర్మన్ మావో మనకు యిలా బోధించారు "*కొన్ని పరిస్థితుల్లో, ఒక వైరుధ్యంలోని రెండు విరుద్ధాంశాలలో, ప్రతిఒక్కటి, వాటి మధ్య ఘర్షణఫలితంగా, అనివార్యంగానే తన విరుద్ధాంశంగా తన్నుతాను పరివర్తన చెందించుకుంటుంది. యిక్కడ పరిస్థితులు ఆవశ్యకం. కొన్ని పరిస్థితులు లేకపోతే విరుద్ధాంశాలలో ఏ ఒక్కటి కూడా తన విరుద్ధాంశంగా పరివర్తన చెందజాలదు*" పార్టీలోని అంతరంగిక పోరాటంలో ఒక చెడువిషయాన్ని, మంచి విషయంగా పరివర్తన చెందించడానికి ముఖ్యమైన షరతు ఏమిటంటే సరైన పంథామార్గదర్శత్వం కింద, పట్టిన పట్టు విడవకుండా సాగించే పోరాటమే. చరిత్రలో బూటకపు మార్క్సిస్టులలో ఎవరూ కూడా మన ఆశయాన్ని దెబ్బతీయడంలో కృతకృత్యులు కాలేదు. దానికి మారుగా, వారందరూ ఓటమినే చవిచూశారు. ఛైర్మన్ మావో మనల్ని మహత్తర పోరాటాలలోకి నడిపి, సాధారణ ధోరణికనుగుణంగా అభివృద్ధిని గైడ్‌చేసి, విప్లవానికి అనుకూలమైన మార్గంలో వైరుధ్యాలను పరివర్తన చెందించడాన్ని పెంపొందించే సానుకూల పరిస్థితులను సృష్టించి, తద్వారా తిరోగామి పరివర్తనలను సకాలంలో నిరోధించి, అధిగమించేటట్లు చేశారు అనే వాస్తవమే చెడు విషయాలు, మంచివిషయాలుగా మార్చబడడానికి వెనుకనున్న కారణం.

విప్లవ క్రమంలో, అన్ని రకాల తప్పుడు పంథాలు ప్రభావాలు, నానారకాల దుష్టుల విద్రోహాలు, దుష్ట విషయాలు వుంటాయి.

*(తరువాయి 39వ పేజీలో..)*

## బస్తర్ విముక్తి పోరులో

# "మహాన్ భుంకాల్- 1910"

*[బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యతిరేక బస్తర్ విముక్తి పోరాటంలో చోటుచేసుకున్న అనేక తిరుగుబాట్లలో మహాన్ భుంకాల్ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. 'మాడియా రాజ్'గా ప్రకటించుకొని 40 రోజుల ప్రజల పాలన సాగిన చరిత్ర దానికుంది. బ్రిటీష్ దుర్మార్గుల పాశవిక సైన్యాలను తన్ని తరిమిన ఘనత కలిగినది. బ్రిటీష్ పాలనాధిపతులు పెద్దెత్తున సైనిక చర్యలను చేపట్టగా, ఓటమి సంభవించి బస్తర్ నడిగడ్డన రక్తం ఏరులై పారిన మహాన్ భుంకాల్ (క్రాంతి) అది. ఇంతటి ఘనమైన, వీరోచితమైన చరిత్రను కలిగిన మహాన్ భుంకాల్ భారత స్వాతంత్ర్య పోరాట పుటల్లో చోటుచేసుకోకపోవడం పాలకవర్గ కుట్రల్లోకెల్ల పెద్ద కుట్రగా చెప్పాలి. ఆనాటి ప్రజావీరుల బలిదానాలను సంస్మరించని 'స్వతంత్ర భారత సంగ్రామ చరిత్ర' మాకక్కరలేదని ప్రకటించాలి. గత వీరుల పోరాట జ్ఞాపకాలతో కొత్త నెత్తుటి సిరాతో వారి వారసులుగా కొత్త చరిత్రను రాసుకుందాం.*

*1910 తిరుగుబాటుకు గల ప్రాముఖ్యత రీత్యా మూడు భాగాలుగా ఆనాటి వివరాలను అందించబూనుకుంటున్నాం. ఇందులో భాగంగా ప్రస్తుత సంచికలో ఆ తిరుగుబాటు కాలంలోని సామాజిక- ఆర్థిక-రాజకీయ పరిస్థితులను వివరిస్తాం. రానున్న సంచికల్లో రెండవ భాగంగా **"మహాన్ భుంకాల్-1910 నాటి గోండు ప్రజల గెరిల్లా యుద్ధం"*** మరియు మూడవ భాగంగా ***"చరిత్రసాక్షిగా వీరుల త్యాగాలు వృధాపోవు"**గా అందిస్తాం*

*- సంపాదక మండలి]*

11వ శతాబ్ధంలో బస్తర్‌ను నాగవంశీయులు పాలించినట్లుగా చరిత్రకారులు పేర్కొంటారు. ఆనాడు 'బార్సూర్'ను రాజధానిగా చేసుకొని వీరి పాలన సాగినప్పటికీ కుర్సుపాల్ మరియు చిత్రకోట్‌లు కూడా రాజకీయ కార్యకలాపాల కేంద్రంగానే వుండేవి. కానీ, 14వ శతాబ్ధంలో పొరుగున వున్న వరంగల్ రాజధానిగా ఆంధ్ర దేశాన్నేలుతున్న కాకతీయుల పాలనపై ముస్లింలు దాడి చేయగా రాజు ప్రతాప్ రుద్రదేవ్ వారికి బందీగా చిక్కగా, అతని సోదరుడు అన్నందేవ్ ప్రాణతీపితో గోదావరి దాటి బస్తర్ అడవుల్లోకి శరణుగా పారివచ్చాడు. అతడు యిక్కడి నాగవంశీయరాజును తుదముట్టించి, బస్తర్ పాలనను కైవసం చేసుకున్నాడు. జగ్ధల్‌పూర్‌కు పశ్చిమాన వున్న ముధోటాను మొదటి రాజధానిగా చేసుకొని యితని పాలన సాగింది. యితని తరువాత అనేక తరాలవారు కూడా ముధోటా కేంద్రంగానే పాలన సాగించినప్పటికీ, పురుషోత్తమదేవ్ కాలంళో జగ్ధల్‌పూర్‌కు 12 కిలోమీటర్ల దూరాన ఉత్తరంలో నున్న `బస్తర్' రాజధానిగా ఉనికిలోకి వచ్చింది.

బస్తర్ రాజకుటుంబంలో చెలరేగిన అంతఃకలహాల ఫలితంగా బస్తర్ రాజ్యంలో పొరుగు రాజ్యాల జోక్యం చోటుచేసుకుంది. రాజు దల్వాత్‌దేవ్ తన కనిష్ఠ సోదరుడి కుట్రతో సాగిన మరాఠాల దాడిని తట్టుకోలేక రాజ్యం విడిచివెల్లినా, అనతి కాలంలోనే తిరిగి సైనికదాడి జరిపి విజయాన్ని వరించి తన ఓటమికి బదులు తీర్చుకున్నాడు. పిదప తన రాజధాని నగరాన్ని బస్తర్ నుండి ఇంద్రావతికి దక్షిణ ఒడ్డున వ్యూహాత్మక ప్రాముఖ్యతను కలిగిన జగ్ధల్‌పూర్ పట్టణానికి మార్చుకున్నాడు. (లక్షకుపైగా జనాభాతో పట్టణంగా మారిన ఈనాటి జగ్ధల్‌పూర్‌కు సమీపంలో ఒక చారిత్రాత్మక ప్రదేశంగా బస్తర్ పల్లె పర్యాటకులకు దర్శనమిస్తుంది)

ఆనాడు జగ్ధల్‌పూర్ కేవలం 400-500 గుడిసెలు కలిగిన పట్టణం. ఇటుకలతో మట్టి ముద్దలతో లేపిన గోడలపై గడ్డి కప్పులు కలిగిన ఇండ్లు అవి. ఆనాటి రాజప్రాసాదం కూడా ఇంగ్లీషు అధికారుల రిపోర్టు ప్రకారం అదో గడ్డి గుడిసెనో కాకపోతే సాధారణ గుడిసెలకన్నా కాస్త పెద్దసైజు కలిగింది. 1856లో ఇ.సి. ఇలియట్ అనే ఇంగ్లీషు అధికారి తొలిసారిగా బస్తర్‌ను సందర్శించేవరకు కూడా ఈరాజ్యంలో 30-40 గ్రామాలే, 100-200 ఇండ్లు కలిగినవి వుండేవట. ఇప్పటికీ విశాల బస్తర్ జిల్లాలోని విస్తారమైన అడవుల్లో, విసిరివేయబడ్డట్టుండి పట్టుమని 10 గుడిసెలు కూడా లేని పల్లెలెన్నో వున్నాయి. 1854 వరకు ఇక్కడ అతి ప్రాచీనమైన ఒక సంప్రదాయ ముండేదంటారు. ఇంట్లో ఎవరైనా కాలం చెల్లిపోతే, ఆ ఇల్లు కూల్చి మరోచోట మరో కొత్త ఇల్లు నిర్మించుకునే సంప్రదాయం వున్నందున నగర వికాసానికి ఆటంకమైందనీ, దివాన్ దల్‌గండన్ సింగ్, కాలంలో (1853-54) ఈ సంప్రదాయాన్ని నిలిపి వేశాడంటారు. అయితే, ఈనాటికీ దండకారణ్యం మాట పక్కనబెట్టినా తెలంగాణా భూస్వామ్య పల్లెల్లో ఇంట్లో ఎవరు కన్నుమూసినా తిదివార నక్షత్రాలు బ్రాహ్మడిచే లెక్క వేయించి కొన్ని మాసాలు ఇళ్లు వదలి వెళ్లే పురాతన సాంప్రదాయం వర్ధిల్లుతోంది. ఇంతేకాదు, ఆ పల్లెలోని పై కులస్థుల ఇళ్లల్లోకి ఉడుం చొచ్చినా గ్రహచారం కలిసి రాలేదని బ్రాహ్మడి మాట మీద కొంతకాలం ఇళ్లు విడిచే సాంప్రదాయం మిగిలింది. ఇది ఇలా వుంటే, ఈనాటికీ బస్తర్‌లో ఎవరైనా పచ్చని చెట్టుకు వేళ్లాడి ఉరిపెట్టుకుని ఆత్మహత్య చేసుకుంటే ఆ చెట్టును మొదలంటా నరికి వేస్తారు.

రాజు దల్వాత్‌సింగ్ మరణంతో అతని వారసుల్లో రాజ్యాకాంక్షతో ఘర్షణ ప్రబలింది. దుర్యావ్‌దేవ్ పొరుగు రాజుల మద్దత్తుతో పాలన చేపట్టాడు. మద్దతందించిన పొరుగు రాజైన జైపూర్ రాజు (ఒరిస్సా) కోటపాడ్‌ను కైవశం చేసుకోగా, నాగపూర్ మరాఠా రాజులు ఏకంగా బస్తర్ రాజును సామంత రాజు స్థాయికి చేర్చారు. కోట్‌పాడ్ తదనంతర కాలంలో బస్తర్-జైపూర్ రాజ్యాల మధ్య ఆరని మంటగా మిగిలి అనేక ఘర్షణలకు కేంద్రబిందువయ్యేది. యిది 1870 నాటి మాట.

1854లో జరిగిన రెండవ ఆంగ్లా-మరాఠా యుద్ధంతో నాగపూర్ నేరుగా ఆంగ్లేయుల పాలన క్రిందకు వెళ్లిన ఫలితంగా బస్తర్ రాజ్యం కూడా వారి ఆధీనంలోకి వెళ్లినట్లే అయింది. అలా బస్తర్ బ్రిటీష్-ఇండియా పాలనలో భాగంగా అయింది. ఆ కాలంలో రాయపూర్ కమీషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఇంగ్లీషు అధికారి ఇ.సి. ఇలియట్ 1856లో తొలిసారి బస్తర్‌లో పర్యటించినప్పటికీ, బస్తర్ పాలన బ్రిటీష్‌వారి హయాంలో ఛత్తీస్‌గఢ్ డివిజన్ కమీషనర్ ఆధీనంలోని సిరొంచలో గల అప్పర్ గోదావరి డిప్యూటీ కమీషనర్ కిందనే 1-4-1882 వరకు సాగింది. ఆ పిదప కొంతకాలం ఒరిస్సాలోని కలహండి భవానీపట్న పాలనా వ్యవహారాల సూపరిండెంట్ ఆధీనంలోకి వెళ్లింది. ఆనాడు బ్రిటీష్ వాడి చిత్తం

వచ్చినట్టు బస్తర్ పాలన సాగింది. ఈనాడు ఢిల్లీ-భోపాల్ పాలకుల దయాదాక్షిణ్యంపై బస్తర్ పాలన సాగుతోంది. పరాయివాడి దాడితో బస్తర్‌లో 'ప్రజల' పాలన అంతంకాగా, పరాయి వారి పాలనను అంతమొందించడానికి బస్తర్ ప్రజ నిరంతరం పోరాడుతూనే వున్నారు. ఆ పోరుకు సజీవసాక్ష్యం నేటి దండకారణ్యపోరు.

1854 నాటికి బస్తర్ పాలన ఏ విధంగా వుండేదో చూద్దాం. రాజు క్రింద 'ప్రధానమంత్రి' (దివాన్) వుండగా, ఇతడి క్రింద రాజ్యం పలు సబ్ - డివిజన్‌లుగా విభజింపబడింది. ఒక్కొక్క సబ్ డివిజన్‌కు ఒక్కో 'కామ్‌దార్' (మేనేజర్) వుండేవాడు. యితడికి నిర్దిష్టమైన ధాన్యం బత్తాగా యివ్వడమేకాకుండా 10 రూపాయల జీతం వుండేది. ఇతడి కింద కొన్ని గ్రామాలపై ఒక 'నేగి' వుండి, నేగీలు సబ్ డివిజన్ వ్యాప్తంగా వుండేవారు. నేగీకి సహాయంగా 'హిక్మీ' లుండేవారు. హిక్మీల కింద గ్రామాల్లో ప్రజల నుండి నేరుగా పన్నులు వసూలు చేసే గ్రామ ముఖ్యులుండేవారు. వీరినే 'మాంజీ'లనేవారు వీరు ప్రజలపై, గ్రామాలపై పూర్తి పట్టుగలిగిన శక్తులు. నిన్నటివరకు వీరి మాటే దండకారణ్యంలో చెల్లుబాటైందన్నా, ఈనాడుకూడా పోరులేని పల్లెల్లో వీరిమాటే చెల్లుతుందన్నా ఆ శక్తుల బలాన్ని గుర్తించినట్లవుతుంది.

రాజు
↓
దివాన్ (ప్రధానమంత్రి)
↓
కాందార్ (మేనేజర్)
↓
నేగి
↓
హిక్మా
↓
మాంజీ

బ్రిటీష్‌వారి పూర్వం భూమి పన్ను వసూలు లెక్కలు సరళంగా ఉండేవి . ఒక్కో నాగలికి 8అణాల నుండి (0-8-0) $1^1/_4$ రూపాయి వరకు (20అణాలు) లేదా ఒక్కో పారపై నాలుగు నుండి 16 అణాల వరకు పన్ను వసూలు చేసేవారు. అంటే ఇంకా స్థిరవ్యవసాయం కానీ, పూర్తిగా నాగళ్లపై ఆధారపడిన వ్యవసాయంగానీ బస్తర్‌లో నెలకొనలేదని గుర్తించాలి. ఈనాటికీ అబూజ్‌మాడ్ కొండల్లో పారలతో నేలను తవ్వి విత్తడం పోలేదని తెలుసుకోవాలి.

1863లో దివాన్ దల్‌గంజన్ సింగ్ మరణంతో పరిపాలన అస్తవ్యస్థంగా తయారవ్వగా మోతీసింగ్ దివాన్ బాధ్యతలు చేపట్టాడు. బ్రిటీష్‌వారి నమ్మినబంటుగా వ్యవహరించాడు. ఇలాంటి అధికారుల ద్వారా ప్రజలపై రోజు రోజుకు బ్రిటీష్‌వారి చట్టాల వల బిగుసుకుపోసాగింది. ఇతడి కాలంలోనే తొలిసారిగా బస్తర్ రాజ్యంలో 'ఇండియన్ పీనల్‌కోడ్' ప్రవేశపెట్టబడింది. స్టాంప్ ఆక్ట్ వచ్చి కోర్టుల ఆదాయాన్ని పెంచింది. 1865 నాటికి రాజు స్థాయి బ్రిటీష్‌వారి దృష్టిలో 'పెద్దపాలేరు' స్థితికి దిగజారింది. రాజు ఏ నేరస్థున్నైనా విచారించి జీవిత ఖైదు చేయవచ్చు. కానీ, కమిషనర్ అనుమతి వుండాలి. మోతీసింగ్ కాలంలోనే బ్రిటీష్‌వారు పశువుల మేతపై పన్నును 1866లో ప్రారంభించాడు. ఇంతేకాదు, భారత జాతీయ పెట్టుబడిదార్ల అభివృద్ధిలో బంజారాలకు అత్యంత ప్రాముఖ్యత వుందనీ, మొగల్‌ల కాలంలో వారు వారి సైనిక గుడారాల్లోకి కూడా ఒంటెలపై సరుకులు చేరవేశారనీ, కానీ బ్రిటీష్‌వారి రాకతో బంజారాల వికాసం అపమార్గం పట్టిందని ప్రముఖ చరిత్రకారుడు కోశాంబి పేర్కొన్న బంజారాలే బస్తర్ వాసులకు బయటి ప్రపంచంతో, వ్యాపారంతో సంపర్కం ఏర్పర్చిన ఆద్యులని అనుకుంటే, వీరి వ్యాపారంపై కూడా దిగుమతి సుంకాలు విధించారు. ఇలా, రాజకోశానికి అదనపు ఆదాయాలు వచ్చిచేరే అనేక మార్గాలు ఉనికిలోకి రాసాగాయి. ఇవన్నీ ప్రజలను పీడించే దోపిడీ మార్గాలే. ఇలాంటి మార్గాన్వేషకులు ప్రజల్లో అభాసుపాలు కావడంతో కొత్తవారిని దివాన్‌లుగా ప్రజలకు పరిచయం చేయడం బ్రిటీష్‌వారికి భారత పాలన ఉగ్గుపాలతో నేర్పింది. దీనిలో భాగంగానే మోతీసింగ్ స్థానంలో 1870 నాటికి దివాన్‌గా గోపీనాథ్ వచ్చాడు. ఇతడు నేత వృత్తుల వారిపై కూడా పన్ను విధించాడు. అలాగే సారా బట్టీలను వేలం వేయడం ద్వారా ఎక్సైజ్ సుంకాల వసూళ్లకు ప్రాణం పోశారు. జగ్దల్‌పూర్ వడ్డీ వ్యాపారస్థుల నుండి, వర్తకుల నుండి 'పంథారీపన్ను' వసూలు ప్రారంభమైంది. రీవా నుండి వలస వచ్చిన మైహిత్రి బ్రాహ్మణుడు రాజగురు లోక్‌నాథ్ రాజప్రసాదంలో పూజారిగా వుండేవాడు. అన్నందేవ్ నుండి బ్రిటీష్‌వారి మధ్య పాలించిన రాజులు తమ అవసరాల రీత్యా జగల్‌పూర్‌కు భిన్న సాంప్రదాయాల ప్రజలను, భిన్నవర్ణాల ప్రజలను తీసుకవచ్చి స్థిరపర్చారు.

1876 తర్వాత సమాజంలోని అన్ని రంగాలలో ఆర్థిక, రాజకీయ, సాంఘిక రంగంలో బ్రిటీష్‌వారు తమ దోపిడీని మరింత తీవ్రతరం చేయడానికి మరిన్ని సంస్కరణలను చేబట్టారు. ప్రతి సంస్కరణకు 'ప్రజా సంక్షేమం' అన్న బోర్డు కూడా తగిలించారు. దోపిడీదార్లు ఏ పని మొదలు పెట్టినా, ఏ చర్య చేపట్టినా యిలాంటి బోర్డులు తగిలించకుంటే ప్రజలు తక్షణం ఎదురుతిరిగే ప్రమాదం వుంటుందనీ, లోకాన్ని నమ్మించడానికి బోర్డులవసరమనీ లేనిచో పుట్టగతులుండవనీ పుట్టుకతోనే నేర్చుకున్నారు.

1. భూమి పన్ను వసూలుకై భూమి బందోబస్తు విధానాలను చేపట్టింది.
2. తన దోపిడీ యంత్రాన్ని త్వరగా తరిలించడానికి రాజ్యవ్యాప్తంగా రోడ్ల నిర్మాణానికి తలపడింది.
3. అటవీ సంపదపై కన్నేసిన వలసపాలకులు ఆదివాసీ ప్రజలను అడవుల నుండి దూరం చేస్తూ నూతన చట్టాలకు రూపకల్పన చేశారు.
4. న్యాయ, పోలీసు వ్యవస్థ తమ పాలన కనుగుణంగా రూపు దిద్దారు.
5. తమ పాలనకు అవసరమైన రీతిలో బంట్రోతులను సృష్టించు కోవడానికి పాఠశాలలను ఏర్పరచారు.
6. ప్రజాసంక్షేమం పేరుతో వైద్యశాలలు నెలకొల్పారు.

పై రంగాలలో తలపెట్టిన 'సంస్కరణల' ఫలితంగా అడవిలో బ్రిటీష్ అధికారుల, ప్రభుత్వ ఏజంట్ల దండు పెరిగి ప్రజలపై విరుచుకుపడసాగింది. పాఠశాల చెప్రాసి, ఉపాధ్యాయుడి నుండి దివాన్ వరకు తమ తమ స్థాయిల్లో ప్రజలను వేధించుకు తినేవారే. అడవుల్లో తమ పటాలాలతో సంచరించే అధికారుల సేవలో ప్రజల నెత్తురు నీళ్లై పారేది. ఆ చెమట కాలువలు ప్రజల్లో క్రోధాగ్నిని రగల్చక మరేం చేస్తాయి? ఆ పరాయి పీడన స్థానిక ప్రజల్లో తిరుగుబాటు బావుటానెత్తకుండా నిలవరించలేకపోయింది. వీటన్నింటి పరాకాష్టే మహాన్ భుంకాల్‌గా 1910లో బద్దలైంది. మరింత వివరంగా పై దోపిడీ వివరాలను

చూద్దాం!

1891 మూడు విధాల ప్రయోజనాల పేరుతో నూతన అటవీ చట్టాలు ప్రవేశపెట్టబడ్డాయి.

1. అటవీ సంపత్తి సంరక్షణ
2. అడవుల నుండి లభించే ఆదాయాలను వృద్ధి పరచడం ప్రత్యేకించి కలప మరియు తేనె, మైనం, లక్క, హుర్రా, బంక మొదలైన చిన్నతరహా అటవీ ఉత్పత్తుల అమ్మకం ద్వారా ఆదాయాన్ని పెంచడం.
3. ఆదివాసీ ప్రయోజనాలను కాపాడడం.

70% అడవులతో నిండి వుండి మూడింట రెండు వంతులు పోడు వ్యవసాయంపై ఆధారపడి వున్న బస్తర్‌లో బ్రతికే ఆదివాసుల జీవన విధానంపై నూతన అటవీ చట్టాలు గొడ్డలిపెట్టు పెట్టాయి. ప్రజలు తమ సర్వస్వాన్ని కోల్పోయినట్టే భావించసాగారు. 1896లో స్టేట్ ఫారెస్ట్ అధికారిగా హంట్ వచ్చాడు. రిజర్వు ఫారెస్టు అధికారిగా బ్లంట్ వచ్చాడు. అడవుల వర్గీకరణతో రిజర్వు ఫారెస్టులలో పోడు వ్యవసాయం నిషేధించబడింది. 1178 చదరపు మైళ్లు రిజర్వు అడవులుగా ప్రకటించారు. అత్యంత ప్రాచీన పద్ధతుల్లో వ్యవసాయాన్ని చేసే ఆదివాసీలకు ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్కొక్కరికి కేవలం $1^3/_4$ (పావుతక్కువ రెండెకరాలు) సాగు లాయకైన భూమిని కేటాయించి 8 అణాల పన్ను విధించారు.

నారాయణపూర్‌లో కొత్తగా కర్ర డిపోను తెరిచారు. దక్షిణాన కుంట ఒక ముఖ్యమైన కలప వ్యాపార కేంద్రమైంది. 15 x10 చదరపు మైళ్లు గోదావరి తీరం వెంట అడవి నరకడం నిషేధించారు. అడవిలో పోగుచేసిన కర్రను తమ దేశానికి సముద్ర మార్గాన తరలించుక పోవడానికి అనుగుణంగా గోదావరిలో తెప్పలపై రవాణాచేసి నిలవ చేయడానికి రాజమండ్రిలో మరో కలప డిపోను తెరిచారు. బ్రిటిష్ హయాంలో నెలకొన్న ప్రైవేట్ రైల్వే కంపెనీలకు అంతాఘడ్ నుండి సాల్ (గుగ్గిలం) మొద్దులు తరలించసాగారు. 1897-98లో ఒక్క దక్షణ మరాఠా రైల్వేకే 65 వేల సాల్ స్లీపర్లు అమ్ముకున్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలును కూడా బ్రిటిష్ ప్రభుత్వమే స్వాధీనం చేసుకుంది. అడవిలో నివశించే వారిపై 'వినిమయ పన్ను' (కమ్యుటేషన్ టాక్స్)గా యింటికి రెండణాలు (0-2-0) ఆదివాసులపై విధించి, 3 అణాలు గైరాదివాసులపై విధించి ప్రజల కర్ర - గడ్డి - అటవీ ఉత్పత్తుల సేకరణపై పరిమితులు విధించారు. అడవిపై అన్ని రకాల యాజమాన్యాన్ని కైవశం చేసుకున్న బ్రిటిష్ వారి ఆదాయం 1907లో 85,602 రూపాయలంటే, ఒక్క సంవత్సరంలోనే 1,10,384 రూపాయలకు పెరిగిందంటే దోపిడి తీవ్రత తెలుసుకోవచ్చు.

భూమి బందోబస్తు తయారు చేశారు. ఖాస్రాలు తయారైనాయి. అన్ని గ్రామాల్లో భూముల తనిఖీ ప్రారంభమైంది. ముందుగా 1904 నాటికి జగ్దల్‌పూర్ తాలూకా 7 సంవత్సరాల కాలంలో భూమి బందోబస్తు పనులు పూర్తి చేశారు (ల్యాండ్ సెటిల్‌మెంట్). గతంలో గ్రామ మాంజీల సహకారంతో భూముల వివరాలు సేకరించి పన్నులు వసూలు చేసుకున్న బ్రిటిష్ ప్రభుత్వం క్రమంగా పకడ్బందీగా పన్నుల విధానాన్ని ముందుకు తెచ్చింది.

ఒక్క నాగలి భూమిగా 12-15ఎకరాలను గుర్తించారు. 5 నుండి $7^1/_2$ కండీలు (కండీ = 20 పైలీలు; 1 పైలీ = $1^1/_2$ కిలోలు) ధాన్యం అలుకుతారని కూడా నిర్ణయించారు. ఇందుకుగాను నూతన పన్ను రూ. 4 - 8 - 0 నుండి రూ. 8 - 4 - 0గా నిర్ణయించారు. గతంలో రూ. 4 నుండి రూ. 6 వుండేది. భూమి బందోబస్తుకు ముందు సరైన లెక్కలు లేని కారణంగా 1877లో రూ. 23,487లు; 1887లో రూ 27,406లు భూమి పన్ను వసూలు కాగా, ఖచ్చితమైన భూమి వివరాలు తయారైన పిదప 1904లో 1,30,000 వసూలవుతుందని తేల్చగా 93,000 వసూలు చేయగలిగారు. అయితే, ఆనాటి బస్తర్ రాజ్యంలోని ఐదు తాలూకాల్లో (జగ్దల్‌పూర్, కొండగాం, అంతాఘడ్, బీజాపూర్, కుంట) కేవలం ఒక్క జగ్దల్‌పూర్ తాలూకాలోని భూమి లెక్కలు పూర్తయి దాదాపు 6 రెట్ల పన్నును అధికం చేశాయి. అన్ని తాలూకాల్లో పూర్తయితే మరెన్ని రెట్ల బ్రిటిష్ సంపద తులతూగేదో కానీ, 'మహాన్ భుంకాల్' అడ్డుకుంది.

అబూజ్‌మాడ్ కూడా శీఘ్ర బందోబస్తు కిందకు వచ్చింది. (సమ్మరీ సెటిల్మెంట్). ఇక్కడ 16 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరి నుండి పోల్‌టాక్స్ (తలసరి పన్ను)గా రూ.1-8-0ల నుండి రూ. 2-0-0ల వరకు వసూలు చేయడం ప్రారంభించారు. జీవించడమే నేరంగా తయారై బతుకంతా పన్నులమయం గావడంతో కుతుల్ లాంటి మాడ్ గ్రామాలు కూడా మంటలు ఎగజిమ్మాయి.

బ్రిటిష్ ప్రభుత్వం సారాను తన చేతిలో పెట్టుకొని నేరాల సంఖ్యను తగ్గిస్తానంది. ఈ పిట్టకథల్నే ఈవాళిటికీ ప్రభుత్వాలు వల్లె వేస్తున్నాయి. 1894 వరకు ప్రత్యేకించి ఎక్సైజ్ (ఆబ్కారి)శాఖ వచ్చి ఒక దరొగా కూడా చేరిండు. సారా బట్టీల వేలం జోరైంది. గాంజా, నల్లమందు అమ్మకం, ప్రభుత్వ గుత్తాధిపత్యంగా నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల మూలుగులను పీల్చిన బ్రిటిష్ నల్లమందు వ్యాపారం ఆ దుర్మార్గుల బొక్కసానికి ఎన్నెన్ని కోట్ల పౌండ్లను సమకూర్చిందో! ఎన్నెన్ని యుద్ధాలకు పెనుకారణమైందో ప్రపంచ చరిత్ర తరచి చూస్తేగాని తెలియదు. బస్తర్‌కు నల్లమందు-గాంజా రాయపూర్ కేంద్రంగా దిగుమతి అయ్యేది. 1901లో రూ 59,398ల ఎక్సైజ్ ఆదాయం దశాబ్దం గడవకముందే 1908లో 93,606 రూపాయలకు చేరి దాదాపు రెట్టింపుకు చేరువైంది. సంప్రదాయ సారాపై సర్కార్ చట్టం ఆటంకంగా మారి సారా వ్యాపారంలో నీళ్లు కలపడం సాధారణమైంది.

1892లో ఛత్తీస్‌గఢ్ డివిజన్ కమిషనర్ ఫ్రెసర్ బస్తర్‌లో రోడ్ల నిర్మాణం దుర్లభం అని గతంలో ప్రభుత్వానికి అందిన రిపోర్టులన్ని తప్పని బుట్టదాఖలు చేసి రోడ్ల నిర్మాణాన్ని ముమ్మరం చేశాడు. దోపిడీ యంత్రాలను మారుమూలలకు తరలించడానికి రాజ్యవ్యాప్తంగా రోడ్లు నెలకొన్నాయి. పోరుగు ప్రాంతాలకు రోడ్లు పొడగించబడినాయి. 1892-1908 మధ్య ఈ రోడ్లు ఆదివాసీ గూడాలను అడవుల మధ్య బంధించినాయి. 1898లో రాయపూర్-జగ్దల్‌పూర్ రోడ్డు నిర్మాణం పూర్తయి 1904 నాటికి కుంటవరకు అంటే 600 కి.మీ. పొడిగించబడింది. ఈ హైవే నిర్మించిన పుణ్యం బ్రిటిష్‌వారికే దక్కుతుంది. 1899 నాటికే జగ్దల్‌పూర్-కోటపాడ్ - జైపూర్ నిర్మాణం పూర్తయింది. కొండగాం - నారాయణపూర్ - అంతాఘడ్‌ల రోడ్డు 1907 వరకు పూర్తయి లోహరి డోంగ నుండి రాజనందగాం వరకు పొడిగించబడింది. ఈ రోడ్డు పనులకు ప్రధానంగా బయటి కూలీలే వచ్చారు.

బ్రిటిష్ వారికి స్థానిక అధికారుల నుండి వెంట వెంట నివేదికాలు, సందేశాలు తిరిగి పై నుండి - ఆదేశాలు చేరడానికి 1908 నాటికి దంతరి - జగ్దల్‌పూర్ పోస్టల్ కమ్యూనికేషన్ పూర్తయింది. దశాబ్దకాలంలో 1892-1901 కాలంలో ఈ శాఖవారు

కూడా రెట్టింపు ఆదాయాన్ని సమకూర్చుకున్నారు. 54వేల రూపాయల నుండి 1,26,000 రూపాయలు పొందారు.

బ్రిటీష్‌వారి దోపిడీ సవ్యంగా సాగడానికి శాంతి, భద్రతల పరిరక్షణ పేరుతో పోలీసు వ్యవస్థ సంస్కరించబడింది. ఎల్.జె. ఫాగన్ అనే అధికారి, పోలీసుల్లో క్రమశిక్షణ, ఆత్మస్థైర్యాన్ని పెంచడానికి ప్రత్యేక కృషి సల్పాడు. 1891-1908 మధ్య ఈ సంస్కరణ చోటు చేసుకుంది. మళ్లీ వందేళ్ల తరువాత ఆ బ్రిటీష్ స్కాట్‌లాండ్ యార్డ్ పోలీసులే దండకారణ్యా పోరాటాలను అణచడానికి యిక్కడి పోలీసులకు ప్రత్యేక శిక్షణ యివ్వబూను కుంటున్నారు. వందేళ్ల క్రింద (1904) 297 పోలీసు కానిస్టేబుల్‌లు, 27 మంది హెడ్ కానిస్టేబల్‌లు బ్రిటీష్‌వారి సేవలో నిమగ్నమై ఆదివాసీ ప్రజల మెడపై బందూకులు నిలిపి అడవిని తమ గుప్పెట్లో బంధించుకున్నారు.

కొత్వాల్ వ్యవస్థను కూడా బ్రిటీష్‌వాడు పటిష్టవంతం చేశాడు. గ్రామాల్లో జరిగే నేరాల రిపోర్టు పోలీసులకు చేరవేసే బాధ్యత వీరిది. వీరి సేవలకు ఫలితంగా ఒక నాగలి భూమి (15 ఎకరాలు) ఇచ్చేవారు.

ఇంతేకాదు, జైళ్ల వ్యవస్థ కూడా వాడి దోపిడీకి తగినట్లుగా ఆధునీకరించ బడింది. మహిళా వార్డులు ప్రత్యక్షమయినాయి. 1897 నాటికే జగ్దల్‌పూర్ జైలు ఖైదీలకు సరిపోక అనేకమంది తహసీల్దార్ ముందు విచారణకు ప్రవేశపెట్టబడి ఆ జైళ్లలోనే శిక్షకాలాన్ని గడిపేవారు. జైళ్లలో కలరా, తదితర అంటువ్యాధులు ప్రబలి అనేక మంది ఖైదీలు మృత్యువాతపడ్డారు. వారిచే తోటల పెంపకం, లిథోప్రెస్, అల్లకం, నూనె తీయడం, ఇటుకల నిర్మాణం, వెదురు, కలప పనులు చివరకు జగ్దల్‌పూర్ పట్టణంలోని మురుగు కాల్వలు కూడా సాఫ్‌చేయించేవారు.

ఇలా అన్ని రంగాలలో తీవ్రమైన బ్రిటీష్‌వాడి దోపిడీ ప్రజలకు కంటకప్రాయమైంది. ఇంకా ఆ దోపిడీని భరించే శక్తి వారిలో లేకుండా పోయింది. ఆ దుర్మార్గమైన దోపిడీ ప్రజల్లో తిరుగుబాటు జండాను లేపింది. ఆ బ్రిటీష్ క్రౌర్యం ప్రజల్లో మహాన్ భుంకాల్‌కు బాటలు వేసింది. 1910 భుంకాల్ బస్తర్ పోరాట చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయిన వీరోచిత త్యాగాల పరంపరను నెలకొల్పింది. ○

పత్రికా ప్రకటన

# ప్రజలకు విజ్ఞప్తి

దండకారణ్యం అత్యంత విలువైన, విశిష్టమైన వృక్ష జంతుజాలానికి (ఫ్లోరా అండ్ ఫౌన) చారిత్రికంగా అత్యంత ప్రసిద్ధి చెందిన ప్రాంతం. సంజీవిని లభ్యమై విలువైన ప్రాణాలను రక్షించినదని కూడా పురాణేతిహాసాలలో వింటాము. ఈనాటికి రకరకాల మూలికలు, కందమూలాలు, ఫలపుష్పాదులను ఆయుర్వేదం ప్రక్రియలో వినియోగిస్తున్నారు. అత్యంత విలువైన ప్రస్తుతం దినదినం లుప్తమవుతున్న వన్య మృగాలకు కూడా ఈ ప్రాంతం నిలయంగా వున్నది. ఇలా వృక్ష, జంతుజాలాలకు పేరొందిన దండక్ అడవుల్లో నివశించే ఆదివాసుల గూర్చి కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

స్థానిక ఆదివాసులు గతంలో ఏ ప్రాంతం నుండి యిక్కడికి వలస వచ్చినారన్న విషయం నుండి మొదలు పెట్టి మానవ సమాజ పురోగమనంలో వారు ఈనాడు ఏదశలో జీవితాలను వెళ్లదీస్తున్నారనే వరకు చరిత్రకారులకు, మానవ వేత్తలకు ఎంతో విలువైన పరిశోధనాత్మక అంశంగానే వుంది. గుంపులు గుంపులుగా తొలి మానవులు తమ మనుగడకోసం భూమండలంపై విస్తరించిన క్రమంలో దండక్ అడవుల్లోకి చేరిన వారి పుట్టు పూర్వోత్తరాలను అనేకమంది ఎంతో ఆసక్తితో పరిశోధిస్తున్నారు. యిందులో భాగంగానే, ఈనాటికీ దండకారణ్యంలోని అడవుల్లోని లోతట్టు ప్రాంతాల్లో తమదైన విశిష్ట జీవనశైలిలో బతుకుతున్న ప్రజలు పరిశీలనాంశంగా వున్నారు. యిందులో 'మాడ్' కొండల్లో నివశిస్తున్న ఆదివాసులను ప్రత్యేకించి చెప్పుకోవాలి. లాభాపేక్ష మాత్రమే పరమ ధ్యేయంగా కలిగిన పాలక వర్గాలు వారి ప్రభుత్వాలు మానవ సమాజ వికాసం పట్ల ఎంతటి ఘోరమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తాయో వారి భాషలో కొన్ని ప్రాంతాలకు పెట్టిన పేర్లనుబట్టి కూడా సులభంగా అర్థం చేసుకోవచ్చు. దోపిడీ పాలక వర్గాలు మాడ్ కొండలను ఈనాటికీ అబూజ్ మాడ్‌గా చెప్పుకుంటాయి. ఈ కొండల ప్రజల ప్రాసస్త్యాన్ని తెలుసుకోలేకపోయిన పాలకవర్గాలు అబూజ్ అంటే 'అర్థం కానివి' అన్న అర్థంలోనే అలా నామకరణం చేశాయి. మానవ సమాజ పురోగమనంలోని భిన్నమైన విప్లవాత్మక దశల చిహ్నాలు - అవశేషాలు ఈ ప్రజల్లో మిగిలి నేటికీ ఔత్సాహిక పరిశోధకులకు గొప్ప విజ్ఞానదాయకంగా వున్నాయి. దండకారణ్య విప్లవకారులు కూడా వీటిని ఎంతో శ్రద్ధాసక్తులతో, ఉత్సాహంగా పరిశీలిస్తూ మానవ సమాజ వికాస క్రమాన్ని మార్క్సిస్టు అవగాహనతో అర్థం చేసుకోవడానికి కృషి చేస్తున్నారు. ఆటవిక యుగం, అనాగరిక యుగం, నాగరిక యుగంగా మానవ సమాజాన్ని మూడు దశలుగా పేర్కొనే విభజనలో ఇక్కడి ప్రజల అభివృద్ధి ఏ దశ వరకు సహజ పరిణామంలో సాగింది, వీరి అభివృద్ధి ఎక్కడ ఏ అపమార్గం పట్టి వైకల్య స్థితికి నెట్టబడిందన్న విషయాలు వీరి అధ్యయనంలోని ముఖ్యాంశాలు. కాగా, గత 3 - 4 శతాబ్దాల కాలంలో వీరి జీవన విధానాన్ని మరీ ముఖ్యంగా వలస వాదులకు వ్యతిరేకంగా జరిపిన ప్రజల వీరోచిత పోరాటాలు ఈ మధ్యకాలంలో అనేక యూనివర్శిటీల విద్యార్థులకు పరిశోధనాత్మకంగా మారినాయి. మరో మాటలో చెప్పుకోవాలంటే ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక మరియు సైనిక రంగాలలో ప్రజల గతితార్కిక చారిత్రక అభివృద్ధి ఒక అధ్యయనాంశంగా వుంది. యిది ఆహ్వానించదగినది - ప్రోత్సహించదగినది.

గొప్ప పట్టుదల, అత్యంత శ్రద్ధాసక్తులతో, అంకితభావంతో శాస్త్రీయ, వైజ్ఞానిక రంగాలలో ప్రగతిని ఆశించి చేసే ప్రతివారి పరిశోధనలు అత్యంత ప్రమాదకర పరిస్థితిలో సాగాల్సిన దౌర్భాగ్య స్థితి నేడు నెలకొన్నది. అందుకు కారణం, పూర్తి బాధ్యత ఈనాటి దోపిడీ ప్రభుత్వాలదీ, ట్రిగ్గర్ హాపీ (తుపాకి గుర్రంపై మక్కువగల) పోలీసులదే. వాస్తవానికి దండకారణ్యంలో గత 20 యేళ్ల కాలంగా సాగుతున్న ప్రజల వీరోచిత విప్లవపోరాటాలు

కూడా అంతకంతకు ఎక్కువ మంది పరిశీలకును ఆకర్షిస్తున్న నేపధ్యంలో దినదినం వారి అధ్యయనం ఖాకీ మూకల క్రౌర్యాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. దండకారణ్యంలో పోలీసులు జరుపుతున్న విచ్చలవిడి కూంబింగ్‌లు, చిత్తం వచ్చిన రీతిలో వారు ప్రజలపై జరిపేదాడులు, అత్యాచారాలు ఔత్సాహికుల అధ్యయనానికి ఆటంకంగా పరిణమిస్తున్నవి. విప్లవోద్యమ విజయాలతో ప్రజల్లో చోటు చేసుకుంటున్న అనేక ప్రగతిశీల మార్పుల ఫలితంగా బెంబేలు పడిపోతున్న పాలకవర్గాలు తమ దోపిడీ పునాదులను కాపాడుకోవడానికి చేపడుతున్న తక్షణ దీర్ఘకాలిక సైనిక చర్యలు, గెరిల్లాల కదలికలపై మాత్రమే కాకుండా అడవులపై, నీటి వనరులపై నిఘాను కూడా తీవ్రతరం చేశాయి. ఇందులో భాగంగానే నిగూఢంగా సంచరించే వేగుల నుండి మొదలు పెట్టి ఏరియల్ సర్వే (వైమానిక పరిశీలన) వరకు కొనసాగుతుంది.

నిగూఢంగా సంచరించే వేగులు ముఖ్యంగా గెరిల్లాల ఆనుపానులు పసిగట్టడానికై అడవిలో వారు జరిపే వేట అడుగడుగునా ప్రమాదకరంగా తయారవుతోంది. పొరపాటున గెరిల్లాల, ప్రజల చేత చిక్కిన కొందరు వేగులు తమకు పోలీసులు మంచి శిక్షణ గరిపి, డబ్బులు సమకూర్చి గూఢాచర్యానికి పంపారని చెబుతుంటే, మరికొంతమంది నోరు మెదపడం లేదు. యిందులో స్త్రీ-పురుషులు ఇరువురూ వుంటున్నారు. పేదరికంతో, నిరుద్యోగంతో బాధపడుతూ పోలీసుల ప్రలోభాలకు మోసపోయి గూఢచర్యానికి ఒప్పుకున్నామనీ గెరిల్లాల విచారణలో స్పష్టంచేసి, అనేక మంది ప్రాణాలు కాపాడుకుంటుండగా నోరు మెదపనివారు కొందరు మరణశిక్షను అనుభవిస్తున్నారు. ఇందులో స్థానికులు మరియు బయటివారు కూడ వుంటున్నారు. ప్రభుత్వం నక్సలైట్ల గూర్చి చేస్తున్న విషపూరిత ప్రచారంతో మోసపోయి, ఉద్యోగ ఆశతో ప్రధానంగా బయటివారు వస్తుంటే, ప్రజావ్యతిరేకులైన స్థానికులు విప్లవోద్యమానికి వ్యతిరేకంగా నిల్చి ముందుకు వస్తున్నారు. బహు రూపాలలో వస్తున్న ఈ వేగుల వేధింపులు సాధారణ ప్రజానీకానికి అలాగే ఒక సామాజిక లక్ష్యంతో వస్తున్న అధ్యయనపరులకూ తప్పడంలేదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో స్థానికేతరులు గెరిల్లాలకుగానీ, స్థానిక ప్రజలకుగానీ, తటస్థిస్తే వారిని పోల్చుకోవడం కష్టసాధ్యమవుతుంది. బంధితులు వెలిబుచ్చే అభిప్రాయాలే నిజానిజాల నిరూపణకు ఏకైక ఆధారంగా నిలుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిర్దోషులు కూడా ప్రాణాలు కోల్పోయే సంఘటనలు ఎదురవు తున్నాయి.

ఈ సంవత్సరం ఫిబ్రవరి మధ్యలో సంజీవ్ శుక్లా అనే యువకుడు ఉత్తర బస్తర్‌లోని కేస్కల్ ప్రాంతంలో ఈ గెరిల్లాల చేత చిక్కి ప్రాణాలు కోల్పోయాడు. తర్వాత రాజీవ్ శుక్లా గూర్చి విచారించగా వెలుగులోకి వచ్చిన కొన్ని వివరాలను బట్టి అతడు పోలీసుల గూఢాచారి కాదని తెలుస్తోంది. మాకు లభించిన ప్రాథమిక సమాచారం బట్టి అతడు భగ్నప్రేమికుడై తానున్న చోట దుర్మార్గమైన అన్యాయానికి గురై ప్రస్తుత దోపిడీ సమాజంపై తీవ్రమైన అసంతృప్తితోనున్న అత్యంత సాధారణ వ్యక్తి అని, నిర్దోషి అని కూడా అనుకోవచ్చు. ఇలాంటి వారు మా గెరిల్లాల చేతిలో తొందరపాటున హతులవడం విచారకరం. వారి కుటుంబానికి-బంధుమిత్రులకు వేదనను-దుఃఖాన్ని కలిగిస్తున్న మా గెరిల్లాల చర్య పట్ల వారు ఆవేశానికి లోనుకాకూడదని, మా పరిస్థితులను అర్థంచేసుకొని క్షమించాలని హృదయపూర్వకంగా కోరుతున్నాం. ఇలాంటి తొందరపాటు చర్యలకు తావివ్వకుండా వుండడానికి కావలసిన రాజకీయ శిక్షణను మా గెరిల్లాలకు గరపాల్సిన సీరియస్ ఆవశ్యకతను ఈ సందర్భంగా మరోసారి గుర్తిస్తున్న మా స్పెషల్ జోనల్ కమిటీ మా గెరిల్లాల మూలంగా అరకొరగానైనా జరుగుతున్న యిలాంటి తొందరపాటు చర్యలను తొలగించడానికి ప్రజల నుండి కూడా పూర్తి సహకారాన్ని ఈ సందర్భంగా కోరుతోంది.

తమ వ్యక్తిగత అవసరాల రీత్యా దండకారణ్య స్పెషల్‌జోన్ సందర్శించే కొత్త వారెవరైనా తప్పనిసరిగా తగిన ఆధారాలతో వుండాలి. వారి వద్దనున్న ఆధారాలను ప్రజల-గెరిల్లాల కోరికపై తప్పనిసరిగా చూపాలి. స్థానిక పరిచయస్థులు ఆధారాలుంటే అందజేయాలి. గెరిల్లాలు చేపట్టే విచారణ సందర్భంగా పూర్తిగా సహకరించాలి. విచారణ పూర్తయ్యే వరకు అవసరమైతే గెరిల్లాల ప్రత్యక్ష సంరక్షణలో వుండడానికైనా, ప్రజల సంరక్షణలో వుండడానికైనా సిద్ధపడాలి. ప్రభుత్వ పోలీసు యంత్రాంగంతోకానీ, విదేశీ గూఢాచారి సంస్థలతోగానీ, ఎలాంటి ప్రత్యక్ష పరోక్ష సంబంధాలు లేవని నిరూపించబడేంతవరకు విచారణ కాలంలో ప్రజల లేదా గెరిల్లాల ఆధీనంలో అవసరమైతే వుండాలి. అలాగే దోపిడీ ప్రభుత్వ పౌర అధికార్లు కూడా దండకారణ్యంలో తాము చేపట్టే ఎలాంటి కార్యక్రమాలకైనా ముందుగా స్థానిక ప్రజల అనుమతి పొందాలి. లేనిచో మే-జూన్ 2000లలో ఉత్తర బస్తర్‌లో అడవి సర్వే చేపట్టిన ఒక సర్వే అధికారుల బృందానికి పట్టినగతే మిగతావారికి పడుతుందని ఉద్యోగస్థులకు స్పష్టం చేస్తున్నాం. ఆ సర్వే అధికారుల నుండి మా ప్రజలు స్వాధీనం చేసుకున్న సామాగ్రిని ప్రజల ఆగ్రహానికి గురైన ఆ అధికారులు కోరిన పక్షంలో తిరిగి అప్పగించడానికి ప్రజలు సిద్ధంగా వున్నారు. ఆ అధికారులు, ఉద్యోగాలకు ప్రభుత్వం నుండి ఎదురుగానున్న ముప్పును గురించి చర్చించి ప్రజలు తీసుకున్న సముచితమైన నిర్ణయాన్ని గౌరవించాలని వారిని కోరుతున్నాం.

ప్రజల పక్షాన నిలిచి ప్రజల సహాయసహకారాలతో తమ విధులను నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులతో విప్లవకారుల ప్రవర్తన మర్యాదపూర్వకంగానూ వర్గ దృక్పథంతో కూడి వుంటుందని కూడా స్పష్టం చేస్తున్నాం. దండకారణ్యంలో ప్రభుత్వోద్యోగులుగా వివిధ శాఖల్లో పనిచేస్తున్నవారు నిర్భయంగా తమ విధులను నిర్వహించు కోవచ్చు. అయితే వారి ప్రతిచర్యా ప్రజలకు జవాబుదారిగా వుంటుందని మరచిపోవద్దు. వేతనాల రూపంలో వారు పొందుతున్న ప్రజల సానుభూతి దుర్వినియోగపరచకుండా తమ విధులను సక్రమంగా నిర్వహించాలని, గెరిల్లాల గూర్చి ప్రభుత్వం దురుద్దేశ పూర్వకంగా చేపట్టి కొనసాగిస్తున్న దుష్ప్రచారానికి లోనుకాకూడదని కూడా కోరుతున్నాం. ప్రజాసేవకులు గెరిల్లాలు ప్రజా మిత్రులు గెరిల్లాలు; భూస్వామ్య సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు గెరిల్లాలు విప్లవ సైనికులు గెరిల్లాలు, వారితో సహకరించండి అని అన్ని వర్గాల సెక్షన్‌ల ప్రజలకు మరోమారు విజ్ఞప్తి చేస్తున్నాం.

☆

# ఆదివాసుల మనుగడకే సవాలుగా పరిణమించిన బైలడిల్లా గనులు: పాలకుల 'అభివృద్ధి' నిజస్వరూపం

మధ్యప్రదేశ్‌లోని బస్తర్, అపార ప్రకృతి వనరులకు నిలయం, ఇక్కడ యితర ఖనిజాలతో పాటు ఇనుప ఖనిజం కూడా విస్తారంగా లభిస్తుంది. ఈ అపార సహజసంపద, ఇక్కడి ప్రజలకు ఒకవరంలా కాక ఒక శాపంగా పాలకులచే మార్చబడిన వైనాన్ని బైలడిల్లా గనుల చరిత్ర మన కళ్ల ముందు వుంచుతుంది. బైలడిల్లా ప్రాంతంలో వున్న అపార ఇనుము నిక్షేపాలు, అక్కడ కారుచౌకగా లభించగల శ్రమశక్తి, సహజంగానే దోపిడీ దారులకు కన్నుకుట్టిస్తుంది. అందుకనే జపానీ సామ్రాజ్యవాదుల పాదసేవకై సదా తహతహలాడే భారత పాలకవర్గాల డేగకళ్లు ఈ ప్రాంతంపై పడ్డాయి. సామ్రాజ్యవాదుల అండదండలు వారికి ఎలానూ వుండడంతో ఈ సంపదను తరలించుకుపోవడానికి వారు ఉపక్రమించారు. యిక వారి భారత సేవకులు దేశ ప్రజల, ప్రత్యేకించి బస్తర్ ఆదివాసీ ప్రజల అభివృద్ధికి రాచబాట వేయడానికి ఇక్కడ ఇనుపగనుల తవ్వకానికి ప్రారంభిస్తున్నామంటూ వెనువెంటనే రంగంలోకి దిగారు. 1965లో కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థయైన ఎన్.ఎమ్.డి.సి. (జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ)కి ఈ గనులను తవ్వి ఖనిజాన్ని శుద్ధిచేసి జపానుకు తరలించే బాధ్యతను అప్పచెప్పింది. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవేమిటన్న చందంగా, గనుల తవ్వకం కోసం వందలాది ఆదివాసీ గ్రామాలు నేలమట్టం చేయబడ్డాయి. ఈ 'అభివృద్ధి' దేశ ప్రజలకు ఒరగబెట్టిన మొదటి 'మేలు' ఏమిటంటే, వేల సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో నివశిస్తు వచ్చిన ఆదివాసులు తమ ఇళ్లనూ, భూములను కోల్పోయారు. నష్టపరిహారం చెల్లిస్తానని ప్రభుత్వం ప్రకటించిందిగానీ, పట్టాలున్న వారికే అది అందుతుందని ఒక షరతు విధించింది. తరతరాలుగా అడవిని నరికి సాగుచేసుకుంటున్న ఆదివాసులకు, పట్టాలనిచ్చిన పాపాన ఏ ప్రభుత్వమూ పోలేదన్న విషయం పాలకులకు తెలియనిది కాదు, అందుకనే ఆ సాకున ప్రజలకు మొండిచేయి చూపించారు. ఫలితంగా స్థానిక ప్రజలు తమ స్వంత గడ్డపైనే పరాయివారుగా కంపెనీ బాబుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే కూలీలుగా దిగజార్చబడ్డారు. ప్రజల పట్ల ఇంత నిర్ధ్యాక్షిణ్యంగా వ్యవహరించిన పాలకులు మరోవంక, బైలడిల్లాలో శుద్ధిచేసిన ఖనిజాన్ని, కారుచౌకగా జపానుకు రవాణాచేయడానికై ఆఘమేఘాల మీద బైలడిల్లా నుండి విశాఖ పట్నానికి రైల్వేలైనును నిర్మించారు. స్వతంత్రం లభించబడిందని చెప్పబడిన తర్వాత పలుదశాబ్దాలు గడిచినా, ప్రజలకు ఉపయోగపడే మార్గాల్లో కనీసం కిలోమీటరు దూరానికైనా రైలు లైనులు వేయడానికి సిద్ధపడని పాలకులు, దట్టమైన అడవులు, నిటారు కొండలతో నిండివుండే అత్యంత సంక్లిష్టమార్గంలో, వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగపరుస్తూ ఈ రైల్వే లైనును నిర్మించారు. ఈ రైల్వే లైను వల్ల దేశ ప్రజలకు అణు మాత్రం ఉపయోగం లేదు. ఈ మార్గంలో ఒక్క ఇనుప ఖనిజ రవాణా తప్ప మరే యితర సరుకు రవాణా కాదు. అడవుల్లో కొండల్లో అక్కడొకటి, ఇక్కడొకటిగా వుండే గ్రామాల ప్రజలకు, ఈ రైల్వేలైను అవసరమూ లేదు. బైలడిల్లాలో ఖనిజం లుప్తమైన తర్వాత, ఈ రైల్వే లైనును మూసి వేయాల్సిందే తప్ప మరెందుకూ పనికిరాదు. అంతేకాదు, విశాఖకు చేరిన తర్వాత క్షణం ఆలస్యం కాకుండా ఓడల కెక్కించడానికై ఆసియాలోనే అతి పెద్దదైన కన్వేయరు బెల్టును కూడా మన పాలకులు నిర్మించారు. ఇన్ని వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి, సాగిస్తున్న బైలడిల్లా ఇనుప గనుల తవ్వకం ప్రజలకు అందించిన మొట్టమొదటి 'అభివృద్ధి' ఫలం ఏమిటంటే, వారు తమ స్వంత గడ్డ నుండి తన్ని తరిమివేయబడ్డారు. స్వచ్ఛమైన గాలి, నీటితో విలసిల్లిన ఈ ప్రాంతం ఇప్పుడు దేశంలోనే పర్యావరణ పరంగా అత్యంత కలుషితమైన ప్రాంతాల్లో ఒకటిగా తయారైంది. ఫలితంగా ఇక్కడి ప్రజలేకాక, పశువులు, పక్షులు, సమస్త జీవజాలపు మనుగడ ప్రశ్నార్థకంగా తయారైంది. మరోపక్క, గనుల తవ్వకం కోసం వెలసిన టౌన్‌షిప్‌లు, అమాయక ఆదివాసీ ప్రజలలో భూస్వామ్య, సామ్రాజ్యవాద విష సంస్కృతిని వ్యాపింపజేస్తూ, వారి సాంప్రదాయాలు భాషను, సంస్కృతిని కూడా ఘోరంగా దెబ్బ తీస్తూ, వారి కుటుంబ జీవనాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ విషసంస్కృతి మోజుకు బలై అనేకమంది యువకులు, జులాయిలుగా, లంపెన్‌లుగా మారుతుండగా, పలువురు యువతులు వ్యభిచారిణిలుగా మారుతున్నారు. ఆదివాసీ ప్రజల జీవనంపైనా, పర్యావరణంపైనా సామ్రాజ్యవాదులు, వారి భారత దళారులు జరుపుతున్న దాడి మూలంగా యిక్కడ ఘనీభవించిన విషాద చిత్రాన్ని సూక్ష్మంగా పరిశీలిద్దాం.

ఎన్ఎమ్‌డిసి, జపాన్ సాయంతో 1965లో యిక్కడ పనులు ప్రారంభించి, మొదట 14 నెంబరుగని, 5వ నెంబరు ఓపెన్‌కాస్ట్ గని అనే రెండు గనుల తవ్వకాలను ప్రారంభించింది. దాని ఫలితంగా '5' గని వద్ద బచేలి టౌన్‌షిప్, '14' గని వద్ద కిరండూల్ టౌన్‌షిప్‌లు వెలిశాయి. 80వ దశకం నుండి 11 - సి గని తవ్వకం మొదలైంది. ఇన్ని వేల కోట్ల రూపాయల వ్యయంతో సాగుతోన్న ఈ గనుల్లో మొత్తం రెగ్యులర్ కార్మికుల సంఖ్య 3250 వుండగా, క్యాజువల్ కార్మికులు వేయిమంది వుంటారు. ఈ గనులు వల్ల లభించిన ఉపాది యిది. యిందులో అత్యధికులు బయట నుంచి వచ్చినవారే. స్థానిక ఆదివాసులకు దక్కింది సున్నకు సున్నా, హళ్లికి హళ్లి, ఇక కిరండూల్ - వాల్తేర్ రైల్వే లైను యిక్కడి ప్రజలకు ఏమి ఒరగబెట్టిందో 'ప్రభాత్'99 అక్టోబరు సంచికలో ఇంతకు ముందే వివరించివున్నాం.

## స్వతంత్ర జీవితాన్ని గడుపుతూ వస్తుండిన ఆదివాసుల్ని పరాధీనులుగా మార్చి వారి జీవనాలను, సాంప్రదాయాలను, సంస్కృతిని ఛిద్రంచేస్తోన్న 'అభివృద్ధి'

బైలడిల్లా గనులు, రైల్వే లైనులు, ఎన్ఎండిసి కార్యాలయాలు, క్వార్టర్లు, పోలీసు భవనాలు వగైరాల కోసం టౌన్‌షిప్పులు (5గని వద్ద బచేలి టౌన్ షిప్ '14' గని వద్ద కిరండూల్ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయడానికై ప్రభుత్వం పలు గ్రామాలను మొత్తంగానో, పాక్షికంగానో నేలమట్టం చేసింది. ఆ గ్రామాలలో తరతరాలుగా నివశిస్తూ వచ్చిన ఆదివాసీ రైతుల భూముల్ని గుంజుకుంది. ఇళ్లను

కూలగొట్టింది. వారికి పట్టాలు లేవనే సాకుతో నష్టపరిహారం చెల్లించకుండా ఎగ్గొట్టింది. గనులు, రైల్వే లైనుల మూలంగా స్థానికులకు ఇబ్బడి ముబ్బడిగా ఉపాధి అవకాశాలు కల్పించబడి, వారు అందలాలలో ఊరేగగలరని ప్రచారం చేస్తూ, వారి భూముల్ని గుంజుకున్న ప్రభుత్వం ఉపాధికల్పన విషయంలో కూడా వారి నోళ్లలో మన్ను కొట్టింది. యిక్కడి మొత్తం కార్మికుల్లో, ఆదివాసులు 3%లోపే వుంటారు. తమ గ్రామాల నుండి తరతరాలుగా తమకు జీవనోపాధిని కల్పిస్తూ వచ్చిన వ్యవసాయం నుండి ప్రభుత్వం 'దయ'న కట్టుబట్టలతో వెళ్లగొట్టబడిన ఆ రైతాంగం కుటుంబాల ఆర్థిక జీవనం ఒక్కసారిగా తలకిందులైంది. వ్యవసాయంపైనా, అటవి ఉత్పత్తుల పైనా ఆధారపడుతూ, మార్కెట్‌తో పెద్దగా సంబంధం లేకుండా స్వతంత్ర జీవనం గడుపుతూ వస్తుండిన ఆదివాసీ కుటుంబాలు, ఒక్క దెబ్బతో పరాధీన కుటుంబాలుగా మారిపోయాయి. ఏరోజుకారోజు, టౌన్‌షిప్పులకు వెళ్లి కూలినాలో దొరికించుకోకపోతే, లేదా అటవి ఉత్పత్తులను అయినకాడికి తెగనమ్మకోకపోతే, గంజినీళ్లు కూడా కరువయ్యే పరిస్థితి వారికి దాపురించింది. బైలడిల్లా చుట్టుపక్కల గల 200-300గ్రామాల ప్రజల జీవితాలు ఈ 'అభివృద్ధి' పుణ్యమా అని నిత్యం సుడిగుండాలలో చిక్కుకుపోయి ఛిద్రమై పోతున్నాయి. స్త్రీలు, బాలలు, వృద్ధులు అనే తేడా లేకుండా, ఈ గ్రామాల ప్రజలందరూ పొద్దు పొడవకముందే, నెత్తిన గంపల్లో అటవి ఉత్పత్తులను నింపుకొని, టౌన్‌షిప్పులకు బారులుతీరతారు. వాటిని ఏదో ఒక రేటుకు తెగనమ్ముకొని, ఆ వచ్చిన రెండు పైసలతో కలోగంజో తాగి కడుపులు నింపుకుంటున్నారు. ఏపూటకాపూట కూలిపనులకోసం వెంపర్లాడుతూ, దొరికితే తిని, లేకపోతే పస్తులుంటున్నారు. ఆదివాసీ మహిళలు గని అధికారుల, పోలీసు అధికారుల, యితర దొరబాబుల, షావుకార్ల ఇళ్లల్లో పనిమనుషులుగా మారి బతుకులు వెళ్లదీస్తున్నారు. కొందరు, గ్రామాలలో ఇప్పసారా కాయించి, యువతుల ద్వారా టౌన్‌షిప్పులకు తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది యువతులు దొరబాబుల చేతుల్లో అత్యాచారాలకు గురవుతున్నారు.

టౌన్‌షిప్పులతో నిత్య సంబంధం వారి సంస్కృతి, సాంప్రదాయాల్లో కూడా పెను మార్పులను తెచ్చింది. మైమరపించే పట్టణ సంస్కృతి, తెల్ల బట్టల మనుషుల మధ్య అడుగుబెట్టిన అమాయక ఆదివాసీ యువతీ, యువకులను తన సమ్మోహనా మాయాజాలంతో భ్రష్టుపట్టిస్తోంది. ముఖ్యంగా యువతులు నాగరికులనబడే వారి మెరమెచ్చుపు మాటలు నమ్మి, వారి వేష భాషల ఆకర్షణకు లోనై. వారి వంచింపులకు లోనవుతున్నారు. వారికి ఉంపుడుగత్తెలుగా మారుతున్నారు. ఆ దుష్టసంస్కృతి సాలెగూటిలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతూ వేశ్యలుగా మారుతున్నారు. యువకులు జులాయిలుగా, లంపెన్లుగా మారుతున్నారు.

ఫలితంగా కుటుంబాలు విచ్ఛిన్నమై పోతున్నాయి. వారి సాంప్రదాయం, సంస్కృతి కొడిగట్టిపోతున్నాయి. రోజంతా పడిన శ్రమను మర్చిపోవడానికై రాత్రివేళల్లో నెగళ్లచుట్టూచేరి, తమ శ్రమైకజీవన సౌందర్యాన్ని వర్ణిస్తూ వారు తరతరాలుగా పాడుతూ వస్తున్న *"నిమ్మ వయో నిమ్మ"* పాటలు *"రేల రేల"* పాటలు తెరమరుగై, కేబుల్ టివీ ద్వారా వ్యాపిస్తోన్న భూస్వామ్య-సామ్రాజ్యవాద విషసంస్కృతికి చెందిన బూతు సినిమాపాటలు వాటి స్థానంలోకి ప్రవేశిస్తున్నాయి. బైలడిల్లాకు 6 కి.మీ. దూరంలో 100 కుటుంబాలు నివశించే టిలో గ్రామం ఒక్కదాంట్లోనే ఈ విష సంస్కృతి ప్రభావానికి లోనై, పెళ్లి కాకుండా తల్లులైనవారు కనీసం 15 మంది వున్నారు అనే చేదు వాస్తవం, పట్టణాల్లోని బాబులను అనుకరించే దుస్తుల్లో, శ్రమకు దూరమై, ఆవారాలుగా తిరుగుతూ గ్రామా గ్రామాన కనిపిస్తున్న యువకులు ఈ విషసంస్కృతి, ఆదివాసీ జీవితాలను ఎలా చిన్నాభిన్నంచేస్తోందో మనకు తెలియజెప్పే సజీవ నిదర్శనాలు. వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి మన పాలకులు సాధించిన ***"అభివృద్ధి"*** యిదే.

## మానవులతో సహా సమస్త జీవరాసి ఉనికికే సవాలుగా పరిణమించిన పర్యావరణ కాలుష్యం:

బైలడిల్లా గనులు కొని తెచ్చిన *"అభివృద్ధి"* ఇంతటితోనే ఆగిపోలేదు. యిక్కడి మనుషులతో సహా సమస్త జీవజాలము అనతికాలంలోనే నశించిపోయే విపత్తుకు దారితీసే పర్యావరణ కాలుష్యాన్ని కూడా తన వెంట కొనితెచ్చింది.

బైలడిల్లాలో, గనులున్న కొండలకు రంధ్రాలు (డ్రిల్లింగ్)చేసి మైన్లతో పేలుస్తారు. ఆ ప్రేలుడుకు ఖనిజపు బండలు ముక్కలు చెక్కలై నాలుగు చెరగుల వెదజల్లబడతాయి. అపారమైన దూళి గాలిలోకి లేస్తుంది. ఇలా వెదజల్లబడిన ముక్కల్ని పోగుచేసి, ప్రోక్లెనర్ మెషిన్లద్వారా డంపర్లలో లోడుచేసి, వాటిని పిండిచేసే క్రషర్ యంత్రాలకు అందిస్తారు. అక్కడినుండి రైల్వే వాగన్ల ద్వారా విశాఖకు తరలిస్తారు.

అయితే, ఈ క్రమంలో వెదజల్లబడిన ఖనిజపు ముక్కలు, రేగిన దూళి, ఆ చుట్టుప్రక్కలగల లోవగాం, కర్క, దుగ్గేలి, పరత్‌నార మొదలైన గ్రామాలపైబడతాయి. అంతేకాదు, ఖనిజాన్ని గనుల పక్కపారే నదులు, వాగుల్లో శుద్ధి చేస్తారు. దాని మూలంగా, ఈ కొండలకు పడమరవైపునున్న తాల్పేరు, మీనగచ్చేవ్ నదులు, దక్షిణాన గల మలిహేర్, తూర్పునవున్న శంకిని నదుల నీరు కలుషితమై, కాషాయరంగుకు మారిపోయింది. అవి ఎంత ఘోరంగా కలుషితమైనాయంటే, స్వయంగా పర్యావరణ పరిరక్షణా సంస్థే, ఈ నదులను 'డి' కోవలోకి వచ్చే నదులుగా అంటే అవి తాగునీరుగా వుపయోగించకూడని హానికరమైన నదులుగా మారాయని ఒప్పుకుంది.

ఖనిజాలు కడగడం వల్ల నీటిలో చేరిన విష రసాయనాలు, ఎర్రమట్టి ఆ నీళ్లను వాడడానికి పనికిరానివిగా చేస్తున్నాయి. శంకిని నది విషయంలో ఇది ప్రత్యేకించి వర్తిస్తుంది. ఇది ఇక్కడి నుండి 40 కి.మీ. పారి, దంతెవాడ వద్ద డంకినీ నదిలో కలుస్తుంది. ఈ మొత్తం నీరంతా కలుషితమై పోయింది. ఈ నది ప్రవాహ ప్రాంతంలో నివశించే సుమారు 100 గ్రామాల ప్రజలు ఈ నది ఒడ్డున తవ్వే 'సువ్వలు' (చెలమలు) నీటిని తాగడానికి వాడుకుంటారు. యిందు మూలంగా వారికి అనేక రకాల కొత్త జబ్బులు పుట్టు కొస్తున్నాయి. యింతకుముందే మలేరియా తదితర మహమ్మారులతో పీడించబడుతున్న ప్రజలకు, పుండుమీద పుట్రలా కొత్త వ్యాధులు వ్యాపించడంతో పెద్ద ఎత్తునే మరణాలు సంభవిస్తున్నాయి. అంతేగాదు, ఆ నీళ్లను తాగిన గొడ్లు, మేకలు, కోళ్లు కూడా చనిపోతున్నాయి. పిట్టలు క్రమంగా కనుమరుగవు తున్నాయి. యిక పేద ప్రజలకు పౌష్టికాహారంగా అంతో యింతో పనికివస్తోన్న చేపలు యిప్పటికే మొత్తంగా అదృశ్యమైపోయాయి.

యిక పడమరవైపుగా ప్రవహించే తాల్పేరు, మీనగచ్చల్

నదులు, దక్షిణాన పారే మరింగేర్ నది, కాలుష్య సమస్యనేకాక మరో సమస్యను కూడా ఎదుర్కొంటున్నాయి.

గనులను పేల్చి ముక్కలు ముక్కలు చేసే క్రమంలో, అక్కడి మట్టి పెద్దెత్తున పేరుకుపోయి, వర్షాలు కురవగానే అదంతా కిందకు కొట్టుకుపోయి, వాగులు నదులు, వంకలన్నీ ఎర్రమట్టితో నిండిపోతున్నాయి. ఈ నదుల తీరప్రాంతాలన్నింటా 20 కిలోమీటర్ల పర్యంతం బురద మేటలు వేసి, ఊబులుగా మారుతున్నాయి. అక్కడి నీళ్లకోసం వెళ్లిన పశువులు, మేకలు తదితర జంతువులు ఊబిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నాయి. ఈ కాలుష్యాన్ని తక్షణమే నిలుపుచేయాలని డిమాండ్ చేస్తూ, చుట్టుప్రక్కల 40 గ్రామాల ప్రజానీకం కలిసి ఎన్.ఎం.డి.సి. అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ వారి మొరనాలకించే నాథుడే కరవయ్యాడు.

ఇలా ప్రజల జీవితాలతోనూ, పర్యావరణంతోనూ చెలగాటమాడుతూ కొనసాగుతున్న ఈ గనుల తవ్వకం వల్ల మొత్తం దేశ ప్రజలకొరిగేదేమన్నా వుందా అంటే, అది పూజ్యమేనని ప్రభుత్వ లెక్కలే తెలియజేస్తున్నాయి. ఒక పక్క దేశపు అమూల్య సంపదైన ఇనుప ఖనిజాన్ని జపాను సామ్రాజ్యవాదులకు కారుచౌక ధరలకు అమ్మి, వారికి ఏటా వేల కోట్ల రూపాయల లాభాలనార్జించడానకి సాయపడుతోన్న ఎన్ఎమ్‌డిసి, ఈ తవ్వకం ద్వారా సంపాదిస్తున్న నికర లాభం కేవలం 98 కోట్ల రూపాయలే. ప్రభుత్వ ఖజానాలకు ఈ ధనాన్ని కూడా దక్కకుండా చేయడాన్ని కూడా భారత దళారీల చేతులు నింపడానికై యిక్కడి పరిశ్రమలను ప్రైవేట్ పరంచేయాలనే పథకం కూడా త్వరలోనే ఊపిరిపోసుకోనుంది.

పారిశ్రామికీకరణ, ఇక్కడి ఆదివాసుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపి, ఈ ప్రాంతాన్నంతా 'అభివృద్ధి' చేయగలదనీ, ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ, వ్యాపారావకాశాలను ఇతోధికంగా కల్పించగలదని, వగైరా వగైరా ఆకర్షణీయమైన నినాదాల చాటున భారత దళారీ పాలకవర్గాలు, అమూల్యమైన దేశసంపదను (బైలడిల్లా ఇనుప ఖనిజం) కారుచౌక ధరల్లో జపాన్ సామ్రాజ్యవాదులకు కట్టబెడుతూ ఆ క్రమంలో అక్కడి ప్రజల ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నారు. ప్రజల నుండి వారి కొంపాగోడు, భూముల్ని కొల్లగొట్టడమేకాక, ఆఖరికి వారు తాగేనీరు, పీల్చేగాలిని కూడా విషమయం చేస్తున్నారు. వారి సంస్కృతి, సంప్రదాయాలను కాలరాచివేస్తున్నారు.

దండకారణ్య విప్లవోద్యమం ఈ విషయమై తన వంతు కృషిని నిర్వహిస్తూనే వుంది, కొత్తగా గనుల తవ్వకాన్ని అడ్డుకోవడం, రైల్వేలైన్ల విస్తరణను అడ్డుకోవడం వంటిచర్యల ద్వారా ఒక పక్క అమూల్య సంపద కొల్లగొట్టబడకుండా చూడడానికి ప్రయత్నిస్తూనే మరోపక్క ఈ సమస్యపైన, భారత దళారీలు, సామ్రాజ్యవాదుల పన్నాగాలను వివరిస్తూ ప్రజలను ఎడ్యుకేట్ చేసి, సంఘటిత పోరాటాలకు దించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అంతేకాక, పర్యావరణ కాలుష్యంతో రోగాల వాతన పడి అలమటిస్తోన్న ప్రజలకు తక్షణ ఉపశమనాన్ని అందజేయడానికై, హెల్త్‌సెంటర్లు తెరచి ప్రజలకు చేయూతనందిస్తోంది. దీర్ఘకాలిక పోరాటం ద్వారా సామ్రాజ్యవాదులు, వారి భారత దళారీల కబంధ హస్తాల నుండి, ఈ అమూల్య సంపదను విముక్తం చేసి, నిజమైన అభివృద్ధికి దోహద పడేరీతిలో దాన్ని వినియోగించగల వ్యవస్థకోసం పోరాడితేగాని ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదన్న రాజకీయాలను ప్రజలకు అర్థం చేయించి, పోరాటానికి సమాయత్తం చేసే కృషిలో నిమగ్నమైవుంది.

---

*(చివరి పేజీ తరువాయి......)*

మభ్యపెట్టి పబ్బం గడుపుకుంటూ వస్తున్న నేతలు యిప్పుడు రోజులు మారాయని గుర్తించాలి.

ఎనలేని మానవ వనరులున్న మన దేశంలో శ్రమశక్తికి ఎలాంటి కొరతాలేదు. శ్రమశక్తిపై ప్రధానంగా ఆధారపడిన పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధిని సమకూర్చగల అవకాశాలెన్నో వున్నాయి. కానీ దోపిడీ పాలకవర్గాలు యిందుకు సిద్ధంగా లేవు. రోజు రోజుకూ పడిపోతున్న లాభాల రేట్లను నిలబెట్టుకోవడానికైఅత్యాధునిక టెక్నాలజీ, కంప్యూటరైజేషన్ ద్వారా మానవ శ్రమశక్తిని నాశనం గావిస్తూ నిరుద్యోగ సైన్యాన్ని యిబ్బడి ముబ్బడిగా పెంచుతున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యసంస్థల ఆదేశాలపై భారత పాలకవర్గాలు చేపట్టిన గ్లోబలైజేషన్, ఉదారీకరణ, ప్రైవేటీకరణ వంటి ఆర్థిక విధానాల ఫలితంగా దేశంలో వందలాది పరిశ్రమలు మూతపడుతున్నాయి. వేలాది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి వీధుల్లోకి విసరివేయబడుతున్నారు. యిలాంటి స్థితిలో, రోమెల్ట్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం ద్వారా బస్తర్‌లో నిరుద్యోగ సమస్య సమసిపోతుందనీ, చేయగలిగిన ప్రతివాడికీ ఉపాధి దొరుకుతుందని చెప్పడం దేశం యొక్క ప్రస్తుత వాస్తవిక పరిస్థితిని గూర్చి ప్రజలను భ్రమలో వుంచడమే అవుతుంది.

## రోమెల్ట్ స్టీల్ ప్లాంట్‌తో జరిగేది బస్తర్ అభివృద్ధి కాదు, వినాశనం

పార్లమెంటరీ రాజకీయ నాయకులు రోమెల్ట్ స్టీల్ ప్లాంట్‌ను వ్యతిరేకిస్తున్న వారందరిపైనా అభివృద్ధి నిరోధకులంటూ ముద్రవేస్తున్నారు. కానీ, ఏ నాయకుడూ కూడా ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో నిజంగా బస్తర్, బస్తర్ ప్రజల అభివృద్ధి ఎలా జరగగలదోనన్న వివరాలేవీ చెప్పడం లేదు. అసలు వాస్తవమేమిటంటే, ఈ ప్లాంట్ నిర్మాణం నుండి ఉత్పన్నమయ్యే సమస్యల మూలంగా బస్తర్ వాసులు నష్టపోవడం మాత్రం ఖాయం. ఈ ప్లాంట్ నిర్మాణం ద్వారా యిందులోంచి వెలువడే కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్‌డైఆక్సైడ్ వంటి వాయువులతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. రాష్ట్ర హైవే మీదనే దీన్ని నిర్మించతలపెట్టినందున ప్రయాణీకులూ యిబ్బందుల నెదుర్కోవాల్సి వుంటుంది. హీరానార్‌కు దగ్గర్లో 80 కి.మీ. పరిధిలో గల గోటపాల్, బడే తుమ్‌నార్, నాగుల్, చిందనార్, ఊసేట్, చిందపాల్ మున్నగు నలభై గ్రామాల ప్రజల ఆరోగ్యాలపై ఈ వాయువుల మూలంగా చెడు ప్రభావం పడే ప్రమాదం వుంది. ప్రజల బాగోగుల పట్ల ఆవగింజంతయినా శ్రద్ధపెట్టని పాలకులు యిలాంటి ప్రమాదాలనేం పట్టించుకుంటారు? యిందుకు సజీవ సాక్ష్యం భోపాల్ గ్యాస్ పీడితుల పట్ల అమలవుతున్న ఉదాసీనత, నిర్లక్ష్యాలే. ఈ ప్లాంట్ నిర్మాణంతో ఎదురవగల సమస్యల పట్ల ప్లాంట్ సమర్థకులు మౌనం వహిస్తున్నారు. వాళ్ల దృష్టిలో బస్తర్ అభివృద్ధికై తలపెట్టిన అంశాలలో యిలాంటి ప్రమాదకారకమయిన సమస్యలు సహజంగానే మరుగున పడిపోతాయి.

రోమెల్ట్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం 1,000 ఎకరాల భూమి అవసరమవుతుంది. ఐఎంఎఫ్. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి ద్రవ్య సంస్థల ముందు జోలెచాచి అప్పుల కోసం దేబిరిస్తున్న కేంద్ర-రాష్ట్రాల ప్రభుత్వాలు యిలాంటి కంపెనీలకు అవి

అడిగిన భూముల్ని అప్పజెప్పుతున్నాయి. మధ్యప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ కంపెనీకి బస్తర్ అడవుల్ని అప్పజెప్పింది. యిప్పటికి 450 ఎకరాల అడవి భూమిని సర్వేచేశారు. దీంట్లో 8,000లకుపైగా విలువైన చెట్లున్నాయని ఒక అంచనా. మొత్తం 1000 ఎకరాల్లోనూ సర్వే చేస్తే, ఈ ప్లాంట్ మూలంగా ఎంతో విలువైన అటవీ సంపద నాశనమయిపోతుంది. ఈ ప్లాంట్ సమర్ధకులు పర్యావరణాన్ని ఏ మాత్రం లెక్క చెయ్యడం లేదు. పచ్చని అడవులను ఈ ప్లాంట్‌కు ధారాదత్తం చేస్తే తీవ్రమయిన కాలుష్యం ఏర్పడుతుంది. 'బస్తర్ అభివృద్ధి' అంటూ తెగ వాపోయే వాళ్లకు జరుగబోయే నష్టాలు అసలే కన్పించడంలేదు.

ఒకవైపు స్థానిక ప్రజలు ఈ ప్లాంట్ నిర్మాణం వల్ల పంటభూములు కోల్పోవడానికి వ్యతిరేకంగా ప్రతిఘటనకు సిద్ధమవుతుండగా, మరోవైపు ఈ 'నాయకులు' దీని నిర్మాణానికై వీధి పోరాటాలకు శంఖమూదాలంటున్నారు. ప్రజల సంపదల్ని కొల్లగొడుతున్న సామ్రాజ్యవాదులను పారదోలడానికి వీధిపోరాటాలు చేయలేని నేతలు తాము ఎవరికి వ్యతిరేకంగా వీధిపోరాటాలు చెయ్యదల్చారో చెప్పాలి. నిజానికి, స్వయంగా ప్రజలే అన్ని రకాల దోపిడీ శక్తులనూ, వారి తొత్తులను తరిమికొట్టే రోజు ఎంతో దూరంలోలేదు.

రోమెల్ట్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరిగితే 10 క్యూసెక్కుల (గంటకు 1000 ఘనపు మీటర్లు) నీరు అవసరమవుతుంది. పక్కనే వున్న ఇంద్రావతి నది నుండే నీళ్లను తోడేస్తారన్న విషయంలో అనుమానమేమీ లేదు. ప్లాంట్ యంత్రాలకు (చల్లబర్చడానికీ, ధూళి వగైరా శుభ్రపరచడానికి, స్లెగ్‌క్వెంచింగ్ కోసమూ) అగ్నిమాపక, యంత్రాలకూ, పిగ్ యినుమును చల్లబర్చడానికీ, నీరు అవసరమవుతుంది. ముందు నుండే నీళ్ల కరువుతో వట్టిపోతున్న ఇంద్రావతి నది ఈ స్టీల్‌ప్లాంట్ అవసరాల్ని తీర్చలేక సంక్షోభంలో పడగలదు. అంతేగాకుండా, ప్లాంట్ నుండి వెలువడే కలుషిత నీరు కూడా ఈ నదిలోనే కలుస్తుంది. దీనివల్ల నదికి దిగువన 140 కి.మీ. దూరం వరకు, అంటే భూపాలపట్నం వరకూ గల అనేక గ్రామాల ప్రజలు కలుషిత నీటితో దెబ్బతింటారు. ప్లాంట్ సమర్ధకులు ఈ వ్యవస్థ విషయంలో కూడా నోరు మెదపడం లేదు. నిజానికి ఈ ప్లాంట్ నీటి అవసరాలను తీర్చగల యితర మార్గాలు కూడా వున్నాయి. బైలడిల్లాలో 5b, 6వ ప్లాంటుల నుండి వెలువడే నీటిని పైపుల ద్వారా ఈ ప్లాంట్‌కు తరలించి ఈ సమస్యను పరిష్కరించవచ్చు. కానీ, పైప్‌లైన్ నిర్మాణం మూలంగా అయ్యే అదనపు ఖర్చును భరించడానికి ఏ కంపెనీ సిద్ధపడుతుంది కనుక? ఈ కంపెనీల లాభాలపై వేటువేసే ఈ సూచనను ఏ ఎన్నికల నాయకుడు ఒప్పుకుంటాడు గనుక?

బైలడిల్లా స్టీల్‌ప్లాంట్ వల్ల జిల్లాలో కొండలపైనుండి దిగువకు ప్రవహించే నదులన్నీ ముందే కలుషితమైపోయాయి. ఈ కారణంగా, ప్రజలు ఎన్నో ఆరోగ్య సంబంధమయిన సమస్యల నెదుర్కొంటున్నారు. యిక యిప్పుడు రోమెల్ట్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరుగుతోంది. శంకిని, డంకిని నదుల్లో కలుస్తున్న వ్యర్థపదార్థాలను ఈ ప్లాంట్‌కు ముడిసరుకుగా వాడుకోవచ్చునని అంటున్నారు. దీనిద్వారా బైలడిల్లా ప్లాంటు కారణంగా నదులు కలుషితమైపోతున్న ప్రమాదం నివారించుకోవచ్చునని కూడా అంటున్నారు. కానీ యిదీ మోసమే. ఏ వ్యర్థపదార్థాలనయితే యిప్పుడు నిర్మించ తలపెట్టిన స్టీల్‌ప్లాంట్‌కు ముడిసరుకుగా వినియోగించవచ్చునని అంటున్నారో, వాటిలో యినుపఖనిజం 20 నుండి 28 శాతం మాత్రమే వుంటుంది. 45% వుంటే తప్ప ఇందుకు వుపయోగపడదు. అలాంటప్పుడు, దీన్ని ముడిసరుకుగా ఎలా వుపయోగిస్తారో వాళ్లకే ఎరుక! ప్రజలను పక్కదార్లు పట్టించడానికి యిలాంటి తలాతోకాలేని వాదనలు చేస్తున్నారు.

ఇంద్రావతి నది కలుషితం కావడంవల్ల వన్యప్రాణుల ఉనికికి ముప్పు రానుంది. దంతెవాడ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్, బైరంగఢ్ వన్యప్రాణుల అభయారణ్యం, పామేడ్ అభయారణ్యం, కుట్రు అభయారణ్యం వంటివి ఈ నది పరివాహక ప్రాంతంలోనే వున్నాయి. అరుదైన వన్యప్రాణులకు యివి దేశంలోనే పేరుగాంచిన కేంద్రాలు. తగిన రక్షణ చర్యలు తీసుకోకుండానే జరిగే పారిశ్రామికీకరణ వల్ల యివి బాగా దెబ్బతినిపోతాయి. అంతేకాకుండా, ఈ కాలుష్యం వల్ల అటవీ సంపదకు కూడా తీరని నష్టమే జరుగుతుంది. ఇలాంటి పర్యావరణ సమస్యలను దృష్టిలో వుంచుకునే, కొన్నేళ్ల కింద స్థానిక ప్రజలు బోధ్‌ఘాట్ విద్యుత్ ప్రాజెక్టును, తుమ్‌నార్‌లో నిర్మించతలపెట్టిన పేపర్‌మిల్‌ను వ్యతిరేకిస్తూ, ఆ నిర్ణయాలను వెనక్కు తీసుకునేంత వరకు పోరాటం సల్పారు. ప్రజలు తమ గత అనుభవాల వెలుగులో రోమెల్ట్ స్టీల్‌ప్లాంట్‌ను సమర్థించేవాళ్లందరికీ బుద్ధిచెబుతారు.

ఈ ప్లాంట్ నిర్మాణంలో రకరకాల దుష్ఫలితాలు రానున్నాయి. పార్లమెంటరీ పార్టీల నాయకులు కేవలం ఉద్యోగాలు దొరుకుతాయనీ, నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందని మాత్రమే చెబుతూ, ప్రజలను పక్కదార్లు పట్టించేందుకు కావాలని వాస్తవాలను మరుగుపరుస్తున్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రతను బాగా ఎరిగిన నాయకులు యువతను ఈ సున్నితమైన అంశంపైన రెచ్చగొడుతున్నారు. ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చేస్తున్న వాదనలలో కూడా ఎంతమాత్రం నిజం లేదు. ఈ అబద్ధాలకోరు నాయకులకు ప్రజలే తగిన బుద్ధిచెబుతారు. వాళ్లను పెంచి పోషిస్తున్న బహుళజాతి కంపెనీలను తన్ని తరిమేస్తారు.

## ఇప్పటి వరకు ఈ 'బస్తర్ నాయకులు' ఎవరి ప్రయోజనాలను ఈడేర్చారు? ఏం సాధించారు?

బస్తర్ నడిబొడ్డున నెలకొని వున్న బైలడిల్లా ప్రాంతం యినుపగనులకు పేరుగాంచింది. ఇక్కడ మొత్తం ఆసియాలోనే ప్రసిద్ధిగాంచిన యినుపగనులున్నాయి. ఈ కొండల గర్భాన్ని చీలుస్తూ జపాన్ సామ్రాజ్యవాదులు యినుప ఖనిజాన్ని దోచుకుపోతున్నారు. బైలడిల్లా గనుల ద్వారా కేంద్ర ప్రభుత్వం యేటా 325 కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తుండగా, జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండిసి)కు 200 కోట్ల లాభం సమకూరుతోంది. యిక్కడి నుండి ఇనుపఖనిజాన్ని తరలించడానికై లోతట్టు అడవుల గుండా బైలడిల్లా నుండి విశాఖపట్నం రేవు వరకు రైలు మార్గం నిర్మించారు. దీని ద్వారా బస్తర్ జిల్లా ప్రజలు ఎంతగా అభివృద్ధి చెందారో తెలుసుకోవడానికి కిరండల్, బాసి, గమవాడ, పటేల్‌పాం గ్రామాల రైతుల జీవితాలను చూస్తే చాలు, లేదా ఈ కొండల చుట్టుప్రక్కల్లో వున్న అనేక యితర ఆదివాసీ గ్రామాల రైతుల స్థితిగతుల్ని చూస్తే చాలు.

ఇనుపగనుల తవ్వకం వల్ల ఆ ప్రాంతంలో పరాయీకరణ బాగా జరిగింది. అడవిలో పుట్టకొక్కులు, పండ్లపుల్లలు మొదలుకొని అన్ని రకాల అడవిసంపదలు బజారు వస్తువులయ్యాయి. స్థానిక ప్రజలు ఈ అటవీ సంపదలను అనుభవించే హక్కును కోల్పోయారు. పెట్టుబడిదారీ విషసంస్కృతి ఆదివాసీ సంస్కృతిని మింగేస్తోంది. సారా వ్యాపారం, మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోయాయి. నిరుపేద ఆదివాసీ యువతులు వేశ్యావృత్తిలోకి ఈడ్చబడుతున్నారు. ఆత్మాభిమానం కుంచించుకుపోతోంది. ఒకవైపు సామ్రాజ్యవాద బకాసురులు ఈ ఇనుప కొండల్ని మింగేసి బలిసిపోతూ బస్తర్ సంపదలు విచ్చలవిడిగా దోపిడీకి

గురవుతుండగా, మరోవైపు బస్తర్‌వాసులు వినాశనం అంచుకు చేరుకుంటున్నారు. దీనినే అభివృద్ధి అంటూ పొగిడే వాళ్లను దేశద్రోహులే అనాలి తప్ప మరోటికాదు. ఈరోజు బస్తర్ ప్రజలు యిలాంటి అభివృద్ధిని ఎంతమాత్రమూ కోరుకోవడం లేదు.

'బస్తర్ అభివృది'ని గుత్తకు తీసుకున్నవాళ్లు రావ్‌ఘాట్ రైల్వేలైన్ నిర్మాణం ద్వారా బస్తర్ అభివృద్ధి కాగలదంటూ మరోవాదన కూడా చేస్తున్నారు. బైలడిల్లా అనుభవాన్ని చూసినవారెవ్వరూ రావ్‌ఘాట్ రైలుమార్గంతో బస్తర్ అభివృద్ధి అవుతుందన్న మాటను నమ్మరు. రావ్‌ఘాట్ రైల్వేలైన్ ప్రజల అవసరాలను దృష్టిలో వుంచుకొని నిర్మిస్తున్నారా, లేక అక్కడి విలువైన ఖనిజ సంపదను భిలాయ్ స్టీల్‌ప్లాంట్‌కు తరలించడానికి నిర్మిస్తున్నారా అన్నది అసలు ప్రశ్న. యివి రెండు పరస్పర విరుద్ధమైన ప్రయోజనాలు. ఒక ఒరలో రెండు కత్తులిమడవు. భిలాయ్ స్టీల్‌ప్లాంట్‌ను ముడిసరుకు కొరత సమస్య నుండి కాపాడాలంటే, ప్రజల అభివృద్ధి అంటూ ప్రచారం చేస్తేనే ఈ రైలు మార్గం నిర్మాణం కాగలదన్న వాస్తవాన్ని దృష్టిలో వుంచుకునే ఈ రాజకీయ మోసగాళ్లు ప్రచారానికి లంకించుకున్నారు. అభివృధిపేరిట ప్రజలను పక్కదారి పట్టించే కుట్ర యిది. అపారమైన వనరులు కల్గిన బస్తర్ జిల్లాను బడాపెట్టుబడిదార్ల ప్రయోజనాల కోసం బలివ్వడాన్ని బస్తర్‌వాసులు అనుమతించకూడదు.

## బస్తర్ ప్రజలు ఏం కోరుకుంటున్నారు?

నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ తయారు చేసిన మధ్యప్రదేశ్ మానవాభివృద్ధి రిపోర్టు (1998) ప్రకారం, 60-70 శాతం ఆదివాసీ జనాభా కల్గిన బస్తర్ జిల్లాలో గడచిన 50 యేళ్ల పాలనలో కేవలం 2 శాతం భూములకు మాత్రమే నీటిపారుదల సౌకర్యం లభించింది. 93.6 శాతం యిళ్లలో మరుగుదొడ్లు లేవు. 75.7 శాతం ప్రజలకు విద్యుత్తు అందుబాటులో లేదు. 49 శాతం ప్రజలు రక్షిత మంచినీళ్లకు నోచుకోకుండా వున్నారు. లోతట్టు ఆదివాసీ ప్రాంతాలకు ఈ శాతాలు మరింత ఎక్కువ.ఈ వివరాలే కాకుండా, యిటీవల ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్ 'గ్రామ సంపర్క్ అభియాన్' సందర్భంగా వెలువరించిన లెక్కలు బస్తర్ ప్రజల బతుకు చిత్రాన్ని మరింతగా స్పష్టం చేస్తాయి.

రాష్ట్రంలోని 38 జిల్లాల్లో 22,91,661మంది పిల్లలు బడికి పోవడం లేదు. ఆదివాసీ జిల్లాల్లోని పిల్లల పరిస్థితి మరింత దయనీయంగా వుంది. వీటిలో బస్తర్ ఒకటి. యిక్కడి 60 నుండి 90 శాతం ఆడపిల్లలు పలకా-బలపం పట్టే భాగ్యానికి నోచుకోవడం లేదు. ఈ 38 జిల్లాల్లో గల 55,295 గ్రామాల్లో 11,430 గ్రామాలు ఎలాంటి విద్యా సౌకర్యాలకూ నోచుకోలేదు. ఈ వివరాలను 2000 సంవత్సరపు ద్వితీయార్ధంలో 'జనసంపర్క్ అభియాన్' సందర్భంగా వెలువరించారు. 53 యేళ్ల 'స్వతంత్ర'పాలనలో సాధించిన ఈ 'ఘనమైన' అభివృద్ధిని ప్రజలు లోతుగా అర్ధం చేసుకోవడానికి గాను ప్రజల డబ్బును దుర్వినియోగపర్చి వెబ్‌సైట్లలోకి ఎక్కించారు. ఈ వివరాలు ముఖ్యమంత్రి అట్టహాసంగా మొదలుపెట్టిన 'విద్యా గ్యారంటీ పథకాల', 'పఢ్నా-బఢ్నా ఆందోళన్ (చదవాలి-ఎదగాలి ఉద్యమం)'వంటి పథకాలు ఎంత ప్రగతిని సాధించాయో తెలియజేస్తాయి.

నేటికీ బస్తర్ ప్రజలకు సాగుచేసుకోవడానికి తగినంత భూమిలేదు. వున్నకొద్దిపాటి భూమి సైతం నీటిపారుదల సౌకర్యానికి నోచుకోకపోవడం వల్ల వ్యవసాయం పూర్తిగా ప్రకృతి దయా దాక్షిణ్యాలపైనే ఆధారపడి వుంది. ప్రజలు ప్రతి సంవత్సరం కరువు సమస్యను ఎదుర్కొంటున్నారు. యిక్కడి ప్రజల వ్యవసాయ పద్ధతులు కూడా చాలా ప్రాచీనమైనవి. బస్తర్ అభివృద్ధి గురించి తెగ మాట్లాడే నాయకులు వ్యవసాయాన్ని అభివృద్ధిపర్చే ఏ ఒక్క చర్యా చేపట్టలేదు. ఆరోగ్య సౌకర్యాలు లేకపోవడం వల్ల పిల్లలు, పెద్దలు, స్త్రీలు అనేక యిక్కట్లనెదుర్కొంటున్నారు. అంటువ్యాధులు, మహమ్మారులు ప్రబలి అకాల మృత్యువునకు బలవుతున్నారు. ప్రసూతి మరణాలు చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. విద్యాసౌకర్యాలు కూడా నామమాత్రంగానే వున్నాయి. యివీ ప్రజల మౌలిక సమస్యలు. ఎవరైతే వీటి పరిష్కారం కోసం వెంటనే ప్రయత్నిస్తారో వాళ్లే బస్తర్ ప్రజల అభివృద్ధిని నిజంగా కోరుకునే వాళ్లవుతారు. ఈ రంగాల్లో 'పైన పటారం లోన లొటారం' వంటి చర్యలుకాదు కావాల్సింది. సమూలమైన మార్పుకోసం ప్రయత్నం జరగాలి.

బస్తర్‌లో అపారమయిన వనరులున్నాయని ప్రత్యేకించి చెప్పాల్సిన పనేలేదు. అయినా బస్తర్‌వాసులు భయంకరమైన దరిద్ర్యంలో మునిగివున్నారు. వీళ్ల పరిస్థితిని మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత కేంద్రమంత్రి సుందర్‌లాల్ పట్వా మాటల్లోనే చెప్పాలంటే, "బంగారు ఇటుకలపైన నిలబడ్డ బస్తర్ బుక్కెడు బువ్వకు, జానెడు బట్టకూ మొహం వాచింది". ఇక్కడి వనరులన్నింటినీ కొల్లగొట్టడానికి వివిధ సామ్రాజ్యవాద కంపెనీలు, వాటి తొత్తులైన దళారీ పెట్టుబడిదార్లు అర్రులు చాచి వున్నారు. వీరు చేపట్టిన పారి శ్రామికీకరణ ద్వారా బస్తర్ అభివృద్ధి కొంచెమైనా జరుగదు. పైగా, వినాశనమే జరుగుతోంది. ప్రజలను పెడదారి పట్టించడానికి నాయకులు ఎప్పుడూ వాస్తవాలను వక్రీకరిస్తుంటారు. అందుకే వీళ్ల మోసకారితనాన్ని ఎండగడుతూ ప్రజలు తమ అభివృద్ధి కోసం తామే పోరాడాలి. ముందుగా వ్యవసాయాన్ని మెరుగుపర్చుకోవాలి. దానిపై ఆధారపడుతూ, దానికి అవసరమైన పరిశ్రమల స్థాపనకు పూనుకోవాలి. రెండు కాళ్లపై ఆధారపడుతూ, దానికి అవసరమైన పరిశ్రమల స్థాపనకు పూనుకోవాలి. రెండు కాళ్లపై నడిచే ఆర్థిక విధానాన్ని అనుసరించాలి. 'బస్తర్‌వాసులే బస్తర్‌లోని సకల సంపదలకు యజమానులు' అని గుర్తించి, వాళ్ల పక్షం వహించి, వాళ్ల అభీష్టంతో, వాళ్ల క్రియాశీల భాగస్వామ్యంలో బస్తర్ అభివృద్ధికై సముచిత చర్యలను చేపట్టాలని కోరుకునే వాళ్లే అసలైన ప్రజాస్వామ్య ప్రియులు అవుతారు. ఈ అవగాహనతోనే గడచిన 20 ఏళ్లుగా బస్తర్‌లో అనేక పోరాటాలు కొనసాగుతున్నాయి. వీటికి భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె)(పీపుల్స్‌వార్) నాయకత్వం వహిస్తుంది. బస్తర్ అభివృద్ధిని కోరుకునేవాళ్లు ఈ పోరాటాలకు తమ మద్దత్తును ప్రకటించి పోరాడే ప్రజలతో మమేకం కావాలి. నేడు బస్తర్ ప్రజానీకం కోరుకుంటోదిదే. దీనికి విరుద్ధంగా, దోపిడీ ప్రభుత్వాలతో కుమ్మక్కై, ప్రజాపోరాటాలను అణచడానికి ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజావ్యతిరేక నిర్బంధ చర్యలలో భాగస్వాములయేవాళ్లు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వుంటుంది. ప్రభుత్వం బస్తర్ అభివృద్ధి పేరిట ఎలాంటి ప్రజావ్యతిరేక చర్యకు పాల్పడినా, క్రమంగా అభివృద్ధి చెందుతోన్న ప్రజాఉద్యమం ప్రతిఘటనను నిర్మిస్తుంది. బస్తర్ నేలలో జొరబడి, యిక్కడి వనరులను కొల్లగొడుతున్న సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదారుల కంపెనీలన్నింటినీ దండకారణ్య విప్లవోద్యమం ఆక్రమించుకుంటుంది.

భూస్వామ్య- సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను ఉధృతం చేయాల్సిందిగా, నూతన ఆర్థిక విధానాల చాటున బహుళజాతి కంపెనీల ప్రయోజనాలను ఈడేరుస్తున్న ప్రభుత్వాన్ని ఎండగడుతూ ప్రజల ప్రయోజనాలను కాపాడడానికై దృఢంగా పోరాడాల్సిందిగా, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలకు మన దేశాన్ని తాకట్టుపెడ్తున్న కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల విధానాలనన్నింటినీ సమైక్యంగా ప్రతిఘటించాల్సిందిగా మేం కార్మిక-కర్షకులకూ, విద్యార్థి-మేధావులకూ పిలుపునిస్తున్నాం. ◆

దండకారణ్యంలోని మధ్యప్రదేశ్ రాష్ట్రం క్రిందకు వచ్చే దక్షిణ బస్తర్ డివిజన్‌లోని బైరంగడ్ దళ ప్రాంతానికీ, మాడ్ డివిజన్‌లోని ఇంద్రావతి దళ ప్రాంతానికీ దగ్గరగా హీరాపూర్ గ్రామం వుంది. జగ్ధల్‌పూర్ నుండి బీజాపూర్ వెళ్లే రాష్ట్ర హైవేపై గల గీదం తాలూకా కేంద్రానికి అతి దగ్గరలోనున్న హీరాపూర్‌లో ఆదివాసీలతోపాటుగా యితర తరగతుల ప్రజలు కూడా నివశిస్తున్నారు. ఇంద్రావతి నది ఒడ్డుకే వుండడం గ్రామానికి గల మరో ప్రత్యేకత అని చెప్పుకోవాలి. ఇనుప గనులకు పేరుగాంచిన బైలడిల్లా కొండలతో చుట్టుముట్టబడినట్టుగా వుండే ఈ గ్రామంపై సహజంగానే సామ్రాజ్యవాదుల డేగకన్ను పడింది. రోమెల్ట్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ఈ గ్రామం ఎంపికయ్యింది. ఈ బహుళజాతి కంపెనీ పుణ్యమా అని గడచిన కొద్ది నెలలుగా హీరానార్ ఎడతెగని చర్చలకు కేంద్రమయింది. బస్తర్‌లోని దోపిడీ వర్గ రాజకీయపార్టీలన్నీ కూడా రోమెల్ట్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణమే తమ లక్ష్యంగా ప్రకటించి రకరకాల నినాదాలతో ముందుకొస్తున్నాయి. హీరానార్ (రోమెల్ట్) స్టీల్‌ప్లాంట్ నిర్మాణం ద్వారా బస్తర్‌వాసుల సర్వతోముఖాభివృద్ధి జరుగగలదని అవి వాదిస్తున్నాయి. ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణం ద్వారా ఉద్యోగాలు దొరుకుతాయని కూడా నమ్మ బలుకుతున్నాయి. బస్తర్ యువతరాన్ని పట్టి పీడిస్తున్న నిరుద్యోగ సమస్య పరిష్కరింపబడగలదని నేతలందరూ ప్రజలకు ఆశలు చూపుతున్నారు. అన్ని ఎన్నికల పార్టీలకూ యిప్పుడు హీరానార్ ఏకైక అంశమయ్యింది. బస్తర్ రాజకీయ చిత్రపటంపై హీరానార్ ముందుకొచ్చింది.

బిజెపి యువజన సంఘమయిన భారతీయ జనతా యువ మోర్చా ఈ నినాదాన్ని అందుకుంది : "*మనమంతా ఒక్కటి - మనమంతా ఒక్కటి! మనం ఆదివాసులమూ కాము - ఆదివాసీయేతరులమూ కాము - కాంగ్రెస్, కమ్యూనిస్టులమూ కాము- మనమంతా ఒక్కటి*" బస్తర్‌లోని చిత్రకోట్ ఎంఎల్‌ఏ ప్రతిభా షా యిలా సవాలు చేస్తోంది : "*హీరానార్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం మేం గల్లీ నుండి ఢిల్లీ వరకూ పోరాడుతాం. ప్లాంటును వ్యతిరేకిస్తూ బ్రహ్మదేవ్ శర్మ గనుక రంగంలోకి దిగితే మేం చూస్తూ వూరుకోం. బస్తర్‌వాసులు 20 యేళ్ల క్రిందటి గోచీగుడ్డ ఆదివాసులు కారని బి.డి. శర్మ గుర్తించాలి. బస్తర్‌లో చేయగల్గిన ప్రతి వాడికీ ఉపాధి కావాలి. బస్తర్ అభివృద్ధి, బస్తర్ సంస్కృతి పేరుతో బి.డి. శర్మ గనుక యిప్పుడు ప్రజలను రెచ్చగొట్ట జూస్తే దాని పరిణామాలను చవిచూడ్డానికి అతను సిదంగా వుండాలి. బస్తర్‌లోని 12 మంది ఎంఎల్‌ఏలూ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం విషయంలో ఒక్కతాటిపై నిలబడ్డారు. బ్రహ్మదేవ్ శర్మ ముసలి తనపు ఛాదస్తంతో అన్నింటినీ వ్యతిరేకిస్తున్నాడు*" అంటూ ప్రతిభా షా అతనిపై తన అక్కసునంతా వెళ్లగక్కింది. కానీ, ఈ చిత్రకోట మహారాణి ఒక్క నిజాన్ని మాత్రం దాచేసింది. - 12 మంది ఎంఎల్‌ఏలను ఒక్క తాటిపై నిలిపిన 'దివ్యశక్తి' మరేదో కాదు, రోమెల్ట్ కంపెనీ యాజమాన్యమేనని.

బస్తర్ నుండి లోక్ సభకు ఎన్నికయిన బిజెపి నేత బలిరాం కాశ్యప్ "*బస్తర్‌లోకి ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నా*"మంటూ ప్రకటించాడు.

ఎన్.ఎస్.యు.ఐ. మాజీ ఉపాధ్యక్షుడు యోగేశ్ శుక్లా "*హీరానార్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికై వీధుల్లో పోరాటానికి నడుం బిగించాల్సింది*"గా పిలుపునిచ్చాడు. ఈ స్టీల్‌ప్లాంట్ బస్తర్ వాసుల మనోభావాలతో ముడిపడిందిగా అతను అభివర్ణించాడు. యింకా ఈ ప్లాంట్ నిర్మాణంతో బస్తర్ సమగ్ర అభివృద్ధి జరుగుతుందనీ, నిరుద్యోగ సమస్య మటుమాయమవుతుందనీ, యువతీయువకులందరికీ ఉపాధి దొరుకుతుందనీ అన్నాడు.

ఈ విధంగా, బస్తర్‌లోని వివిధ పార్లమెంటరీ పార్టీలు (కాంగ్రెస్, బిజెపి, సిపిఐ, సిపిఎం వగైరా) రోమెల్ట్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరగాల్సిందేనని పట్టుబడుతున్నాయి. యిది కాకతాళీయమైనదీకాదు, యిందులో ఆశ్చర్యపడాల్సిందీలేదు. ఈ పార్టీలన్నింటి వర్గ స్వభావమే యిది. బడా భూస్వాముల, సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదారుల సేవకు అంకితమైన ఈ పార్టీలు యిందుకు భిన్నంగా ఎలా వ్యవహరిస్తాయి? ఈ పార్టీల వైఖరిని ఎండగడుతూ, ప్రజల ప్రయోజనాల రీత్యా ఈ ప్లాంట్‌ను వ్యతిరేకించే వారెవరినయినా ఈ పార్టీలు అభివృద్ధి నిరోధకులంటూ నిందిస్తున్నాయి. యిదంతా దొంగే దొంగని అరిచే వ్యవహారమే. ఒక్క అబద్ధాన్ని వందసార్లు నిజమని చెబితే అది నిజమయిపోతుందన్న సిద్ధాంతాన్ని ఒంటబట్టించుకున్న ఈ పార్టీలు బస్తర్ ప్రజలను, ప్రత్యేకించి యువతరాన్ని వాస్తవాల నుండి పెడతోవ పట్టిస్తున్నాయి.

## వాస్తవాలను తెరమరుగు చేస్తున్న నేతల వాగ్ధానాలు

రోమెల్ట్ స్టీల్ ప్లాంట్ యొక్క వాస్తవ వివరాలకూ, పార్లమెంటరీ రాజకీయ పార్టీల నేతలు నమ్మబలుకుతున్న మాటలకూ భూమ్యాకాశాలంత తేడా వుంది. ఒక విదేశీ బహుళజాతి కార్పోరేషన్ ద్వారా నిర్మించ తలపెట్టిన ఈ స్టీల్ ప్లాంట్ పూర్తిగా హైటెక్ పద్ధతులపై ఆధారపడినట్టిది. యిది అత్యాధునిక, భారీ యంత్రాల ద్వారా నడవనున్నది కావడంతో చాలా తక్కువ ఉద్యోగాలు మాత్రమే దొరుకుతాయి. పేపర్లలో రాస్తున్న వివరాల ప్రకారం ఈ స్టీల్‌ప్లాంటులో మహా అయితే 250 మందికి ఉద్యోగాలు దొరుకుతాయట. అవి కూడా నిపుణులూ, సుశిక్షితులూ అయిన కార్మికులకు, ఉన్నత శ్రేణి టెక్నీషియన్లకు మాత్రమే ఉద్యోగాలనివ్వగల ఈ కంపెనీ నిర్మాణం ద్వారా బస్తర్‌లోని నిరుద్యోగ సమస్య ఏ మేరకు పరిష్కారం కాగలదన్న ప్రశ్నకు '*ఉద్యోగాలు, ఉద్యోగాల*'ంటూ కాకిగోల పెడుతున్న నేతలే జవాబు చెప్పాలి. ఈ ప్లాంట్‌లో పని చేయగల హైటెక్ టెక్నీషియన్లు బస్తర్‌లో ఎంత మందున్నారో కూడా ఈ నేతలే సెలవివ్వాలి. ముందుగా, స్వాతంత్ర్యం వచ్చి 50 యేళ్లు దాటాయని అంటున్నప్పటికీ బస్తర్‌లో అక్షరాస్యత 20 శాతంకన్నా ఎందుకు ముందుకు వెళ్లలేదో వారే జవాబు చెప్పాలి. ఉత్తుత్తి మాటలు పక్కకు పెట్టి ఈ పరిస్థితికి కారకులెవ్వరో చెప్పాలి. యిప్పటిదాకా, ఎన్నికల సమయంలో తియ్యటి మాటల్తో ప్రజలను

(*తరువాయి49వ పేజీలో*)

# హీరానార్ స్టీల్‌ప్లాంట్ ద్వారా బస్తర్ అభివృద్ధి జరగదు!
# రోమెల్ట్ స్టీల్‌ప్లాంట్ ప్రయోజనాలకై బస్తర్‌ను బలి చేయవద్దు!!